www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50
వరంగల్

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 22
సంచిక (Issue) : 95

బుధవారం | 3-7-2024

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, కృష్ణపక్షం; తిథి: ద్వాదశి ఉ. 7.11 తదుపరి త్రయోదశి; నక్షత్రం: రోహిణి తె. 4.07 తదుపరి మృగశిర; వర్జ్యం: రా.8.18-9.51; దుర్ముహూర్తం: ఉ.11.53-12.45; అమృతఘడియలు: రా. 12.59-2.33; రాహుకాలం: మ.12.00-1.30; సూర్యోదయం: 5.48; సూర్యాస్తమయం: 6.49

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



1) తొక్కిసలాటలో మరణించిన వారి మృతదేహాలను బస్సులో తరలిస్తున్న దృశ్యం

2) ఓ ఆస్పత్రి వద్ద చెల్లాచెదురుగా మృతదేహాలు



దైవ భక్తితో నాలుగు మంచి మాటలు విందామని ప్రవచనానికి వెళ్తే.. అక్కడ జరిగిన తొక్కిసలాటలో 116 మంది ప్రాణాలు పోయాయి! 150 మందికి పైగా గాయపడ్డారు. 5000 మంది మాత్రమే పట్టే చోట.. పదిహేను వేల మందితో కార్యక్రమం నిర్వహించడంతో జరిగిన ఘోరవిది. ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్ జిల్లా రతిభాన్‌పూర్ గ్రామంలో భోలే బాబా అనే ఆధ్యాత్మికవేత్త మంగళవారం నిర్వహించిన కార్యక్రమం విషాదాంతమైంది. చనిపోయినవారిలో ఎక్కువ మంది మహిళలు, చిన్నపిల్లలేనని.. మృతుల సంఖ్య ఇంకా పెరిగే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు.

సత్సంగ్‌లో తొక్కిసలాట..

116 మంది దుర్మరణం

ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో ఘోరం.. 150 మందికిపైగా గాయాలపాలు

చనిపోయినవారిలో మహిళలు, పిల్లలే ఎక్కువ.. మృతులు పెరిగే ముప్పు

స్థానికంగా పేరొందిన ఆధ్యాత్మిక వేత్త 'భోలేబాబా' సత్సంగ్‌కు వేలాది జనం

కార్యక్రమం ముగిశాక బయటకు వెళ్లే క్రమంలో తోపులాట.. పెనుప్రమాదం

రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, అమిత్‌షా, ఖర్గే, రాహుల్ సంతాపం

హత్రాస్, జూలై 2: యూపీలోని కిషన్‌గంజ్ జిల్లాకు చెందిన భోలే బాబా.. గతంలో పోలీసు శాఖలోని నిఘా విభాగంలో 18 ఏళ్లపాటు పనిచేసి, ఆ తర్వాత ఉద్యోగం మానేసి ఆధ్యాత్మిక గురువుగా మారారు. స్థానికులు ఆయన్ను 'నారాయణ సాకార్ హరి'.. 'సాకార్ విశ్వ హరి బాబా' అనే పేర్లతో పిలుచుకుంటారు. ప్రతి మంగళవారం ఆయన నిర్వహించే సత్సంగానికి ప్రజలు వేలాదిగా

మిగతా 2వ పేజీలో...



సచివాలయంలో అన్ని శాఖల కార్యదర్శులతో సీఎం రేవంత్ సమీక్ష సమావేశం. చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి, సీఎస్ శాంతికుమారి

కలెక్టర్లు కదలాలి

కలెక్టరేట్లు దాటి బయటకు రాకపోవడంపై సీఎం రేవంత్‌రెడ్డి అసంతృప్తి

సీనియర్ ఐఏఎస్‌లు జవాబుదారీగా ఉండాలి

ఒక్కో అధికారి ఒక ఫ్లాగ్‌షిప్ ఐడియా ఇవ్వాలి

తెలంగాణను దేశంలో ఆదర్శంగా తీర్చిదిద్దాలి

అధికారులపై ప్రభుత్వానికి రాగద్వేషాలు లేవు

పనితీరు ఆధారంగానే ఉన్నతావకాశాలు

వారానికి ఒకరోజు విధిగా జిల్లాలకు వెళ్లాలి

నెలకోసారి జిల్లా అధికారులతో సమీక్షించాలి

ఐఏఎస్‌లకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం

వారానికో జిల్లాలో పర్యటిస్తానని వెల్లడి

సీఎంఆర్‌ఎఫ్ అక్రమాలకు చెల్లు

ఇక ఆన్‌లైన్లో.. వెబ్‌సైట్ ప్రారంభించిన సీఎం

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ల పనితీరుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. వారు కలెక్టరేట్లకే పరిమితమవుతున్నారని, కార్యాలయాలు దాటి వెళ్లడం లేదని తప్పుబట్టారు. ఇలాగైతే ప్రజల సమస్యలు తెలియవని, క్షేత్ర స్థాయికి వెళితేనే ప్రజలకు సరైన న్యాయం చేయగలుగుతారని అన్నారు. ఈ విషయంలో తగిన చొరవ తీసుకోవాలని, కలెక్టర్లు క్షేత్ర స్థాయి పర్యటనకు వెళ్లేలా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ఆదేశించారు. ఆస్పత్రులు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ప్రభుత్వ సేవలందించే అన్ని విభాగాలను కలెక్టర్లు అప్పుడప్పుడు సందర్శించాలని సూచించారు. ప్రజల సమస్యలు, ఇబ్బందులు, అనూహ్యంగా జరిగే సంఘటనలు, దుర్ఘటనలన్నింటిపైనా సత్వరమే స్పందించాలన్నారు. మంగళవారం సచివాలయంలో అన్ని శాఖల, విభాగాల కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ శాఖల బాధ్యతలు చూస్తున్న సీనియర్ ఐఏఎస్ అధికారులు ప్రభుత్వ ప్రాథమ్యాలకు అనుగుణంగా పని చేయాలని ఆదేశించారు. తమ పరిధిలోని శాఖలు, విభాగాలపై పట్టు సాధించాలని, ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, ప్రజా పాలన అందించేందుకు అందరూ బాధ్యతగా పని చేయాలని దిశానిర్దేశం చేశారు. అందరూ కలిసికట్టుగా పని చేసి ప్రజలకు సుపరిపాలన

మిగతా 13వ పేజీలో...

డ్రగ్స్, సైబర్ నేరాల నియంత్రణలో
సినీ నటులకూ బాధ్యత

అవగాహన వీడియోలు ప్రదర్శిస్తేనే టికెట్ ధరల పెంపు: సీఎం

100 కిలోలకు మించి గంజాయి పట్టిస్తే 2 లక్షలు: శాండిల్య 13

చిక్కుముళ్లు వీడే దిశగా..!

- తెలంగాణ, ఏపీ సీఎంల మధ్య 6న భేటీ
- చంద్రబాబు ప్రతిపాదనకు రేవంత్ ఓకే
- సమావేశానికి రావాలంటూ బాబుకు లేఖ
- పదేళ్లుగా అపరిష్కృతంగా సమస్యలు
- ఈ భేటీతో పరిష్కారమవుతాయన్న ఆశలు
- ఎజెండాపై మంత్రులతో రేవంత్ చర్చలు

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య విభజన సమస్యల పరిష్కారానికి ఎట్టకేలకు ఓ ప్రయత్నం జరుగుతోంది. సుహృద్భావ వాతావరణంలో, పరస్పర ఆమోదంతో సమస్యలను పరిష్కరించుకునే దిశగా రెండు తెలుగు రాష్ట్రాలు కదులుతున్నాయి. రెండు రాష్ట్రాల్లో కొత్త ప్రభుత్వాలు ఏర్పడిన నేపథ్యంలో చిక్కుముళ్లు వీడే దిశగా ఓ అడుగు ముందుకు పడుతోంది. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్ సీఎం ఎన్. చంద్రబాబునాయుడు ఈ నెల 6న సమావేశం కావాలని నిర్ణయించారు. విభజన సమస్యలపై సమావేశమవుదామంటూ చంద్రబాబు రాసిన

మిగతా 14వ పేజీలో...

ఏపీ ఆధీనంలోని ఆర్ అండ్ బీ ఆస్తుల స్వాధీనానికి కసరత్తు.. కోమటిరెడ్డి సమీక్ష 13

భద్రాచలంలో పంచాయతీల విలీనంపై చొరవ చూపాలి.. సీఎంకు తుమ్మల లేఖ 11

చంద్రబాబు శక్తిమంతుడు

ఆయనపై కేంద్ర సర్కారు ఆధారపడి ఉంది

7 మండలాలు, సీలేరు ప్రాజెక్టు రాష్ట్రానికి దక్కేలా బాబుపై ఒత్తిడి తేవాలి

రేవంత్‌కు హరీశ్‌రావు సూచన 14

అబద్ధాలు.. పిల్లచేష్టలు!



రాహుల్‌గాంధీపై ప్రధాని ధ్వజం

రిజర్వేషన్లు, అగ్నిపథ్, ఎమ్మెస్పీ సహా అనేక విషయాలపై అసత్య ప్రచారం

హిందువులపై దుష్ప్రచారం ఒక కుట్ర

'నీట్' బాధ్యుల్ని క్షమించేది లేదు: మోదీ

3 రెట్లు వేగంగా పనిచేసేందుకే ప్రజలు మూడోసారి గెలిపించారని వ్యాఖ్య

రాహుల్‌లా ప్రవర్తించవద్దు

మీడియాకు దూరంగా ఉండండి

ఢిల్లీలో స్టింగ్ ఆపరేషన్లు జరుగుతాయ్

ఎన్డీయే ఎంపీలకు ప్రధాని హెచ్చరిక

న్యూఢిల్లీ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ దేశంలో అరాచకత్వాన్ని వ్యాపింపజేయాలని చూస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. రిజర్వేషన్లు, రక్షణ నియామకాలు, ఎమ్మెస్పీ సహా అనేక విషయాలపై అసత్యాలు ప్రచారం చేస్తోందని ధ్వజమెత్తారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు మోదీ మంగళవారం సమాధానమిచ్చారు. కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీపై విరుచుకుపడ్డారు. అబద్ధాలు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని దేశం కోరుకుంటోందని స్పీకర్‌కు తెలిపారు. ప్రతిపక్ష నేతలు పిల్లచేష్టలకు పాల్పడుతున్నారని పరోక్షంగా రాహుల్‌పై విమర్శలు

మిగతా 2వ పేజీలో...

నీట్‌పై చర్చిద్దాం

మోదీకి రాహుల్ ప్రతిపాదన

సభను ఒకరోజు ముందే వాయిదా వేసిన ప్రభుత్వం

పరీక్షకు 2 గంటల ముందు ప్రశ్నపత్రం తయారీ!

నీట్ పీజీపై కేంద్రం సమీక్ష 2

ఆగస్టు మధ్యలో ఎగ్జామ్?



213 మంది ఖైదీలకు
క్షమాభిక్ష

షరతులతో ప్రసాదించిన రాష్ట్ర ప్రభుత్వం

చర్లపల్లి జైలుకు తరలింపు


నేడు కౌన్సెలింగ్, జాబ్‌మేళా.. ఆపై విడుదల 13

విద్యుత్ కమిషన్ గడువు
నెల రోజులు పెంపు

ఈ నెల 31లోగా నివేదిక ఇవ్వండి: ఇంధన శాఖ

కేసీఆర్‌పై వేచిచూసే ధోరణి

బ్యారేజీలపై అబద్ధాలు



దెబ్బతిన్న మేడిగడ్డ బ్యారేజీ (ఫైల్)

విచారణ తప్పుదోవ పట్టేలా ఇరిగేషన్ అధికారుల కుమ్మక్కు

కమిషన్‌కు ఇచ్చిన అఫిడవిట్లలో కానరాని కీలకాంశాలు

గతంలో చక్రం తిప్పినవారే ఇప్పటికీ ముఖ్య స్థానాల్లో..

వారి సూచనల మేరకే ఇతర అధికారుల వైఖరి!

మంత్రి ఆదేశించినా సమగ్ర సమాచారం ఇచ్చేందుకు నో

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల నిర్మాణం/నిర్వహణ లోపాలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పినాకిచంద్ర ఘోష్ కమిషన్‌కు నీటిపారుదల శాఖ అధికారులు తప్పుడు సమాచారం ఇస్తున్నారా? కమిషన్ ఏ సమాచారం కోరినా.. అందరూ కూడబలుక్కొని ఒకే రకంగా చెబుతూ వాస్తవాలు వెల్లడి కాకుండా చేస్తున్నారా? అంటే.. అవుననే అభిప్రాయాలే వ్యక్తమవుతున్నాయి. అధికారులు తప్పుడు సమాచారం ఇస్తున్నట్లుగా పీసీ ఘోష్ కమిషన్ గుర్తించిందని, అందుకే సమగ్ర సమాచారాన్ని అఫిడవిట్ల రూపంలో ఇవ్వాలని కోరిందని తెలిసింది. కానీ, అఫిడవిట్లలో కూడా కీలక అంశాలు లేవని కమిషన్ గుర్తించినట్లు సమాచారం. విచారణ కమిషన్‌కు సమగ్ర సమాచారం అందించాలని, పూర్తిస్థాయిలో

మిగతా 11వ పేజీలో...



టీజీఎస్ ఆర్టీసీలో 3,035 కొలువులు

ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వ ఆమోదం

త్వరలో నోటిఫికేషన్: మంత్రి పొన్నం 14

గవర్నర్ ముఖ్య కార్యదర్శిగా రామకృష్ణారావు?

లేదంటే బెన్‌హర్ మహేశ్‌దత్‌కు అవకాశం

త్వరలో మరోసారి ఐఏఎస్‌ల బదిలీలు!

'రైతుభరోసా' ఉపసంఘం చైర్మన్‌గా భట్టి

సభ్యులుగా శ్రీధర్‌బాబు, తుమ్మల, పొంగులేటి.. జీవో జారీ



హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రైతుభరోసా పథకం అమలుకు అనుసరించాల్సిన విధివిధానాలు, మార్గదర్శకాలపై అధ్యయనం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. చైర్మన్‌గా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, సభ్యులుగా మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్లను గత నెల 21న జరిగిన మంత్రివర్గ సమావేశంలోనే ప్రకటించారు. అయితే ఈ ఉపసంఘం ఏర్పాటుపై 11 రోజుల తర్వాత.. మంగళవారం సీఎస్ శాంతికుమారి జీవో జారీ చేయడం గమనార్హం. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క చైర్మన్‌గా

మిగతా 13వ పేజీలో...

మూడో వారంలో బడ్జెట్ సమావేశాలు!

ఖజానాకు ఆదాయమెలా?.. నేడు కీలక శాఖల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ 13

ఖమ్మం రైతు ఆత్మహత్య కేసులో 10 మందిపై కేసు

భూ వివాదంపై ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

మనస్తాపంతో పొలంలోనే బలవన్మరణానికి పాల్పడ్డ రైతు ప్రభాకర్

చనిపోతూ వీడియో.. రాష్ట్రవ్యాప్తంగా చర్చ.. దర్యాప్తునకు సీఎం ఆదేశం 3



ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

ఐదుగురు మావోయిస్టుల మృతి.. మృతుల సంఖ్య పెరిగే అవకాశం

అబూజ్‌మడ్ అడవుల్లో ఆపరేషన్.. పాల్గొన్న 1,400 మంది జవాన్లు

కొనసాగుతున్న కూంబింగ్.. తుపాకులు, సామగ్రి స్వాధీనం 11



విహారయాత్ర విషాదాంతం

పుణె సమీపంలో రోడ్డు ప్రమాదం.. కల్వర్టుని ఢీకొట్టిన కారు

నారాయణఖేడ్‌కు చెందిన ఐదుగురు యువకుల మృతి 3

నీట్‌పై చర్చిద్దామన్న రాహుల్.. లోక్‌సభ నిరవధిక వాయిదా

ప్రధానికి మంగళవారం ఉదయం రాహుల్ లేఖ


షెడ్యూల్‌కు ఒకరోజు ముందే సభ నిరవధిక వాయిదా

న్యూఢిల్లీ, జూలై 2: పార్లమెంటు సమావేశాల చివరి రోజైన బుధవారం నీట్‌పై లోక్‌సభలో చర్చకు అనుమతించాలని ప్రధాని మోదీకి ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ఉదయం ప్రధానికి లేఖ రాశారు. జూన్ 28న అలాగే సోమవారం ఈ అంశంపై చర్చిద్దామని ప్రతిపక్షం కోరగా అనుమతించలేదని అందులో పేర్కొన్నారు. నీట్ సమస్యకు ఒక నిర్మాణాత్మక పరిష్కారం కనుగొనడమే తమ ఉద్దేశమని లేఖలో పేర్కొన్నారు. అయితే, స్పీకర్ ఓంబిర్లా మంగళవారమే(షెడ్యూల్ కంటే ఒకరోజు ముందే) సభను నిరవధిక వాయిదా వేశారు. దీంతో, నీట్‌పై ఎలాంటి చర్చ లేకుండానే లోక్‌సభ నిరవధికంగా వాయిదాపడింది. కాగా, జాతీయ పరీక్ష ఏజెన్సీ(నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) డైరెక్టర్‌ని మార్చడం, ఇతర పరీక్షలను వాయిదా వేయడం వల్ల ఉపయోగం లేదని, అవి మన పరీక్షల విధానంలో ఉన్న తీవ్రమైన లోపాలను కప్పిపుచ్చే చర్యలు మాత్రమేనని రాహుల్ మోదీకి రాసిన లేఖలో పేర్కొన్నారు. ఉన్నత విద్యా వ్యవస్థలో నెలకొన్న తీవ్రమైన లోపాలు నీట్ ద్వారా బయటపడ్డాయన్నారు. లక్షలాది కుటుంబాలు తమ పిల్లల కోసం ఎన్నో త్యాగాలు చేశాయని, పేపర్ లీక్‌లు వారి కలలను కల్లలు చేశాయన్నారు. నీట్‌పై వారిలో నమ్మకం కలిగించడానికి పార్లమెంటు లో చర్చే తొలిమెట్టు అన్నారు. ఈ అంశం ప్రాధాన్యత దృష్ట్యా బుధవారమే లోక్‌సభలో చర్చ చేపట్టాలన్నారు. ఈ చర్చకు ప్రధానే నాయకత్వం వహించాలన్నారు.



రాహుల్ 'హిందూ' వ్యాఖ్యల తొలగింపు

రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా లోక్‌సభలో రాహుల్ చేసిన ప్రసంగం నుంచి కొన్ని భాగాలను తొలగించారు. స్పీకర్ ఓం బిర్లా ఆదేశాల మేరకు రాహుల్ ప్రసంగంలోని కొన్ని వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించినట్లు మంగళవారం అధికారులు తెలిపారు. హిందువులు, ప్రధాని మోదీ, బీజేపీ, ఆరెస్సెస్‌లపై రాహుల్ చేసిన వ్యాఖ్యలు సహా మరికొన్నింటిని తొలగించినట్లు వెల్లడించారు. దీనిపై రాహుల్ గాంధీ స్పీకర్‌కు లేఖ రాశారు. తన ప్రసంగంలో నుంచి 'ఎంపిక చేసిన వ్యాఖ్యల'ను మాత్రమే తొలగించారని ఆరోపించారు. ఇది పార్లమెంటు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని తెలిపారు. 'రికార్డుల నుంచి తొలగించిన నా వ్యాఖ్యలను పునరుద్ధరించాలని కోరుతున్నా' అని రాహుల్ స్పీకర్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. తాను చెప్పినవన్నీ నిజాలని రాహుల్ విలేకరులతో చెప్పారు.



ఆగస్టు మధ్యలో నీట్ పీజీ పరీక్ష?

» ఎగ్జామ్‌కు 2 గంటల ముందు ప్రశ్నపత్రం తయారీ!

న్యూఢిల్లీ, జూలై 2: వాయిదా పడ్డ నీట్-పీజీ పరీక్షను.. ఆగస్టు మధ్యలో నిర్వహించే అవకాశం ఉందని సమాచారం. అలాగే.. ఈ పరీక్ష ప్రశ్నపత్రాన్ని కూడా ఎగ్జామ్ నిర్వహించడానికి రెండు గంటల ముందు రూపొందించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. నీట్-యూజీ ప్రశ్నపత్రం లీక్ అయిన నేపథ్యంలో.. జూన్ 23న జరగాల్సిన నీట్-పీజీ పరీక్షను ముందు జాగ్రత్త చర్యగా వాయిదా వేసిన సంగతి తెలిసిందే. ఈ పరీక్ష నిర్వహణ సన్నద్ధతపై 'నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఫర్ మెడికల్ స్టూడెంట్స్'(ఎన్‌బీఈఎంఎస్)తో చర్చించి.. పరీక్ష ఎప్పుడు నిర్వహించేదీ ప్రకటిస్తామని ప్రభుత్వం అప్పట్లో వెల్లడించింది. ఈమేరకు.. కేంద్ర హోం శాఖ సోమవారం ఒక భేటీ నిర్వహించింది. దీనికి కేంద్ర ఆరోగ్య శాఖ, ఎన్‌బీఈఎంఎస్, నీట్-పీజీ నిర్వహణకు సంబంధించి సాంకేతిక భాగస్వామి అయిన టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్), సైబర్ సెల్ అధికారులు, ప్రతినిధులు హాజరయ్యారు. పరీక్ష నిర్వహణ సన్నద్ధతపై చర్చించారు. దాంతోపాటు.. జూలై 6న జరగనున్న 'విదేశీ వైద్య పట్టభద్రుల పరీక్ష' నిర్వహణ సన్నద్ధతనూ సమీక్షించినట్లు సమాచారం.

నిస్పృహతోనే పార్లమెంట్‌లో కాంగ్రెస్ రచ్చ!

» హుందాగా ఉండండి.. రాహుల్‌లా ప్రవర్తించవద్దు

» మీడియాకు దూరం ఉండండి..ఎన్డీయే ఎంపీలతో మోదీ

న్యూఢిల్లీ, జూలై 2: ఓ చాయ్‌వాలా వరుసగా మూడోసారి ప్రధానిగా ఎన్నికవడాన్ని విపక్ష కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతోందని ప్రధాని మోదీ అన్నారు. నెహ్రూ తర్వాత ఎవరూ ఈ ఘనత సాధించలేదని.. అది మింగుడుపడకే నిస్పృహతో పార్లమెంటులో ఆ పార్టీ రచ్చ చేస్తోందని మండిపడ్డారు. మంగళవారం పార్లమెంటు ప్రాంగణంలో ఎన్డీయే ఎంపీల సమావేశంలో ఆయన ప్రసంగించారు. గత ఐదేళ్లలో ఆయన బీజేపీ ఎంపీలతో మాత్రమే భేటీ అయ్యేవారు. ఈ దఫా ఆ పార్టీకి లోక్‌సభలో సొంతంగా మెజారిటీ లేకపోవడం.. మిత్రపక్షాలపై ఆధారపడాల్సి రావడంతో ఎన్డీయే ఎంపీలందరితో సమావేశం కావడం గమనార్హం. 'దేశ సేవ కోసమే ప్రతి ఎంపీ ఇక్కడకు వచ్చారు. వేర్వేరు పార్టీలకు చెందిన పార్లమెంటు సభ్యులందరూ దేశాభివృద్ధికి కృషిచేయాలి. సోమవారం సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీలా కాకుండా మీరంతా పార్లమెంటరీ నిబంధనలకు అనుగుణంగా హుందాగా వ్యవహరించాలి. సంబంధిత సబ్జెక్టులపై పట్టు సాధించాలి. పార్లమెంటులో సాధికారికంగా మాట్లాడాలి' అని మోదీ ఈ సందర్భంగా అన్నారు. పార్లమెంటు సమావేశాలు జరిగేటప్పుడు ఎన్డీయే ఎంపీలు క్రమం తప్పకుండా భేటీ అవ్వాలన్నారు. మీడియాకు దూరంగా ఉండాలని వారికి సూచించారు. విలేకరులతో అనవసరంగా మాట్లాడొద్దని కూడా చెప్పారు. ఢిల్లీలో స్టింగ్ ఆపరేషన్ల ప్రమాదం ఉందని హెచ్చరించారు. మీడియాతో ఏదైనా అంశంపై మాట్లాడేముందు అధ్యయనం చేయాలన్నారు.

ఈవీఎంలను విశ్వసించం: అఖిలేశ్

న్యూఢిల్లీ, జూలై 2: ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేశ్ యాదవ్ మరోసారి ఈవీఎంలపై అపనమ్మకం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో తమకు 80కి 80 లోక్‌సభ సీట్లు వచ్చినా ఈవీఎంలపై తమ అభిప్రాయం మారదని, అనుమానాలు తొలగవని స్పష్టం చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై జరుగుతున్న చర్చలో భాగంగా మంగళవారం ఆయన లోక్‌సభలో మాట్లాడారు. 'నేను ఈవీఎంలను నిన్న నమ్మలేదు. నేడూ నమ్మడం లేదు. ఉత్తరప్రదేశ్‌లో మొత్తం స్థానాలన్నీ మేమే గెలిచినా కూడా నమ్మను' అని పేర్కొన్నారు. ఈవీఎంలతో జరిగిన ఎన్నికల్లో తాము అధికారంలోకి వచ్చినా సరే వాటికి స్వస్తి పలుకుతామని తెలిపారు.

'ఇగ్నో'లో ఎంఏ భగవద్గీత

న్యూఢిల్లీ, జూలై 2: ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ వర్సిటీ(ఇగ్నో)లో 2024-25 విద్యా సంవత్సరం నుంచి ఎంఏ భగవద్గీత అధ్యయనం కోర్సును ప్రారంభిస్తున్నట్లు అధికారులు తెలిపారు. 2024 జూలై నుంచి ఈ కోర్సు అందుబాటులోకి తీసుకువచ్చామని, ఓపెన్, దూరవిద్య ద్వారా విద్యార్థులు కోర్సును పూర్తిచేయవచ్చని చెప్పారు. డిగ్రీ అర్హతతో మొత్తం 500 మంది విద్యార్థులు ఈ కోర్సులో ప్రవేశం పొందవచ్చని తెలిపారు. రెండు సంవత్సరాల కోర్సుకు రూ. 12,600లుగా ఫీజు నిర్ణయించారు.

కేసుల నుంచి మాజీ అధ్యక్షులకూ రక్షణ

» అమెరికా సుప్రీంకోర్టు తీర్పు.. ట్రంప్‌కు తొలగిన అడ్డంకి

వాషింగ్టన్, జూలై 2: అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్‌నకు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. 2020నాటి అధ్యక్ష ఎన్నికల్లో ప్రజా తీర్పును మార్చివేయడానికి ప్రయత్నించారన్న అభియోగాలను ఎదుర్కొంటున్న ఆయనకు సోమవారం చల్లని కబురు అందింది. పదవిలో ఉన్నప్పుడు మాజీ అధ్యక్షుడు రాజ్యాంగం ద్వారా సంక్రమించిన విశేషమైన అధికారంతో చేపట్టిన పనులపై క్రిమినల్ ప్రాసిక్యూషన్ చర్యలు తీసుకోవడానికి అవకాశం లేదని తెలిపింది. ఈ విషయంలో మాజీ అధ్యక్షునికి సంపూర్ణ రక్షణ ఉంటుందని తీర్పు చెప్పింది. ఆయన తీసుకున్న అధికారిక నిర్ణయాలపై క్రిమినల్ చర్యలు తీసుకోకుండా మినహాయింపు ఉంటుందని తెలిపింది. అనధికారిక చర్యలకు మాత్రం ఎలాంటి రక్షణ ఉండదని స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జాన్ రాబర్ట్స్ ఆధ్వర్యంలోని మెజార్టీ న్యాయమూర్తులు ఈ మేరకు తీర్పు ఇచ్చారు. మొత్తం తొమ్మిది మంది న్యాయమూర్తులకుగానూ ఆరుగురు ట్రంప్‌నకు అనుకూలంగా, ముగ్గురు మాత్రం ప్రతికూలంగా తీర్పు చెప్పారు.



బిబోయ్‌పూర్‌లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న జవాన్లు

అసోంలో వరదలు.. 46కు పెరిగిన మృతులు

గువాహటి, జూలై 2: అసోంలో భారీ వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. వరద నీటిలో కొట్టుకుపోయి, కొండచరియలు విరిగిపడి రాష్ట్రంలో ఇప్పటివరకు 46 మంది చనిపోయారు. దేశంలో నైరుతి ప్రవేశించిన తర్వాత అసోంలో రెండుసార్లు వరదలు సంభవించాయి. రెండు వారాలుగా అసోం వరదలతో చిగురుటాకులా వణికిపోతోంది. వర్షాల ఉధృతి ఇంకా తగ్గలేదు. బ్రహ్మపుత్ర సహా 13 ప్రధాన నదులు ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. 20 జిల్లాలో 6.71 లక్షల మంది ఇంకా వరద ముప్పును ఎదుర్కొంటున్నారు. రాబోయే రోజుల్లో పలు జిల్లాలో అతిభారీ వర్షాలు కురుస్తాయని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఇదిలా ఉండగా, మంగళవారం దిబ్రూగఢ్ జిల్లాలో నదీ ద్వీపంలో చిక్కుకుపోయిన 13 మంది జాలర్లను భారత వైమానిక దళం(ఐఏఎఫ్) హెలికాప్టర్ సాయంతో కాపాడింది.

అబద్ధాలు.. పిల్లచేష్టలు!

(మొదటి పేజీ తరువాయి)

గుప్పించారు. గతంలో కౌగిలించుకోవడం, కన్నుగీటడం వంటి పనులకు పాల్పడ్డారని.. ఇప్పుడు దేవుళ్లను కూడా తమ రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. హిందూ ఉగ్రవాదం వంటి పదాలను వాడడం, మతాన్ని డెంగీ, మలేరియాతో పోల్చడం సరికాదని, దేశం ఇలాంటి వాటిని క్షమించదని చెప్పారు. హిందువులకు వ్యతిరేకంగా తప్పుడు ప్రకటనలు చేయడాన్ని తీవ్రమైన కుట్రగా అభివర్ణించారు. పదేళ్లలో తమ ప్రభుత్వ పనితీరు చూసిన ప్రజలు.. మరింత బాగా పనిచేసేందుకే మూడోసారి గెలిపించారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. గతంలో కంటే మూడు రెట్లు వేగంగా పనిచేస్తామన్నారు. అభివృద్ధిని మరో స్థాయికి తీసుకెళ్తామని తెలిపారు. దేశవ్యాప్తంగా ఎన్డీయేకు ప్రజలు మెజారిటీ సీట్లు కట్టబెట్టారంటూ ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఏపీలో ఎన్డీయేకు ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. దేశంలో సుస్థిరతకు, నిరంతర సుపరిపాలనకు అవకాశం కల్పించారని అన్నారు.

విచ్ఛిన్నకర రాజకీయాలు..

అవినీతి కేసుల్లో రాహుల్ బెయిల్‌పై ఉన్నారని, పలు పరువునష్టం కేసులను ఎదుర్కొంటున్నారని, ఓబీసీలను అవమానపరిచినందుకు ఆయనకు శిక్ష పడిందని మోదీ గుర్తుచేశారు. సుప్రీంకోర్టు ముందు క్షమాపణ చెప్పుకోవాల్సిన పరిస్థితి తలెత్తిందన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఆర్థిక విధానాల ద్వారా అరాచకత్వాన్ని వ్యాపింపజేస్తున్నారని ఆరోపించారు. కులాలు, మతాలతో విచ్ఛిన్నకర రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. బాబా సాహెబ్ అంబేడ్కర్‌ను నెహ్రూ అవమానించారని, ఎన్నికల్లో ఓడించారని, జగ్జీవన్ రామ్ ప్రధాని కాకుండా ఇందిరా గాంధీ అడ్డుపడ్డారని, రాజీవ్ గాంధీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పార్లమెంట్‌లో మాట్లాడారని ఆయన గుర్తు చేశారు. తాము జమ్మూకశ్మీరులో 370 అధికరణను రద్దు చేశామని, ఒకప్పుడు రాళ్లు రువ్విన ప్రజలు ఇప్పుడు ప్రజాస్వామ్యాన్ని అనుభవిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ మాదిరి బుజ్జగింపు రాజకీయాలు కాకుండా అందరికీ న్యాయం చేయడమే తమ లక్ష్యమని మోదీ స్పష్టం చేశారు. అవినీతిని సహించబోమన్నారు. 25 కోట్లమంది ప్రజలను పేదరికం నుంచి బయటపడేసినందుకే తాము మూడోసారి గెలిచామని తెలిపారు. అగ్నిపథ్ పథకంపై కాంగ్రెస్ పార్టీ పూర్తిగా అబద్ధాలు ప్రచారం చేస్తోందని మోదీ మండిపడ్డారు. యువత సైన్యంలో చేరకుండా ఉండేలా తప్పుడు ప్రచారం చేస్తోందని ధ్వజమెత్తారు. ఇందులో కుట్ర కోణం దాగి ఉందన్నారు. రక్షణ రంగాన్ని బలహీనం చేయాలన్న కుట్రతోనే అబద్ధాలు ప్రచారం చేస్తోందని ఆరోపించారు.



భారత సాయుధ బలగాలు బలోపేతమవ్వాలని కాంగ్రెస్ ఎన్నడూ కోరుకోదన్నారు. గతంలో అవసరమైన మేరకు సంస్కరణలు చేయకపోవడం వల్లే సాయుధ బలగాలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నాయని చెప్పారు. దేశ రక్షణకు సంబంధించిన విషయాలు బహిరంగంగా చెప్పకూడదన్నారు. అందుకే తాను స్పందించలేదని చెప్పారు. ఇక రఫేల్ యుద్ధ విమానాల విషయంలోనూ కాంగ్రెస్ పార్టీ దేశ ప్రజలను తప్పుదోవ పట్టించేలా దుష్ప్రచారం చేసిందని విమర్శించారు. మన బలగాలు ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండేలా చూస్తున్నామని, అందులో భాగంగానే సంస్కరణలు అమలు చేస్తున్నామని చెప్పారు. కాగా నీట్ ప్రశ్నపత్రాల లీక్ గురించి ప్రధాని మాట్లాడుతూ.. నేరస్థులెవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. అక్రమార్కులు ఎక్కడున్నా, ఎంత మంది ఉన్నా శిక్షించి తీరతామని, విద్యార్థులకు తగిన న్యాయం చేస్తామని చెప్పారు.

ప్రతిపక్షాల నినాదాల నడుమే..

ప్రధానమంత్రి మోదీ మాట్లాడుతున్నంత సేపూ ప్రతిపక్ష నేతలు వెల్‌లోకి దూసుకొచ్చి నినాదాలు చేశారు. మణిపూర్‌పై మాట్లాడాలంటూ డిమాండ్ చేశారు. గందరగోళం మధ్యనే ప్రధాని తన ప్రసంగం ప్రారంభించి ముగించారు. ప్రధాని ప్రసంగాన్ని అడ్డుకోవాలని సభ్యులను రెచ్చగొడుతున్నందుకు స్పీకర్ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని పలుసార్లు మందలించారు.

100కి 99 కాదు.. 543కు 99!

కాంగ్రెస్ పార్టీ గత మూడు ఎన్నికల్లో వంద సీట్లు కూడా సాధించలేకపోయిందని మోదీ గుర్తుచేశారు. అయినా తాము గెలిచామన్న సంబరం వారిలో కనిపించడం విడ్డూరంగా ఉందన్నారు. చిన్నపిల్లవాడు సైకిల్ తొక్కుతూ కింద పడిపోతే అతని దృష్టి మళ్లించేందుకు అదిగో చీమ చనిపోయిందని సంతోషపెట్టే ప్రయత్నం చేస్తారని, కాంగ్రెస్ నేతలు కూడా రాహుల్‌ను అలాగే సంతోషపెడుతున్నారని వ్యాఖ్యానించారు. ఒక విద్యార్థికి 100కి 99 మార్కులు వస్తే అందరూ అభినందిస్తారని, కానీ.. అతనికి 543కి 99 మార్కులు వచ్చిన విషయం అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. అంతేగాక కాంగ్రెస్‌ను ఇతర పార్టీలపై ఆధారపడిన పరాన్న జీవిగా మోదీ అభివర్ణించారు. ముఖాముఖి పోరులో కాంగ్రెస్ విజయం సాధించలేదని, మిత్రపక్షాల భుజాలపై ఎక్కి కొన్ని సీట్లు గెలుచుకుందని చెప్పారు. ప్రజలు కాంగ్రెస్‌ను ప్రతిపక్షంలో కూర్చోమని తీర్పు ఇచ్చారన్నారు. ఆ విషయాన్ని ఇప్పటికైనా గుర్తుంచుకోవాలని హితవు పలికారు.

ప్రధాని ప్రసంగానికి ప్రతిపక్షాల అంతరాయం

» మణిపూర్ ఎంపీకి అవకాశం ఇవ్వాలని విపక్షాల ఆందోళన

న్యూఢిల్లీ, జూలై 2: ప్రధాని మోదీ ప్రసంగించే సమయంలో ప్రతిపక్షాలు అంతరాయం కలిగించడాన్ని ఖండిస్తూ మంగళవారం లోక్‌సభ తీర్మానాన్ని ఆమోదించింది. 18వ లోక్‌సభ తొలి సమావేశాల చివరి రోజున రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపేందుకు ప్రధాని సిద్ధం కాగా విపక్షాలు అడ్డుకున్నాయి. ప్రధాని మాట్లాడానికి ముందు మణిపూర్ ఎంపీకి అవకాశం ఇవ్వాలని కోరాయి. ఇప్పటికే ఆ రాష్ట్రానికి చెందిన ఒక ఎంపీకి అవకాశం ఇచ్చామని, మరో ఎంపీకి అవకాశం ఇవ్వలేమని స్పీకర్ ఓం బిర్లా చెప్పారు. ఇందుకు నిరసన తెలుపుతూ మణిపూర్‌కు చెందిన ఇద్దరు ఎంపీలు, కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగొయ్‌లు వెల్‌లోకి వెళ్లి ఆందోళన చేశారు. వారికి మరికొంత మంది కాంగ్రెస్, తృణమూల్ సభ్యులు తోడయ్యారు. మణిపూర్‌కు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. ప్రతిపక్ష సభ్యుల చర్యను ఖండిస్తూ రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. హోం మంత్రి అమిత్ షా దీన్ని సమర్థించారు. ఈ తీర్మానాన్ని సభ మూజువాణి ఓటు ద్వారా ఆమోదించింది. స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ ప్రతిపక్ష సభ్యులను వెల్‌లోకి పంపిస్తున్నారంటూ రాహుల్ గాంధీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. రాహుల్‌కు 90 నిమిషాల సమయం ఇచ్చామని, కానీ ఆయన ప్రవర్తన పార్లమెంటరీ సంప్రదాయాలకు అనుగుణంగా లేదని అన్నారు. కాగా, రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ఆమోదించిన అనంతరం లోక్‌సభ నిరవధికంగా వాయిదా పడింది. 34 గంటల పాటు ఏడు సిట్టింగ్‌లు జరిగాయని, 103 శాతం ఉత్పాదకత సాధించిందని స్పీకర్ ప్రకటించారు. ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై 18 గంటల పాటు చర్చ జరగగా 68 మంది సభ్యులు పాల్గొన్నారు. ఈ చర్చకు ప్రధాని మోదీ సమాధానం ఇచ్చారు.

ఖర్గే స్థానంలో జైరాం ఉండటం ఉత్తమం

» రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్

» కుల ప్రస్తావన తెస్తున్నారంటూ ఖర్గే ఆగ్రహం



న్యూఢిల్లీ, జూలై 2 :రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్, ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే మధ్య మంగళవారం మాటల యుద్ధం జరిగింది. సభ సజావుగా సాగేందుకు ప్రయత్నించే క్రమంలో ఖర్గే బదులుగా జైరాం రమేశ్ ప్రతిపక్ష నేత స్థానంలో ఉంటే బాగుండేదంటూ చైర్మన్ ధన్‌ఖడ్ చేసిన వ్యాఖ్యలు వాగ్యుద్ధానికి కారణమయ్యాయి. ఈ క్రమంలో రాజ్యసభ చైర్మన్ కుల వివక్ష చూపిస్తున్నారంటూ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు ఖర్గే ఆరోపించగా ధన్‌ఖడ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నిజానికి, రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై కాంగ్రెస్ సభ్యుడు ప్రమోద్ తివారీ రాజ్యసభలో మాట్లాడుతుండగా జోక్యం చేసుకున్న చైర్మన్ ధన్‌ఖడ్.. నిజనిర్ధారణ చేసుకోకుండా సభలో ఏ అంశాన్ని ప్రస్తావించవద్దని సూచించారు. ఇందుకు స్పందించిన జైరాం రమేశ్ చైర్మన్ సూచనను పరిగణనలోకి తీసుకుంటామని అన్నారు. దీంతో చైర్మన్ మాట్లాడుతూ.. "సీనియర్ నాయకుడు(ఖర్గే) ఇక్కడే ఉన్నారు. మీరు(జైరాం రమేశ్) ఆయన(ఖర్గే) స్థానాన్ని భర్తీ చేస్తే బాగుంటుందని నా అభిప్రాయం. మీరు(జైరాం) చాలా తెలివైన వారు, ప్రతిభావంతులు. మీరు వెంటనే ఖర్గే స్థానంలో కూర్చోవడం ఉత్తమం. ఎందుకంటే ఆయన పని కూడా మీరే చేస్తున్నారు" అని అన్నారు. చైర్మన్ వ్యాఖ్యలకు ఘాటుగా స్పందించిన ఖర్గే.. కుల ప్రస్తావన తీసుకురావద్దని, కులం వల్లే రమేష్ చాలా తెలివైన వ్యక్తి అని అంటున్నారని, తనని తక్కువ చేస్తున్నారని ఆరోపించారు. ఖర్గే వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన ధన్‌ఖడ్.. తన మాటలను తప్పుగా అర్థం చేసుకున్నారని అన్నారు. పార్లమెంట్ చరిత్రలోనే చైర్మన్ స్థానాన్ని ఇలా ఎవరూ అవమానించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

సత్సంగ్‌లో తొక్కిసలాట.. 116 మంది దుర్మరణం



(మొదటి పేజీ తరువాయి)

హాజరవుతుంటారు. యూపీ నుంచే కాక.. హరియాణా, రాజస్థాన్ తదితర రాష్ట్రాల నుంచి కూడా వస్తుంటారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు కూడా భోలే బాబా సత్సంగాలకు రావడం కద్దు. ఫేస్‌బుక్‌లోనే ఆయనకు 3 లక్షల మంది ఫాలోయర్లు ఉన్నారు. ఈ క్రమంలోనే.. మంగళవారం హత్రాస్‌లో ఆయన నిర్వహించిన సత్సంగానికి ప్రజలు పెద్దఎత్తున వచ్చారు. కార్యక్రమం ముగిసిన తర్వాత.. బయటకు వెళ్లే సమయంలో తోపులాట జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. లోపల వాతావరణమంతా ఉక్కగా ఉండడంతో అంతా త్వరగా బయటకు వెళ్లేందుకు ప్రయత్నించారని.. కానీ ఆ ద్వారం చిన్నగా ఉండడంతో తొక్కిసలాట జరిగి ఇంత మంది ప్రాణాలు కోల్పోయారని వారు వివరించారు. మరికొందరేమో..కార్యక్రమం చివర్లో భక్తులు భోలేబాబాను దగ్గర్నుంచీ చూడడానికి, ఆయన పాద ధూళిని తీసుకోవడానికి ప్రయత్నించే క్రమంలో ఈ ఘోరం జరిగినట్లు చెబుతున్నారు.



భోలే బాబా

ప్రముఖుల సంతాపం..

ఈ ప్రమాదవార్త తెలిసే సమయానికి ప్రధాని మోదీ లోక్‌సభలో ఉన్నారు. వెంటనే ఆయన సభకు ఈ విషయాన్ని తెలియజేసి.. చనిపోయిన వారి కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కేంద్ర ప్రభుత్వంలోని సీనియర్ అధికారులు యూపీ సర్కారుతో సంప్రదింపులు జరుపుతూ అన్ని రకాల సహాయసహకారాలూ అందిస్తున్నట్టు వెల్లడించారు. అనంతరం.. హత్రాస్ మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేలు చొప్పున.. ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి పరిహారం ఇవ్వనున్నట్టు ప్రధాని కార్యాలయం ఒక ప్రకటనలో వెల్లడించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ, యూపీ మాజీ ముఖ్యమంత్రులు మాయావతి, అఖిలేశ్ యాదవ్ తదితరులు జరిగిన ఘోరం పట్ల సంతాపం తెలిపారు. అమిత్ షా.. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌తో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. యోగి కూడా మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేలు చొప్పున పరిహారం ప్రకటించారు. జరిగిన ఘటనపై దర్యాప్తునకు.. ఆగ్రా అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, అలీగఢ్ డివిజనల్ కమిషనర్ నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి, 24 గంటల్లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. బుధవారం ఆయన ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించనున్నట్టు సమాచారం. ఇక.. హత్రాస్ దుర్ఘటన తన మనసునెంతో బాధించిందని.. అక్కడి హృదయాలు తన హృదయాన్ని కలచివేశాయని పేర్కొంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ట్వీట్ చేశారు. ఈ ఘటనలో గాయపడ్డవారికి, బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా సాయం చేయాలని రాహుల్, ప్రియాంక డిమాండ్ చేశారు.



తొక్కిసలాటకు ముందు

జనరల్ బోగీలను పెంచనున్న రైల్వే

చెన్నై, జూలై 2: జనరల్ బోగీల ప్రయాణికులు ఏసీ బోగీలను ఆక్రమించేస్తున్న ఘటనలు పదే పదే పునరావృతమవుతున్న నేపథ్యంలో జనరల్, సెకండ్ క్లాస్ బోగీల తయారీని పెంచాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఈ మేరకు తమ వార్షిక ఉత్పత్తి ప్రణాళికను రైల్వేశాఖ సవరించుకుంది. సుదూర ప్రాంతాలకు వెళ్లే రైళ్లలో మరిన్ని థర్డ్ ఏసీ కోచ్‌లు అందుబాటులోకి తీసుకొచ్చే ప్రణాళికలో భాగంగా దశలవారీగా జనరల్, స్లీపర్ కోచ్‌లు తొలగించాలని ఇటీవల ప్రణాళిక రూపొందించిన రైల్వేశాఖ ఇప్పుడా ప్రణాళికను మార్చుకుంది. గత కొద్ది సంవత్సరాలుగా ఉత్తరాది, ఈశాన్య రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో వలస కార్మికులు తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలకు తరలుతుండటంతో ఈ మార్గాల్లో అన్‌రిజర్వుడు బోగీలకు గణనీయంగా డిమాండ్ పెరిగింది. ఈ మూడు రాష్ట్రాలకు షాలిమార్(హౌవ్‌డా), గువాహటీ, సిల్చార్, పట్నా, బొకారో, లఖ్‌నవూ, ముజఫర్‌పూర్, ధన్‌పూర్ ప్రాంతాల నుంచి వచ్చే రైళ్లు ప్రయాణికులతో కిక్కిరిసి ఉంటున్నాయి. స్లీపర్ క్లాస్ కోచ్‌లను కూడా అనధికారికంగా సాధారణ ప్రయాణికులే ఆక్రమించేస్తున్నారు. పండుగల వేళ అంతర్రాష్ట్ర రైళ్లలో రద్దీ ఎక్కువగా ఉంటున్నట్లు రైల్వే అధికారులు కూడా గుర్తించారు. దీంతో పరిష్కారానికి చర్యలు చేపట్టారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తి చేయాల్సిన 6,325 ఎల్‌హెచ్‌బీ కోచ్‌లలో జనరల్, స్లీపర్ కోచ్‌లే 4,075 వరకు ఉండనున్నాయి. రైల్వే బోర్డు ఈనెల 27న సవరించిన ప్రణాళిక ప్రకారం 2024-25 సంవత్సరంలో జనరల్ క్లాస్(సెకండ్ సిట్టింగ్) కోచ్‌లు 1,171 నుంచి 2 వేలకు పెరగనున్నాయి. అలాగే, ఈ ఏడాది 1,030 స్లీపర్ కోచ్‌లనూ రైల్వేశాఖ ఉత్పత్తి చేయనుంది. అదనంగా అమృత్‌భారత్ ఎక్స్‌ప్రెస్‌ల జనరల్ కోచ్‌ల ఉత్పత్తిని 440 నుంచి 605కు పెంచనున్నారు. 2024-25 సంవత్సరానికి 787 థర్డ్ ఏసీ కోచ్‌లు తయారు చేయాలని తొలుత ప్రణాళిక రూపొందించగా, సవరించిన ప్రణాళిక మేరకు 300 ఏసీ ఎకానమీ త్రీటైర్ కోచ్‌లు, 460 రెగ్యులర్ ఏసీ త్రీటైర్ కోచ్‌లు ఉత్పత్తి చేయనున్నారు.

మతమార్పిడులు కొనసాగితే మెజార్టీ ప్రజలు మైనార్టీలవుతారు

» అలహాబాద్ హైకోర్టు వ్యాఖ్య

ప్రయాగ్‌రాజ్/ముంబై, జూలై 2: మతమార్పిడులు కొనసాగుతూ పోతే కొంతకాలానికి దేశంలోని మెజార్టీ ప్రజలు మైనార్టీలుగా మారుతారని అలహాబాద్ హైకోర్టు వ్యాఖ్యానించింది. మత సమ్మేళనాల్లో మతమార్పిడులు జరగకుండా తక్షణమే నిరోధించాల్సి ఉందని అభిప్రాయపడింది. చట్టవ్యతిరేక మాతమర్పిడి నిరోధక నిబంధనల కింద అరెస్టయిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ వ్యక్తికి బెయిల్ నిరాకరిస్తూ న్యాయమూర్తి జస్టిస్ రోహిత్ రంజన్‌అగర్వాల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆరోగ్యం కోసం సమావేశాలు జరుగుతున్నాయని చెప్పి కొందర్ని ఢిల్లీ తీసుకువెళ్లి వారిని క్రైస్తవ మతంలోకి మార్చారంటూ ఆయనపై కేసు నమోదైంది. విచారణ జరిపిన జస్టిస్ అగర్వాల్ ఆయనకు బెయిల్ నిరాకరించారు. ఎస్సీ, ఎస్టీ, ఆర్థికంగా వెనకబడిన వర్గాల వారిని చట్టవ్యతిరేకంగా క్రైస్తవంలోకి మార్చడం యూపీలో అధికంగా జరుగుతోందని వ్యాఖ్యానించారు. కాగా, ఇటీవల హిజాబ్‌ను నిషేధించిన ముంబైలోని ఎన్‌జీ ఆచార్య, డీకే మరాఠే కాలేజీ తాజాగా.. టీషర్టులు, టార్న్(చిరిగిన) జీన్స్‌ను నిషేధిస్తూ నిర్ణయం తీసుకుంది.

'సన్నకారు'... బేజారు!

» ఆదాయం తగ్గి అన్నదాతల ఇక్కట్లు

» 'స్టేట్ ఆఫ్ మార్జినల్ ఫార్మర్స్' నివేదిక

న్యూఢిల్లీ, జూలై 2: దేశవ్యాప్తంగా సన్నకారు రైతుల పరిస్థితి దుర్భరంగా ఉందని 'స్టేట్ ఆఫ్ మార్జినల్ ఫార్మర్స్ ఆఫ్ ఇండియా-2024' నివేదిక స్పష్టం చేసింది. వారి ఆదాయం పడిపోయి కష్టాలు అనుభవిస్తున్నారని తెలిపింది. పార్లమెంటులో సన్నకారు రైతుల దుస్థితిపై చర్చించాల్సిన అవసరం ఉందని నివేదిక అభిప్రాయపడింది. ఈ ఏడాది 'స్టేట్ ఆఫ్ మార్జినల్ ఫార్మర్స్ ఆఫ్ ఇండియా-2024'.. రైతుల ఆర్థిక పరిస్థితి, వారి జీవన విధానాలు, వాతావరణ మార్పుల ప్రభావం వారిపై ఎలా ఉందనే విషయాన్ని అధ్యయనం చేసింది. రెండున్నర ఎకరాల కంటే తక్కువ భూమి ఉన్నవారిని సన్నకారు రైతులుగా గుర్తించింది. దీనిప్రకారం.. దేశంలో 2015-16 మధ్య చేపట్టిన వ్యవసాయ గణన ప్రకారం వీరి సంఖ్య 65.4% ఉంది. కానీ, వీరికి ప్రభుత్వం నుంచి అందుతున్న సాయం మాత్రం తగ్గుతూ వస్తోందని నివేదిక స్పష్టం చేసింది. 2022లో పీఎం కిసాన్ పథకం 10.47 కోట్ల మందికి అందగా, ప్రస్తుతం వీరి సంఖ్య 9.26 కోట్లకు తగ్గిపోయింది. ఫలితంగా సన్నకారు రైతులకు పెట్టుబడి సాయం తగ్గి.. ఇబ్బందులు పెరిగాయని నివేదిక తెలిపింది.

విహారయాత్ర విషాదాంతం

- మహారాష్ట్రలోని పుణె సమీపంలో రోడ్డు ప్రమాదం
- అదుపు తప్పి కల్వర్టుని ఢీకొట్టిన కారు
- నారాయణఖేడ్‌కు చెందిన ఐదుగురు యువకుల మృతి


ప్రమాదానికి గురైన కారు

నారాయణఖేడ్, జూలై 2: సంగారెడ్డి జిల్లా నారాయణ ఖేడ్‌కు చెందిన కొందరు యువకులు చేపట్టిన విహారయాత్ర విషాదంగా మిగిలింది. మహారాష్ట్రలోని పుణె సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు యువకులు అక్కడికక్కడే మరణించారు. మరొకరు తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మంగళవారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాద వివరాలిలా ఉన్నాయి. నారాయణఖేడ్ నియోజకవర్గానికి చెందిన మహబూబ్ ఖురేషి, రఫీక్ ఖురేషి, ఫిరోజ్, ఇస్మాయిల్, ఫిరోజ్, అమెర్ కలిసి అజ్మీరా దర్గా సందర్శన కోసం ఆదివారం సాయంత్రం కారులో వెళ్లారు. ముంబై, అజ్మీరా దర్గా సందర్శన అనంతరం మంగళవారం తిరుగు ప్రయాణమయ్యారు. అయితే, వీరు ప్రయాణిస్తున్న కారు పుణె సమీపంలో అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న కల్వర్టును బలంగా ఢీకొట్టింది. దీంతో నారాయణఖేడ్‌కు చెందిన మహబూబ్ ఖురేషి, రఫీక్ ఖురేషి, కంగ్టికి చెందిన ఫిరోజ్, హైదరాబాద్ బొరబండలో ఉండే ఫిరోజ్, ఇస్మాయిల్ అక్కడికక్కడే మృతి చెందారు. నారాయణఖేడ్ మండలం వెంకటాపూర్‌కు చెందిన అమెర్ తీవ్ర గాయాలతో పుణెలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆరుగురు యువకులు 30 ఏళ్ల లోపు వయస్సు వారే. కంగ్టికి చెందిన ఫిరోజ్, హైదరాబాద్‌లో ఉండే ఫిరోజ్ వివాహితులు. కాగా, సౌదీలో పని చేసే మహబూబ్ ఖురేషి నెల రోజుల క్రితం స్వస్థలం నారాయణఖేడ్‌కు వచ్చాడు. మిగిలిన వారంతా చిన్నచిన్న వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు.

రైతు సంక్షేమానికి రూ. 50 నుంచి రూ. 60 వేల కోట్లు!

- రానున్న మూడు నెలల్లో వ్యయం
- వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- రైతుబీమా క్లెయిమ్‌లు పెండింగ్ ఉండకూడదు
- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



హైదరాబాద్, రాజేంద్రనగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మొదటి ప్రాధాన్యం రైతు సంక్షేమమని, రానున్న మూడు నెలల కాలంలో అందుకు రూ. 50 వేల నుంచి రూ. 60 వేల కోట్లు ఖర్చు చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, ఉద్యాన శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. రుణమాఫీ, రైతు భరోసా, పంటల బీమా, రైతుబీమా పథకాలకు ఈ నిధులు ఖర్చు చేయబోతున్నట్లు తెలిపారు. ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వివిధ జిల్లాల వ్యవసాయ, ఉద్యాన, పట్టుపరిశ్రమలశాఖ అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. అధికారులకు ఖరీఫ్ సీజన్‌లో చేపట్టాల్సిన పనులపై దిశానిర్దేశం చేశారు. వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రానున్న కాలంలో ఆర్థిక వెసులుబాటును బట్టి ఒక్కొక్కటిగా అన్ని పథకాలను పునరుద్ధరిస్తామని, ఇప్పటికే మట్టి నమూనా పరీక్ష కేంద్రాలను తిరిగి వాడుకలోకి తెచ్చామన్నారు. వానాకాలంలో విత్తనాల సరఫరా రాష్ట్రమంతటా బాగున్నా... ఒకటి, రెండు కంపెనీల విత్తనాల విషయంలో ఒకట్రెండు జిల్లాల్లో ఇబ్బందులు తలెత్తితే రాష్ట్రమంతటా ఉన్నట్లు ప్రచారం చేశారని అన్నారు. రైతు బీమా పథకంలో 1,222 క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయని, ఇంత పెద్ద మొత్తంలో పెండింగ్ ఉంటే ఎలా అన్నారు. పంటల నమోదులో కచ్చితత్వం ఉండాలన్నారు. ఆయిల్ పామ్ ప్రాజెక్టు చేపట్టి మూడో సంవత్సరంలోకి వచ్చినా 2023-24లో 2.30 లక్షల ఎకరాల లక్ష్యానికిగాను కేవలం 59,200 ఎకరాలు మాత్రమే పురోగతి చూపెట్టారని, ఇది కేవలం 26 శాతమేనని అన్నారు. శాస్త్రవేత్తలు, అధికారులు ఒక బృందంగా ఏర్పడి జిల్లాల్లో కనీసం వారానికి రెండు మండలాలు సందర్శించి రైతులకు సలహాలివ్వాలని ఆదేశించారు. బిందుసేద్యం సబ్సిడీని ఆయిల్‌పామ్‌తోపాటు ఇతర పంటలకు 70,600 ఎకరాలకు ఇస్తున్నామని... ఉద్యాన, కూరగాయ పంటల సాగును ప్రోత్సహించాలని మంత్రి సూచించారు.

మా సమస్యలు రేవంత్‌కు చెప్పండి

- లోకేశ్‌కు క్యాబ్ డ్రైవర్ల వినతి

అమరావతి, జూలై 2(ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో తమ సమస్యను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెప్పాలని మంత్రి లోకేశ్‌కు హైదరాబాద్‌లో ఉంటున్న ఏపీ క్యాబ్ డ్రైవర్లు విజ్ఞప్తి చేశారు. లోకేశ్ ప్రతిరోజూ నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ కార్యక్రమానికి ఈ క్యాబ్ డ్రైవర్లు మంగళవారం పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యను విన్నవించారు. ఉమ్మడి రాజధానిగా పదేళ్ల గడువు పూర్తి కాగానే హైదరాబాద్‌లో తమపై వేధింపులు పెరిగిపోయాయని, తాము ఇప్పటికే లైఫ్ ట్యాక్స్ చెల్లిస్తే ఇప్పుడు మరోసారి తెలంగాణ రాష్ట్రానికి చెల్లించాలని అధికారులు విపరీతంగా ఒత్తిడి తెస్తున్నారని వారు వాపోయారు. 'ట్యాక్సీలకు ఏపీ రిజిస్ట్రేషన్ నంబర్ కనిపిస్తే తెలంగాణలోని అధికారులు దాడులు చేస్తున్నారు. ఒక్కో ట్యాక్సీకి ఏకంగా రూ.లక్ష వరకూ ఫైన్ విధించి చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే ప్రయాణికులు ఉండగానే టైర్లలో గాలి తీస్తున్నారు. మేం హైదరాబాద్‌లో బతుకుతున్నాం. మా పిల్లలు అక్కడ స్కూళ్లలో చదువుకొంటున్నారు. ఇప్పుడు అర్థాంతరంగా రాష్ట్రం వదిలి పోవాలంటే ఎలా? రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో మా సమస్యను వివరించి పరిష్కారం చూపించాలని లోకేశ్‌ను కోరాం. ఆయన సానుకూలంగా హామీ ఇచ్చారు' అని క్యాబ్ డ్రైవర్లు మీడియా ప్రతినిధులతో చెప్పారు.

ఖమ్మం రైతు ఆత్మహత్య కేసులో పదిమందిపై కేసు

ప్రభాకర్ బలవన్మరణంపై స్పందించిన సీఎం రేవంత్.. సమగ్ర దర్యాప్తు నిర్వహించాలని అధికారులకు ఆదేశం

- చెరువు పక్కన ఉన్న తన వ్యవసాయ భూమిలో మట్టి పోయించుకొన్న ప్రభాకర్
- అది చెరువు శిఖం అని అభ్యంతరాలు
- మత్స్యసంఘానికి, ప్రభాకర్ కుటుంబానికి మధ్య వివాదం
- తన పొలంలో గుంతలు తవ్వారని, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని రైతు ప్రభాకర్ మనస్తాపం
- పొలంలో పురుగు మందు తాగి ఆత్మహత్య
- చనిపోతూ వీడియో.. రాష్ట్రవ్యాప్తంగా చర్చ

చింతకాని/ఖమ్మం, జూలై 2(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం జిల్లా చింతకాని మండలం పొద్దుటూరు గ్రామానికి చెందిన రైతు బోజెడ్ల ప్రభాకర్ ఆత్మహత్య వ్యవహారంలో పోలీసులు మంగళవారం పదిమందిపై కేసు నమోదు చేశారు. పొద్దుటూరు గ్రామ రెవెన్యూ పరిధిలో 276, 277 సర్వే నెంబర్‌లో పాము చెరువుకు సమీపంలో ప్రభాకర్, ఆయన కుటుంబ సభ్యులకు 7.10 ఎకరాల భూమి ఉంది. ప్రభాకర్ ఈ వేసవిలో తన భూమిలో చెరువు మట్టి పోయించుకున్నాడు. అయితే, ప్రభాకర్ చెరువు శిఖం భూమిలో మట్టి పోయించి సాగు చేస్తున్నాడంటూ మత్స్యసంఘం సభ్యులు అభ్యంతరం తెలిపారు. ఈ విషయంపై కొన్ని రోజులుగా ప్రభాకర్ కుటుంబానికి, మత్స్యసంఘ సభ్యులకు వివాదం నడుస్తోంది. తాను మట్టి పోసిన భూమిలో మత్స్య సంఘం సభ్యులు ప్రొక్లెయిన్లతో పెద్ద గుంతలు తవ్వారని మనస్తాపం చెందిన ప్రభాకర్.. తన పొలాన్ని కొందరు నాశనం చేశారని, వారిపై ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించలేదని తన పొలంలోనే పురుగుల మందు తాగుతూ వీడియో తీసి సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి వీరభద్రం ఫిర్యాదు మేరకు పదిమందిపై ఖమ్మం నగరం ఖానాపురం హవేలీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మంగళవారం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రభాకర్ మృతదేహానికి పోస్టుమార్టం పూర్తిచేసి పొద్దుటూరుకు తరలించగా పోలీసుల పర్యవేక్షణలో కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు.


చనిపోయే ముందు వీడియోలో మాట్లాడిన రైతు

వీడియో వైరల్.. రాష్ట్రవ్యాప్తంగా చర్చ

రైతు ప్రభాకర్ పురుగుల మందు తాగుతున్న వీడియో వైరల్ అయింది. అతని ఆత్మహత్య రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ ఘటనపై స్పందించారు. దీనిపై సమగ్ర విచారణ జరపాలని అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రే స్పందించడంతో కేసును పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు, ప్రభాకర్ ఆత్మహత్యపై పూర్తి విచారణ జరపాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం జిల్లా రెవెన్యూ, పోలీసు అధికారులను ఆదేశించారు. కాగా ఆత్మహత్యకు ముందు రైతు చిత్రీకరించింది సెల్ఫీ వీడియో కాదని, మరో వ్యక్తి వీడియో తీస్తుండగా రైతు మాట్లాడినట్లు ఉందని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు తగిన ఆధారాలు కూడా పోలీసుల వద్ద ఉన్నట్లు సమాచారం. పోలీసులు అనుమానిస్తున్న వ్యక్తి ఫోన్ నెంబర్ ఈ ఘటన జరిగిన కొద్ది సేపటి తరువాత స్విచ్ ఆఫ్ చేసి ఉండటం, అతడు పరారీలో ఉండటం ఈ అనుమానాలకు మరింత బలాన్నిస్తున్నాయి.

పక్కనే మరో ముగ్గురు

ప్రభాకర్ ఆత్మహత్యకు వీడియో రికార్డు చేసిన సమయంలో అక్కడ అతడితో పాటు మరో ముగ్గురు ఉన్నట్లు తెలుస్తోంది. రైతు ప్రభాకర్ మాట్లాడుతుండగా ఓ యువకుడు వీడియో రికార్డు చేయగా అతడు రికార్డు చేస్తున్న దృశ్యాలను అదే ప్రాంతంలో ఉన్న మరో యువకుడు సెల్‌ఫోన్‌లో రికార్డు చేసినట్లు తెలిసింది. ప్రస్తుతం ఆ వీడియో పోలీసుల వద్ద ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రైతు ప్రభాకర్ అసలు ఆత్మహత్య చేసుకున్నాడా.. లేక ఇంకేమైనా ఉందా అనే కోణంలోనూ పోలీసులు విచారణ చేస్తున్నట్లు సమాచారం. విచారణలో భాగంగా రైతు ప్రభాకర్ పురుగుల మందు తాగిన మామిడి తోటను ఖమ్మం అర్బన్ పోలీసులు మంగళవారం సాయంత్రం పరిశీలించినట్లు తెలిసింది.

యాదగిరిగుట్ట, భద్రకాళి ఆలయాలపై సౌర విద్యుత్ ప్లాంట్లు

- దేవాదాయ భూముల్లోనూ ఏర్పాటు
- బోనాల జాతరలో లేజర్ షోలు: మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ శాఖ భూముల్లో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించాలని ఆ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. ముందుగా యాదగిరిగుట్ట, భద్రకాళి ఆలయాలపై ఎన్పీపీసీ ఆధ్వర్యంలో రూఫ్‌టాప్ సౌర విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. మంత్రి సచివాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. కామన్ గుడ్ ఫండ్ (సీజీఎఫ్)కు రూ.150 కోట్లు కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరతామని తెలిపారు. వరంగల్‌లో పురాతన శివాలయ పునరుద్ధరణ, మెట్ల బావుల మరమ్మతు పనులు చేపట్టాలన్నారు. బోనాల ఉత్సవాల్లో అమ్మవారి వృత్తాంతాన్ని తెలిపేలా లేజర్ షోలు ప్రదర్శించనున్నట్లు మంత్రి తెలిపారు. మరికొన్ని రోజుల్లో బోనాలు మొదలుకానున్న నేపథ్యంలో దేవాలయాలకు నిధులు విడుదల ప్రారంభించాలన్నారు. దేవాదాయ శాఖలో పదోన్నతులు, ఉద్యోగుల బదిలీలపై త్వరలో మార్గదర్శకాలు జారీ చేస్తామని తెలిపారు. వేములవాడ గోశాలలో కోడెలు మృత్యువాత పడుతుండడంపై అధికారులను ఆరా తీశారు. దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ హన్మంతరావు, అడిషనల్ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పురాతన ఆలయాల పునరుద్ధరణకు కమిటీ

శిథిలావస్థలో ఉన్న పురాతన, చారిత్రక ఆలయాల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసింది. పురావస్తు శాఖతో సమన్వయంతో పని చేయాల్సి ఉన్నందున కమిటీ ఏర్పాటు చేయాలని దేవాదాయ శాఖ అధికారులు ప్రభుత్వానికి తెలిపారు. దీంతో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి చైర్మన్‌గా కమిటీ నియమించింది. పురావస్తు శాఖ డైరెక్టర్ కన్వీనర్‌గా, దేవాదాయ శాఖ డైరెక్టర్ కో-కన్వీనర్‌గా, వైటీడీఏ సీఈవో జి.కిషన్ రావు సభ్యుడిగా వ్యవహరిస్తారు. ఆర్కిటెక్ట్ సత్యనారాయణమూర్తిని ప్రత్యేక ఆహ్వానితుడిగా నియమించింది.

నోటి దురుసు హెచ్ఎం మాకొద్దు..

- నిజామాబాద్ జిల్లా రాణాకలాన్‌లో విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

ఎడపల్లి, జూలై 2: ఈ నోటి దురుసు ప్రధానోపాధ్యాయుడు మాకొద్దంటూ నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం రాణాకలాన్ గ్రామ ప్రాథమిక పాఠశాల ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు హెచ్ఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం మాట్లాడుతూ, పాఠశాల పునఃప్రారంభించి 20 రోజులైనా.. పాఠశాలలో విద్యాబోధన సరిగ్గా లేదని, నీటి వసతి కూడా ఇప్పటివరకు ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. ప్రైవేటు కంపెనీల స్కీం పేరుతో నాలుగేళ్లుగా గ్రామస్థుల వద్ద ఒక్కొక్కరి నుంచి హెచ్ఎం రూ. 2,200 చొప్పున వసూలు చేస్తున్నారని చెప్పారు. అలాగే గ్రామస్థులకు వడ్డీలకు అప్పులిచ్చి ముక్కుపిండి వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో పాఠశాలలో 150మంది విద్యార్థులు చదివేవారని, ఆయన వచ్చాక ఆ సంఖ్య 30కి పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకు హెచ్ఎం నోటి దురుసే కారణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి హెచ్ఎం నరేందర్ పనితీరుపై విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

సాగర్‌లో ఐదెకరాల భూమి కేటాయించండి

- నీటి పారుదలశాఖకు శ్రీ రామచంద్ర మిషన్ విజ్ఞప్తి

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్‌లో హార్ట్‌ఫుల్‌నెస్ యోగా శిక్షణ, ఆధ్యాత్మిక విద్యాకేంద్రానికి ఐదెకరాల భూమి కేటాయించాలని శ్రీ రామచంద్ర మిషన్ నీటిపారుదలశాఖను కోరింది. ఎకరానికి ఏడాదికి రూ.10 వేల చొప్పున పదేళ్ల కాలానికి గాను లీజుకు ఇవ్వాలని స్థానిక అధికారులకు నివేదించింది. అయితే 2012లో ప్రభుత్వ భూముల లీజులపై విడుదలైన జీవోనెం.571 ఆధారంగా ఐదెకరాలకు రూ.24.20 లక్షలను వార్షిక లీజుగా నిర్ధారించాలని స్థానిక అధికారులు ప్రతిపాదనలు పంపగా.. స్వచ్ఛంద సేవ జాబితాలో భూమిని ఎకరానికి రూ.10 వేల చొప్పున ఏడాదికి లీజుకు ఇవ్వాలని సంస్థ నివేదించింది. దాంతో దీనిపై ప్రభుత్వస్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇప్పటికే నాగార్జున సాగర్‌లో 7289 గజాల స్థలాన్ని శ్రీ రామచంద్ర మిషన్ 1980లో లీజుకు తీసుకుంది. తాజాగా మరో ఐదెకరాల స్థలం కావాలని కోరగా, దీనిపై తగిన నిర్ణయం తీసుకోవాలని అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు.

ముందుగానే 'నైరుతి' విస్తరణ

- 6 రోజులు ముందే ప్రక్రియ పూర్తి
- జూలై 2 నాటికి దేశవ్యాప్తంగా విస్తరణ
- జూన్‌లో 11 శాతం లోటు వర్షపాతం
- మారుతున్న రుతుపవనాల స్వభావం
- వర్షాలు కురిసే రోజులు తగ్గుముఖం




విశాఖపట్నం, జూలై 2(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగానికి తోడ్పాటును అందించే నైరుతి రుతుపవనాలు మంగళవారం నాటికి దేశవ్యాప్తంగా విస్తరించాయి. సాధారణంగా జూలై 8 నాటికి పశ్చిమ రాజస్థాన్‌లోని శివారు ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించాల్సి ఉంది. అయితే, ఈ ఏడాది ఆరు రోజులు ముందుగానే ఆ ప్రక్రియ పూర్తయింది. జూలై 2 నాటికి రుతుపవనాల విస్తరణ పూర్తికావడం వరుసగా ఇది మూడో ఏడాది కావడం గమనార్హం. ఈ ఏడాది మే 30న కేరళలో ప్రవేశించిన రుతుపవనాలు జూన్ 10 నాటికి పశ్చిమ భారతంలో మహారాష్ట్ర, ఇటు ఉత్తర కోస్తా, అటు ఈశాన్య భారతం వరకు విస్తరించి నిలిచిపోయాయి. తిరిగి జూన్ 24న రుతుపవనాల్లో కదలిక ప్రారంభమై.. ఎనిమిది రోజుల్లో మిగిలిన ప్రాంతాలకు విస్తరించాయి. నైరుతి నిలిచిపోయిన సమయంలో ఉత్తర భారతంలో తీవ్రమైన ఎండలు కొనసాగి, వడగాడ్పులు వీచాయి. ఇదే సమయంలో విచిత్రంగా బంగాళాఖాతం నుంచి తీవ్రమైన తేమగాలులు వీయడంతో ఈశాన్య భారతంలోని అసోం, మణిపూర్, మిజోరాం, మేఘాలయల్లో భారీ వర్షాలు కురిసి వరదలు సంభవించాయి. ప్రస్తుతం ఆ రాష్ట్రాల్లో ఆరేడు లక్షల మంది వరదల్లో చిక్కుకున్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో ఇంకా కుంభవృష్టి కురుస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ఏడాది రుతుపవనాల సీజన్‌లో సాధారణం లేదా అంతకంటే ఎక్కువ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ఇప్పటికే ప్రకటించింది. దీనికి అనుగుణంగా తొలుత సమృద్ధిగా వర్షాలు కురిసినా.. మధ్యలో పొడి వాతావరణం నెలకొనడంతో జూన్‌లో 11శాతం లోటు వర్షపాతం నమోదైంది. నైరుతి సీజన్‌లో వ్యవసాయ పనులు పూర్తికావాలంటే జూన్, జూలై నెలలు చాలా కీలకం. ప్రధానంగా మహారాష్ట్ర నుంచి తూర్పున ఉన్న పశ్చిమ బెంగాల్ వరకూ మధ్యలో ఉన్న ప్రాంతమంతా కోర్ వ్యవసాయ జోన్‌గా చెబుతారు. ఇదిలావుంటే నైరుతి రుతుపవనాల మౌలిక స్వభావం మారుతోంది. స్థానిక పరిస్థితులు, వాతావరణంలో మార్పుల ప్రభావంతో సీజన్‌లో వర్షాలు కురిసే రోజులు తగ్గుతున్నాయి. అదే సమయంలో దేశవ్యాప్తంగా వర్షాల విస్తరణలో కూడా హెచ్చుతగ్గులు కనిపిస్తున్నాయి. కొన్నిచోట్ల కుంభవృష్టిగా వర్షాలు కురుస్తుంటే.. మరికొన్నిచోట్ల రోజుల తరబడి పొడి వాతావరణం నెలకొంటోంది. గతేడాది హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో వరదలు సంభవించాయి. ఈ ఏడాది ఈశాన్య భారతంలో అదే తరహా పరిస్థితులు నెలకొనడం వాతావరణ మార్పులకు నిదర్శనమని నిపుణులు చెబుతున్నారు. రానున్న రెండు, మూడు రోజుల్లో ఉత్తరాది, ఈశాన్య భారతంలోని అనేకచోట్ల కుంభవృష్టిగా వర్షాలు కురుస్తాయని హెచ్చరించారు.

గంజాయి కేసు బనాయించి హింసించారు!

- మా కుటుంబంపై ఓ కానిస్టేబుల్ కక్ష సాధింపునకు 'టీఎస్ న్యాబ్' అండ
- హెబియస్ కార్పస్ పిటిషన్ వేయకుండా నా కుటుంబ సభ్యులను నిర్బంధించారు
- టీఎస్ న్యాబ్, లంగర్‌హౌజ్ ఇన్‌స్పెక్టర్‌పై న్యాయ విచారణకు బాధితుడి విజ్ఞప్తి

చాదర్‌ఘాట్, జూలై 2(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ పాలనలో తెలంగాణ రాష్ట్ర మాదక ద్రవ్యాల నిరోధక విభాగం (టీఎస్ న్యాబ్) పోలీసులు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని, తనను చితకబాది అక్రమ కేసు బనాయించారని వంకడోతు వీరన్న అనే వ్యాపారి ఆరోపించారు. సినీ ఫక్కీలో సాగిన ఈ కేసులో టీఎస్ న్యాబ్ పోలీసులతో పాటు లంగర్‌హౌజ్ ఇన్‌స్పెక్టర్, కీలక పాత్రధారుడైన కానిస్టేబుల్‌పై న్యాయ విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డీజీపీ, ఏసీబీ డీజీకి ఫిర్యాదు చేశారు. మంగళవారం మలక్‌పేటలో హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ నివాసంలో జరిగిన మీడియా సమావేశంలో వీరన్న వివరాలు తెలిపారు. 'మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం అపూర్ గ్రామానికి చెందిన మా కుటుంబానికి, టీఎస్ న్యాబ్ కానిస్టేబుల్ అయిన తమ బంధువు భూక్య రాజేందర్‌తో పాత తగాదాలు ఉన్నాయి. నాపై కక్ష కట్టిన రాజేందర్ గంజాయి కేసు మోపి జైలు పాలుచేస్తానని బెదిరించేవాడు. మొదట్లో నేను అంతగా పట్టించుకోలేదు. రాజేందర్ టీఎస్ న్యాబ్, లంగర్‌హౌస్ పోలీసు ఇన్‌స్పెక్టర్ అండతో నా మొబైల్ ఫోన్‌ను ట్రాక్ చేసి, గత ఏడాది ఆగస్టు 9న నేను కారులో డ్రైవర్‌తో కలిసి వస్తుండగా ఓఆర్ఆర్ ఘట్‌కేసర్ టోల్‌గేట్-9 వద్ద అడ్డుకున్నారు. కారు ఆపగానే పోలీసులు నన్ను అదుపులోకి తీసుకుని చితకబాదారు. చిత్రహింసలు పెట్టారు. నా కుటుంబ సభ్యులు ఆరుగురిపై తప్పుడు కేసులు నమోదు చేశారు. ఎవరికైనా చెబితే ఎన్‌కౌంటర్ చేస్తామని బెదిరించారని వీరన్న కంటతడి పెట్టుకున్నారు. తన కారు నంబర్ ప్లేట్ తొలగించి అత్తాపూర్‌కు వచ్చిన తర్వాత తిరిగి బిగించారని తెలిపారు. అత్తాపూర్‌లో కారును చుట్టుముట్టి పట్టుకున్నట్లు మొబైల్ ఫోన్‌లో రికార్డు చేస్తూ.. కారులో గంజాయి తరలిస్తున్నట్టు టీఎస్ న్యాబ్, లంగర్‌హౌస్ పోలీసులు సీన్ సృష్టించారని చెప్పారు. తన భూమి కొనుగోలుదారుడి వద్దకు వెళ్లి రూ.33 లక్షలు వసూలు చేశారని పేర్కొన్నారు. తాను, తన కుటుంబ సభ్యులు వ్యాపారాలు, ఉద్యోగాలు చేసుకుని గౌరవంగా బతుకుతున్నామని, పాత కక్షలతో తమ కుటుంబాన్ని వేధించారన్నారు. తనను అక్రమంగా అరెస్టు చేసినప్పుడు తన కుటుంబ సభ్యులు కోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ వేయకుండా నిర్బంధంలో ఉంచి బెదిరించారని తెలిపారు. 10 నెలలుగా పోలీసుల వేధింపులతో తీవ్ర మానసిక క్షోభ అనుభవిస్తున్నామని విలపించారు. కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో ఆరు నెలల రిమాండ్ తర్వాత విడుదల అయ్యానని తెలిపారు. అయినా పోలీసుల బెదిరింపులు ఆగడం లేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి స్పందించి న్యాయ విచారణ చేపడితే టీఎస్ న్యాబ్ తనలాంటి వ్యక్తులపై బనాయించిన అక్రమ కేసులు వెలుగుచూస్తాయన్నారు.


ఫిర్యాదు ప్రతిని చూపిస్తున్న వీరన్న

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సంచలన సభాపర్వం

ఊహించినట్టుగానే రాహుల్ గాంధీ ఘాటు ప్రసంగానికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ గట్టి జవాబు ఇచ్చారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానంపై జరిగేచర్చలో రాహుల్ గాంధీ సోమవారం నాడు మాట్లాడారు. ప్రతిపక్ష నేతగా ఆయన మొదటి ప్రసంగం ఇది. తీవ్రమైన విమర్శలలో, కొన్ని వివాదాస్పద వ్యాఖ్యలను కూడా జోడించి, రాహుల్ చేసిన వేడి వేడి ప్రసంగానికి మిశ్రమ ప్రతిస్పందనలు లభించాయి. ప్రతిపక్షాలన్నిటి తరఫున మాట్లాడుతూ, ఆత్మవిశ్వాసాన్ని, పరిపక్వతను ప్రదర్శించారని అభిమానులు సంతోషిస్తే, అనుభవ రాహిత్యంతో చాపల్యాన్ని ప్రదర్శించారని విమర్శకులు మండిపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా, రాహుల్ గాంధీ ప్రతిపక్ష నేత స్థాయికి తగినట్టు పెద్దరికాన్ని చూపలేదని విమర్శించారు. చర్చకు సమాధానం ఇస్తూ, మోదీ మంగళవారం నాడు రాహుల్‌ను బాలకుడు, బాలకుడు అంటూ పదేపదే ఎద్దేవా చేశారు. అయితే, చిన్నపిల్లవాడిగా వ్యవహరించాడని తేలికగా తీసుకోగూడదని, రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యల వెనుక ప్రమాదకరమైన ఉద్దేశ్యాలున్నాయని మోదీ వ్యాఖ్యానించారు. హిందూ సమాజాన్ని హింసావాదులుగా నిందించడాన్ని కోట్లాది మంది ప్రజలు మరచిపోరని హెచ్చరించారు. జనాదేశం తమకే అనుకూలంగా ఉన్నదని, పూర్తి సాధికారతతో తాము పాలిస్తామని, ఈ నినాదాలకు, విమర్శలకు లొంగి తగ్గబోమని మోదీ స్పష్టం చేశారు.

ఎన్నికల ఫలితాలకు తగ్గట్టు, పద్ధెనిమిదో లోక్‌సభ సంచలనశీలంగా, ఉద్రిక్తంగా, సంవాదభరితంగా మొదలయ్యింది. మున్ముందు సభా కాలం అంతా ఇదే విధంగా కొనసాగుతుందన్న సూచనలు కనిపిస్తున్నాయి. మునుపటి సభలలో మాదిరిగా, నూతన సభలో ప్రభుత్వ, ప్రతిపక్ష కూటముల మధ్య అంతరం భారీగా లేదు. అధికార కూటమిలో ప్రధాన పార్టీ బీజేపీకి స్వయంగా మెజారిటీ లేదు. కాంగ్రెస్ సొంత సంఖ్య వంద దాటనప్పటికీ, మునుపటి కంటె 90 శాతం పెరిగింది, దాని మిత్రపక్షాల బలమూ గణనీయంగా పెరిగింది. ఆ ఉత్సాహం సభలో వ్యక్తమవుతోంది. ఇటీవలి సాధారణ ఎన్నికల ప్రచారాన్ని వేడెక్కించిన అంశాలు, రాష్ట్రపతి ప్రసంగంపై జరిగిన చర్చలో కూడా ప్రతిధ్వనించడం చూడవచ్చు. వాటికి తోడు, ఎన్నికల అనంతరం ముందుకు వచ్చిన 'నీట్' వంటి సమస్యలు చర్చలో ప్రముఖంగా ముందుకు వచ్చాయి. చర్చకు ప్రధాని సమాధానం ఇచ్చే రోజునే 'నీట్' ఆందోళనకారులు పార్లమెంటు ముట్టడిని చేపట్టడం విశేషం. ప్రధాని ప్రసంగిస్తున్నంత సేపు, ప్రతిపక్ష బెంచ్‌ల నుంచి ఎడతెగకుండా నినాదాలు వినిపిస్తూనే ఉన్నాయి. ఇంతకాలం విస్మరణకు గురిఅయిన మణిపూర్, మంగళవారం నాడు, ప్రజాప్రతినిధుల ప్రసంగాల్లో, నినాదాల్లో మారుమోగింది.

అత్యవసర పరిస్థితికి 49 ఏళ్లు నిండిన సమయంలో, అధికారపక్షం ప్రారంభించిన ఉధృత విమర్శలు, సభలోనూ కొనసాగాయి. రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి, రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకమని ఎన్నికల ప్రచారంలో చేసిన విమర్శలను తిప్పికొట్టడానికి బీజేపీ ఎమర్జెన్సీ యాభై ఏట ప్రవేశించిన సందర్భం అనువుగా అందివచ్చింది. జగ్జీవన్ రామ్ ప్రధాని అయ్యే అవకాశం వచ్చినప్పుడు దాన్ని ఇందిరాగాంధీ అడ్డుకున్నదని, మండల్ కమిషన్‌కు వ్యతిరేకంగా సభలో రాజీవ్ గాంధీ సుదీర్ఘ ప్రసంగం చేశారని మోదీ ప్రస్తావించడం, కాంగ్రెస్‌ను సామాజిక న్యాయానికి వ్యతిరేకిగా నిలబెట్టడానికే. అయితే, బీజేపీపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలు వర్తమానానికి సంబంధించినవి కాగా, బీజేపీ ఎదురుదాడి, గతంలోని కాంగ్రెస్ వైఖరుల మీద గురిపెట్టినవి.

గత సభ కంటె అదనంగా లభించిన విజయాలను చూసి కాంగ్రెస్ అతిగా ఆనందిస్తున్నదని, ఆ పార్టీకి అంత ఉత్సాహం అవసరం లేదని బీజేపీ చెబుతోంది. అట్లాగే, తాము బలహీనపడ్డామని, ప్రజలు తమను నిరాకరించారని భావించవద్దని, ప్రజాదరణ తమకు తగ్గలేదని, మూడోసారి అధికారానికి ప్రజలే పంపారని, తమది కొనసాగింపే తప్ప, మార్పేమీ లేదని మోదీ పదే పదే చెబుతున్నారు. ఒకరిలో అతిశయాన్ని, మరొకరిలో న్యూనభావాన్ని ఈ వైఖరులు ప్రతిబింబిస్తున్నాయి. ప్రతిపక్షం అతిచురుకుగా ఉండేందుకు, ప్రభుత్వపక్షం యథాపూర్వం కొనసాగేందుకు చేసే ప్రయత్నాలు చట్టసభలలోను, పరిపాలనలోను, ప్రజారంగంలోను అనేక విశేష సన్నివేశాలను కల్పించవచ్చు. సభను నిర్వహించడంలో స్పీకర్ ఓం బిర్లా పడుతున్న ఇబ్బంది, పరిస్థితిలోని జటిలతను సూచిస్తోంది.

సభలో గమనించదగిన విశేషం, ప్రతిపక్ష కూటమిలో అనేక గొంతులు దృఢంగా వినిపించడం. మంగళవారం నాడు అఖిలేశ్ యాదవ్ మాట్లాడిన తీరు కూడా అందరి దృష్టిని ఆకర్షించింది. మణిపూర్ ఎంపీ బిమోల్ అకోయ్జమ్ ఉద్వేగపూరిత ప్రసంగం చేశారు. డీఎంకే, ఆర్జెడీ, ఠాక్రే శివసేన ఎంపీలనూ ప్రత్యేకంగా చెప్పుకోవాలి. కులగణన కోరే స్వరాలకు పార్లమెంటులో కొత్త బలం వచ్చినట్టు అనిపించింది. రాష్ట్రపతి ప్రసంగంపై జరిగిన చర్చలో బీజేపీ సభ్యులు చురుకుగా పాల్గొనగా, మిత్రపక్షాల నుంచి ఆ స్థాయిలో భాగస్వామ్యం కనిపించలేదు. బడ్జెట్ సమయంలో ప్రభుత్వం ఇంకా అనేక సమస్యలు ఎదుర్కొనే అవకాశం కనిపిస్తోంది.

జిల్లాల తగ్గింపు పరిణామాలు ఆలోచించారా?

2014లో ఏర్పాటైన తెలంగాణ రాష్ట్రంలో జిల్లా ఏర్పాటుకు సంబంధించి తీసుకున్న ఒక సాహసోపేతమైన నిర్ణయం రాష్ట్ర ముఖ చిత్రాన్ని మార్చింది. నాటి ప్రభుత్వం 2016లో తీసుకున్న నిర్ణయం జిల్లాల పునర్విభజన. ఇందులో భాగంగా ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న 10 జిల్లాలను 2016లో 31 జిల్లాలుగా విభజించి, తర్వాత 2019లో ములుగు, నారాయణపేట జిల్లాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రాష్ట్రం 33 జిల్లాలను కలిగి ఉంది.

జిల్లాల పునర్వ్యవస్థీకరణ తర్వాత పరిపాలన చాలా సులభంగా మారింది. ఉదాహరణకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను ఐదు జిల్లాలుగా విభజించిన తర్వాత ఆయా జిల్లాల్లోని చిన్న చిన్న పట్టణాలు అన్ని రంగాల్లో అభివృద్ధిలోకి వస్తున్నాయి. నారాయణపేట జిల్లా ఏర్పడ్డాక అనేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల నిర్మాణం జరిగి, కొత్త పరిశ్రమల స్థాపనతో గణనీయమైన అభివృద్ధిని సాధించింది. ఇంతకుముందు మహబూబ్‌నగర్ చేరుకోవడానికి సుమారు 2 – 3 గంటలు (70 – 80 కి.మీ) ప్రయాణం చేయాల్సి వచ్చేది. కానీ ఇపుడు జిల్లా కేంద్రం దగ్గరగా ఉండటం వల్ల ప్రజలు సులభంగా పనులు చేసుకునే వీలు ఉంది. అలాగే నారాయణపేట చుట్టూ ఉన్న మక్తల్, మరికల్, దమరగిద్ద, ఉట్లిగుండం వంటి అత్యంత వెనుకబడిన ప్రాంతాలు రియలెస్టేట్ పరంగా, వాణిజ్య వ్యాపారపరంగా అభివృద్ధిలోకి వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇలా చెప్పుకుంటూ వెళ్తే రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఇలాంటి ప్రయోజనాలు కలిగాయి.

జిల్లాల సంఖ్య నియోజకవర్గాల సంఖ్య ఒకే విధంగా ఉండాలనే డిమాండ్ ఈ మధ్య వినబడుతుంది. దేశవ్యాప్తంగా చూస్తే ప్రస్తుతం మొత్తం 786 జిల్లాలు ఉన్నాయి. అయితే లోక్‌సభ సీట్లు 543 మాత్రమే. దీనిని బట్టి చూస్తే అన్ని రాష్ట్రాల్లో నియోజక వర్గాలు, జిల్లాల సంఖ్య సమానంగా లేదని అర్థమవుతుంది. అతిపెద్ద రాష్ట్రాలైన ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో 75 జిల్లాలుండగా, 80 నియోజకవర్గాలు ఉన్నాయి. అలాగే మధ్యప్రదేశ్ 55 జిల్లాలుండగా, 29 నియోజక వర్గాలు ఉన్నాయి. రాజస్థాన్ రాష్ట్రంలో 50 జిల్లాలుండగా, 25 నియోజకవర్గాలు ఉన్నాయి. చండీగఢ్, లక్షద్వీప్ రాష్ట్రాల్లో తప్పితే ఏ ఇతర రాష్ట్రమూ సమానంగా జిల్లాలు, నియోజకవర్గాలను కలిగి లేవు. అతి చిన్న రాష్ట్రాలున్న ఈశాన్య ప్రాంతంలో కూడా ఈ జిల్లాల సంఖ్య, నియోజకవర్గ సంఖ్యల్లో సారూప్యత లేదు. ఉదాహరణకు, అరుణాచల్ ప్రదేశ్‌లో 26 జిల్లాలు ఉంటే కేవలం రెండు నియోజకవర్గాలను మాత్రమే కలిగి ఉంది.



అసలు 33 జిల్లాల సంఖ్యను ఎందుకు తగ్గించాలని ప్రభుత్వం భావిస్తున్నదో ఇప్పటివరకు స్పష్టం చేయలేదు. నూతన ప్రభుత్వం జిల్లాల సంఖ్య తగ్గింపు నిర్ణయం తీసుకుంటే గత ప్రభుత్వ హయాంలో జరిగిన కొన్ని పొరపాట్లను మళ్ళీ పునరావృతం కాకుండా కొన్ని విషయాల్ని దృష్టిలో ఉంచుకొని ఆ పని చేయాలి.

తెలంగాణ రాష్ట్రంలో 33 జిల్లాల ఏర్పాటు కొంత శాస్త్రీయ పద్ధతిలో జరగలేదన్న వాదన నిపుణుల నుంచి అలాగే రాజకీయ నాయకుల నుంచి ఉంది. రాజకీయ కారణాలతో కొత్త జిల్లాలు ఏర్పాటయ్యాయి. జిల్లాల సగటు తలసరి ఆదాయం సమాన పంపిణీ నిర్వహించబడలేదు. జిల్లాల్లో తలసరి ఆదాయానికి మధ్య చాలా వ్యత్యాసం ఉందని రాజకీయ విశ్లేషకులు కె. నాగేశ్వర్‌రావు తెలిపారు. అసలు 33 జిల్లాల సంఖ్యను ఎందుకు తగ్గించాలని ప్రభుత్వం భావిస్తున్నదో ఇప్పటివరకు స్పష్టం చేయలేదు. నూతన ప్రభుత్వం జిల్లాల సంఖ్య తగ్గింపు నిర్ణయం తీసుకుంటే గత ప్రభుత్వ హయాంలో జరిగిన పొరపాట్లను మళ్ళీ పునరావృతం కాకుండా కొన్ని విషయాల్ని దృష్టిలో ఉంచుకొని ఆ పని చేయాలి.

1) జిల్లా కేంద్రం నుంచి చివరి గ్రామం ఎంత దూరంలో ఉందో కూడా దృష్టిలో పెట్టుకుంటే సామాన్య ప్రజలకు ఎంతో కొంత మేలు జరుగుతుంది. ఉదాహరణకు: రవాణా వ్యయం, సమయం. 2) జిల్లాల మధ్య సరిహద్దులుగా భౌగోళిక సరిహద్దులు ఉంటే సామాన్య ప్రజలకు కూడా జిల్లా సరిహద్దులు తెలిసే అవకాశం ఉంటుంది. 3) జాతీయ రహదారులు సరిహద్దులుగా ఉంటే విభజన చాలా సులభంగా చేయవచ్చు. 4) జిల్లాల భౌగోళిక సరిహద్దులు నిర్ణయించేటపుడు ఆయా ప్రాంతాల్లో ఉన్న ఒకే రకమైన సంస్కృతి కలిగిన ప్రాంతాలను ఒకే జిల్లాలో ఉంచటం సముచితం. 5) రాష్ట్రంలోని వివిధ సంస్థల డైరెక్టర్లు ఒకరు లేదా ఇద్దరు, ఒక ప్రముఖ భూగోళ శాస్త్ర నిపుణుడు, ఒక చరిత్ర నిపుణుడు, ఒక పరిపాలన విభాగ నిపుణుడు, అలాగే రాష్ట్రంలోని అన్ని అంశాలపైన అవగాహన కలిగిన ఒక ప్రముఖుడు, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి.. ఈ సభ్యులతో కమిటీ వేసి వారి సలహా మేరకు జిల్లాల విభజన చేయాలి. 6) రాష్ట్రంలో ఇప్పుడున్న పార్లమెంట్ నియోజకవర్గాల సంఖ్యను ఆధారంగా చేసుకొని జిల్లాల సంఖ్య నిర్ణయిస్తే బాగుంటుంది. ఇపుడున్న జిల్లాల్లో చాలావరకు అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాలు ఒకటి లేదా రెండు జిల్లాల్లో విస్తరించి ఉన్నాయి. ఉదాహరణకు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం మూడు జిల్లాల (కరీంనగర్, సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల) నియోజకవర్గాలలో విస్తరించి ఉంది. 7) డీలిమిటేషన్ తర్వాత భవిష్యత్తులో రాష్ట్రానికి ఎన్ని పార్లమెంట్ నియోజకవర్గాలు వస్తాయో ఆ సంఖ్యను దృష్టిలో ఉంచుకొని జిల్లాల సంఖ్యను నిర్ణయించాలి.

ముప్పైమూడు జిల్లాల స్థానంలో కొన్ని జిల్లాలు తగ్గించాలన్న నిర్ణయం రాష్ట్రంలో చాలా పరిణామాలకు దారితీస్తుంది. అవన్నీ ప్రస్తుత ప్రభుత్వం దృష్టిలో ఉంచుకొని నిర్ణయానికి రావాలి. రాష్ట్రంలో ప్రజలు తమ తమ జిల్లాల పేరు మీద అన్ని రకాల అధికార పత్రాలు పొంది ఉన్నారు. ఇపుడు జిల్లాల తగ్గింపు వల్ల అధికార పాత్రల గందరగోళం ఏర్పడే అవకాశం ఉంది. ప్రజలు మళ్ళీ ఆయా ప్రభుత్వ సంస్థల చుట్టూ తిరగడంలో సమయం, ధనం వృథా అయ్యే అవకాశం ఉంది. అలాగే నూతన ప్రాంతాల బదలాయింపు (ఒక జిల్లా నుంచి వేరొక జిల్లాకు) డిమాండ్ పెరుగవచ్చు. గత పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ తర్వాత జిల్లా కేంద్రాల్లో దాదాపు అన్ని ప్రభుత్వ ప్రైవేట్ సంస్థలు తమ తమ కార్యాలయాల్ని ఏర్పాటు చేసుకున్నాయి. మరి ఇపుడు ఆయా కార్యాలయాల పరిస్థితి ఏమిటి? జిల్లా కేంద్రం ఏర్పాటవుతుందని రియలెస్టేట్ వ్యాపారులు ఎక్కువ మొత్తంలో భూమిని కొనుగోలు చేసి ఉన్నారు. ఇపుడు జిల్లా కేంద్రాల ఎత్తివేతతో భూమి విలువల్లో విపరీతమయిన మార్పులు రావొచ్చు. అప్పుడు వ్యాపారస్థులు, పిల్లల భవిష్యత్తుకై పెట్టుబడులు పెట్టిన సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటన్నది ఆలోచించాలి. అలాగే ఉమ్మడి జిల్లాల నుంచి అన్నీ సర్దుబాటు చేసుకొని ఇపుడిపుడే కోలుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరిస్థితిని గురించి కూడా ఆలోచించాలి. తర్వాత వచ్చే ప్రభుత్వం కూడా ఇలానే జిల్లాల సంఖ్యతో మళ్ళీ ఆట మొదలు పెడితే పరిస్థితి గందరగోళం అవుతుంది.


● పారుపల్లి ఆంజనేయులు
సీనియర్ సహాయ పరిశోధకులు, సెస్, హైదరాబాద్

ఈ చట్టాలతో ప్రజలకు న్యాయం చేరువవుతుందా?

బ్రిటిష్ వారు నిష్క్రమించి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మన ఊరు హెడ్ కానిస్టేబుల్ మారతాడా అన్న అనుమానం కన్యాశుల్కం నాటకంలో ఒక జట్కా బండి వాడు వ్యక్తం చేశాడు. దేశంలో ఎవరు అధికారంలోకి వచ్చినా వ్యవస్థల స్వభావం మారదనే చారిత్రక సత్యం ఈ వాక్యాల్లో ప్రస్ఫుటమయింది. న్యాయవ్యవస్థ పలుకుబడి గల వారికి అనుకూలంగా మారడం, సాక్ష్యాలను తారుమారు చేయడం గురించి వందేళ్ల క్రితమే గురజాడ తన కన్యాశుల్కం నాటకంలో చెప్పారు. సమాజంలో శక్తిమంతులే చివరకు గెలుపు సాధిస్తారని ఆయన స్పష్టం చేశారు. కన్యాశుల్కం రాయడానికి ముందే 1825లో మెకాలే తొలి భారతీయ శిక్షా స్మృతిని రూపొందించారు. 1872లో జేమ్స్ స్టీఫెన్ భారతీయ సాక్ష్యాధార చట్టాన్ని లిఖించారు. రాజ్యాంగాన్ని లిఖించుకున్న ఏడు దశాబ్దాల తర్వాత స్వతంత్ర భారతంలో తొలిసారి మనం రూపొందించుకున్న కొత్త నేర చట్టాలు ఎంత వరకు ఆధునిక నాగరిక సమాజానికి, ప్రజాస్వామ్య ఆకాంక్షలకు అనుగుణంగా ఉన్నాయన్న విషయంపై ఇప్పుడు సర్వత్రా చర్చలు జరుగుతున్నాయి.

జూలై 1 నుంచి అమలులోకి వచ్చిన ఈ నేర చట్టాల ప్రధాన లక్ష్యం పారదర్శకత, జవాబుదారీ విధానం, సమర్థత, ఆధునికీకరణను ప్రవేశపెట్టడం ద్వారా ప్రజలకు న్యాయాన్ని చేరువగా చేర్చడమే అని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. ప్రజలను శిక్షించడానికి తాము ప్రాధాన్యతనీయడం లేదని, వారికి న్యాయం అందించడమే తమ ప్రాధాన్యత అని ఆయన అన్నారు. అయితే ఈ చట్టాల ఉద్దేశాలు మాత్రం వలసవాద మనోభావాలనే ప్రతిఫలిస్తున్నాయని, చాల చోట్ల భాషను మార్చారు కాని సారాన్ని మార్చలేదని అనేకమంది న్యాయ, రాజ్యాంగ నిపుణుల నుంచి వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి.

స్వాతంత్ర్య పూర్వం మహాత్మాగాంధీ, లోకమాన్య తిలక్ వంటి స్వాతంత్ర్య సమర యోధుల్ని ఐపీసీలోని సెక్షన్ 124 ఏ ప్రకారం రాజద్రోహ నేరం క్రింద అరెస్టు చేసి నిర్బంధించారు. 'నేటి కాలానికి అనుగుణంగా లేని అలాంటి వలస వాద చట్టాలు మనకు అవసరమా?' అని రెండేళ్ల క్రితం అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ ప్రశ్నించడమే కాదు, సెక్షన్ 124ఏ అమలును నిలిపివేస్తూ చరిత్రాత్మక తీర్పును వెలువరించారు. అప్పటి నుంచీ దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో ఈ సెక్షన్‌ను అమలు చేయడం ఆగిపోయింది. జూలై 1 నుంచి అమలులోకి వచ్చిన భారతీయ న్యాయసంహితలో సెక్షన్ 124ఏను అయితే తొలగించారు కాని దాని స్థానంలో సెక్షన్ 152ను ప్రవేశపెట్టారని, ఈ సెక్షన్‌లో గతంలోని రాజద్రోహ క్లాజు కంటే ఎక్కువ కఠినమైన, ప్రమాదకరమైన నిబంధనలున్నాయని, పైగా శిక్షను మూడేళ్లనుంచి ఏడేళ్లకు పెంచారని పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ (పియుసిఎల్) తెలిపింది. కొత్త నేరచట్టాల్లో వలసవాదం కాలం నాటి కంటే ఎక్కువ క్రూరమైన, ప్రజా వ్యతిరేకమైన నిబంధనలను చేర్చారని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కూడా ఆందోళన వ్యక్తం చేసింది. ఇవాళ రాజద్రోహం అన్న పదానికి అర్థం లేకపోయినా దేశ ద్రోహాన్ని మాత్రం తీవ్రంగా పట్టించుకోవాలని, దేశ సమగ్రత, సమైక్యత, సార్వభౌమికతకు ఎవరు నష్టం కలిగించినా చర్యలు తీసుకోవాల్సిందేనని కేంద్రం వాదించవచ్చు కాని సెక్షన్ 124ఏను దుర్వినియోగపరిచినట్లే, సెక్షన్ 152ను కూడా దుర్వినియోగపరచరన్న హామీ ఎవరు ఇవ్వగలరు? గతంలో ముఖ్యమంత్రి ఇంటి ముందు హనుమాన్ చాలీసాను పఠించడాన్ని కూడా రాజద్రోహం క్రింద పరిగణించినట్లు ప్రజలు వ్యక్తం చేసే ఏ నిరసనను అయినా దేశ ద్రోహం క్రింద పరిగణించరన్న గ్యారంటీ ఉన్నదా? 'దేశ భద్రతా ప్రయోజనాలు, సమగ్రత గురించి మాత్రమే కాదు, ప్రజల పౌర హక్కుల గురించి కూడా న్యాయస్థానానికి అవగాహన ఉన్నది. ఈ రెండింటి మధ్యా సమతుల్యం పాటించడం అవసరం. అది చాలా క్లిష్టమైన పని' అని జస్టిస్ రమణ తన తీర్పులో కొన్ని ముఖ్యమైన వ్యాఖ్యలు చేశారు. ఈ సమతుల్యం పాటించగలిగిన పరిపక్వత మన వ్యవస్థలకు ఉన్నదా అన్నదే చర్చనీయాంశం.



కొత్త నేర చట్టాలను పార్లమెంట్ ఆమోదించినప్పుడు ఉభయ సభల్లోనూ ప్రతిపక్షాలను బహిష్కరించినందువల్ల పెద్దగా చర్చలు జరగలేదు. ఇప్పుడైనా వాటిపై క్షుణ్ణంగా చర్చ జరపాల్సి ఉన్నది. కీలక రాజ్యాంగ అంశాలపై విశ్లేషించి, వ్యాఖ్యానించే అధికారాన్ని రాజ్యాంగం న్యాయవ్యవస్థకు ఇచ్చింది. చట్టసభలు, న్యాయవ్యవస్థ రెండూ తమ కర్తవ్యాలను నెరవేర్చి నేర చట్టాలను, మానవ హక్కులను అంతర్జాతీయ నాగరిక సమాజానికి అనుగుణంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేసినప్పుడే మనం నిజమైన విశ్వగురువు స్థానాన్ని పొందగలుగుతాము.



■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

కొత్త నేర చట్టాల్లో రాజద్రోహం తన పేరును, సెక్షన్‌ను మార్చుకుని ప్రవేశించడం, ఊపా, మోకా వంటి ఉగ్రవాద చట్టాలు వేరుగా కాకుండా తొలిసారి ఐపీసీలో భాగం కావడం, ఎన్‌కౌంటర్ మరణాలను, కస్టడీ మరణాలను నిర్వచించక పోవడం, పోలీసులకు జవాబుదారీ విధానం, బాధ్యతను నిర్ణయించకుండా, వారు అధికార దుర్వినియోగానికి విచ్చలవిడిగా పాల్పడేందుకు మరింత వీలు కల్పించడం, సెక్షన్ 187 క్రింద పోలీసు కస్టడీ రిమాండ్ కాలాన్ని 15 రోజుల నుంచి 90రోజుల వరకు పెంచే అవకాశం ఉండడం విమర్శలకు తావిస్తున్నాయి. సెక్షన్ 113 క్రింద టెర్రరిస్టు చట్టం పోలీసులకు ఊపా కంటే విచ్చలవిడి అధికారాలను కల్పిస్తోందని న్యాయనిపుణులు అంటున్నారు. జస్టిస్ మాలిమత్ నుంచి మాజీ హోం సెక్రటరీ పద్మనాభయ్య వరకు ఎందరో సూచించిన పోలీసు సంస్కరణలను కొత్త నేర చట్టాల విషయంలో పరిగణనలోకి తీసుకున్నట్లు దాఖలాలు లేవు. ఊపా క్రింద అనేకమంది మేధావులు, విద్యార్థులు, ఆదివాసీలు, ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారందర్నీ ఏళ్లతరబడి విచారణ లేకుండా జైలులో బంధించడం, చివరకు 3శాతం మందికి కూడా శిక్ష పడకపోవడం గురించి మానవ హక్కుల సంఘాలు అనేక సందర్భాల్లో ప్రస్తావించాయి. కొత్త నేరాల చట్టాల్లో కూడా నిర్విచక్షణగా అరెస్టులు చేయకుండా పోలీసు అధికారులపై ఆంక్షలు విధించే నిబంధనలు ఏమీ లేవు. ఒక ఖైదీ జైలు శిక్షను తగ్గించాలంటే కేంద్ర ప్రభుత్వ ఆమోదం ఉండాల్సిందేనన్న సెక్షన్ చేర్చడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా కనిపిస్తోంది. విద్వేష నేరాలు, మూక ఊచకోత అన్న పదాలకు ఈ చట్టాల్లో తావివ్వక పోవడం కూడా విమర్శలకు తావిస్తోంది. 'బెయిల్ అనేది నిబంధన కావాలి, జెయిల్ అనేది మినహాయింపు కావాలి, నేరం రుజువుకానంతవరకూ ఎవరైనా అమాయకుడే' అన్న కనీస మౌలిక సూత్రాలకు కొత్త నేర చట్టాలు కూడా తిలోదకలిచ్చాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అయినప్పటికీ కొత్త నేర చట్టాల్లో చెప్పుకోదగ్గ మార్పులు లేకపోలేదు. మహిళలు, పిల్లల సంరక్షణకు సంబంధించి ఎన్నో చర్యల్ని చేపట్టారు. చిన్న చిన్న నేరాలు చేసిన వారితో జైళ్లను నింపకుండా కమ్యూనిటీ సేవను ఒక శిక్షగా చేర్చారు. శాస్త్ర సాంకేతిక రంగాలకు నేర విచారణలో కీలక పాత్రను పోషించారు. డిజిటల్, ఎలెక్ట్రానిక్ సాక్ష్యాలకు ప్రాధాన్యత కల్పించారు. ఫోరెన్సిక్ సైన్స్‌కు ప్రాధాన్యత నిచ్చారు. ఖైదీల పరివర్తన, పునరావాసానికి వీలు కల్పించారు. సాక్షులకు భద్రత కల్పించాలని పేర్కొన్నారు. కాని వీటన్నింటినీ ఎలా చేయాలో మాత్రం వివరించలేదు. పోలీసు కస్టడీలో హింసించకుండా టెక్నాలజీ ద్వారా నేర విచారణ జరిపించాలంటే పోలీసులకు శిక్షణ అవసరం. వారికే కాదు, న్యాయవాదులకూ, ప్రాసిక్యూటర్లకూ ఆధునిక టెక్నాలజీ వినియోగంలో శిక్షణ నీయాల్సిన అవసరం ఉన్నది. భారత రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులను ఒక పోలీసు కానిస్టేబుల్‌ను దృష్టిలో ఉంచుకుని రూపొందించారని, హక్కులను ఇచ్చినట్లే ఇచ్చి ప్రతి అధికరణలోనూ దాన్ని వెనక్కి తీసుకునే అవకాశం కల్పించారని రాజ్యాంగ అసెంబ్లీ సభ్యుడు సోమనాథ లాహిరి వ్యక్తం చేసిన అభిప్రాయం కొత్త నేర చట్టాల విషయంలో కూడా ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు కనిపించడం లేదు.

మానవ హక్కుల విషయంలో భారత దేశం చాలా వెనుకబడి ఉన్నదన్న విషయంలో సందేహం లేదు. 1948లో ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల ప్రకటనను రూపొందించింది. 1966లో పౌర, రాజకీయ హక్కులపై ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పద్దులపై ఐక్యరాజ్యసమితి రెండు ఒడంబడికలను రూపొందించింది. అయినప్పటికీ 1993లో పివి నరసింహారావు హయాంలో కాని మన దేశంలో జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఏర్పాటు చేయలేదు. మనుషులను హింసించడం, క్రూరంగా, అమానుషంగా వ్యవహరించడానికి వ్యతిరేకంగా 1997లో ఐక్యరాజ్యసమితి ఏర్పర్చిన సదస్సులో భారతదేశం కూడా పాల్గొని సంతకాలు చేసింది. కాని ఇంతవరకూ దాన్ని మనం భారతదేశంలో అమలు చేయలేకపోతున్నాం. ఐక్యరాజ్యసమితి వరకు ఎందుకు? మన రాజ్యాంగంలో పేర్కొన్న కీలకమైన హక్కులనే మన ప్రభుత్వాలు కాలానుగుణంగా విస్మరిస్తూ చట్టాలు చేయడం మొదలుపెట్టాయి 1950లో ప్రవేశపెట్టిన పీడీ చట్టం నుంచి ఊపా వరకు ఎన్నో ఉదాహరణలు మనం పేర్కొనవచ్చు. ఇలాంటి చట్టాల విషయంలో కాంగ్రెస్ పార్టీకి, బీజేపీకి పెద్ద తేడా లేదు. జాతీయ మానవ హక్కుల కమిషన్ స్థాయిని క్రమక్రమంగా తగ్గించడమే కాని పెంచేందుకు పూనుకున్న దాఖలాలు లేవు. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తిని చైర్మన్‌గా నియమించడానికి బదులుగా ప్రభుత్వానికి అనుగుణంగా ఉండే మాజీ న్యాయమూర్తినైనా నియమించుకునే సంప్రదాయాన్ని ప్రవేశపెట్టి ఈ సంస్థను పేపర్ టైగర్‌గా మార్చివేశారు. దళితులు, ఆదివాసీలు, స్త్రీలకోసం ఏర్పర్చిన ప్రత్యేక కమిషన్లు కూడా అస్మదీయ సంస్థలుగా మారాయి. కొత్త నేర చట్టాలను పార్లమెంట్ ఆమోదించినప్పుడు పార్లమెంట్‌లో ప్రతిపక్షాలను బహిష్కరించినందువల్ల పెద్దగా చర్చలు జరగలేదు. ఇప్పుడైనా మరోసారి వీటిపై క్షుణ్ణంగా చర్చ జరపాల్సి ఉన్నది. రాజ్యాంగం న్యాయవ్యవస్థకు కీలక రాజ్యాంగ అంశాలపై విశ్లేషించి, వ్యాఖ్యానించే (జ్యుడిషియల్ ఇంటర్‌ప్రిటేషన్) అధికారం ఇచ్చింది. కేశవానంద భారతి కేసు నుంచి ఇటీవల ఎన్నికల బాండ్ల కేసు వరకూ సుప్రీంకోర్టు ఇలాంటి ఎన్నో కీలకమైన వ్యాఖ్యానాలు చేసింది. చట్టసభలు, న్యాయవ్యవస్థ రెండూ తమ కర్తవ్యాలను నెరవేర్చి నేర చట్టాలను, మానవ హక్కులను అంతర్జాతీయ నాగరిక సమాజానికి అనుగుణంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేసినప్పుడే మనం నిజమైన విశ్వగురువు స్థానాన్ని పొందగలుగుతాము.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ఈసారి అవకాశవాదం అచ్చిరాలేదు!

ఇటీవల్ని ఎన్నికల్లో జాతీయ స్థాయిలో బీజేపీ నాయకత్వాన ఎన్డీఏ, కాంగ్రెస్ నాయకత్వాన ఇండియా కూటములు హోరాహోరీగా పోరాడాయి. అధికార పార్టీకి మోదీ నాయకత్వం వహించి దేశం మొత్తం సుడిగాలి పర్యటన చేశారు. ఈ పర్యటనలో సహజంగా చర్చకు రావాల్సిన రాజకీయ, సాంఘిక, ఆర్థిక అంశాలను మోదీ పక్కకుపెట్టేశారు. అందుకు కారణం తాను గతంలో ప్రధానమంత్రి పదవికి పోటీలో ఉన్నప్పుడు చేసిన హామీలు ఆయన నెరవేర్చలేకపోవడమే. ఆ హామీల ఊసెత్తకుండా రాజకీయేతర విభేదాలపై దృష్టి కేంద్రీకరించారు. రాజ్యాంగ మౌలిక సూత్రాలకే వ్యతిరేకంగా మాట్లాడారు. చివరకు ఆయన పార్టీ 303 స్థానాల నుండి 240కి పడిపోయింది.

ఇందుకు భిన్నంగా– ఏ పార్టీ, ఏ నాయకులు రాజకీయ స్పష్టతతో ఉన్నారో వారికి సానుకూలమైన రాజకీయ ఫలితాలొచ్చాయి. ఏ పార్టీ, లేదా వ్యక్తి రాజకీయ స్పష్టత లేకుండా అవకాశవాద తటస్థత పాటించారో వారందరికీ సరైన రాజకీయ ఫలితాలు దక్కలేదు. భారతదేశంలో ఏ పార్టీ అయినా ఆదర్శంగా తీసుకోవాల్సింది తమిళనాడుకు చెందిన డీఎంకే పార్టీని. డీఎంకే అధినేత స్టాలిన్ అతిచిన్న పార్టీని కూడా వదలకుండా డీఎంకే కూటమిలో ఇముడ్చుకున్నారు. అందుకే నూటికి నూరు శాతం రాజకీయ విజయం సాధించారు. బీజేపీని నిలవరించారు. ఆ విధానాన్ని కాంగ్రెస్ పార్టీ అనుసరించలేకపోయింది. కాంగ్రెస్ పార్టీ బలంగా ఉన్న రాష్ట్రాలలో సంకుచిత వైఖరిని ప్రదర్శించింది. బీజేపీని ఆమూలాగ్రం వ్యతిరేకించే రాజకీయ పార్టీలను కలుపుకోలేకపోయింది. దానికి తగిన మూల్యం చెల్లించుకున్నది.

ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ నాయకుడు జగన్మోహన్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్, ఒడిస్సాలో నవీన్ పట్నాయక్, బీఎస్‌పి అధినేత్రి మాయావతి వీరంతా తటస్థ వైఖరిని అవలంబించి వైఫల్యం మూటగట్టుకున్నారు. జమ్మూకశ్మీర్‌లో గులాంనబీ అజాద్ సైతం తటస్థ వైఖరితోనే లోయలో మునిగిపోయారు. బిహార్‌లో చిరాగ్ పాశ్వాన్, ఆంధ్రప్రదేశ్‌లో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రాజకీయ స్పష్టతతోనే విజయం సాధించారు. దీన్నిబట్టి మంచో చెడో స్పష్టతతో ఉంటేనే రాజకీయంగా తగిన ఫలితాలొస్తాయి. అతి తెలివితో, లోపలొకలా బైటొకలా ప్రవర్తించే కపట రాజకీయ నాయకులకు ఫలితాలు రావని పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నిరూపించాయి.

– డాక్టర్ కె.నారాయణ, సీపీఐ జాతీయ కార్యదర్శి

అంబేడ్కర్ చేసిన 'తిరుగుబాటు హెచ్చరిక'

భారత రాజ్యాంగం ఒక్కరోజులో తయారైంది కాదు. దాదాపు మూడొందల మంది మూడేళ్ళకు పైగా భారీ కసరత్తు చేసి రూపొందించిన రాజ్యాంగం మనది. మొదట్లో అయితే దాదాపు నాలుగు వందల మంది సభ్యులు ఉండేవారు.

ఆనాడు మనది వలసదేశం. వ్యవసాయిక దేశం. వెనుకబడిన దేశం. సాంఘిక రంగంలో క్రూరమైన భూస్వామ్య భావజాలం బలంగా ఉన్న దేశం. మెరుగైన సమాజం కోసం ప్రజలు తాపత్రయం పడుతున్న కాలం అది.

అప్పటికి రాజ్యాంగ సభ ముందున్న ప్రధాన ప్రత్యామ్నాయం రాజకీయ రంగంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం. ఆర్థిక రంగంలో పెట్టుబడీదారీ వ్యవస్థ. ఈ రెండు విభాగాల్లో యూరప్, అమెరికా దేశాలు చాలా ముందున్నాయి. అనేక దేశాల నుండి, అనేకమంది ఆలోచనాపరుల నుండి అనేక ఆదర్శాలను భారత రాజ్యాంగం స్వీకరించింది. సాంకేతిక పరిజ్ఞానంలో కొత్త ఆవిష్కరణల్ని విదేశాల నుండి స్వీకరించినట్టు సామాజిక, రాజకీయ సిద్ధాంతాలను కూడా స్వీకరించడం ఒక చారిత్రక అవసరమే.

జాన్ లాక్, రూసో, థామస్ జెఫర్సన్, అబ్రహం లింకన్, ఫ్రెంచ్ రివల్యూషన్.. ఇలా చెప్పుకుంటూ పోతే ఈ జాబితా చాలా పెద్దది అయిపోతుంది. జర్మనీకి చెందిన వెయిమర్ (Weimar) రాజ్యాంగం కూడ ఇందులో ఉంది. వాటన్నింటి వివరాల్లోకి వెళితే అదో పెద్ద గ్రంథం అవుతుంది. అయితే, భారత రాజ్యంగ నిర్మాతలు పూర్తిగా విదేశీ సిద్ధాంతాల ప్రభావంలో పడిపోయి దేశీయ సాంప్రదాయాలను పక్కన పెట్టేశారు అనే విమర్శ కూడా ఒకటి వున్నది. ఈ విమర్శను రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) చాలా బలంగా ఎక్కుపెట్టింది.

సంఘపరివారం దృష్టిలో దేశీయ పౌర సాంప్రదాయం అంటే మనుస్మృతి. మనుస్మృతినే భారత రాజ్యాంగంగా ప్రకటించాలని వాళ్ళు చాలా కాలంగా చాలా స్పష్టంగా చెపుతున్నారు. చాలా బలంగా ఒత్తిడి పెంచుతున్నారు. ప్రజాస్వామిక రాజ్యాంగాన్ని విమర్శిస్తూ, మనువును కొనియాడుతూ ఆరెస్సెస్ పత్రిక 'ఆర్గనైజర్' అనేక వ్యాసాలు రాసింది, రాస్తున్నది.

కేవలం రాజ్యాంగ రచనా కమిటికి చైర్మన్‌గా మాత్రమే గాక దాని రూపశిల్పిగానూ వ్యవహరించింది బాబాసాహెబ్ అంబేడ్కర్. రాజ్యాంగంలో ప్రజాస్వామిక ఆత్మను ఆయన చాలా జాగ్రత్తగా అమర్చాడు. అదే భారత రాజ్యాంగానికి ప్రాణం. మనువాదులకు ప్రజాస్వామ్యం అంటే పడదు. అంబేడ్కర్‌కు మనుస్మృతి అంటే పడదు. దేశ సామాన్య ప్రజల మీద మనువు సాంస్కృతిక ఆధిపత్యాన్ని నిలువరించడానికే ప్రజాస్వామిక రాజ్యాంగ రచన సాగింది. రాజ్యాంగ రచనలో ఇది ప్రధాన అంశం. ప్రజాస్వామిక రాజ్యాంగం అమల్లోనికి వచ్చింది. ఇక మనువు ఆధిపత్యం అంతం అవుతుందని అంబేడ్కర్ స్వయంగా ప్రకటించాడు.

భారత రాజ్యాంగం దేశీయ సాంప్రదాయాలను అస్సలు పట్టించుకోలేదు అనడం కూడా నిజం కాదు. ఆయన దేశీయ సాంప్రదాయాలు రెండింటిని గట్టిగా పట్టించుకున్నాడు. ఒకదాని గురించి స్పష్టంగా చెప్పాడు. మరోదాని గురించి నేరుగా చెప్పలేదు గానీ అర్థం చేసుకోవడం కష్టం ఏమీకాదు. తాను బుద్ధుని బోధనల నుంచి ఉత్తేజాన్ని పొంది రాజ్యాంగ రచన సాగించినట్టు అంబేడ్కర్ చెప్పుకున్నాడు. రాజ్యాంగ ప్రధాన ఆదర్శాలైన స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావాలను తాను బుద్ధుని నుంచి స్వీకరించినట్టు ఒక సందర్భంలో వివరించాడు. అయితే రాజ్యాంగం మీద అంబేడ్కర్ చెప్పని ప్రభావం కూడ మరొకటి ఉంది. అది సాయుధ పోరాటం.

బుద్ధుని బోధనల నుంచి ఉత్తేజాన్ని పొంది రాజ్యాంగ రచన సాగించినట్టు అంబేడ్కర్ చెప్పుకున్నాడు. రాజ్యాంగ ప్రధాన ఆదర్శాలైన స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావాలను తాను బుద్ధుని నుంచి స్వీకరించినట్టు ఒక సందర్భంలో వివరించాడు. అయితే రాజ్యాంగం మీద అంబేడ్కర్ చెప్పని ప్రభావం కూడ మరొకటి ఉంది. అది సాయుధ పోరాటం.



1946లో రాజ్యాంగ సభ ఏర్పడే నాటికే నిజాం సంస్థానంలోని తెలంగాణ ప్రాంతపు రెండు మూడు జిల్లాల్లో కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో రైతు–కూలీ రాజ్యం కోసం సాయుధ పోరాటం కొనసాగుతోంది. 1948 ఫిబ్రవరిలో భారత ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ ఒక కీలక నిర్ణయాన్ని తీసుకుంది. తాము స్వాతంత్ర్యంగా భావిస్తున్నది నిజానికి అధికార మార్పిడి మాత్రమేనని నిర్ధారించింది. దేశంలోని పీడిత ప్రజలు తమ విముక్తి కోసం సాయుధులై పోరాడాలని పిలుపిచ్చింది. తెలంగాణలో ప్రధానంగానూ, దేశంలోని మరో రెండు మూడు ప్రాంతాల్లో స్వల్పంగానూ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో కొన్నాళ్ళు సాయుధ పోరాటాలు కొనసాగాయి. అయితే 1948 సెప్టెంబరు నెలలో కమ్యూనిస్టు పార్టీ సాయుధ పోరాటాన్ని విరమించింది. తరువాత పార్లమెంటరీ ప్రజాస్వామ్య పంథాను చేపట్టింది.

ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ పార్లమెంటరీ ప్రజాస్వామ్య పంథాను చేపట్టినప్పటికీ, దేశంలో సాయుధ పోరాట ముప్పు పూర్తిగా తప్పిపోయినట్టు కాదని అంబేడ్కర్ భావించాడు. దేశంలో ప్రజాస్వామిక పాలన విఫలం అయితే ప్రజలు సాయుధులై తిరగబడతారని స్పష్టంగా గుర్తించాడు. కమ్యూనిస్టు పార్టీ పేరును నేరుగా ప్రస్తావించలేదు గానీ, పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి పొంచి వున్న సాయుధ పోరాట ముప్పు గురించి మాత్రం రాజ్యాంగ సభలోనే చాలా స్పష్టంగా చెప్పాడు. రాజ్యాంగ సభలో 1949 నవంబరు 25న చేసిన చివరి ప్రసంగంలో అంబేడ్కర్ ఈ హెచ్చరిక చేశాడు:

'మూడేళ్ళు కష్టపడి ఒక గొప్ప ప్రజాస్వామిక రాజ్యాంగాన్ని రూపొందించాం. సమానత్వం మన సిద్ధాంతం; సోదరభావం మన లక్ష్యం. మన రాజ్యాంగం ప్రస్తుతానికి రాజకీయ రంగంలో సమానత్వాన్ని సాధించింది. యుక్త వయస్సు వచ్చిన ప్రతి మనిషికి ఓటు హక్కు కల్పించాం. ప్రతి ఓటుకూ సమాన విలువ ఇచ్చాం. సంపూర్ణ సమానత్వ సాధన దిశగా ఇది తొలి అడుగు. అయితే, రాజకీయరంగంలో సమానత్వాన్ని సాధించినంత మాత్రాన సరిపోదు. సాంఘీక, ఆర్థిక రంగాల్లోనూ సమానత్వాన్ని సాధించాలి. ఈ రాజ్యాంగం ఆధారంగా రేపు ఏర్పడబోయే ప్రభుత్వాలు ఈ రెండు లక్ష్యాలను ప్రథమ కర్తవ్యాలుగా భావించి సాకారం చేయాలి. ఈ కర్తవ్యాలను ప్రభుత్వాధినేతలు నిర్లక్ష్యం చేస్తే, సాంఘిక, ఆర్థిక రంగాల్లో అసమానత్వానికి బాధితులైన ప్రజలు తిరగబడతారు. అంతిమంగా, మనం ఇన్నేళ్ళు కష్టపడి నిర్మించిన ఈ ప్రజాస్వామిక భవనాన్ని పేల్చిపడేస్తారు' అని హెచ్చరించాడు. (అంబేడ్కర్ ప్రసంగ భాగానికి ఇది యథాతథ అనువాదం కాకపోయినా సారాంశం మాత్రం అదే).

ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ సాయుధ పోరాట పంథాను వదిలి పార్లమెంటరీ ప్రజాస్వామ్య పంథాను చేపట్టిన తరువాత కూడ దేశంలో సాయుధ తిరుగుబాట్లు జరిగాయి. ఈ అంశాన్ని అంబేడ్కర్ సరిగ్గానే అంచనా వేశాడు. ఇప్పుడు సాగుతున్న మణిపూర్ పరిణామాలు అలాంటివే.


ప్రజాస్వామ్యానికీ, సాయుధ పోరాటానికీ మధ్య ఒక విలోమానుపాత సంబంధం వుంటుంది. దేశాధినేతలు ప్రజాస్వామ్యాన్ని కాపాడుతుంటే సాయుధపోరాటాలు వెనక్కు తగ్గుతాయి. దేశాధినేతలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తే సాయుధ పోరాటాలు తలెత్తుతాయి. సాయుధ పోరాటాలు తలెత్తితే ఆ తప్పు ప్రజలది కాదు; ప్రభుత్వాధినేతలది. 'అప్పుడు మరొకర్ని నిందించే అవకాశం కూడ వుండదు; మనల్ని మనమే నిందించుకోవడంతప్ప', (If things go wrong, we will have nobody to blame except ourselves) అంటూ అంబేడ్కర్ ఆ ప్రసంగాన్నిముగించాడు.

దేశంలో ఒక వైపు మనుస్మృతిని అభావం చేయడం, మరో వైపు భవిష్యత్తులో తలెత్తే సాయుధ పోరాటాలను నివారించడం అనే లక్ష్యాలతో ప్రజాస్వామిక రాజ్యంగ రచన సాగింది. దీని అర్థం ఏమంటే, ప్రజాస్వామ్యం బలహీనపడితే ఒకవైపు మనుస్మృతి, మరో వైపు సాయుధ పోరాటాలు బలపడతాయి.

ఇక్కడో కిటుకు ఉంది. మనుస్మృతిని పునరుద్ధరించాలనుకునే వారు ఉద్దేశ్యపూర్వకంగానే, ప్రణాళికబద్ధంగానే ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయవచ్చు. ప్రజాస్వామిక ఎన్నికల ద్వారా పాలనాధికారాన్ని దక్కించుకున్నవారు రాజ్యాంగ ఆదర్శాలను, విలువలను తుంగలో తొక్కి నిరంకుశ పోకడలకు పోయినప్పుడు సహజంగానే రాజ్యాంగానికి ఉన్న ఆమోదాంశం సంక్షోభంలో పడుతుంది. అప్పుడు సాయుధ పోరాటాలు తలెత్తే అవకాశాలు పెరుగుతాయి.

■ డానీ
సమాజ విశ్లేషకులు, సీనియర్ జర్నలిస్టు





- రేవంత్ కేబినెట్‌లో ఉమ్మడి జిల్లా నుంచి ఇప్పటికే ఇద్దరు మహిళలు
- మరొకరికి అవకాశం ఉంటే కడియం శ్రీహరితో పాటు రేవూరి, నాయినిల్లో ఒకరికి!
- అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్న ఎమ్మెల్యేలు
- కొండా సురేఖ, సీతక్కల శాఖల మార్పుపైనా చర్చ
- వారికి కీలక శాఖలు దక్కబోతున్నాయని ప్రచారం
- రేవంత్‌రెడ్డి మంత్రివర్గ కూర్పుపై పెరుగుతున్న ఆసక్తి

మరో బెర్త్ దక్కేనా?

మంత్రి వర్గ విస్తరణపై ఓరుగల్లు ఎమ్మెల్యేల్లో ఆశలు

వివరాలు : 7లో..

త్వరలోనే రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణ జరగబోతోంది. ఇప్పటికే అమాత్యుల మార్పులు, చేర్పులు, కూర్పులపై కసరత్తు పూర్తి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ఢిల్లీ వెళ్లి మంత్రి వర్గ విస్తరణపై అధిష్ఠానం వద్ద గ్రీన్‌సిగ్నల్ తీసుకోవడంతో పాటు.. కొత్తగా మంత్రివర్గంలోకి తీసుకోబోయే నేతలు.. పాత మంత్రుల శాఖల మార్పులు తదితర అంశాలకు సంబంధించిన జాబితాను అందజేశారు. దీంతో మంత్రివర్గంలో ఓరుగల్లుకు మరో బెర్త్ దక్కబోతోందన్న ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో మంత్రిపదవి కోసం ఎదురుచూస్తున్న ఉమ్మడి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఉమ్మడి జిల్లా నుంచి ఇప్పటికే ఇద్దరు మహిళలు రేవంత్ టీంలో ప్రాతినిధ్యం వహిస్తుండగా.. మరొకరికి అవకాశం ఉంటుందన్న చర్చ జరుగుతోంది. ప్రస్తుత మంత్రుల్లో సురేఖ బీసీ సామాజిక వర్గం, సీతక్క ఎస్టీ సామాజిక వర్గం వారు కావటంతో ఎస్సీ, జనరల్ కోటా నుంచి కేబినెట్‌లో చోటుకోసం పలువురు శాసనసభ్యులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో కొత్తగా మంత్రివర్గంలో చోటు కల్పిస్తే.. మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో పాటు జనరల్ కోటాలో వరంగల్ పశ్చిమ, పరకాల ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాష్‌రెడ్డి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. అలాగే మంత్రులు సురేఖ, సీతక్కల శాఖలు కూడా మారుతాయని, వారికి కీలక శాఖలు దక్కబోతున్నాయన్న ప్రచారం ప్రజల్లో ఆసక్తిని రేపుతోంది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

బల్దియా అదనపు కమిషనర్‌గా కృష్ణారెడ్డి



వరంగల్ కార్పొరేషన్, జూలై 2: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ అదనపు కమిషనర్‌గా ఎస్.కృష్ణారెడ్డికి నియమిస్తూ వరంగల్ బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అదనపు కమిషనర్‌గా విధులు నిర్వర్తించిన అనిసుర్ రషీద్ జూన్ 30న ఉద్యోగ విరమణ పొందడంతో ఆయన స్థానం ఖాళీ అయ్యింది. దీంతో ప్రజలకు పరిపాలనాపరమైన సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు కమిషనర్ ప్రస్తుతం కాశిబుగ్గ మున్సిపల్ సర్కిల్ కార్యాలయంలో అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్న కృష్ణారెడ్డిని బల్దియా ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించారు. కాశిబుగ్గ సర్కిల్ కార్యాలయంతో పాటు బల్దియా ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్‌గా విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. అంతే కాకుండా బల్దియా సెక్రెటరీ విజయలక్ష్మి 20 రోజుల సెలవులో ఉండడంతో ఆ బాధ్యతలు కూడా కృష్ణారెడ్డి నిర్వర్తించాలని ఆదేశించారు.

9మంది సీఐలు, ఐదుగురు ఎస్ఐల బదిలీ

వరంగల్ క్రైం, జులై 2: వరంగల్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న 9మంది సీఐలు, 5గురు 5ఎస్ఐలను బదిలీ చేస్తూ మంగళవారం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు.

బదిలీ అయిన సీఐలు

ఆర్.సంతోష్ పీసీఆర్ నుంచి ఆత్మకూరు, వి.క్రాంతికుమార్ ఆత్మకూరు నుంచి పరకాల, డి.రవిరాజ్ పరకాల నుంచి వీఆర్, జి.బాబులాల్ వీఆర్ నుంచి గీసుగొండ, ఎల్.పవన్‌కుమార్ గీసుగొండ నుంచి టాస్క్‌ఫోర్స్, ఎ.సువర్ణ వీఆర్ నుంచి సుబేదారి మహిళా పోలీస్‌స్టేషన్, ఎన్.కరుణాకర్ సుబేదారి మహిళా పోలీస్‌స్టేషన్ నుంచి సీసీఆర్‌బీ, కె.రామకృష్ణ వీఆర్ నుంచి వరంగల్ ట్రాఫిక్, కె.శ్రీధర్ వరంగల్ ట్రాఫిక్ నుంచి టాస్క్‌ఫోర్స్ వరంగల్‌కు బదిలీ అయ్యారు.

బదిలీ అయిన ఎస్ఐలు

ఎస్.వెంకన్న గీసుగొండ నుంచి వీఆర్, జి.రాజేష్‌రెడ్డి ఆత్మకూరు నుంచి వీఆర్, ఎన్.చెన్నకేశవులు దేవురుప్పుల నుంచి జనగామ, పాస్తం శ్రీనివాస్ హనుమకొండ నుంచి వీఆర్, జి.అనిల్‌కుమార్ ఐనవోలు నుంచి వీఆర్‌కు బదిలీ అయ్యారు.

నూతన చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



పుస్తకాలను అందించిన సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, జులై 2: దేశవ్యాప్తంగా అమలవుతున్న నూతన క్రిమినల్ న్యాయ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా ముమ్మర ప్రచారం నిర్వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. మంగళవారం హనుమకొండలోని కమిషనరేట్ కార్యాలయంలో నూతన చట్టాలకు సంబంధించిన పుస్తకాలను పోలీస్ స్టేషన్లకు కమిషనర్ అందించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. నూతన నేర చట్టాల ద్వారా బాధితులకు సత్వరమే న్యాయం అందించడంతో పాటు సమయం ఆదా అవుతుందన్నారు. నూతన చట్టాలపై పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ రాగ్యానాయక్, ఏసీపీలు జితేందర్‌రెడ్డి, డేవిడ్‌రాజ్, ఇన్స్‌పెక్టర్లు శ్రీధర్‌రావు, సంజీవ్, ఎస్ఐ సురేష్ పాల్గొన్నారు.



- ఐదేళ్లలో జిల్లాలో అభివృద్ధి శూన్యం
- మొత్తంగా రూ.7.06 కోట్లే విడుదల
- పాలనా వ్యయానికే సరిపోని నిధులు
- ఇంకా రూ.61లక్షల బకాయిలు
- జిల్లాల విభజనతో వైభవం కనుమరుగు

జడ్పీ.. మ..మ



రేపటితో ముగియనున్న జిల్లా పరిషత్ పాలకవర్గం గడువు

హనుమకొండ సిటీ, జూన్ 26: హనుమకొండ జిల్లా పరిషత్ పాలకవర్గం గడువు జూలై 4తో ముగియనుంది. ఐదేళ్లపాటు హనుమకొండ జిల్లా పరిషత్ ఉత్సవ విగ్రహంగానే మిగిలింది. మొక్కుబడిగా సమావేశాల నిర్వహణ జరిగింది. అభివృద్ధిపై చర్చలే లేవు. నిధుల మాటే అసలే లేదు. సాధారణ పాలన ఖర్చులు కూడా తీరని ఆర్థిక దుస్థితి జడ్పీలో నెలకొంది. జడ్పీ చైర్మన్ సైతం నిధులు లేక కుర్చీకే పరిమితమై ఉండడం గమనార్హం. మండలాల్లో అభివృద్ధి కరువై జడ్పీటీసీలు జనానికి ముఖం చూపించలేని పరిస్థితి ఎదుర్కొన్నారు.

జడ్పీ వ్యవస్థ నిర్వీర్యం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో జిల్లా పరిషత్ అంటే మినీ అసెంబ్లీని తలపించేది. మంత్రులు, ఎమ్మెల్యేలు, పాలకవర్గ సభ్యులు, జిల్లా ఉన్నతాధికారగణంతో నిత్యం సందడిగా ఉండేది. పాలన పరమైన నిర్ణయాలు, ప్రభుత్వ నిధుల విడుదల, మండలాలు, గ్రామాల్లో అభివృద్ధి పనులు, సర్వసభ్య సమావేశాల్లో అధికార, ప్రతిపక్షాల పోటాపోటీ చర్చలు, ప్రజా సమస్యలపై పోరాటం.. ఇలాంటి దృశ్యాలతో నిండి ఉండేది. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న జిల్లాల విభజనతో పూర్వ వైభవాన్ని కోల్పోయింది. ఫలితంగా హనుమకొండ జిల్లా పరిషత్ పాలన ఏడు మండలాలకే పరిమితమైంది. విభజనతో హనుమకొండ జిల్లా పరిషత్ ఐదేళ్లలో ఏమి సాధించలేని దుస్థితిలోకి వెళ్లింది. ఎలాంటి అభివృద్ధి పనులు లేక ప్రగతి కుంటుపడింది.

ఐదేళ్లలో రూ.7.06 కోట్లే విడుదల

ఐదేళ్లలో హనుమకొండ జిల్లా పరిషత్‌కు మొత్తంగా రూ.7.06కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. ఇందులో రూ.3.24కోట్లు కేంద్రానివే కావడం ప్రస్తావనార్హం. 15వ ఆర్థిక సంఘం నిధులుగా కేంద్రం నుంచి రూ.3.24 కోట్ల నిధులు రాగా.. రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంటుగా రూ.2.09కోట్లు విడుదల చేసింది. అంటే 2020 నుంచి 2024.. అంటే మొత్తం నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంటుగా రూ.2.09కోట్లు, 2021-22 ఆర్థిక సంవత్సరంలో విడుదల చేసిన రూ.1.73కోట్లు స్పెషల్ గ్రాంటుతో మొత్తంగా రూ.3.82కోట్లు మాత్రమే విడుదల చేసి చేతులు దులుపేసుకుంది. ఇంత తక్కువ స్థాయిలో నిధుల విడుదల జిల్లా పరిషత్ చరిత్రలోనే లేదు.

సరిపోని నిధులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి విడుదలైన నిధులు గతంలో ఉన్న పెండింగ్ బిల్లుల చెల్లింపునకే అధికశాతం ఖర్చయ్యింది. ఈక్రమంలో విడుదలైన నిధులు ఎందుకూ సరిపోలేదు. నిధులతో మండలాలు, గ్రామాల్లో అభివృద్ధి సంగతి అటు ఉంచితే.. కనీసం పాలనాపరమైన ఖర్చులకు కూడా సరిపోని దుస్థితి జిల్లా పరిషత్‌కు ఎదురైంది. నిధుల కొరత వల్ల మండలాల్లో ప్రజల కనీస అవసరాలు కూడా తీర్చకుండా జిల్లా పరిషత్ పాలన ఉత్సవ విగ్రహంగా మారింది.

రూ.61 లక్షల బకాయిలు

ఇప్పటికీ జిల్లా పరిషత్ రూ.61లక్షల బకాయిలను వివిధ ప్రభుత్వ శాఖలకు చెల్లించాల్సి ఉంది. విద్యుత్, మునిసిపల్ శాఖకు పన్నులు, పెట్రోలు బంకులు ఇలా.. రూ.61 లక్షల బకాయిలు పడింది.

జడ్పీ ఆధ్వర్యంలోని మడిగెల అద్దె నెలకు రూ.1.21లక్షలు ప్రధాన ఆదాయంగా మారడం జిల్లా పరిషత్ ఆర్థిక దివాళకు అద్దం పడుతోంది. ప్రతీ నెల సాధారణ ఖర్చులే రూ. 2లక్షలు మించుతుంటే ఆదాయం రూ.1.21లక్షలే కావడంతో అధికారులు కూడా తలలు పట్టుకునే పరిస్థితి. జిల్లా పరిషత్‌కు ప్రధాన ఆదాయ వనరుల మార్గాలను ప్రభుత్వం మూసివేయడంతో సంవత్సరానికి జనరల్ ఫండ్ రూపంలో కూడా నిధులు రాక క్లిష్టమైంది. ఈ పరిస్థితుల్లో జిల్లా పరిషత్

మిగతా 8వ పేజీలో..

నేడు సర్వసభ్య సమావేశం

2019 జూలై 5న పాలకవర్గం కొలువుదీరగా.. జడ్పీ చైర్మన్‌గా డాక్టర్ ఎం.సుధీర్‌కుమార్ ఎంపికయ్యారు. అంటే గురువారానికి ఆ పాలకవర్గ పదవీ కాలం ఐదేళ్లు పూర్తి కానుండగా ఒకరోజు ముందుగానే బుధవారం చివరి జడ్పీ చివరి సర్వసభ్య సమావేశం జరుగనుంది. ఇదే రోజున సభ్యులను జిల్లా పరిషత్ అధికారగణం సన్మానం, వీడ్కోలు కార్యక్రమాలను కూడా నిర్వహించనుంది.

పదవుల కోసమే బీఆర్ఎస్‌పై విమర్శలు

- రాజకీయ అవగాహన లేకుండా మాట్లాడితే సహించం
- కాంగ్రెస్ నాయకులపై బీఆర్ఎస్ నేతల ధ్వజం



విలేకర్ల సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ నేతలు

రాంనగర్, జులై 2: నామినేటెడ్ పదవుల కోసం కాంగ్రెస్ నేతలు స్థాయిని మరిచి బీఆర్ఎస్‌పై విమర్శలు చేస్తున్నారని కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు ధ్వజమెత్తారు. మంగళవారం హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నాగేశ్వర్‌రావు మాట్లాడారు. తమ పార్టీపై, నేతలపై విమర్శలు చేసిన కాంగ్రెస్ నేతలు.. బీఆర్ఎస్‌లో లబ్ధిపొందిన వారేనని ఆరోపించారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మెప్పు పొందేందుకు తమ పార్టీపై విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రి నగరానికి రావడం వల్ల కలిగిన ఫలితం ఏవిటని తమ పార్టీ నేతలు ప్రశ్నిస్తే.. కాంగ్రెస్ నేతలు ఎందుకు ఉలిక్కిపడుతున్నారని అన్నారు. కాంగ్రెస్ నేతలకు నగర అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదన్నారు. నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేయాలనే ఆలోచన కాంగ్రెస్‌కు లేదని నాగేశ్వర్‌రావు విమర్శించారు. ముఖ్యమంత్రి కేవలం ప్రైవేటు ఆస్పత్రి ప్రారంభానికి మాత్రమే వచ్చారని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా బీఆర్ఎస్‌పై విమర్శలు మాని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని నాగేశ్వర్‌రావు సూచించారు. బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నాయకుడు వీరేందర్ మాట్లాడుతూ.. తమ పార్టీ నేత మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయభాస్కర్ తీసుకువచ్చిన నిధులతో పనులు చేయిస్తూ కాంగ్రెస్ నేతలు తామేదో చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని ఆరోపించారు. ప్రస్తుతం నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులన్నీ దాస్యం వినయభాస్కర్ మంజూరు చేయించినవేనన్నారు. తమది ప్రజాపాలన అని చాటుకుంటున్న కాంగ్రెస్.. అప్రజాస్వామిక పాలన సాగిస్తోందని వీరేందర్ ధ్వజమెత్తారు. ఈ విలేకర్ల సమావేశంలో నేతలు బి.రంజిత్‌రావు, నర్సింగ్, లోహితరాజు, రాజునాయక్, నార్లగిరి రమేశ్, ఉడతల సారంగపాణి, సంపత్‌రెడ్డి, బండి రజనీకాంత్, ప్రశాంత్, రంజిత్, రఘు, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్యపై దృష్టి సారించాలి

- డీఎస్సీని రద్దు చేసి మెగా డీఎస్సీ నిర్వహించాలి
- నిరుద్యోగుల ఓటుతో గెలిచిన తీన్మార్ మల్లన్న జాడలేడు..
- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న ప్రేమేందర్‌రెడ్డి

హనుమకొండ టౌన్, జులై 2: పార్టీ ఫిరాయింపులను పక్కకు పెట్టి ముందుగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యపై దృష్టి సారించాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి సలహా ఇచ్చారు. మంగళవారం హంటర్‌రోడ్డులో జరిగిన విలేకరుల సమావేశంలో ప్రేమేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 7నెలలైనా ఇంకా హనీమూన్ పీరియడ్‌లా భావిస్తోందని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉన్నాయన్నారు. నిరుద్యోగ సమస్యను పారదోలుతానని చెప్పి అధికారం చేజిక్కించుకున్న రేవంత్‌రెడ్డి.. గ్రూప్-1, 2 పోస్టులను పెంచడం కానీ, మెగా డీఎస్సీ నిర్వహణ చేయడం కానీ లేదన్నారు. అసెంబ్లీ సాక్షిగా జీవో 46ను రద్దు చేస్తామని భట్టి విక్రమార్క ప్రకటించి దాని ఊసెత్తడం లేదన్నారు. నిరుద్యోగ భృతి, 2 లక్షల ఉద్యోగాల విషయం మరిచేపోయారన్నారు. గ్రూప్-1 ప్రిలిమ్స్ తర్వాత 1:100 పిలుస్తామని చెప్పి ఇప్పుడు 1:50 పిలుస్తాననడం మోసపూరితమన్నారు. నిరుద్యోగుల తరుపు మేమున్నామంటూ ప్రస్తుతం హడావిడి చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ.. తమ హయాంలో చేసిన పాపాల సంగతేందని ప్రశ్నించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ దొందూ దొందేనని, ఇరు పార్టీలు నిరుద్యోగులను మోసం చేశాయన్నారు. నిరుద్యోగ సమస్యపై జూలై 5న బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్‌ల ఎదుట ఆందోళనకు పార్టీ పిలుపునిచ్చిందన్నారు. సీఎం ఢిల్లీ చుట్టూ తిరగడం మాని రాష్ట్రంలోని పరిస్థితులను చక్కదిద్దాలన్నారు. రూ.2లక్షల రుణమాఫీ అని చెప్పి అధికారంలోకి వచ్చి.. ఇప్పుడు షరతులు వర్తిస్తాయని అనడం హాస్యాస్పదమని ప్రేమేందర్‌రెడ్డి పేర్కొన్నారు వరికి రూ.500 బోనస్ ప్రకటించి ఇప్పుడు సన్నాలకు మాత్రమే అనడం విడ్డూరంగా ఉందన్నారు. రూ.4,000 పెన్షన్ ఇస్తామని విస్మరించారన్నారు నిరుద్యోగుల ఓట్లతో ఎమ్మెల్సీగా గెలిచిన తీన్మార్ మల్లన్న నిరుద్యోగి దీక్ష చేస్తుంటే అటు వైపు కన్నెత్తి చూడటం లేదన్నారు. 8 లోక్‌సభ స్థానాల్లో విజయం ఇచ్చి మిగతా లోక్‌సభ స్థానాల్లో రెండోస్థానం ఇచ్చినందుకు ఓటర్లకు కృతజ్ఞత చెప్పేందుకు ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో కృతజ్ఞత సభలను ఏర్పాటు చేయబోతున్నట్లు పేర్కొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రైవేట్ ఆస్పత్రులపై కాకుండా ఎంజీఎం, సూపర్ స్పెషాలిటి ఆస్పత్రిపై దృష్టి సారించాలన్నారు, భూకబ్జాలను, రౌడీయిజాన్ని నిలువరిస్తానని చెప్పిన నాయిని రాజేందర్‌రెడ్డి.. అలాంటి వ్యక్తులను పార్టీలో చేర్చుకోవడం బంద్ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గురుమూర్తి శివకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండి జితేందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నర్మెట్ట శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ సత్యనారాయణ, పర్వతగిరి మండల నాయకుడు శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.



80సీట్లేనా.. ఇంకా పెరుగుతాయా?

అడ్మిషన్ల కోసం ఆశావహుల ఎదురుచూపు

ప్రభుత్వానిదే తుది నిర్ణయమంటున్న వర్సిటీ అధికారులు

కేయూ పీహెచ్‌డీ మలి విడత

అడ్మిషన్లపై ఉత్కంఠ



కేయూ క్యాంపస్, జూలై 2: కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ మలి విడత అడ్మిషన్లపై రోజు రోజుకు ఉత్కంఠ పెరుగుతోంది. రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులు గతంలో 80సీట్లకు అడ్మిషన్లు కల్పించాలని చెప్పింది. తాజాగా ఇప్పటి వరకు అన్ని విభాగాల్లో ఉన్న పీహెచ్‌డీ సీట్ల వివరాలను అడిగింది. దీంతో పీహెచ్‌డీ అడ్మిషన్ల ఎలా చేపడతారనే విషయంలో రోజు రోజుకు ఉత్కంఠ పెరుతుగుతోంది. వర్సిటీలో గత ఎన్నికల ముందు 2020-22 ఏడాదికి గాను వర్సిటీని అన్ని విభాగాల్లో పీహెచ్‌డీ ప్రవేశాల పరీక్షలు నిర్వహించి అడ్మిషన్లు కల్పించారు. అయితే పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయని విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. వర్సిటీ ప్రిన్సిపాల్ కార్యాలయంలో కంప్యూటర్లు, ఫర్నిచర్లు ధ్వంసం చేశారు. దీంతో విద్యార్థుల పై ట్రాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేయడం రాష్ట్రవ్యాప్తంగా అప్పట్లో సంచలనం రేగింది. అదే క్రమంలో విద్యార్థులు కేయూ దూరవిద్య కేంద్రం ఎదుట నిరవధిక నిరహార దీక్షలు చేపట్టారు. వారి దీక్షలకు అప్పట్లో పార్టీలకతీతంగా నాయకులంతా సంఘీభావం ప్రకటించారు. ఆ సమయంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి విద్యార్థుల దీక్షా శిబిరాన్ని సందర్శించి వర్సిటీలో పీహెచ్‌డీ విద్యార్థులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కేయూ విద్యార్థులు స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రుల సహకారంతో సీఎంని కలిసి తమకు న్యాయం చేయాలని విన్నవించారు.

పీహెచ్‌డీ అడ్మిషన్లపై ముందడుగు

కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే కమిటీని నియమించింది. కమిటీలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి నేతృత్వంలో త్రిమెన్ కమిటీని వేసి నిజ నిర్ధారణ చేశారు. కమిటీ సూచనల మేరకు పీహెచ్‌డీ అడ్మిషన్లు కాగా మిగిలిన సీట్లను భర్తీ చేయాలని నిర్ణయించారు. అయితే ఎన్నికల సమయం ముంచుకు రావడంతో వర్సిటీ అధికారులు ఆ దిశగా దృష్టి సారించకపోవడంతో పీహెచ్‌డీ మలి విడత అడ్మిషన్లు జరగలేదు. తాజాగా కొత్తగా ఇన్‌చార్జ్ వీసీగా నియమితులైన వాకాటి కరుణ విద్యార్థుల పీహెచ్‌డీ మలి విడత అడ్మిషన్లపై దృష్టి పెట్టారు. కేటగిరి-1లో మిగిలిన సీట్లన్నీ కేటగిరి-2లోకి భర్తీ చేయకపోవడాన్ని గుర్తించారు. మిగిలిన సీట్లన్నీ వెంటనే మెరిట్ ప్రకారం భర్తీ చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని నిర్ణయించారు.

ఎగ్జిక్యూటివ్ కమిటీలోనూ నిర్ణయం

కేటగిరి-2లో పీహెచ్‌డీ సీట్ల భర్తీకి సంబంధించిన వర్సిటీ ఎగ్జిక్యూటీవ్ కమిటీలో నిర్ణయం తీసుకున్నారు. అయితే రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అధికారులు ఇటీవల కేటగిరి-1లో మిగిలిన సీట్లతోపాటు తాజాగా వర్సిటీలోని అన్ని విభాగాల్లో మొత్తంగా సీట్ల వివరాలను కావాలని అడిగారు. దీంతో పాత 80 సీట్ల వరకే అడ్మిషన్లు కల్పిస్తారా.. ఇప్పటి వరకు మిలిగిన సీట్లన్నింటికి అడ్మిషన్లు కల్పిస్తారా అనేది సందేహంగా మారింది.

వర్సిటీ పీహెచ్‌డీలో మిగిలిన సీట్లివే..

కాకతీయ యూనివర్సిటీ ఈసీ నిర్ణయం మేరకు కేటగిరి -1లో మిలిగిన 80 సీట్ల వివరాలను వర్సిటీ అధికారులు రాష్ట్ర ఉన్నతవిద్య మండలి అధికారులకు అందజేశారు. వాటిలో సోషల్ సైన్స్‌లో 5, ఇంజనీరింగ్‌లో 10, ఫార్మసీలో 17, ఎడ్యుకేషన్ విభాగాల్లో ఖాళీల్లేవు. మిగతా సీట్లన్ని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, ఆర్ట్స్, సైన్స్ విభాగాల్లో ఉన్నాయి. తాజా మళ్లీ ఇప్పుడూ రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులు ఇప్పటి వరకు వర్సిటీలో పీహెచ్‌డీ సీట్లు ఎన్ని ఉన్నాయనే వివరాలు కావాలని లేఖలు పంపారు. వివరాలను అధికారులు అన్ని విభాగాల నుంచి సేకరించి తయారు చేస్తున్నారు. అయితే పాత 80సీట్లలో అడ్మిషన్లు కల్పిస్తారా.. తాజాగా తీసుకుంటున్నా వివరాల ప్రకారం అడ్మిషన్లు చేపడుతారా అనే అంశం సందేహంగా మారింది.

అడ్మిషన్లపై రాష్ట్ర ప్రభుత్వానిదే తుది నిర్ణయం

కేయూ మలి విడత పీహెచ్‌డీ అడ్మిషన్లపై కాకతీయ యూనివర్సిటీ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానిదే తుది నిర్ణయమని చెబుతున్నారు. 80 సీట్లకు అడ్మిషన్లు కల్పించాలా.. తాజాగా ఉన్న ఖాళీలను భర్తీ చేయాలా అనే అంశంపై రాష్ట్ర ప్రభుత్వమే నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేస్తున్నారు. రాష్ట్ర విద్యాశాఖ సీఎం రేవంత్‌రెడ్డి చేతుల్లోనే ఉందని, తుది నిర్ణయం ఆయనదేనని వర్సిటీలో చర్చ జరుగుతోంది. పీహెచ్‌డీ ఆశావాహుల్లో రోజు రోజుకు అడ్మిషన్లపై ఉత్కంఠ పెరుగుతుండగా సీట్లు పెరిగితే తమకు అడ్మిషన్ వస్తుందని.. లేదంటే తమకు రాదని అభ్యర్థులు లెక్కలు వేసుకుంటున్నారు. ఏదేమైనా త్వరగా అడ్మిషన్లు చేపడితే అర్హులకు న్యాయం జరుగుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కాళోజీ హెల్త్ యూనివర్సిటీ ఎదుట విద్యార్థుల ఆందోళన



కాళోజీ హెల్త్ యూనివర్సిటీ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

వరంగల్ మెడికల్, జూలై 2: కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో 2022-23 విద్యా సంవత్సరం నుంచి బీఎస్సీ అలైడ్ హెల్త్ సైన్స్ కోర్సులను ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, ఈ కోర్సుల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థుల చదువులను యూనివర్సిటీ గాలికి వదిలేసిందని అలైడ్ హెల్త్‌సైన్స్ విద్యార్థుల నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం కాళోజీ హెల్త్ యూనివర్సిటీ ఎదుట విద్యార్థులు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు.

ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు మాట్లాడుతూ.. కాళోజీ హెల్త్ యూనివర్సిటీ విద్యార్థులకు ఆల్మనాక్, అకడమిక్ క్యాలెండర్, సరైన కరిక్యులమ్ ప్రకటించకుండా, యూనివర్సిటీ అమలు చేయాల్సిన నిబంధనలు కూడా పట్టించుకోవడం లేదన్నారు. పేద విద్యార్థుల భవిష్యత్‌ను నాశనం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో మొదటి బ్యాచ్‌లో పరీక్షలు రాస్తే కేవలం 25మంది ఉత్తీర్ణత సాధించారని, మిగిలిన వారంతా ఫెయిల్ అయ్యారని తెలిపారు. విద్యార్థుల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 700 మంది అలైడ్ హెల్త్ సైన్స్ విద్యార్థులతో కలిసి యూనివర్సిటీని ముట్టడించినట్లు పేర్కొన్నారు. గత సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన అలైడ్ హెల్త్ సైన్స్ కోర్సు నేడు అరకొర వసతులతో, క్లాసరూమ్‌లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు.

అనంతరం విద్యార్థుల ప్రతినిధి బృందం సభ్యులు యూనివర్సిటీ రిజిస్ట్రార్ సంధ్యను కలిసి సమస్యలను విన్నవించారు. సానుకూలంగా స్పందించిన రిజిస్ట్రార్.. సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి మార్గం చూపుతామని హామీ ఇచ్చారు. దీంతో అలైడ్ హెల్త్ సైన్స్ విద్యార్థులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి యార ప్రశాంత్, రాష్ట్ర సహాయ కార్యదర్శి దామర కిరణ్, కె.అశోక్, స్టానిల్, మంద శ్రీకాంత్, చుక్క ప్రశాంత్, యార ప్రశాంత్, లెనిన్ గువేరా, జస్వంత్, పరిమళ, వినోద్ కుమార్, శివ, కిషోర్, సింధు, శ్రీధర్, అన్వేష్, సాయికిరణ్, పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణ చేయాలి..

వరంగల్ మెడికల్, జూలై 2: ప్రభుత్వ వైద్య, ఆరోగ్య విభాగం జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్ఎం) సేవలు అందజేస్తున్న ఉద్యోగుల సర్వీస్ చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారని జాతీయ ఆరోగ్య మిషన్ (ఏఐటీయూసీ అనుబంధం) కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా అన్నారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఏళ్లుగా పని చేస్తున్నా రెగ్యులరైజ్ ఉద్యోగుల సర్వీస్ అన్ని కేడర్లకు 510 జీవో వర్తింపజేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం కింద రెగ్యులర్ ఉద్యోగుల తరహాలో జీతభత్యాలు ఇవ్వాలన్నారు. ఎన్‌హెచ్ఎం కింద పని చేస్తున్న అన్ని కేడర్ల వారిగా సర్వీసును రెగ్యులర్ చేయాలని ఆయన కోరారు.

రాత్రి 8గంటలకు వర్సిటీ గేట్లు బంద్

ఆలోపే విద్యార్థులు క్యాంపస్‌కు చేరుకోవాలి..

కేయూ ఉన్నతాధికారుల ఉత్తర్వులు

కేయూ క్యాంపస్, జూలై 2: కాకతీయ యూనివర్సిటీలో హద్దు తప్పుతున్న వ్యవహారాలకు వర్సిటీ ఉన్నతాధికారులు చెక్ పెట్టారు. అర్ధరాత్రి బర్త్‌డే పార్టీలు, ఇతరత్రా వ్యవహారాలకు అడ్డుకట్ట వేసేందుకు వర్సిటీ అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టారు. ఈ మేరకు మంగళవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఉత్తర్వులు వెలువరించారు. రాత్రి 8గంటల వరకు వర్సిటీ రెండో గేటు మూసివేస్తామని, అలాగే రాత్రి 9 గంటల కల్లా వర్సిటీ మొదటి గేటును మూసివేస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు ఆయా సమయంలోనే వర్సిటీ లోనికి రావాలని స్పష్టం చేశారు. అలాగే బర్త్‌డే పార్టీల పేరుతో వర్సిటీ ఫుట్‌పాత్‌లపై కేక్ కట్ చేసుకుని విచ్చల విడిగా వ్యవహరించడం తగదని హెచ్చరించారు. బయటి వ్యక్తులు ఫొటోషూట్‌ల పేరుతో వర్సిటీల్లో అనుమతి లేకుండా తిరగడాన్ని నిషేధించారు. రాత్రి 9 గంటల వరకే బయట నుంచి భోజనం, ఇతరత్రా తినుబండారాలకు అనుమతి ఉంటుందన్నారు. నిర్ణీత సమయంలోనే ఫుడ్‌తో పాటు తినుబండారాల ఆర్డర్‌లు తీసుకోవాలని విద్యార్థులకు స్పష్టం చేశారు. అధికారులు, సెక్యూరిటీ సిబ్బంది అడిగితే విద్యార్థులు తప్పనిసరిగా తమ గుర్తింపు కార్డులను చూపాల్సిందేనని పేర్కొన్నారు. విద్యార్థులందరితో పాటు టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి ఈ నిబంధనలు వర్తిస్తాయని స్పష్టం చేశారు. వర్సిటీలో అందరి భద్రత కోసమే ఆయా నిర్ణయాలు తీసుకున్నామని, అందరూ సహకరించాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి విజ్ఞప్తి చేశారు.

మతిస్థిమితం లేని మహిళ కుటుంబసభ్యులకు అప్పగింత

హనుమకొండ టౌన్, జూలై 2: మతిస్థిమితం లేని మహిళను కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు హనుమకొండ ఇన్స్‌పెక్టర్ వై.సతీష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం బోజెర్వు గ్రామానికి చెందిన ఇట్టబోయిన ఎల్లమ్మ రెండు నెలల నుంచి హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో మతిస్థిమితం లేకుండా సంచరిస్తోంది. ఎల్లమ్మను చేరదీసి వివరాలు తెలుసుకొని యూనివర్సిటీ క్రాస్‌లో ఉంటున్న ఎల్లమ్మ కుమార్తె కవితకు మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు సీఐ చెప్పారు.



ఎల్లమ్మను కుమార్తె కవితకు అప్పగిస్తున్న పోలీసులు

మరో బెర్త్ దక్కేనా?

మంత్రి వర్గ విస్తరణపై ఓరుగల్లు ఎమ్మెల్యేల్లో ఆశలు



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

సీఎం రేవంత్‌రెడ్డి తన మంత్రివర్గాన్ని విస్తరించేందుకు కసరత్తు చేస్తున్న నేపథ్యంలో.. ఓరుగల్లు ఎమ్మెల్యేల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఉమ్మడి జిల్లా నుంచి ఇప్పటికే ఇద్దరు మహిళలకు అవకాశం కల్పించినా.. మరొకరికి బెర్త్ దక్కే అవకాశాలు ఉన్నాయనే చర్చ జరుగుతోంది. ఇదే జరిగితే తమకు అవకాశం వస్తుందన్న ఆశతో ఉన్న ఎమ్మెల్యేలు అధిష్టానంపై ఒత్తిడి తెస్తున్నారు. ప్రస్తుతం ఉన్న మంత్రుల్లో ఎస్టీ, బీసీ సామాజిక వర్గం వారే కావటంతో ఎస్సీ, జనరల్ కోటా నుంచి కేబినెట్‌లో చోటు దక్కించుకునేందుకు పలువురు ఎమ్మెల్యేలు ప్రయత్నాలు చేస్తున్నారు. వీరిలో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో పాటు జనరల్ కోటాలో వరంగల్ పశ్చిమ, పరకాల ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, రేవూరి ప్రకాష్‌రెడ్డి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. దీంతో పాటు ప్రస్తుతం ఉన్న మంత్రుల శాఖలు కూడా మారుతాయని, ఉమ్మడి వరంగల్ జిల్లా మంత్రులకు కీలక శాఖలు దక్కే అవకాశం ఉన్నట్లు జరుగుతుందన్న ప్రచారం ప్రజల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

మంత్రివర్గ విస్తరణపై అందరిలోనూ ఆశలు

కేబినెట్ విస్తరణకు సీఎం రేవంత్ కసరత్తు చేస్తున్న నేపథ్యంలో రెండుమూడు రోజుల్లో ఆరుగురిని తన మంత్రి వర్గంలోకి తీసుకుంటారనే ప్రచారం జరుగుతోంది. దీంతో ఓరుగల్లుకు చెందిన పలువురు ఎమ్మెల్యేల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 12 అసెంబ్లీ స్థానాలు ఉండగా, కాంగ్రెస్ నుంచి పది మంది ఎమ్మెల్యేలు గత ఎన్నికల్లో విజయం సాధించారు. పార్లమెంట్ ఎన్నికల ముందు బీఆర్ఎస్ నుంచి గెలిచిన స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాంగ్రెస్ గూటికి చేరారు. దీంతో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మినహా మిగతా 11మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌కు చెందన వారే ఉన్నారు. గత డిసెంబరు 7వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డితోపాటు ఉమ్మడి జిల్లా నుంచి మంత్రులుగా కొండా సురేఖ, సీతక్క ప్రమాణ స్వీకారం చేశారు. ఇక తర్వలో జరగబోయే మంత్రివర్గ విస్తరణలో ఓరుగల్లుకు మరో బెర్త్ దక్కు తుందనే సమాచారం నేపథ్యంలో సామాజికలెక్కలను తెరపైకి వస్తున్నాయి. ప్రస్తుతం ఇద్దరు మంత్రులు మహిళలు కావటంతో పాటు ఒకరు బీసీ, మరొకరు ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన నేతలు కావడంతో ఇతరసామాజికవర్గం నేతలు మంత్రి పదవిపై ఆశతో ఉన్నారు. ఎస్సీ సామాజిక వర్గంతోపాటు జనరల్ కోటా నుంచి కూడా పలువురు ఎమ్మెల్యేలు మంత్రి పదవిని ఆశిస్తున్నారు.

తెరపైకి కడియంతో పాటు ఆ ఇద్దరు...

మంత్రివర్గంలో చోటుదక్కే వారి పేర్లలో ప్రధానంగా మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. గతంలో ఉపముఖ్యమంత్రిగా, సాంఘిక, సంక్షేమశాఖ మంత్రిగా, విద్యాశాఖ మంత్రిగా, భారీ నీటిపారుదల శాఖ మంత్రిగా పని చేసిన అనుభవం ఉన్న కడియం శ్రీహరి.. సీఎం రేవంత్‌రెడ్డి పిలుపుతో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. తన కుమార్తెను ఎంపీగా కూడా గెలిపించుకున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీలో కడియం శ్రీహరికి అధిష్టానం మంచి గుర్తింపునిస్తోంది. ఈ క్రమంలోనే కడియంను కెబినెట్‌లోకి తీసుకోవటం ద్వారా తన మంత్రివర్గం బలోపేతం అవుతుందన్న భావనలో సీఎం ఉన్నారనే చర్చ జరుగుతోంది. దీంతో పాటు మాదిగ ఉప కులం నుంచి మరొకరికి స్థానం కల్పించినట్లవుతుందని ఆయన లెక్కలు వేసుకుంటున్నారట. అయితే ఇప్పటికే కుమార్తెకు ఎంపీ టికెట్ ఇవ్వటంతో మళ్లీ ఆయనకు మంత్రి పదవి కూడా ఇస్తారా అనే చర్చ కూడా జరుగుతోంది.

● వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి కూడా మంత్రి పదవి దక్కవచ్చుననే ప్రచారం జరుగుతోంది. తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచినా ఆయన పాతికేళ్లకుపైగా కాంగ్రెస్‌కు సేవలు అందిస్తున్నారు. బీఆర్ఎస్ హయంలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పార్టీని కాపాడుకున్నారనే పేరుంది. దీనికితోడు సీఎం రేవంత్‌రెడ్డితో సత్సంబంధాలు ఉండటంతో వరంగల్‌కు మరో బెర్త్ ఇస్తే నాయినికి అవకాశం రావచ్చనే చర్చ జరుగుతోంది.

● పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డికి కొత్త మంత్రివర్గంలో చోటు దక్కబోతోందని ప్రచారం జరుగుతోంది. నర్సంపేట నియోజకవర్గం నుంచి 1994, 1999, 2009లో మూడు పర్యాయాలు టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 2023లో కాంగ్రెస్‌లో చేరిన మూడు నెలల్లోనే పరకాల ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన రేవూరి ప్రకాష్‌రెడ్డికి సామాజిక వర్గాల సమీకరణలతో ఒక్కసారి కూడా మంత్రిగా పని చేసే అవకాశం రాలేదు. దాంతో పాటు సీఎం రేవంత్‌రెడ్డితో ఉన్న అనుబంధంతో ఈసారి ఆయనకు మంత్రి పదవి దక్కుతుందనే ఆశతో రేవూరి అనుచరులు ఉన్నారు.

● ఇక ఈ ముగ్గురితో పాటు 2014, 2023లో నర్సంపేట నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన దొంతి మాధవరెడ్డి పేరు కూడా వినిపిస్తోంది. అయితే సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటనకు మాధవరెడ్డి దూరంగా ఉండటం చర్చనీయాంశంగా కావడం, ఆయనకు సీఎంతో సఖ్యత లేదన్న ప్రచారం జరగడం ఇబ్బందికరమేనన్న చర్చ జరుగుతోంది. తొలిసారి గెలిచిన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ సీనియర్ నేత అయినప్పటికి సామాజిక సమీకరణలో మంత్రి పదవి దక్కుతుందా లేదా అనేది చర్చనీయాంశంగా మారింది.

అలాగే పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి తొలిసారి గెలవటంతో పాటు రాజకీయాలకు కొత్త కావటంతో ఆమెకు అవకాశం ఉండకపోవచ్చునని తెలుస్తోంది. డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్‌కు విప్‌గా బాధ్యతలు అప్పగించడం, మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ తొలిసారి ఎమ్మెల్యే కావడంతో పాటు సామాజిక సమీకరణలు వారికి కలిసి రాకపోవచ్చుననే చర్చ జరుగుతోంది.

మంత్రులు సురేఖ, సీతక్క శాఖల మార్పు?

ఓరుగల్లు నుంచి రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలో ప్రాతినిధ్యం వహిస్తున్న కొండా సురేఖ, సీతక్కల శాఖల్లో మార్పు జరగవచ్చుననే ప్రచారం ఉంది. రేవంత్‌రెడ్డి మంత్రివర్గ విస్తరణతో పాటు పలువురి శాఖలను కూడా మారుస్తారని.. ఈ క్రమంలో ప్రస్తుతం గ్రామీణాభివృద్ధిశాఖ, మహిళ, శిశు సంక్షేమశాఖ మంత్రిగా ఉన్న ములుగు ఎమ్మెల్యే సీతక్కకు హోం శాఖ బాధ్యతలు అప్పగిస్తారనే ప్రచారం జరుగుతోంది. అయితే గతంలో నక్సలిజంలో పని చేసిన సీతక్కకు హోంశాఖ కేటాయిస్తారనే ప్రచారం ప్రజల్లో ఆసక్తిని రేపుతోంది. ఏజెన్సీ ప్రాంతం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న ఆమెకు హోం శాఖమంత్రి పదవి ఇస్తే.. ఉమ్మడి వరంగల్ చరిత్రలోనే గిరిజన మహిళకు హోంశాఖ ఇవ్వడం తొలిసారి అవుతుందన్న చర్చ జరుగుతోంది. అలాగే మరో మంత్రి కొండా సురేఖ ప్రస్తుతం దేవాదాయ శాఖతో పాటు అటవీశాఖ మంత్రిగా పని చేస్తున్నారు. సురేఖ సమర్థతకు ఈ రెండుశాఖలు సరిపోవటం లేదనే చర్చ జరుగుతున్న నేపథ్యంలో సురేఖ శాఖల్లో కూడా మార్పు ఉంటుందని, ఆమెకు విద్యాశాఖ లేదా రెవెన్యూ శాఖల్లో ఏదైనా ఒకటి అప్పగించబోతున్నారంటూ ప్రచారం జరుగుతోంది. మొత్తానికి సీఎం రేవంత్‌రెడ్డి తన మంత్రి విస్తరణతో పాటు మంత్రుల శాఖల మార్పుపై చేస్తున్న కసరత్తు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉత్కంఠను రేపుతోంది.

ములుగు జిల్లా పేరు మార్పు కోసం..

జిల్లాలో నేడు ప్రత్యేక గ్రామసభలు

ములుగు, జూలై 2: ములుగు జిల్లాకు సమ్మక్క, సారలమ్మ ములుగు జిల్లాగా నామకరణం చేసేందుకు బుధవారం ప్రత్యేక గ్రామసభలు నిర్వహించనున్నారు. ఈమేరకు పబ్లిక్ నోటీసును జారీ చేసిన కలెక్టర్ దివకర గ్రామసభల ఏర్పాటు కోసం పంచాయతీ అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ సభల్లో ప్రజల నుంచి అభ్యంతరాలను లిఖిత పూర్వకంగా స్వీకరిస్తారు. అనంతరం జిల్లా పంచాయతీ అధికారికి నివేదికను సమర్పించనున్నారు. రాష్ట్ర మంత్రి సీతక్క ప్రతిపాదన మేరకు జిల్లా పేరు మార్పిడి ప్రక్రియను కలెక్టర్ యుద్ధప్రాతిపదిన చేపట్టారు. దీనిపై అన్ని వర్గాల నుంచి సానుకూల స్పందన కనిపిస్తోంది. బుధవారం జరిగే సభల్లో ప్రజలు 'సమ్మక్క, సారలమ్మ ములుగు జిల్లా'కు జైకొట్టే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

వనదేవతలు కొలువైన మేడారం అంతర్భాగంగా ఉన్న తాడ్వాయి మండలానికి ఇప్పటికే సమ్మక్క, సారలమ్మ తాడ్వాయి మండలంగా మార్పు చేశారు. 2018 మహాజాతర సమయంలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక గెజిట్‌ను జారీ చేసింది. ఏపీ పునర్విభజన చట్టంలో భాగంగా తెలంగాణకు కేటాయించిన ములుగు జిల్లాకు మంజూరైన జాతీయ గిరిజన విశ్వవిద్యాలయానికి కూడా కేంద్ర ప్రభుత్వం సమ్మక్క, సారక్క పేరును పెట్టింది. కన్నాయిగూడెం మండలంలోని తుపాకులగూడెం వద్ద గోదావరి నదిపై నిర్మించిన బ్యారేజీకి సమ్మక్క బ్యారేజీగా గత ప్రభుత్వం నామకరణం చేసింది. అయితే.. మినీ కుంభమేళాగా ప్రసిద్ధికెక్కిన మేడారం జాతరకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించాలనే ప్రజల చిరకాలవాంఛ మాత్రం నెరవేరలేదు. తల్లుల పేరు జిల్లాకు పెడుతుండటం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

శాతవాహన, గోల్కొండ రైళ్ల రద్దు

మూడోలైన్ పనులతో పలు రైళ్ల దారి మళ్లింపు

గిర్మాజీపేట, జూలై 2: విజయవాడ జంక్షన్‌లోని విజయవాడ- న్యూవెస్ట్ బ్లాక్ హట్ (ఎన్‌హెచ్‌బీహెచ్) మధ్య జరుగుతున్న మూడో లైన్ పనుల కారణంగా ఈనెల 5 నుంచి 10వ తేదీ వరకు గోల్కొండ, శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే మంగళవారం ప్రకటన విడుదల చేసింది. వరంగల్ మీదుగా ప్రతీ రోజు సికింద్రాబాద్-గుంటూరు -సికింద్రాబాద్ మధ్య నడిచే గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైళ్లు (17201/ 17202)ఈనెల 5 నుంచి 10 వరకు రద్దు చేశారు.

అలాగే వరంగల్ మీదుగా ప్రతిరోజు సికింద్రాబాద్ - విజయవాడ - సికింద్రాబాద్ మధ్య శాతవాహన ఎక్స్‌ప్రెస్ (12713/ 12714) రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ప్రతీ రోజు డోర్నకల్-కాజీపేట - డోర్నకల్ మధ్య నడిచే ప్యాసింజర్ రైళ్లు కూడా 5 నుంచి 10వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. వరంగల్, కాజీపేట మీదుగా వెళ్లే పలు రైళ్లను వరంగల్, కాజీపేట రాకుండా మళ్లించినట్లు అధికారులు తెలిపారు.

రాయల్ సొసైటీ ఆఫ్ బయాలజీ సభ్యుడిగా ప్రొఫెసర్ ఇస్తారీ ఎంపిక



కేయూ క్యాంపస్, జూలై 2: లండన్‌లోని ప్రతిష్టాత్మక రాయల్ సొసైటీ ఆఫ్ బయాలజీకు డాక్టర్ మామిడాల ఇస్తారీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం రాయల్ సొసైటీ ఆఫ్ బయోలజీ లండన్ నుంచి ఈ మెయిల్ ద్వారా సమాచారం వచ్చిందని కేయూ జంతుశాస్త్ర విభాగం ప్రొఫెసర్ మామిడాల ఇస్తారీ తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా బయోలజీ విభాగంలో పరిశోధనలు గావించే ప్రొఫెసర్లు దీనికి సభ్యులుగా ఎన్నికవుతారు. కాకతీయ యూనివర్సిటీ జంతుశాస్త్ర విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఇస్తారీ... రాయల్ సొసైటీ ఆఫ్ బయోలజీ సభ్యుడిగా ఎన్నికవడంతో వర్సిటీ ప్రొఫెసర్లు పలువురు అయనను అభినందించారు. డాక్టర్ ఇస్తారీ ఇప్పటికే 100కు పైగా పరిశోధన పత్రాలను ప్రచురించారు. నేచర్ సైంటిఫిక్ రిపోర్ట్స్ లాంటి అంతర్జాతీయ జర్నల్స్‌లో కూడా గతంలో డాక్టర్ ఇస్తారీ పరిశోధనా పత్రాలు ప్రచురించారు. ఇప్పటి వరకు 10 మంది విద్యార్థులు డాక్టర్ ఇస్తారీ వద్ద పీహెచ్‌డీ పూర్తి చేశారు. అమెరికాలో సీవీ రామన్ ఫెల్లోషిప్ ద్వారా పీడీఎఫ్ పూర్తి చేశారు. చైనా, స్పెయిన్, మాలేషియా, సింగపూర్ లాంటి దేశాల్లోని వివిధ యూనివర్సిటీలో పరిశోధనా పత్రాలను ప్రచురించారు.

నేడు, రేపు క్రీడా వసతి గృహ ప్రవేశాలకు ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్, జూలై 2: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) ఆదేశాల మేరకు హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లోని ప్రాంతీయ క్రీడా వసతి గృహంలో ప్రవేశాలకు బుధ, గురువారాల్లో రెండు రోజుల పాటు విద్యార్థులకు ఎంపిక పోటీలను నిర్వహించనున్నట్లు డీవైఎస్‌వో జి.అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జేఎన్ఎస్‌లోని ప్రాంతీయ క్రీడా వసతి గృహంలో గతంలో ఉన్న అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడలతో పాటు ఇటీవల మరో రెండు స్విమ్మింగ్, రెజ్లింగ్ క్రీడలకు అనుమతులు లభించడంతో మొత్తం 5క్రీడాంశాల్లో 12నుంచి 16 యేళ్ల మధ్య వయస్సు కలిగిన బాలబాలికలు ఎంపిక పోటీలు నిర్వహిస్తామన్నారు. జిమ్నాస్టిక్స్‌లో 10నుంచి 12 యేళ్ల మధ్య వయస్సు కలిగిన బాలబాలికలు, స్విమ్మింగ్‌లో 10నుంచి 12 యేళ్ల మధ్య వయస్సు కలిగిన బాలురకు మాత్రమే అవకాశం ఉంటుందన్నారు. అథ్లెటిక్స్‌లో 12 యేళ్ల నుంచి 16 యేళ్ల మధ్య వయస్సున్న బాలబాలికలు, హ్యాండ్‌బాల్, రెజ్లింగ్ క్రీడాంశాల్లో 12నుంచి 16 యేళ్ల మధ్య వయస్సు కలిగిన బాలురకు ఈ ఎంపిక పోటీల్లో అవకాశం ఉంటుదన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన బాలబాలికలు ఎంపిక పోటీలకు హాజరుకావొచ్చన్నారు. ప్రతిభ ఆధారంగా వసతి గృహంలో చేరేందుకు అవకాశం ఉంటుదని తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన బాల బాలికలు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, 10పాస్ పోర్టు సైజ్ ఫొటోలు, ఒరిజినల్, రెండు సెట్ల జిరాక్స్ కాపీలను వెంట తీసుకొని బుధవారం హనుమకొండ జేఎన్ఎస్‌లో రిపోర్టు చేయాలని అశోక్‌కుమార్ సూచించారు. మరిన్ని వివరాలకు డీఎస్‌ఏ కోచ్‌లు శ్రీమన్నారాయణ సెల్-9182854789, జిమ్నాస్టిక్స్ కోచ్ దేవిక సెల్- 8099 593913, హ్యాండ్‌బాల్ కోచ్ విష్ణువర్ధన్ సెల్- 7386469301, స్విమ్మింగ్ కోచ్ నవీన్ సెల్-9912355802, రెజ్లింగ్ కోచ్ రాజు సెల్- 9182854789 నెంబర్లలో సంప్రదించాలని అశోక్‌కుమార్ పేర్కొన్నారు.

పాలిటెక్నిక్ లెక్చరర్స్ అసోసియేషన్ కార్యవర్గం



నర్సయ్యగౌడ్ దంపతులను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 2: తెలంగాణ గెజిటెడ్ పాలిటెక్నిక్ ఆల్ లెక్చరర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం హైదరాబాద్‌లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సికింద్రాబాద్‌లోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా నర్సయ్య గౌడ్, అధ్యక్షుడిగా డాక్టర్ కేఎస్. చక్రవర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రెటరీగా వై. కృష్ణ, ట్రెజరర్‌గా బి. రాజా, అసోసియేట్ ప్రెసిడెంట్లుగా సురేష్, శ్రవణ్‌కుమార్, రవి పవార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా డాక్టర్ ఎం.రవి, ఆర్గనైజర్లుగా సర్వేష్, రాజేందర్, డి.శ్రీనివాస్, కె.శ్రీనివాస్, రాజ్‌కుమార్, నరేష్ తదితరులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన అసోసియేషన్ అధ్యక్షుడు నర్సయ్య గౌడ్ దంపతులను సత్కరించారు.

మాదిగలను మోసం చేస్తున్న కేంద్రం

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఇల్లందుల రాజేష్‌ఖన్నా



అంబేద్కర్ విగ్రహం వద్ద కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నేతలు

వడ్డెపల్లి, జూలై 2: ఎస్సీల వర్గీకరణ అంశాన్ని పరిష్కరించకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాదిగ సమాజాన్ని మోసం చేస్తోందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి, జిల్లా అధ్యక్షుడు ఇల్లందుల రాజేష్‌ఖన్నా విమర్శించారు. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 7న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద ఉదయం 10 గంటల నుంచి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ చేపట్టే నిరసన దీక్షకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం హనుమకొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఇల్లందుల రాజేష్ ఖన్నా మాట్లాడుతూ.. 30 ఏళ్ల దండోరా ఉద్యమ ప్రయాణం తర్వాత పండగల సంబరాలు చేసుకునే సమయంలో హక్కులు లభించక బిక్కటిల్లి నిరసనకు పిలుపునిస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని నమ్మబలికి మాదిగల జీవితాలతో చెలగాటమాడుతోందని దుయ్యబట్టారు. మాదిగల చిరకాల వాంఛ ఎస్సీ వర్గీకరణను వెంటనే చేపట్టాలని లేకుంటే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ నెల7న జరిగే వంగపల్లి శ్రీనివాస్ మాదిగ దీక్షకు మాదిగలు, ఉప కులాలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర, జిల్లా నేతలు సిలువేరు సుధాకర్, అంబాల చక్రపాణి, జన్ను సంజీవ్, మాస్ ప్రవీణ్, గిన్నారపు అనిల్‌కుమార్, రాజశేఖర్, హనుమకొండ సతీష్, జన్ను కిరణ్, బొట్ల బన్ని, హనుమకొండ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

అప్పు ఇచ్చిన వ్యక్తి చేసిన అవమానం భరించలేక..

● పురుగుల మందుతాగి డోజర్ యజమాని ఆత్మహత్య ● మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలో ఘటన



గూడూరులో రాస్తారోకో చేస్తున్న సోమ బంధువులు, కుటుంబసభ్యులు



జర్పుల సోమ (ఫైల్)

గూడూరు (మహబూబాబాద్ జిల్లా), జూలై 2 : తనకు అప్పు ఇచ్చిన వ్యక్తి చేసిన అవమానం భరించలేక డోజర్ యజమాని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం తేజావత్ రాంసింగ్ తండా శివారు నల్లబోడుతండాలో మంగళవారం జరిగింది. గూడూరు ఎస్ఐ నగేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లబోడు తండాకు చెందిన జర్పుల సోమ (38) డోజర్ వాహనాన్ని కొనుక్కొని సొంతంగా నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో తన వ్యక్తిగత అవసరాల కోసమంటూ మండలంలోని గుండెంగ గ్రామ శివారు ముత్యాలమ్మతండాకు చెందిన భూక్య శ్రీనివాస్ వద్ద కొంత సొమ్మును అప్పుగా తీసుకున్నాడు. మంగళవారం సోమ ఇదే మండలంలోని మట్టెవాడ గ్రామపరిధిలో డోజర్‌తో పనులు చేస్తుండగా భూక్య శ్రీనివాస్.. బాసు, చింబావత్ రమేష్, దారావత్ సంతోష్‌తో కలిసి అక్కడికి వచ్చాడు. తవ వద్ద చేసిన అప్పు ఎప్పుడు తీరుస్తావని సోమను అడిగాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మాటమాట పెరిగింది. శ్రీనివాస్.. సోమను దూషించడంతో పాటు, చేయికూడా చేసుకున్నారు. దాంతో తనకు అవమానం జరిగిందని మనోవేదన చెందిన సోమ మట్టెవాడ క్రాస్‌రోడ్డు వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నా డు. సోమకు భార్య సరోజ, కుమారుడు నరేష్, కుమార్తె నందిని ఉన్నారు. సరోజ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్ఐ నగేష్ తెలిపారు. అయితే ఆత్మహత్య చేసుకున్న సోమ కుటుంబాన్ని ఆదుకోవాలని అతడి బంధువులు, తండావాసులు గూడూరు మండల కేంద్రంలో ఆందోళన చేపట్టగా.. ఎస్ఐ సర్దిచెప్పడంతో వారు శాంతించారు.

కాటారం మండలంలో మహిళ ఆత్మహత్య

కాటారం, జూలై 2: కాటారం మండలం గుమ్మళ్లపల్లికి చెందిన కంక ణాల లక్ష్మి(46), రాజయ్య దంపతులు తమకున్న నాలుగెకరాల్లో పత్తి పంట సాగుచేస్తు న్నారు. గతేడాది భారీ వర్షాలతో పంట దెబ్బతిని దిగుబడులు రాక సుమారు రూ.4లక్షల అప్పు అయింది. దానికి తోడు ఇటీవల వారి కుమార్తె మృతి చెందింది. ఓ వైపు అప్పులు.. మరోవైపు కూతురి మరణంతో మనోవేదన చెందుతున్న లక్ష్మి సోమవారం ఆమె ఇంట్లోని గడ్డి మందుతాగింది. గమనించిన భర్త తొలుత మహదేవపూర్ సీహెచ్‌సీకి, అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లాడు. అక్కడ చికిత్స పొందుతూ లక్ష్మి మంగళవారం మృతి చెందింది.

విద్యుత్ ఉత్పత్తిలో కేటీపీపీ ముందంజ

● 200 రోజులపాటు నాన్‌స్టాప్ ప్రొడక్షన్ ● 85శాతం పీఎల్ఎఫ్‌తో 600 మెగావాట్ల ఉత్పత్తి



కేటీపీపీలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న ఇంజనీరింగ్ ఉద్యోగులు

గణపురం, జూలై 2: జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూరులోని కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు (కేటీపీపీ) నిరంతర విద్యుత్ ఉత్పత్తిలో రికార్డు సృష్టించింది. కేటీపీపీలో మొదటి దశ 500మెగావాట్లు, రెండో దశ 600 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టులు ఉన్నాయి. దేశంలో ఉన్న 600మెగావాట్ల ప్రాజెక్టుల్లో ఇప్పటి వరకు 200 రోజుల వరకు నాన్‌స్టాప్ ఉత్పత్తి చేసిన థర్మల్ కేంద్రాలు ఏవీ లేవు. గతంలో జైపూర్‌లో సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 600 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టు 194 రోజుల రికార్డు సృష్టించగా దాన్ని కేటీపీపీ ప్రాజెక్టు రెండో దశ బ్రేక్ చేసిందని ఇంజనీరింగ్ అధికారులు వెల్లడించారు.. 85శాతం ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్(పీఎల్‌ఎఫ్)తో ప్రాజెక్టులో మంగళవారం ఉదయం 10.30 గంటల వరకు 200 రోజుల పాటు నిర్విరామ విద్యుత్ ఉత్పత్తి కొనసాగిందని తెలిపారు. దీనిపై కేటీపీపీలో సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా సీఈ సిద్ధయ్య కేక్ కట్ చేశారు. ప్రాజెక్టు చరిత్రలో ఇదే తొలిసారిగా నిరంతర విద్యుత్ కొనసాగిందని అన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు - వృద్ధురాలి మృతి



చిలుపూర్, జూలై 2 : ముందుగా వెళ్తున్న బైక్‌ను ప్రమాదవశాత్తు వెనుక నుంచి గుర్తు తెలియని కారు ఢీకొన్న ప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతిచెందిన సంఘటన జనగామ జిల్లా చిల్పూరు మండలంలోని చిన్నపెండ్యాల సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. ఎస్సై ముత్యం రాజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బచ్చన్నపేట మండలంలోని నాగిరెడ్డిపల్లికి చెందిన కన్నె శివలింగం అతడి తల్లి మల్లమ్మ (60)తో కలిసి ఐనవోలు దేవస్థానానికి బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో అదేమార్గంలో హైదరాబాద్ నుంచి హనుమకొండ వైపు వేగంగా వెళ్తున్న కారు, ముందుగా వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ మల్లమ్మతో పాటు, స్వల్పంగా గాయపడ్డ శివలింగంను చికిత్స నిమిత్తం స్థానికులు 108 సాయంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మార్గమధ్యంలోనే మల్లమ్మ మృతి చెందింది. మృతురాలి పెద్ద కుమారుడు కన్నె రాజలింగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు హిట్ అండ్ రన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రాష్ట్ర మైనారిటీ కమిషన్ మెంబర్ దర్శన్‌సింగ్‌పై కేసు

హనుమకొండ టౌన్, జూలై 2: పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన రాష్ట్ర మైనారిటీ కమిషన్ మెంబర్ దర్శన్‌సింగ్‌తో పాటు భల్జిత్ సింగ్, మరికొంత మందిపై కేసు నమోదు చేసినట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ వైసతీష్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. జూన్ 30న అర్ధరాత్రి హనుమకొండ చౌరస్తాలో దర్శన్‌సింగ్, మరికొంత మంది మరణాయుధాలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తూ పెట్రోలింగ్ విధుల్లో ఉన్న బ్లూకోల్ట్స్ కానిస్టేబుళ్ల మధుసూదన్, మౌలాలీకి పట్టుబడ్డారు. అక్కడి నుంచి వెళ్లిపోవాలని విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బంది ఆదేశించినప్పటికీ వినకుండా అక్కడే ఉండి ప్రజలకు ఇబ్బంది కలిగించారన్నారు. విధులకు ఆటంకం కలిగించారని బ్లూకోల్ట్స్ సిబ్బంది మంగళవారం ఫిర్యాదు చేయగా దర్శన్ సింగ్‌తోపాటు మరికొంత మందిపై కొత్తచట్టాల ప్రకారం పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఈ నెల 10న విద్యుత్ పోల్ క్లైంబింగ్ పరీక్ష

హనుమకొండ టౌన్, జులై 2: ఈనెల 10న ములుగు రోడ్డులోని ఉత్తర విద్యుత్ శిక్షణ సంస్థ (ఎన్‌పీటీఐ)లో జరిగే జేఎల్ఎం విద్యుత్ పోల్ క్లైంబింగ్ పరీక్షకు ఉమ్మడి జిల్లాలోని అర్హులు ఒరిజనల్ సర్టిఫికెట్స్‌తో హాజరుకావాలని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ సూపరింటెండెంట్ కె.వెంకటరమణ పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాలతో అర్హులైన అభ్యర్థులకు ఇప్పటికే సమాచారం చేరవేశారని, వారి జాబితాను సర్కిల్ ఆఫీస్‌లోని నోటీస్‌బోర్డులో అందుబాటులో ఉంచామన్నారు. నిర్వహణ పూర్తిపారదర్శకంగా జరుగతాయని, అభ్యర్థులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు.

పాత పద్ధతిలోనే పర్మిట్లు ఇవ్వాలి..

మంత్రి కొండా సురేఖను కలవనున్న సామిల్లర్లు

రెడ్డికాలనీ, జూలై 2: పాత పద్ధతిలోనే కర్రకు సంబంధించిన పర్మిట్లు ఇవ్వాలని, కొత్తగా నిర్వహిస్తున్న ఆన్‌లైన్ పద్ధతి వల్ల ఆలస్యం జరిగి కర్ర వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వరంగల్ సామిల్లర్ల అసోసియేషన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం వరంగల్ జిల్లా సామిల్లర్ల అసోసియేషన్ సమావేశం ములుగురోడ్‌లోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో జరిగింది. జూన్ 1వ తేదీ నుంచి కొత్తగా అమలు చేస్తున్న ఆన్‌లైన్ పర్మిట్ల పద్ధతి నెల రోజుల్లోనే విఫలమైనట్లుగా తేల్చారు. అంతకుముందు నిర్వహించిన ఆన్‌లైన్ పర్మిట్ల పద్ధతి నెల రోజుల్లోనే విఫలమైనట్లుగా తేల్చారు. అంతకుముందు నిర్వహించిన ఆన్‌లైన్ సేల్ తరహాలోనే ఈ పద్ధతిలో కూడా అనేక సమస్యలు వచ్చాయని వాటి వల్ల పర్మిట్లకు ఆలస్యం జరిగిందన్నారు. కట్టెకోత మిషన్ నిర్వాహకులకు ఆన్‌లైన్ పద్ధతిపై అవగాహన లేకపోవడం వంటి అనేక కారణాల వల్ల పర్మిట్లు ఆలస్యం అవుతున్నాయని పేర్కొన్నారు. పాత పద్ధతినే కొనసాగించాలని సామిల్లర్ల అసోసియేషన్ డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. ఈ విషయంపై అటవీశాఖ మంత్రి కొండా సురేఖను త్వరలోనే కలవనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఉమ్మడి వరంగల్ జిల్లా సామిల్లర్ల అసోసియేషన్, హనుమకొండ, వరంగల్, కాజీపేట నగర అసోసియేషన్ ప్రతినిధులు గడ్డం చంద్రమౌళి, సతీష్, సుదర్శన్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశమైన సామిల్లర్లు

రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



క్రీడాకారులతో కోచ్ శ్రీధర్‌రావు

వరంగల్ కార్పొరేషన్, జూలై 2: మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ నెల 6 నుంచి 9 వరకు జరిగే యోనెక్స్ పదో రాష్ట్రస్థాయి అండర్-19 బాలికల బ్యాడ్మింటన్ పోటీలకు వరంగల్ నగర పాలక సంస్థ ఇండోర్ స్టేడియం క్రీడాకారులు ఎంపికైనట్టు బ్యాడ్మింటన్ కోచ్ మాడిశెట్టి శ్రీధర్‌రావు తెలిపారు. మంగళవారం ఇండోర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయిలో ఎంపికైన క్రీడాకారులను అభినందించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారుల్లో సుకృతి, పూజిక ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులను బల్దియా స్పోర్ట్స్ డైరెక్టర్ శంకర్‌లింగం, కోచ్ శ్రీధర్‌రావుతోపాటు సీనియర్ క్రీడాకారులు అభినందించారు.



జడ్పీ మ..మ..

(5వ పేజీ తరువాయి)

పాలన అంతకంతకు కుదించకుపోయింది.

మొత్తం 23 సమావేశాలు

జిల్లా పరిషత్ పాలకవర్గం కొలువదీరిన నాటి నుంచి ఐదేళ్లలో ఇప్పటి వరకు 22 సర్వసభ్య సమావేశాలు జరిగాయి. జూలై 3న జరిగే చివరి సర్వసభ్య సమావేశంతో మొత్తంగా 23 సమావేశాలను పాలకవర్గం నిర్వహించినట్లు అవుతుంది. సమావేశాలన్నీ కూడా మొక్కుబడిగానే సాగాయి. నిధులు, అభివృద్ధి అంశాలు లేకపోవడంతో ఉన్న ఏడుగురు జడ్పీటీసీలు కూడా సమావేశాలనకు హాజరు కాని పరిస్థితి. పూర్తి కోరం లేక వెలవెలబోయిన సమావేశాలూ ఉన్నాయి. మంత్రులు, ఎమ్మెల్యేలే కాదు జిల్లా పరిషత్‌పాలన అధ్వాన్నంగా మారడంతో చివరకు కలెక్టర్ కూడా సమావేశాలకు హాజరు కాని సందర్భాలు నెలకొన్నాయి. మొత్తంగా జిల్లా పరిషత్ ఐదేళ్ల పాలన అంతా శూన్యంగానే మారింది.

నాణ్యమైన విద్య, వైద్యం అందించడమే లక్ష్యం

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



వేలేరులో ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కడియం

వేలేరు(ధర్మసాగర్), జూలై 2: నాణ్యమైన విద్య, వైద్యం అందించడమే తమ లక్ష్యమని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మంగళవారం వేలేరు మండల కేంద్రంలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ, సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కొత్తగా ఏర్పడిన వేలేరు మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసుకుందామన్నారు. త్వరలో మండల సమీకృత కార్యాలయ భవన నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలకు పెద్దపీట వేస్తోందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరే విధంగా కొత్త పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. వేలేరు మండలానికి రూ.104కోట్లతో ఎత్తిపోతల పథకం మంజూరైందని, త్వరలో పనులు ప్రారంభించి 9 నెలల్లో పనులు పూర్తి చేసి వచ్చే ఖరీఫ్ నాటికి ప్రతీ ఎకరానికి సాగు నీరు అందిస్తామన్నారు. వేలేరు, పీచర, మద్దెలగూడం మీదగా శాలపల్లి వరకు రోడ్డు అధ్వానంగా ఉందని, త్వరలో డబుల్ రోడ్డు నిర్మాణం చేయనున్నట్టు ఆయన తెలిపారు. మండల కేంద్రంలోని బాలుర గురుకుల హాస్టల్, కేజీబీ బాలికల హాస్టల్‌ను ఆయన తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం 46 మందికి కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు.

రైతుల అభిప్రాయాలను చేరవేస్తాం

జిల్లా సహకార అధికారి నాగేశ్వర్‌రావు



మాట్లాడుతున్న డీసీవో

రాంనగర్, జూలై 2: రైతుల అభిప్రాయం మేరకు రైతు భరోసా పథకంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుందని జిల్లా సహకార అధికారి నాగేశ్వర్‌రావు తెలిపారు. మంగళవారం హసన్‌పర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్ బిల్లా ఉదయ్‌కుమార్ అధ్యక్షతన రైతు భరోసా పథకంపై రైతుల అభిప్రాయ సేకరణ సమావేశం జరిగింది. 10 ఎకరాలకు మాత్రమే రైతు భరోసా వర్తింపచేయాలని, ఆదాయ పన్ను చెల్లించే వారికి, ప్రభుత్వ ఉద్యోగులకు, ప్రజాప్రతినిధులకు రైతు భరోసా ఇవ్వవద్దని పలువురు రైతులు వారి అభిప్రాయాన్ని ఈ సందర్భంగా తెలిపారు. సాగుకు పనికిరాని భూములకు, ఇంటి నిర్మాణం జరిగిన తర్వాత మిగిలిన భూములకు, రియల్ ఎస్టేట్ లేఅవుట్, నాన్ లేఅవుట్‌లకు వర్తింపచేయకూడదన్నారు. అనంతరం జిల్లా సహకార అధికారి నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. రైతులు తెలిపిన అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అనురాధ, పీఏసీఎస్ డైరెక్టర్లు వీసం కరుణాకర్, రమేశ్, బండ రవిందర్‌రెడ్డి, జానకి, విజేందర్, సీఈవో శ్రీనివాస్‌రెడ్డి, నోడల్ అధికారి సత్యానందం, తదితరులు పాల్గొన్నారు.

ఢీ అంటే ఢీ

బీఆర్ఎస్ పార్టీ కార్యాలయ నిర్మాణంపై ఎమ్మెల్యే నాయిని అభ్యంతరం

నిబంధనలు ఉల్లంఘించారని కలెక్టర్‌కు ఫిర్యాదు

నోటీసులిచ్చిన మున్సిపల్ అధికారులు.. సమాధానం చెప్పని బీఆర్ఎస్

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య కొనసాగుతున్న పోరు



పక్కపక్కనే ఉన్న బీఆర్ఎస్ పార్టీ, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలు

రాంనగర్, జూలై 2: వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా పార్టీ కార్యాలయం పక్కపక్కనే ఉండటం.. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య చిచ్చురేపుతోంది. బీఆర్ఎస్ పార్టీ నిబంధనలు విస్మరించి పార్టీ కార్యాలయం నిర్మించిందనే ఆరోపణలు ఉన్నాయి. నల్లగొండలో నిబంధనల అతిక్రమించారని ఆ జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బీఆర్ఎస్ కార్యాలయం కూల్చివేయించేందుకు సిద్ధమయ్యారు. అదే బాటలో జిల్లా కాంగ్రెస్ నేతలు సైతం బీఆర్ఎస్ కార్యాలయం కూల్చివేతపై కన్నేసినట్లు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి.. బీఆర్ఎస్ కార్యాలయాన్ని కూల్చివేయించేందుకు రంగం సిద్ధం చేసినట్లు ప్రచారం సాగుతోంది. అధికారాన్ని అడ్డుపెట్టుకుని నాడు బీఆర్ఎస్ నిబంధనలు తుంగలో తొక్కి కార్యాలయం నిర్మిస్తే.. అయితే అదే నిబంధనలను సాకుగా చూపి కూల్చి వేయించేందుకు కాంగ్రెస్ సిద్ధమవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

చౌకగా స్థలం కొనుగోలు

బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కోట్ల రూపాయల విలువ చేసే నగర నడిబొడ్డున ఉన్న ఎకరం స్థలం కేవలం రూ.4లక్షలకే కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. అధికారాన్ని అడ్డుపెట్టుకుని కారుచౌకగా కొనుగోలు చేసిన ఈ స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా పార్టీ కార్యాలయం నిర్మాణం చేసినట్లు ఆరోపణలున్నాయి. ఈ నిర్మాణాన్ని కిందటేడు మే మాసంలో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించారు. రెండు పర్యాయాలు వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా దాస్యం వినయభాస్కర్ విజయం సాధించారు. దీంతో పక్కపక్కనే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంతో పాటు పార్టీ జిల్లా కార్యాలయం నిర్మించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందిన దాస్యం వినయ భాస్కర్.. క్యాంపు కార్యాలయం ఖాళీ చేశారు. ప్రస్తుతం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడి గా కొనసాగుతున్నారు. రోజూ కార్యాలయంలో ఏదో ఒక కార్యక్రమం నిర్వహిస్తున్నారు. నిత్యం బీఆర్ఎస్ శ్రేణులతో కార్యాలయం సందడిగా ఉంటోంది.

కూల్చి వేయించేందుకు పావులు

అసెంబ్లీ ఎన్నికల్లో వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నాయిని రాజేందర్‌రెడ్డి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఓటమి చెందిన వినయభాస్కర్ క్యాంపు కార్యాలయం ఖాళీ చేశారు. క్యాంపు కార్యాలయంలో చేరిన నాయిని.. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ఖాళీ చేయించే విషయంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. క్యాంపు కార్యాలయంలో చేరిన రోజే నాయిని రాజేందర్‌రెడ్డి అనుచరులు క్యాంపు కార్యాలయంలోని శిలాఫలకాన్ని పగులగొట్టడం వివాదాస్పదంగా మారింది. పార్కు స్థలంలో పార్టీ కార్యాలయం ఎలా నిర్మిస్తారని? అనుమతులు లేకుండా భవనం నిర్మించారని నాయిని రాజేందర్‌రెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. శాంతి భద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉందని వరంగల్ పోలీస్ కమిషనర్‌కు సైతం ఫిర్యాదు చేశారు.

నోటీసులు జారీ

ఎమ్మెల్యే నాయిని ఫిర్యాదుతో స్పందించిన మున్సిపల్ అధికారులు.. రెండు రోజుల కిందట బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్‌కు నోటీసులు జారీ చేశారు. కార్యాలయానికి స్థలం కేటాయింపు, భవన అనుమతుల పత్రాలు మూడురోజుల్లో అందించాలని నోటీసులో పేర్కొన్నారు. లేదంటే మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని నోటీసులో పేర్కొన్నారు. అయితే నోటీసులకు దాస్యం వినయభాస్కర్ నుంచి ఎలాంటి సమాధానం రాలేదని తెలిసింది.

కాగా, నిబంధనలకు విరుద్ధంగా పార్కు స్థలం కేటాయింపు, భవన నిర్మాణానికి అనుమతులు లేవనే కారణం చూపుతూ కూల్చివేయించేందుకు కాంగ్రెస్ రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. అయితే బీఆర్ఎస్ సైతం కాంగ్రెస్ చర్యలను ప్రతిఘటించేందుకు సిద్ధమైనట్లు సమాచారం. అవసరమైతే కోర్టుకు వెళ్లాలని నిర్ణయించినట్లు పార్టీ వర్గాల సమాచారం. ఇదిలా వుండగా, కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సైతం ప్రభుత్వ స్థలంలోనే నిర్మించారని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్‌కు ఓ న్యాయం, బీఆర్ఎస్‌కు ఓ న్యాయమా? అని ఆ పార్టీ నేతలు ప్రశ్నిస్తున్నారు. మొత్తంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం పక్కపక్కనే ఉండటం రెండు పార్టీల మధ్య కారుచిచ్చు రేపుతోంది.

రేపు ఎల్బీ కళాశాల స్వర్ణోత్సవ ముగింపు వేడుకలు



స్వర్ణోత్సవ వేడుకల ఆహ్వాన పత్రికలు విడుదల చేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ

హనుమకొండ కలెక్టరేట్, జూలై2: వరంగల్ ములుగురోడ్‌లో ఉన్న లాల్ బహదూర్(ఎల్బీ) కళాశాల స్వర్ణోత్సవ వేడుకలు రేపు(గురువారం) నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్‌రావు తెలిపారు. కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్వర్ణోత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఎల్బీ కళాశాల స్థాపించి 50 యేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలు ఈ యేడు నిర్వహించినట్లు తెలిపారు. ఈ స్వర్ణోత్సవ ముగింపు వేడుకలను గురువారం నిర్వహిస్తున్నామని, వేడుకలకు మంత్రులు శ్రీధర్ బాబు, కొండా సురేఖ, సీతక్క, మేయర్ గుండు సుధారాణి, ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డిలు హాజరవుతున్నారని తెలిపారు. ఈ వేడుకలకు ఎల్బీ కళాశాల విద్యార్థులు, పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ డాక్టర్ ఎం.సదానందం, స్వర్ణోత్సవ వేడుకల గేమ్స్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, కళాశాల సాంస్కృతిక విభాగం కన్వీనర్ సుధాకర్, సీనియర్ లెక్చరర్ మధుకర్‌రావు పాల్గొన్నారు.

కబ్జాకు గురైన ఆలయ భూముల సర్వే

7 ఎకరాలకు పైగా కబ్జాకు గురైన భూముల గుర్తింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కబ్జాకు గురై ఆలయ భూముల్లో హద్దు రాళ్లను పాతిస్తున్న ఇన్‌స్పెక్టర్ సంజీవరెడ్డి

ఐనవోలు, జూలై 2: ఎట్టకేలకు కక్కిరాలపల్లి లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి చెందిన విలువైన భూములను ఎండోమెంట్‌శాఖ అధికారులు సర్వేచేశారు. సర్వేలో 7 ఎకరాలకు పైగా కబ్జాకు గురైనట్టు గుర్తించారు. జూన్ 23న 'ఆంధ్రజ్యోతి'లో కబంధహస్తాలతో ఆలయ భూములు అనే కథనం ప్రచురితమైనది తెలిసిందే. గ్రామ శివారులో వివిధ సర్వే నంబర్‌లలో ఆలయానికి చెందిన 25.19 ఎకరాల భూమి ఉండగా అక్రమణదారులు ఆలయ భూముల్లోకి చొచ్చుకవచ్చి హద్దులను తొలగించి కబ్జాచేసి సాగు చేసుకుటుంన్నారు. కబ్జాపై దేవాదాయ మంత్రి కొండా సురేఖ ఇటీవల ఆరాతీసి నివేదికను ఇవ్వాలని ఎండోమెంట్ అధికారులను ఆదేశించారు. దీంతో దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంతరావు, అసిస్టెంట్ కమిషనర్ ఆర్. సునిత ఆదేశాల మేరకు మంగళవారం దేవాదాయ శాఖ డివిజనల్ ఇన్‌స్పెక్టర్ జి.సంజీవరెడ్డి నేతృత్వంలో సర్వేయర్ పి.అనిల్‌కుమార్ మంగళవారం సర్వే చేశారు. ఖుష్కి సర్వే నంబర్ 251లో 2.20 ఎకరాలు, 255లో 3.19 ఎకరాలు 274లో 1.20 ఎకరాల చొప్పున కబ్జాకు గురైన భూమిని గుర్తించి హద్దులు పాతారు(రాళ్లు). ఇవికాకుండా తరి భూమి సర్వే నంబర్‌లలో సర్వే చేయగా ఒకొక్కరు ఐదు, పది గుంటల చొప్పున ఎకరానికి పైగా భూమిని కబ్జాచేయగా హద్దులు పాతారు. కబ్జాకు గురైన భూముల విలువ సుమారు రూ.3 కోట్ల విలువ ఉంటుందని గ్రామస్థులు వాపోయారు. మొత్తం ఆలయానికి చెందిన 25.19 ఎకరాల భూమిని సర్వే చేసి హద్దులు పాతినట్లు ఇన్‌స్పెక్టర్ సంజీవరెడ్డి తెలిపారు. ఈ సర్వే రిపోర్టును ఉన్నతాధికారులకు అందజేయనున్నారు.

బలరాం నాయక్‌ను టీపీసీసీ అధ్యక్షుడిగా నియమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మావన హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి బాదావత్ రాజు

కాజీపేట జంక్షన్, జూలై 2: మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్‌ను టీపీసీసీ అధ్యక్షుడిగా నియమించాలని కాంగ్రెస్ అధిష్ఠానానికి ఆదివాసీ, గిరిజన సంఘాలు విజ్ఞప్తి చేశారు. మంగళవారం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో నిర్వహించిన ఆదివాసీ, గిరిజన సంఘాల ఐక్య వేదిక సమావేశం జరిగింది. సమావేశానికి ఐక్య వేదిక రాష్ట్ర నాయకులు బానోత్ నవీన్ అధ్యక్షత వహించారు. సమావేశంలో తుడుం దెబ్బ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సిద్దబోయిన లక్ష్మీనారాయణ, మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి, బంజారా రాష్ట్ర నేత బాదావత్ రాజు, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సమ్మయ్య రాథోడ్, బీఎస్‌పీ ఉమ్మడి జిల్లా కన్వీనర్ కన్నం సునిల్ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో కేంద్ర సహాయ మంత్రిగా పనిచేసిన బలరాంనాయక్‌ను టీపీసీసీ అధ్యక్షుడిగా నియమించాలని అన్నారు. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున కర్గే, సోనియా గాంధీ, ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, తదితర కాంగ్రెస్ నాయకులకు విన్నవించుకున్నారు. ఈ సమావేశంలో తెలుగు యూనివర్సిటీ ప్రొఫెసర్ బాబురావు, ప్రొఫెసర్ సమ్మాలాల్ నాయక్, మాజీ జడ్పీటీసీ వీరమ్మ, మహిళా ఉద్యోగుల సంఘం నాయకురాలు అర్పిత, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని అభాసుపాలు చేస్తున్న మోదీ

- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు
- రేపు దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి నాగరాజు

వరంగల్ కార్పొరేషన్, జూలై2: ప్రధాని నరేంద్రమోదీ దేశ విద్యారంగాన్ని అభాసుపాలు చేస్తున్నారని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు ఆరోపించారు. మంగళవారం హనుమ కొండ రాంనగర్‌లోని సీపీఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పేపర్ లీకేజీలు, స్కామ్‌లు, పరీక్షల రద్దు ద్వారా మోదీ ప్రభుత్వం దేశప్రతిష్టను భ్రష్టుపట్టిస్తోందన్నారు. బిహార్‌లో నీట్ పేపర్ లీక్ చేసినట్టు నిందితులు ఒప్పు కున్నా- కేంద్రం విచారణ చేయకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని అన్నారు. మోదీకి దేశ విద్యావిధానంపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. నూతన విద్యా విధానం పేరుతో విద్యారంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పే ప్రయత్నం చేస్తున్నాడని అన్నారు. పాఠశాలల మూసివేతకు నిరసనగా గురువారం దేశవ్యాప్త బంద్‌కు పిలుపునిస్తున్నామని, అన్ని విద్యాసంస్థలు, విద్యార్థులు మద్దతు తెలపాలని కోరారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్, జిల్లా కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రైవేటు కార్పొ రేట్ శక్తులు ఫీజుల దందా సాగిస్తున్నారని, అత్యున్నతమైన విద్యను అమ్మకానికి పెట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్, ఉపాధ్యక్షురాలు పరిమళ, సహాయకార్యదర్శులు జశ్వంత్, వికాస్, వివేక్, వెంకటేశ్, అజయ్, వరప్రసాద్, పాష పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, జూలై 2: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా జరగదని హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. వెస్ట్‌సిటీ సబ్‌స్టేషన్ పరిధిలోని బాపూజీనగర్, ప్రసాద్ ఆస్పత్రి ఏరియాలో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు, నక్కలగుట్ట సబ్‌స్టేసన్ పరిధిలోని పోలీస్‌హెడ్‌క్వార్టర్స్, రాంనగర్, గోకుల్‌నగర్ ఏరియాలో ఉదయం 8.30 నుంచి 11.30 వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ తెలిపారు.

నేడు సొసైటీలో అత్యవసర సర్వసభ్య సమావేశం

ఐనవోలు, జూలై 2: నందనం రైతు సేవా సహకార సంఘం అత్యవసర సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు సంఘం సీఈవో కోతి సంపత్ తెలిపారు. ఈ సమావేశంలో రైతు భరోసాపై సూచలను, సలహాలు తీసుకున్నారు. ఈ సమావేశానికి టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు, సొసైటీ పాలకవర్గ సభ్యులు, అధికారులు పాల్గొననున్నారు.

ప్రభుత్వ ఐటీఐలో చెట్ల వేలం

వరంగల్ ఎడ్యుకేషన్, జూలై 2: ములుగురోడ్‌లోని ప్రభుత్వ ఐటీఐలో ఉన్న చెట్లను తొగించేందుకు వేలం నిర్వహిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్. జుమ్లానాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం వరంగల్ ప్రభుత్వ ఐటీఐలను ఏటీసీలుగా మార్పు చేసిన క్రమంలో భవనాల నిర్మాణాల్లో భాగంగా చెట్లను తీసేశామని, ఆ చెట్లను తొలగించేందుకు ఈ నెల 6న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తిగల వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

ఆస్పత్రులు తప్పనిసరి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

వరంగల్ మెడికల్, జూలై 2: జిల్లాలో ఉన్న ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్పత్రులు తప్పనిసరి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.సాంబశివరావు ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ - 2010 నిబంధనలకు లోబడి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ప్రతీ ప్రయివేట్ ఆస్పత్రి, స్కానింగ్, ఇమేజింగ్ సెంటర్లు, ల్యాబ్‌లు, డయాగ్నోస్టిక్స్ సెంటర్లు తప్పకుండా తెలుగు, ఇంగ్లీషు భాషలల్లో ధరల పట్టికను ప్రదర్శించాలన్నారు. అర్హత లేని డాక్టర్లుగా చెలామణి అవుతూ వైద్యం చేస్తున్నట్లు అయితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే క్రిమినల్ కేసులు కూడా పెడతామని హెచ్చరించారు.

గుట్కా పట్టివేత

వరంగల్ క్రైం, జులై 2: గుట్కా విక్రయిస్తున్న కిరాణా షాపులపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. మంగళవారం దాడులు చేసిన పోలీసులు కాజీపేటలో కిరాణ షాపు నిర్వహిస్తున్న చంద్రశేఖర్ నుంచి రూ.18 వేల గుట్కా ప్యాకెట్లు, వరంగల్ ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత బీట్‌బజార్‌లో కిరాణ షాపు నిర్వాహకుడు రాము నుంచి రూ.45వేల విలువ కలిగిన గుట్కాను స్వాధీనం చేసుకున్నారు. విక్రయిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ధృవీకరించారు.

'ఉపాధి హామీ'లో కూలీలు భాగస్వాములు కావాలి

ధర్మసాగర్, జూలై 2: జాతీయ ఉపాధిహామీ పథకంలో కూలీలు భాగ స్వాములు కావాలని డీఆర్‌డీవో పీడీ నాగపద్మజ అన్నారు. మంగళవారం ధర్మసాగర్ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన 15వ సామాజిక తనిఖీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. మండలంలోని గ్రామాలలో చేపట్టిన పనులకు సంబంధించిన నివేదికను అధికారుల సమక్షంలో చదివి వినిపించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతీ రోజు రిజిస్టర్‌లో చేపడుతున్న పనులను నమోదు చేసుకోవాలన్నారు. సామాజిక తనిఖీ అనేది నిరంతరంగా ఉంటుందని రికార్డుల మెయింటెనెన్స్ సక్రమంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీవో శ్రీనివా సరావు, ఏపీవో నరింహారెడ్డి, ఎంపీడీవో అనిల్ కుమార్, టెక్నీషియన్ శ్రీనివాస్, ఏపీవో సంపత్ తదితరులు పాల్గొన్నారు.

అరకు కాఫీ అంటే తనకున్న ఇష్టాన్ని ప్రధాని నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమాల వేదికగా వెలిబుచ్చిన సంగతి తెలిసిందే. అందుకు సమాధానంగా 'కాఫీ తోటల సాగు వెనుక లెక్కకు మించి గిరిజన మహిళల శ్రమ దాగుంద'ని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ట్వీట్ చేసిన సందర్భంలో... అరకు కాఫీ మరొకసారి చర్చలోకి వచ్చింది. గిరిజన మహిళా రైతులకు అండగా నిలిచి... లోయ కాఫీ రుచులను ఖండాంతరాలకు చేరవేస్తోంది 'నాంది ఫౌండేషన్'. ఆ విశేషాలను ఫౌండేషన్ జాతీయ ప్రతినిధి **రోహిణి ముఖర్జీ** 'నవ్య'తో పంచుకున్నారు.

మహిళా రైతుల సాధికారతకు 'నాంది'





"అరకు కాఫీకి దేశవిదేశాల్లో అభిమానులు కొల్లలు. ఒకటి రెండు కాదు... ఏకంగా పన్నెండు దేశాలకు అరకు కాఫీ పొడి ఎగుమతి అవుతోంది. జీ20 సదస్సుకు వచ్చిన ప్రపంచ దేశాల ప్రముఖులకు ప్రతిష్ఠాత్మకమైన స్వదేశీ ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ వస్తువులతో పాటు అరకు కాఫీ పొడిని కూడా బహూకరించింది కేంద్ర ప్రభుత్వం. అంతటి ప్రఖ్యాతి పొందిన అరకు కాఫీ రుచుల వెనుక బోలెడన్ని కష్టాలు, లెక్కకుమించిన గాథలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా 'నాంది ఫౌండేషన్' ఇరవై ఏళ్లుగా కాఫీ సాగు దారులతో కలిసి ప్రత్యేకంగా పని చేస్తోంది. అరకు లోయలో మాతా శిశు మరణాల రేటు ఎక్కువ ఉండటంతో, వాటిని నిలువరించడానికి మొదట మా ఫౌండేషన్ 2000 నుంచి ఆ ప్రాంతంలో పని చేయడం ప్రారంభించింది. ముందు సురక్షితంగా ప్రసవాలు చేసేలా కొన్ని గ్రామాల్లో వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచాం. దాంతో పాటు నిరంతరం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాం. మన్యం ప్రాంతంలో 98 శాతంమంది రైతులు ఉంటే, వారంతా వరి, కాఫీ తోటలు లాంటివి పండిస్తుంటారు. అందులోనూ మహిళల భాగస్వామ్యం అధికం. భార్యా భర్త కలిసి పని చేస్తేనే ఆ ఇల్లు గడుస్తుంది. అంతేకాదు... ఐదేళ్ల లోపు పిల్లల్లో పౌష్టికాహార లోపం లాంటి సమస్యలను గుర్తించాం. పని పిల్లలకు వంద గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లాగా సంరక్షణ కేంద్రాలు నెలకొల్పి, వారికి సరైన ఆహారం అందించాం. ఒకపూట ఆలనాపాలనా చూసేందుకు కార్యకర్తలను నియమించాం. ఆ క్రమంలోనే రైతుల దయనీయ స్థితి మాకు అర్థమైంది. కష్టపడి పండించిన పంటను లాభసాటిగా అమ్ముకోలేకపోవడాన్ని గమనించిన 'నాంది ఫౌండేషన్' సీఈవో మనోజ్‌కుమార్... కాఫీ సాగుదారుల కోసం ప్రత్యేకంగా పని చేయాల్సిన అవసరాన్ని గుర్తించారు. ఆయన చొరవతో 2005 నుంచి అరకు లోయలోని ఏడు మండలాల రైతులతో నాంది ప్రయాణం మొదలైంది. కాఫీ సాగుదారుల ఆదాయ వనరులను పెంపొందించడమే లక్ష్యంగా నాటి నుంచి పని చేస్తున్నాం.

సేంద్రియ సాగు...

అప్పటి వరకు తమకు తెలిసిన పద్ధతుల్లో కాఫీ సాగు చేస్తున్న రైతులకు నిపుణులతో నిరంతరం అవగాహన తరగతులు నిర్వహించాం. అంతర్జాతీయ స్థాయిలో కాఫీ సాగుపై సాధికారత కలిగిన ప్రముఖులను అరకు తీసుకొచ్చి వారి సలహాలు, సూచనలను రైతులకు తెలియజేశాం. సాధారణంగా మిరియాలు, సిల్వర్ ఓక్స్ చెట్ల మధ్య కాఫీ తోటలు పెంచడం ఆనవాయితీ. అలా కాకుండా స్థానిక వాతావరణానికి అనుగుణంగా మామిడి, సపోట, నేరేడు, సీతాఫలం తదితర పండ్ల చెట్లతో పాటు టేకు లాంటి 19 రకాల చెట్లను పెంచవచ్చని పరిశోధకులు సూచించారు. దాన్ని విస్తృతంగా రైతుల్లోకి తీసుకెళ్లాం. తద్వారా వారికి రాబడి సమకూరుతుందన్నది మా ఆలోచన. దాంతోపాటు నాలుగు కోట్లకు పైగా మొక్కలు పంచాం. కాఫీ మొక్కలు మొదలు అవి నాటిన తర్వాత చీడపీడల నుంచి సంరక్షణకు సేంద్రియ ద్రావణాలు, కంపోస్టు ఎరువు, ఆర్గానిక్ ఇన్‌పుట్స్ లాంటివి ఏటా రైతులకు ఉచితంగా ఇస్తున్నాం. దానివల్ల కాఫీ సాగు మొత్తం సేంద్రియ పద్ధతిలోనే సాగడానికి మా వంతుగా ప్రయత్నిస్తున్నాం. ఇది సత్ఫలితాలనిచ్చింది. దేశంలోనే కాకుండా విదేశాల్లోనూ అరకు కాఫీకి అంతటి గుర్తింపు రావడానికి అది కూడా ఒక ప్రధాన కారణం.

మహిళల శ్రమ అధికం...

కాఫీ సాగులో మహిళల కష్టం వెలకట్టలేనిది. కాఫీ మొక్కలు నాటడానికి నెల ముందు గోతులు తవ్వడం దగ్గర నుంచి ప్రతి పనిలో ఆడవారి భాగస్వామ్యం ఉంటుంది. కలుపు ఒక పెద్ద సమస్య. ఎప్పటికప్పుడు కలుపు తీయడం, ద్రావణాలు మొక్కలపై పిచికారీ చేయడం, ఎరువు వేయడంలాంటి పనులన్నీ మహిళా రైతులే చేస్తారు. ఒకసారి తోట వేస్తే మూడేళ్లకు పంట చేతికి వస్తుంది. ఆ తోట ఇరవై ఏళ్లవరకు ఫలాలు ఇస్తుంది. ఏటా డిసెంబరు- ఫిబ్రవరి మధ్య కాఫీ తోటల్లోని పండ్లను మహిళా రైతులు సేకరిస్తారు. కాఫీ పండించే రైతులంతా కలిసి 'స్మాల్ అండ్ మార్జినల్ ట్రైబల్ ఫార్మర్స్ మ్యూచ్యువల్లీ ఎయిడెడ్ కోపరేటివ్ సొసైటీ' నెలకొల్పారు. దాని ఎగ్జిక్యూటివ్ కమిటీలో యాభై శాతంమంది మహిళలున్నారు. కాఫీ సాగులో మహిళల భాగస్వామ్యం చాలా కీలకమైనదనడానికి ఇది ఒక ఉదాహరణ. కొందరు చెర్రీ పండ్లను అమ్మితే, మరికొందరు పల్పింగ్ మిషన్ ద్వారా పై తొక్కను తీయించి.. మిగిలిన పిక్కను ఎండబెట్టి, దాన్ని అమ్ముతారు. అయితే తొక్క తీసిన గింజలను ఆరబెట్టడంలాంటివి చేస్తుంటారు. ఇంటిల్లిపాదికీ కాఫీ కలిపి ఇవ్వడమే కాదు, ఆ కాఫీ గింజలను పండించడంలోనూ మహిళలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నారు.

అది రైతుల ఇష్టం...

అరకులో ప్రాసెసింగ్ యూనిట్ కూడా ప్రారంభించాం. మా ఫౌండేషన్‌కు అనుబంధంగా 'అరకు ఒరిజినల్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ' ఒకటి ఉంది. అది రైతుల నుంచి పంటను కొనుగోలు చేస్తుంది. అవిగాక 'గిరిజన కో-పరేషన్ లిమిటెడ్'తో పాటు 'ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి కార్పొరేషన్' తదితర సంస్థల్లో ప్రాసెసింగ్ యూనిట్లు అందుబాటులో ఉన్నాయి. కొందరు రైతులు సొంతంగా పల్పింగ్ మిషన్ల లాంటివి నడుపుతూ సొంతంగా కాఫీ పొడి తయారు చేసి మార్కెట్లో అమ్ముతుంటారు. 'నాంది ఫౌండేషన్' రైతులకు ఉచితంగా మొక్కలు మొదలు సేంద్రియ ఎరువుల వరకు అన్నీ ఉచితంగా ఇస్తుంది. కనుక, 'మా దగ్గరే ప్రాసెస్ చేయించుకోవాలి' లాంటి షరతులు అస్సలు ఉండవు. అమ్మకాలు కొనుగోళ్ల వ్యవహారాల్లోనూ మేం జోక్యం చేసుకోం. అది పూర్తిగా రైతుల ఇష్టం. గిరిజనుల జీవితాల్లో ఆనందాన్ని చూడటమే మా అంతిమ లక్ష్యం. దాని కోసమే వారితో కొన్నేళ్లుగా కలిసి పనిచేస్తున్నాం.

• సాంత్వన్

> **పరస్పర సహకారం...**
>
> కాఫీ చెట్లకు పురుగు తొలచడంలాంటి సమస్యలు వస్తుంటాయి. వాటి నివారణగా రసాయన ఎరువులు, పురుగు మందులు లాంటివి రైతులు అస్సలు వినియోగించరు. అరకులోని గిరిజనులు కాఫీని పూర్తిగా సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తారు. తెగులు సోకిన చెట్టును కాండంతో సహా పీకి... తోటకు దూరంగా కాల్చేయడం లేదా పారేయడం చేస్తారు. మా ఫౌండేషన్ పంపిణీ చేసిన సీ100, బ్లాక్100 లాంటి రకరకాల సేంద్రియ ద్రావణాలను మాత్రమే వాడతారు. కాఫీ మొక్కలు నాటడం దగ్గర నుంచి ప్రతి విషయంలో మా వాలంటీర్లు రైతులకు అండగా ఉంటూ, వారికి తగిన సలహాలు సూచనలు ఇస్తుంటారు. ఒకరి తోటల్లో మరొకరు పని చేస్తూ, పరస్పరం సహకరించుకొంటారు.

> **అందుకే ప్రత్యేక రుచి...**
>
> కోతకు వచ్చిన కాఫీ పండ్లను చెర్రీలంటారు. కాఫీ నారు పోసిన తర్వాత ఏడాది వరకు చిన్న బుట్టల్లో నీరు పోసి పెంచుతారు. మొక్కలు అయ్యాక వాటిని తీసిన గొయ్యిల్లో పాతుతారు. అలా నాటిన తర్వాత మూడేళ్లకు పంట చేతికి వస్తుంది. ఏపుగా పెరిగిన చెట్ల మధ్యలో కాఫీ తోటలు వేస్తారు. అరకు లోయలోని వాతావరణం... ఈ కాఫీకి ప్రత్యేకమైన రుచి రావడానికి కారణమని నిపుణులు చెబుతుంటారు.

> **దేశవిదేశాల్లో ...**
>
> అరకులో అరబికాతో పాటు కొత్తగా చంద్రగిరి, ఎస్-5 అనే మూడు రకాల కాఫీ మొక్కలను సాగు చేస్తున్నారు. మన్యంలో కాఫీ సాగుకు వందేళ్లకు పైగా చరిత్ర ఉంది. అయితే, మా ఫౌండేషన్ రైతులకు సేంద్రియ సాగు విధానాన్ని పరిచయం చేయడంతో పాటు దాని మార్కెటింగ్ విషయంలోనూ మద్దతునిస్తోంది. తద్వారా అరకు కాఫీ బ్రాండ్‌కు విదేశాల్లో సైతం మంచి గుర్తింపు రావడానికి తోడ్పడింది. బెంగళూరు, ముంబయి నగరాల్లో అరకు కెఫేలున్నాయి. అరకు గ్లోబల్ హోల్డింగ్స్ సంస్థ ఏడేళ్ల కిందట ఫ్రాన్స్‌లోని పారిస్‌లో కాఫీ షాపు ప్రారంభించింది. మరుసటి ఏడాది ప్రిక్స్ ఎపిక్యురెస్ పోటీల్లో అరకు కాఫీ గోల్డ్ మెడల్ గెలుచుకుంది. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా... మన్యంలో పండిన కాఫీ గింజలు అంతర్జాతీయ మార్కెట్‌లో పేరు రావడమంటే సాధారణ విషయం కాదు.



నావికాదళం నారీమణులదే!

నౌకా దళం అనగానే ఆ రంగం పురుషులకే పరిమితం అనుకుంటాం. కానీ దాన్లో మహిళలకు అంతులేని అవకాశాలున్నాయంటున్నారు హైదరాబాద్‌కు చెందిన మాజీ లెఫ్టినెంట్ కమాండర్ **ఐశ్వర్య బొడ్డపాటి**. గతంలో ఎనిమిది నెలల పాటు సెయిలింగ్ బోట్‌లో ప్రపంచ జలాలను చుట్టి వచ్చిన ఆమె, నావికాదళంలో మహిళల ఉద్యోగావకాశాల గురించీ, తన స్వీయ అనుభవాల గురించీ 'నవ్య'తో ఇలా పంచుకున్నారు.

మెటల్లర్జీలో ఇంజనీరింగ్ పూర్తి చేసిన తర్వాత నా చదువుతో సంబంధం ఉన్న ఇంటర్న్‌షిప్ చేయాలనే ఉద్దేశంతో డిఆర్‌డిఎలో చేరిపోయాను. అదే సమయంలో ఉద్యోగావకాశాల కోసం వెతుకుతూ దినపత్రికలను తిరగేస్తున్నప్పుడు నేవీ ప్రకటన నా కంట పడింది. అది టెక్నికల్ ఆఫీసర్ ఉద్యోగం. ఆ వృత్తిలో నా పని, ఓడలను డిజైన్ చేసి, రూపొందించడం. ఆ ఉద్యోగానికీ, సముద్రయానానికీ ఏమాత్రం సంబంధం లేదు. అయినా ఆ వృత్తి మీద ఆసక్తితో 2011లో అండమాన్‌లోని పోర్ట్ బ్లెయిర్‌లో నేవీలోకి అడుగుపెట్టాను. అక్కడున్న నేవల్ షిప్‌యార్డ్‌లో ఉన్న యుద్ధనౌకల మరమ్మతుల నిర్వహణ బాధ్యతలను నిర్వహించాను. ఆ సమయంలోనే గాలితో నడిచే పడవలో సముద్రజలాల్లో ప్రయాణిస్తూ, విశ్వాన్ని చుట్టి వచ్చే ఒక బృహత్తరమైన సాహసయాత్రలో పాల్గొనే అవకాశం వచ్చింది. దాంతో పోర్ట్ బ్లెయిర్ నుంచి గోవా చేరుకుని, అక్కడ రెండేళ్ల పాటు శిక్షణ తీసుకున్నాను.

నాకు సముద్రమంటే భయం

ఎవరెస్ట్ పర్వతాన్ని ఎక్కడమనేది అత్యంత సవాలుతో కూడుకున్న భూఆధారిత సాహసయాత్ర అయితే, అంతరిక్షంలోకి ప్రయాణించడమనేది అత్యంత సవాలుతో కూడుకున్న వాయు ఆధారిత సాహసయాత్ర. ఈ రెండిటిలాగే సముద్రజలాల మీద విశ్వాన్ని చుట్టి రావడమనేది కూడా సవాళ్లతో కూడుకున్న జల ఆధారిత సాహసయాత్రే! ఆరుగురు అమ్మాయిలం, మొట్టమొదటిసారిగా, తెరచాప పడవలో విశ్వాన్ని చుట్టి వచ్చే సాహసయాత్రకు ఎంపికైనప్పుడు, సహజంగానే అందరూ భయపడ్డారు. నేవీలోకి అడుగు పెడతాననీ, సముద్రంలో సాహసయాత్ర చేస్తాననీ నేను కలలో కూడా అనుకోలేదు. నిజం చెప్పాలంటే నాకు చిన్నప్పటి నుంచీ సముద్రమంటే విపరీతమైన భయం ఉండేది. ఆ భయాన్ని జయించడం కోసమైనా నేవీలో చేరాలని కాలేజీలో ఉన్నప్పుడు అనుకునేదాన్ని. అయితే సముద్రమంటే భయం పోవడానికి నేవీలోనే చేరవలసిన అవసరం లేదనీ, నీటిసంబంధ క్రీడలు, కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా కూడా ఆ భయాన్ని జయించవచ్చనీ నేవీలో చేరిన తర్వాత తెలిసింది.

అలా నేను బంజీ జంపింగ్, రివర్ రాఫ్టింగ్, స్కూబా డైవింగ్ క్రీడల్లో పాల్గొనడం మొదలుపెట్టాను. వీటికి విఘ్నం కలిగించినది ఏదైనా ఉందా అని ఆలోచిస్తున్న సమయంలో ప్రపంచాన్ని చుట్టి వచ్చే ఆరుగురు మహిళల భారతీయ నావికాదళ సాహసయాత్రలో పాల్గొనే అవకాశం తలుపు తట్టింది. కానీ దాన్లో పాల్గొనాలనే నిర్ణయం తీసుకోడానికి నేనెంతో ఆలోచించవలసి వచ్చింది. అప్పట్లో నావికాదళంలోని మహిళా అధికారులు ఓడల్లో ప్రయాణించే వృత్తుల్లో లేరు. పైగా అదే సమయంలో మా పేరెంట్స్ నాకు పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. 'బేస్‌లో ఉంటావని పెళ్లి సంబంధాలు చూస్తున్నాం. నువ్విప్పుడు సముద్ర ప్రయాణం చేస్తానంటే, నిన్ను చేసుకోడానికి ఎవరు ముందుకొస్తారు?' అని అమ్మా నాన్న అన్నారు. కానీ ఆ తర్వాత వాళ్లే నన్ను భుజం తట్టి ప్రోత్సహించారు. అలా రెండేళ్ల పాటు శిక్షణ పూర్తి చేసుకుని 2017లో సాహసయాత్రలో పాల్గొన్నాను.



> **మా బాబు పుట్టడం, నేవీలో నా కెరీర్ ముగిసిపోవడం ఒకేసారి జరిగింది. దాంతో పదేళ్ల నేవీ వృత్తి జీవితం నుంచి సెలవు తీసుకుని, డైవర్సిటీ హైరింగ్‌లో భాగంగా వెల్స్‌ఫార్గో సంస్థలో చేరిపోయాను. మా వారు రాజశేఖర్ సిడబ్ల్యుసిలో పని చేస్తారు. నాలుగేళ్ల బాబు నీల్ అనంత్ ఎల్‌కెజిలో ఉన్నాడు. అమ్మానాన్నలది, గుంటూరు, విజయవాడ.**

సవాళ్లను ఎదుర్కొని...

ప్రాథమిక సర్కమ్‌నావిగేషన్ నియమం ఏంటంటే, మూడు మహాఖండాల దిగువ నుంచి మాత్రమే ప్రయాణించాలి. జలసంధుల గుండా ప్రయాణించడం తేలిక కాబట్టి, సముద్రయానాన్ని క్లిష్టతరం చేయడం కోసమే ఈ నియమాన్ని ఏర్పాటు చేశారు. బహిరంగ మహాసముద్రంలో ప్రయాణించడం పలు సవాళ్లతో కూడుకుని ఉంటుంది. మేం ఆరుగురం మహిళలం తరచూ ఆగుతూ, పడవలో ఆహారం, నీళ్లనూ భర్తీ చేసుకుంటూ ప్రయాణించాలి. అందుకోసం మేం గోవాలో మా ప్రయాణాన్ని మొదలుపెట్టి మొదటి మజిలీలో భాగంగా ఆస్ట్రేలియాకు చేరుకున్నాం. అక్కడి నుంచి న్యూజిలాండ్, పసిఫిక్ మహాసముద్రాన్ని దాటి ఫాక్‌ల్యాండ్ దీవులకు చేరుకుని, అక్కడి నుంచి కేప్‌టౌన్ వెళ్లి, తిరిగి గోవాకు తిరుగు ప్రయాణమయ్యాం. అప్పటివరకూ సజావుగా సాగిన మా ప్రయాణానికి తిరుగు ప్రయాణంలో బ్రేక్ పడింది. మారిషస్ దగ్గర మా పడవకున్న స్టీరింగ్ సిస్టమ్ అయిన రడ్డర్ ఊడిపోయింది. అది సముద్రంలో పడిపోయే సమయానికి దాన్ని తాడుతో కట్టి, పడవను దారి మళ్లించి మారిషస్‌కు చేరుకున్నాం. అక్కడ రిపేరు చేయించుకుని సురక్షితంగా భారత దేశానికి చేరుకున్నాం.

ఆ ప్రయాణం ఆసాంతం ఎన్నో సవాళ్లతో సాగింది. తాగునీరు లేక వర్షపు నీళ్ల మీద ఆధారపడిన సందర్భాలున్నాయి. ఒక సందర్భంలో హాయిగా బేస్‌లోనే ఉండి, ఓడలను రిపేర్ చేసుకుంటూ ఉండిపోతే బాగుండేది కదా అని కూడా అనిపించింది. కానీ సముద్రయానం అనుభవంతో కొత్త విషయాలు నేర్చుకున్నాను. సముద్రంలో ట్రాఫిక్, పొల్యూషన్‌లు ఉండవు. నెట్‌వర్క్ ఉండదు. దాంతో మన గురించి మనం తెలుసుకోగలిగే సమయం చిక్కుతుంది. సవాళ్లతో కూడుకున్న సమయాలు ఎదురైనప్పటికీ, ఆహ్లాదకరమైన సమయాలను గడిపిన సందర్భాలు కూడా ఉన్నాయి.

మహిళలకు సురక్షితమే!

నావికాదళం మహిళలకు సురక్షితమైన రంగమేనా? అనే అనుమానాలు ఎంతో మందికి ఉంటాయి. నిజం చెప్పాలంటే నేలా, నింగికి సంబంధించిన రంగాల కంటే ఈ రంగమే సురక్షితమైనది. ఇంటి నుంచి ఆఫీసుకు బయల్దేరి వెళ్తే తిరిగి సురక్షితంగా ఇళ్లకు చేరతామనే నమ్మకం లేదు. కానీ సముద్రంలో కేవలం వాతావరణానికి సంబంధించిన సవాళ్లనే ఎదుర్కోవలసి వస్తుంది. నైపుణ్యం, అనుభవాలతో వాటిని తేలికగానే అధిగమించవచ్చు. పైగా దేశ సేవకు ఆస్కారం ఉన్న రంగమిది. క్రమశిక్షణ, వ్యక్తిత్వ నిర్మాణాలకు కూడా ఈ రంగం తోడ్పడుతుంది. కానీ నేవీనే కెరీర్‌గా ఎంచుకోవచ్చనే విషయం కూడా చాలా మంది మహిళలకు తెలియదు. కాబట్టే నేను బడులు, కాలేజీలలో ప్రసంగించేటప్పుడు నేవీలో మహిళల కెరీర్ అవకాశాల గురించి అవగాహన కల్పిస్తూ ఉంటాను. అడ్మినిస్ట్రేషన్, టెక్నికల్ స్టాఫ్, ఎడ్యుకేషన్, టీచింగ్, నావిగేషన్... ఇలా ఎన్నో విభాగాల్లో మహిళలకు తగిన ఉద్యోగాలుంటాయి.

• గోగుమళ్ల కవిత

అవకాశాలు అందుకుంటే విజయమే

తన చుట్టు ఉన్న పరిస్థితులను గమనించి వాటిని అనుకూలంగా మలుచుకోగలిగితే సాధికారత దానంతటదే వస్తుంది. ఈ సూత్రాన్ని నమ్మారు కేరళకు చెందిన **సుమిలా జయరాజ్** అనే గృహిణి. కొబ్బరిలో తనకు అవకాశం ఉందని గ్రహించారు.. ఇప్పుడు కోట్ల రూపాయల వ్యాపారం చేస్తున్నారు...



సుమిలా పుట్టింది కేరళలో ఎంగడియూర్ అనే చిన్న పట్టణంలో. చిన్నప్పటి నుంచి డాక్టర్ కావాలనుకుంది. పరిస్థితులు అనుకూలించకపోవటంతో డిగ్రీతో చదువు ముగించింది. పెళ్లి చేసుకొని ముంబైకి వెళ్లిపోయింది. భర్త ఉద్యోగ నిమిత్తం దుబాయ్ వెళ్లటంతో సుమిలా మళ్లీ తన స్వస్థలానికి వచ్చేసింది. పిల్లలు స్కూలుకి వెళ్లిపోయిన తర్వాత అంతా ఖాళీనే! దాంతో ఏం చేయాలో తెలియక- కొబ్బరినూనెను ఎగుమతి చేసే ఒక కంపెనీలో చేరింది. సుమిలాకు ఇంగ్లీషు బాగా వచ్చు. దాంతో ఆమెను అంతర్జాతీయ క్లయింట్స్‌తో మాట్లాడే పని అప్పచెప్పారు. పదేళ్ల పాటు ఆ కంపెనీలో పనిచేయటం వల్ల- అంతర్జాతీయ మార్కెట్‌లో కొబ్బరికి ఉన్న డిమాండ్ ఆమెకు అర్థమయింది. స్వయంగా తానే ఎగుమతులు చేయాలనే ఉద్దేశంతో గ్రీన్ ఆరా అనే ఒక కంపెనీని ప్రారంభించింది. కొబ్బరిపాలు, కొబ్బరినూనెతో పాటు చట్నీ, ఊరగాయలు, వెనిగర్ లాంటి ఉత్పత్తులు ఎగుమతి చేయటం మొదలుపెట్టింది. "ఇదంత సులభమైన ప్రయాణం కాదు. ప్రతి అడుగు కష్టమైనదే! ఒక మహిళ వ్యాపారం మొదలుపెడితే ఎదురయ్యే సవాళ్లెన్నో! అయినా అన్నింటికీ తట్టుకున్నా.." అంటారు సుమిలా. ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే తపనే తనను ముందుకు నడిపించిందంటారు సుమిలా. " డబ్బుల కోసం చిన్నప్పుడు నాన్న మీద.. పెద్దయిన తర్వాత భర్త మీద ఆధారపడటం నాకు నచ్చలేదు. ఆర్థికంగా స్వావలంబన సాధించాలనే కోరికే నన్ను ముందుకు నడిపించింది" అంటారు సుమిలా. ఆమె కంపెనీ ఉత్పత్తులు ఇప్పటికి ఏడెనిమిది దేశాల్లో దొరుకుతున్నాయి. "ప్రపంచమంతా నా ఉత్పత్తులు లభించాలి.. అదే నా కోరిక" అనే సుమిలా ఆశ నెరవేరాలని కోరుకుందాం. •





ప్రొటీన్‌కు ఈ నాలుగు!

మన శరీరానికి అత్యంత అవసరమైన వాటిలో ప్రొటీను ఒకటి. ఈ ప్రొటీను లభించే ఈ కింది నాలుగు పదార్థాలను మన ఆహారంలో తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలి.

శనగలు: ప్రతి అరకప్పు శనగల్లో 8 గ్రామాల ప్రొటీన్ ఉంటుంది. వీటిలో ప్రొటీన్ మాత్రమే కాకుండా- ఫైబర్, కొవ్వు కూడా ఉంటాయి. గుండె జబ్బులు ఉన్నవారు తప్పనిసరిగా తీసుకోవాల్సిన ఆహారమిది.

పప్పు ధాన్యాలు: పప్పు ధాన్యాల్లో ప్రొటీన్‌తో పాటుగా ఫైబర్, పొటాషియం, ఫోలేట్ మొదలైనవి ఉంటాయి. ఒక అరకప్పు పప్పు ధాన్యాల్లో సుమారు 8 గ్రాముల ప్రొటీన్ ఉంటుంది. వీటిలో ఉండే పొటాషియం కొలస్ట్రాల్, బీపీలను తగ్గిస్తుంది.

గుమ్మడి గింజలు: చిన్నగా కనిపించే ఈ గుమ్మడి గింజలకు అనేక శుభలక్షణాలు ఉన్నాయి. దీనిలో ప్రొటీన్‌లతో పాటుగా యాంటీ ఆక్సిడెంట్స్ కూడా ఎక్కువగా ఉంటాయి.

క్వినోవా: క్వినోవాలో కూడా ప్రొటీన్ ఎక్కువగా ఉంటుంది. దీనిలో ఉండే గ్లుటెన్ ఫ్రీ కార్బోహైడ్రేట్స్ వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయి.

ఫ్యాషన్

జిప్సీ జోరు



కాస్త డిఫెరెంట్‌గా, మరికాస్త ప్రత్యేకంగా కనిపించాలంటే జిప్సీ స్టైల్స్ ఫాలో కావాలి. స్కర్ట్స్, లాంగ్ ఫ్రాక్స్, లేయర్ ఫ్రాక్స్... ఇలా జిప్సీలో బోలెడన్ని డ్రస్‌లు ఉన్నాయి. అవే ఇవి!

జామెట్రీ, ఫ్లవర్, ఈజిప్షియన్... ఇలా ఎన్నో రకాల ప్రింటులు జిప్సీ స్కర్ట్స్ సొంతం. ఈ డిజైన్లన్నీ దగ్గర దగ్గరగా ఇరికించినట్టు ఉండడం జిప్సీ స్టైల్ ప్రత్యేకత! ఈ డిజైన్లన్నీ ముదురు రంగుల్లో, ఓ క్రమం లేకుండా డ్రస్‌లో ఒదిగిపోయి ఉండడమే ఈ దుస్తులకు ఉన్న ఎట్రాక్షన్!

పెన్సిల్ హీల్స్ బూట్స్, వెడ్జెస్, ఫ్లాట్స్... వీటిలో ఎలాంటి చెప్పులైనా జిప్సీ దుస్తులతో మ్యాచ్ అవుతాయి. అలాగే పెద్ద సైజు ఇయర్ హ్యాంగింగ్స్, బ్యాంగిల్స్, హెడ్ బ్యాండ్స్ ఈ దుస్తులకు మ్యాచ్ అయినంతగా మరే డ్రస్‌కూ మ్యాచ్ అవవు!

క్రాప్ టాప్స్, స్లీవ్‌లెస్, షర్ట్... ఇలా ఎలాంటి టాప్స్ అయినా జిప్సీలో చెల్లుబాటు అవుతాయి. డిజైన్ పరంగా టాప్, బాటమ్ మ్యాచ్ కావాలనే నియమం కూడా ఉండదు. కాబట్టే జిప్సీ డ్రెస్సింగ్ స్టైల్ సర్వత్రా ఆదరణ పొందుతోంది.



ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
బుధవారం • 3 జూలై 2024
cinema@andhrajyothy.com



కష్టంతోనే అదృష్టం


మన వంతు కష్ట పడాలి, అప్పుడే అదృష్టం కూడా కలసి వస్తుంది అని నమ్ముతాను అన్నారు రష్మిక మందన్న. సినిమా జయాపజయాలపై తన ఆలోచనా ధోరణి గురించి చెబుతూ 'టీంలో ప్రతి ఒక్కరూ శ్రమిస్తేనే మంచి అవుట్‌పుట్ వస్తుంది. అప్పుడే సినిమా పెద్ద హిట్ అవుతుంది. హీరో, హీరోయిన్ దర్శకుడు... ఇలా నటీనటులు మొదలుకొని ప్రతి టెక్నీషియన్ సినిమా కోసం ముందస్తుగా సన్నద్ధమయ్యేందుకు చాలా కష్టపడతారు. ఈ క్రమంలో ప్రతి ఒక్కరూ చాలా ఒత్తిడిని ఎదుర్కోవాల్సి వస్తుంది. ఎంత కష్టపడినా కొన్ని సార్లు అపజయం తప్పదు. అలాంటప్పుడు ఇంత కష్టపడినా ఇలా జరిగిందేంటి అని బాధపడకూడదు. కష్టాన్ని నమ్ముకొని ముందుకెళ్లాలి, అప్పుడే విజయాలు మన సొంతమవుతాయి' అని రష్మిక చెప్పారు. ప్రస్తుతం ఆమె తెలుగులో ధనుష్, నాగార్జున మల్టీస్టారర్ 'కుబేర'లో కథానాయికగా నటిస్తున్నారు. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్నారు. రష్మిక లుక్‌ను ఈ నెల 5న వి డుదల చేస్తున్నట్లు యూనిట్ తెలిపింది. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్‌రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

మా మధ్య అసూయ లేదు



తమిళ నటులు రజనీకాంత్, కమల్‌హాసన్ వెండితెరపై కలసి నటిస్తే చూడాలని కోరుకోని అభిమాని లేడంటే అతిశయోక్తి కాదు. ఈ నెల 12న విడుదలవుతున్న 'భారతీయుడు 2' ప్రమోషన్స్‌లో ఉన్న కమల్‌ను.. ఓ ఆంగ్ల మీడియా విలేఖరి 'ఇండియన్ సినిమా చరిత్రలోనే అత్యంత పాపులర్ నటులయిన మీ ఇద్దరూ కలసి నటించి ఎన్నో ఏళ్లు అవుతోంది. మళ్లీ వి ఇమ్మల్ని ఒకే తెరపై చూసే అవకాశం ఉందా.. ఒకరి సినిమాల్లో ఒకరు కనిపించే ఆలోచనలు ఉన్నాయా?' అని ప్రశ్నించారు. దీనికి కమల్ సమాధానమిస్తూ 'మాది కొత్త కాంబినేషన్ అయితే కాదు. కెరీర్ కొత్తలో మేమిద్దరం ఎన్నో సినిమాల్లో కలసి నటించాం. ఆ సమయంలోనే ఇక కలసి ఒకే సినిమాలో కనిపించకూడదని నిర్ణయించుకున్నాం. మేం ఇద్దరం ఏ విషయంలో పోటీపడలేదు, ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోలేదు. అప్పుడూ.. ఇప్పుడూ. ఎందుకంటే మేం ఇద్దరం ఒకే గురువు కె.బాలచందర్ దగ్గర శిక్షణ పొందాం. మా మధ్య అసూయకు తావు లేదు. ఒకరి ఎదుగుదలను ఇంకొకరం స్పోర్టివ్‌గా తీసుకుని ముందుకు సాగుతున్నాం. ఇదే మా మధ్య ఉన్న బలమైన అనుబంధానికి నిదర్శనం. మాకు 20 ఏళ్లు ఉన్నప్పటి నుంచే ఇలాంటి అవగాహనతో కెరీర్‌లో ముందుకు సాగుతున్నాం' అని రజనీతో ఉన్న స్నేహాన్ని గుర్తుచేసుకున్నారు. కాగా, కమల్,రజనీ కలసి దాదాపు 16 చిత్రాల్లో నటించారు. ఆఖరిగా, 1985లో తెరకెక్కిన అమితాబ్ బచ్చన్ చిత్రం 'గిరఫ్తార్'లో స్ర్కీన్ షేర్ చేసుకున్నారు.

షారుక్ ఖాన్‌కు అరుదైన గౌరవం



బాలీవుడ్ నటుడు షారుక్ ఖాన్‌కు అరుదైన గౌరవం లభించింది. స్విట్జర్లాండ్‌లోని లోకర్నో ఫిల్మ్ ఫెస్టివల్‌ను నిర్వహించే అక్కడి జ్యూరీ సభ్యులు.. షారుక్ ఖాన్‌ను ఈ ఏడాది జరిగే ఫిల్మ్ ఫెస్టివల్‌లో సత్కరించనున్నారు. షారుక్‌కు 'జీవిత సాఫల్య పురస్కారం' ప్రకటించింది. అంతే కాకుండా.. ఆయన సినిమాల్లో క్లాసికల్ హిట్‌గా మిగిలిన 'దేవదాసు' సినిమాను కూడా ఆ ఫిల్మ్ ఫెస్టివల్‌లో స్ర్కీనింగ్‌కు ఎంపిక చేసింది. సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో 2003లో రిలీజైన ఈ సినిమా విమర్శకులు ప్రశంసలతో పాటు బాక్సాఫీస్ వద్ద బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. ఈ అవార్డుకు సంబంధించిన వివరాలను సోషల్ మీడియాలో ప్రకటించిన ఈ ఫిల్మ్ ఫెస్టివల్ నిర్వాహకులు.. షారుక్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. 'షారుక్ లాంటి దిగ్గజ నటుడ్ని మా ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఆహ్వానించాలనే కోరిక ఈ 77వ ఎడిషన్ ఫిల్మ్ ఫెస్టివల్‌తో తీరింది. నిర్మాతగా, నటుడిగా భారతీయ సినిమా ఇండస్ట్రీపై తనదైన ముద్ర వేసిన ఆయన్ని సత్కరించడం మా గౌరవం'. కాగా, ఈ ఫిల్మ్ ఫెస్టివల్ స్విట్జర్లాండ్‌లో వచ్చే నెల 7 నుంచి 17వ తేదీ వరకు జరుగుతుంది. ఈ అవార్డును షారుక్ ఆగస్టు 10న అందుకోనున్నారు.

విరాజి టైటిల్‌తో వరుణ్ సందేశ్



ఇటీవలే విడుదలైన 'నింద' చిత్రంతో హీరోగా చక్కటి విజయాన్ని సొంతం చేసుకున్నారు వరుణ్ సందేశ్. త్వరలో తన కొత్త చిత్రం 'విరాజి'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆద్యంత్ హర్ష దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఎమ్ 3 మీడియా బేనర్‌పై మహేంద్రనాథ్ కూండ్ల నిర్మిస్తున్నారు. మంగళవారం చిత్రబృందం టైటిల్ అనౌన్స్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా వరుణ్ సందేశ్ మాట్లాడుతూ ' 'నింద' సక్సెస్ నాకు మంచి ఉత్సాహాన్ని ఇచ్చింది. హర్ష చెప్పిన కథ బాగా నచ్చింది. ఆయనకు మంచి భవిష్యత్ ఉంది. నా 17 ఏళ్ల కెరీర్‌లో చేయని ఒక డిఫరెంట్ మూవీ ఇది. ఇందులో నా పాత్ర సరికొత్తగా ఉంటుంది' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'త్వరలో ఫస్ట్‌లుక్‌ను విడుదల చేస్తాం. 'విరాజి' వరుణ్ సందేశ్‌కు పేరు తెస్తుంది' అని చెప్పారు. నిర్మాత మాట్లాడుతూ "విరాజి' చిత్రంలో వరుణ్ సందేశ్‌ను కొత్త అవతారంలో చూపించబోతున్నాం. సినిమా చాలా బాగా వచ్చింది. ఆగస్టు 2న విడుదల చేయాలనుకుంటున్నాం' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: ఎబినేజర్ పాల్. సినిమాటోగ్రఫీ: జీవీ అజయ్‌కుమార్. ఎడిటర్: రామ్ తూము

లవ్వు.. నవ్వు.. జీవితం



ప్రియదర్శి, నభా నటేశ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'డార్లింగ్' నుంచి సెకండ్ సింగిల్ విడుదల చేశారు. 'రాహి రే' అంటూ సాగే ఈ పాటను గీత రచయిత కాసర్ల శ్యామ్ రాయగా, కపిల్ కపిలన్ పాడారు. ఇండియాలోని వివిధ ప్రదేశాలను సందర్శిస్తూ పాడుకొనే పాట ఇది. ఆమె జర్నీని సినిమాటోగ్రాఫర్ నరేశ్ రామదురై అందంగా చిత్రీకరించారు. వివేక్ సాగర్ స్వరాలు అందించారు. అశ్విన్ రామ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఈ నెల 19న విడుదల చేయనున్నట్లు నిర్మాతలు నిరంజన్‌రెడ్డి, శ్రీమతి చైతన్య చెప్పారు. 'ఎంజాయ్‌బుల్ మెలోడీ ఇది. తొలి పాటలానే ఇది కూడా ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉంది. ప్రేమ, నవ్వు, జీవితం.. ఈ అంశాలతో రూపుదిద్దుకున్న సినిమా ఇది. అనన్య నాగళ్ల మరో కీలక పాత్ర పోషిస్తున్నారు' అని తెలిపారు. బ్రహ్మానందం, విష్ణు, కృష్ణతేజ్ తదితరులు నటించిన ఈ చిత్రానికి మాటలు: హేమంత్, క్రియేటివ్ ప్రొడ్యూసర్: సీతారామ్ వై.


రాజ్‌తరుణ్ మాస్ హీరోగా నిలబడతాడు




ఇంతవరకూ వినోదభరితమైన పాత్రలతో అందరినీ నవ్వించిన యువ కథానాయకుడు రాజ్ తరుణ్ ఇప్పుడు పవర్‌ఫుల్ యాక్షన్ చిత్రం 'తిరగబడరా సామీ' తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. మాల్వీ మల్హోత్రా కథానాయికగా నటించారు. ఎ.ఎస్.రవికుమార్ దర్శకత్వంలో మల్కాపురం శివకుమార్ నిర్మించారు. ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేసిన సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో రాజ్‌తరుణ్ మాట్లాడుతూ 'అందరం ప్రాణం పెట్టి ఈ సినిమా చేశాం. ముఖ్యంగా డీవోపీ జవహర్‌రెడ్డి అద్భుతంగా చిత్రాన్ని తీర్చిదిద్దారు. సినిమాలో ఇంత యాక్షన్ పార్ట్ చేయడం నాకు కొత్త. అయినా దర్శకుడి ప్రోత్సాహంతో ఈజీగా చేశాను. ఇందులో ఎమోషన్, ఎంటర్‌టైన్‌మెంట్ కూడా బాగుంటాయి. ఈ సినిమాలో నటించే అవకాశం ఇచ్చిన నిర్మాత శివకుమార్‌కు నా ధన్యవాదాలు' అని చెప్పారు. 'నేను దర్శకత్వం వహించిన 'యజ్ఞం' చిత్రం ఇదే రోజున విడుదలై నా జీవితాన్ని కొత్త మలుపు తిప్పింది. అదే ఈ రోజున 'తిరగబడరా సామీ' ట్రైలర్ విడుదల కావడం ఆనందంగా ఉంది. రాజ్‌తరుణ్ ఈ సినిమాతో మాస్ హీరోగా నిలబడతాడు. నిర్మాత చాలా గ్రాండ్‌గా సినిమాని తీశారు. అందరినీ ఆకట్టుకొనే చిత్రమిది' అని చెప్పారు రవికుమార్.

'ఇందులో బాలకృష్ణ అభిమానిగా నటించా. చాలా బ్యూటిఫుల్ కథ ఇది. సినిమాలో ఓ ఫైట్ కూడా చేశా. ఈ చిత్రంతో తెలుగులో పరిచయం కావడం ఆనందంగా ఉంది' అన్నారు హీరోయిన్ మాల్వి. నిర్మాత శివకుమార్ మాట్లాడుతూ 'రవికుమార్ చెప్పిన కథ బాగా నచ్చింది. ఇందులో రాజ్‌తరుణ్ హీరోగా నటిస్తే బాగుంటుందని ఆయన్ని అడిగితే వెంటనే అంగీకరించారు. యాక్షన్ పాత్రలో ఆయన కొత్తగా కనిపిస్తారు. ప్రతి సినిమాతో నేను కొత్తవారిని పరిచయం చేస్తుంటాను. ఈ సినిమాతో హీరోయిన్ మాల్వి పరిచయమవుతోంది. త్వరలో సినిమాను విడుదల చేస్తాం' అని చెప్పారు.

జాకీ భగ్నానికి అండగా అక్షయ్ కుమార్





రకుల్ ప్రీత్‌సింగ్ భర్త, నిర్మాత జాకీ భగ్నానికి బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ అండగా నిలిచారు. అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వంలో రూ.350 కోట్ల రూపాయలతో 'బడేమియా చోటేమియా' సినిమాను జాకీ భగ్నాని, ఆయన తండ్రి వాసు భగ్నానీ నిర్మించారు. అక్షయ్‌కుమార్, జాకీ ష్రాఫ్, మానుషి చిల్లర్, ఆలయా.ఎఫ్ నటించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద కేవలం రూ.110 కోట్ల రూపాయలు రాబట్టి దారుణ పరాజయంగా మిగిలింది. దీంతో సినిమాకు పని చేసిన వారెవ్వరికీ నిర్మాతలు పూర్తి పారితోషికాన్ని చెల్లించలేకపోయారు. ఈ విషయం బీటౌన్‌లో పెద్ద వివాదంగా మారింది. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో అక్షయ్‌కుమార్ తమకు అండగా నిలిచారని జాకీ భగ్నానీ తెలిపారు. ఈ సినిమాకు పనిచేసినవారందరికీ డబ్బులు చెల్లింపులు పూర్తి చేశాకే తనకు ఇవ్వండని.. అలాగే ఈ సంస్థ నిర్మాణంలో మరోసారి అక్షయ్ నటిస్తానని మాటిచ్చినట్లు జాకీ అన్నారు. అక్షయ్‌కు పెద్ద మొత్తం ఇవ్వాల్సి ఉండడంతో.. దానికి కాస్త సమయం దక్కడంతో ఊపిరి పీల్చుకునే వెసులుబాటు దక్కిందని నిర్మాత జాకీ భగ్నానీ భావిస్తున్నారు. ఈ సందర్భాన్ని సోషల్ మీడియాలో షేర్ చేసుకుని అక్షయ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

15 రోజుల షూట్‌తో పూర్తి






శంకర్

'గేమ్ ఛేంజర్' చిత్రం మరో 15 రోజుల షూటింగ్ మాత్రమే మిగిలి ఉంది. 'భారతీయుడు 2' రిలీజవ్వగానే పెండింగ్ పార్ట్‌ను పూర్తి చేస్తాను. 'గేమ్‌చేంజర్', 'భారతీయుడు' చిత్రాల మధ్య పోలిక లేదు. అవి రెండూ పూర్తిగా వేటికవే భిన్నమైనవి. సీక్వెల్ చేయడానికి అవసరమైన మలుపులు 'గేమ్ ఛేంజర్' కథలో లేవు కాబట్టి అలాంటి ప్రయత్నమేదీ చేయడం లేదు' అని దర్శకుడు శంకర్ అన్నారు. ఆయన దర్శకత్వంలో కమల్‌హాసన్ కథానాయకుడిగా నటించిన 'భారతీయుడు 2' చిత్రం ఈనెల 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా శంకర్ మీడియాతో ముచ్చటించారు.

- 'భారతీయుడు' చిత్రానికి మూడో పార్ట్ కూడా ఉంది. మరో ఆరునెలల్లో దాన్ని కూడా విడుదల చేస్తాం. పలు రాష్ట్రాల్లో జరిగే కథ కావడంతో నిడివి పెరిగింది. ప్రతి సన్నివేశం ప్రేక్షకులను కట్టి పడేస్తుంది. ఎడిటింగ్‌లో ఒక్క సన్నివేశం కూడా తీసేయడానికి నా మనసు ఒప్పుకోలేదు. అందుకనే 'భారతీయుడు 3' ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం.
- భవిష్యత్‌లో జేమ్స్‌బాండ్ తరహా చిత్రాలు చేయాలనుకుంటున్నాను. అలాగే చారిత్రక, సైన్స్ ఫిక్షన్ కథాంశాలతో సినిమాలు చేసే ఆలోచన ఉంది. వీఎఫ్‌ఎక్స్‌ను ఉపయోగించుకొని మంచి చిత్రాలు తెరకెక్కించే ఆలోచన ఉంది. ఆ సినిమాలు అందరినీ ఆశ్చర్యపరిచే స్థాయిలో ఉంటాయి.
- శంకర్ సినిమాటిక్ యూనివర్స్ క్రియేట్ చేయాలనే ఆలోచన వచ్చింది. దాని గురించి నా స్నేహితులు, సహాయ దర్శకులు, కుటుంబ సభ్యులకు చెప్పినప్పుడు ఎవ్వరూ పెద్దగా ఎగ్జైట్ అవ్వలేదు. దాంతో ఆ ఆలోచన విరమించుకున్నాను. రజనీకాంత్, కమల్‌హాసన్‌తో మల్టీస్టారర్ ప్లాన్ చేశా. కానీ కమల్ హాసన్ బిజీగా ఉండడంతో కుదరలేదు.
- ఇప్పుడు సినిమాల్లో టెక్నాలజీ బాగా ఎక్కువైంది. దాంతో అద్భుతాలు సృష్టించవచ్చు. కానీ నా దృష్టిలో ఏఐ కన్నా మనిషి ఆలోచనలే శక్తిమంతమైనవి. ఇప్పుడే కాదు ఎప్పటికీ ఏఐ కన్నా మనిషి ఆలోచనలే ముందుంటాయి.
- తప్పకుండా షారూఖ్‌ఖాన్‌తో సినిమా చేస్తాను. మంచి స్ర్కిప్ట్ కుదరాలి. అట్లీ, లోకేశ్ కనగరాజ్ లాంటి దర్శకులు సృజనాత్మకంగా చిత్రాలను తెరకెక్కిస్తున్నారు. 'ట్వల్త్ ఫెయిల్' చిత్రం నాకు బాగా నచ్చింది.

అపరిచితుడు రీమేక్‌ను పక్కనపెట్టాం



రణ్‌వీర్‌సింగ్‌తో హిందీలో 'అపరిచితుడు' రీమేక్ చిత్రం లేనట్టే. ప్రస్తుతానికి ఆ చిత్రాన్ని పక్కనపెట్టినట్లు బాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో శంకర్ చెప్పారు. ఆ చిత్ర నిర్మాత జయంతిలాల్ గడ నాతో 'అపరిచితుడు' రీమేక్ కన్నా మరింత భారీ చిత్రం తీయాలనుకోవడమే దానికి కారణమని శంకర్ తెలిపారు. 'ఈ రీమేక్‌ను ప్రకటించాక కొత్త కాన్సెప్ట్‌లతో పలు పాన్ ఇండియా చిత్రాలు వచ్చాయి, మంచి విజయాన్ని అందుకొన్నాయి. దాంతో మా నిర్మాత మనసు మార్చుకున్నారు. ప్రస్తుతానికైతే 'అపరిచితుడు' రీమేక్‌ను పక్కనపెట్టినట్లే. చేతిలో ఉన్న సినిమాలు పూర్తి చేశాక దీనిపై ఓ నిర్ణయం తీసుకుంటాం' అని శంకర్ చెప్పారు.



నువ్వో యోధురాలివి

కేన్సర్ బారిన పడి చికిత్స తీసుకుంటున్న బాలీవుడ్ నటి హీనాఖాన్‌కు టాలీవుడ్ హీరోయిన్ సమంత ధైర్యం చెప్పారు. మంగళవారం తన ఇన్‌స్టాగ్రామ్‌లో హీనాఖాన్ వీడియోను పోస్ట్ చేశారు సమంత. 'నువ్వో యోధురాలివి. త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను... ధైర్యంగా ఉండు' అని సమంత పేర్కొన్నారు. దీంతో హీనాఖాన్ సమంతకు ధన్యవాదాలు తెలిపారు. 'జీవితంలో ఎదురయ్యే సవాళ్లను మీరు ఎదుర్కొనే తీరు అద్భుతం. తెరపైనే కాదు నిజ జీవితంలోనూ మీరు స్టారే. నాకు స్ఫూర్తిగా నిలిచారు. మీరు నాపై చూపిన ప్రేమకు ధన్యవాదాలు' అని సంతోషం వ్యక్తం చేశారు. తాను రొమ్ము కేన్సర్ బారిన పడినట్లు కొన్ని రోజుల క్రితం హీనాఖాన్ తెలిపారు. సమంత కూడా మయోసైటిస్ అనే వ్యాధి బారినపడి చికిత్స తీసుకుంటున్నారు.



రష్యన్ యువతి తెలుగు చిత్రం



రష్యాలో పుట్టి పెరిగిన లియుబా పామ్ గాయని, నిర్మాత కూడా. 'సేవ్ ది చిల్డ్రన్' పేరుతో ఓ డాక్యుమెంటరీ తీశారు. 'లవ్ ఓవర్ ఈవిల్' టీవీ సిరీస్‌కు రచయిత్రి, ప్రస్తుతం 'నిన్ను వదలను' పేరుతో రూపుదిద్దుకుంటున్న హారర్ సస్పెన్స్ చిత్రంలో లియుబా నటిస్తున్నారు. షిరాజ్ మెహది దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో కుష్బూ జైన్ కూడా మరో ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. గోవా, హైదరాబాద్ ప్రాంతాల్లో ఈ చిత్రం షూటింగ్ జరుగుతుంది. గంగాధర్, వైజాగ్ షరీఫ్, రవితేజ, అజయ్, అనంత్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: ప్రవీణ్ కొమరి, ఎడిటింగ్: కె.ప్రభు, సహ నిర్మాత: దేవేంద్ర నెగి, నిర్మాత: అశోక్ కుల్లర్.

భారతీయ సినిమాకు అవార్డుల పంట



సుచి తలాటి దర్శకత్వంలో బాలీవుడ్ నటి రిచా చద్దా, ఫయాజ్ అలీ నిర్మించిన 'గర్ల్స్ విల్ బి గర్ల్స్' చిత్రం రిలీజ్‌కు ముందే సంచలనాలు సృష్టిస్తోంది. ఇప్పటికే పలు అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో అవార్డులు గెలుచుకున్న ఈ చిత్రం ఇప్పుడు మరో అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ లాస్ ఏంజిల్స్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన గ్రాండ్ జ్యూరీ అవార్డును సాధించి చరిత్ర సృష్టించింది. ఈ సినిమా ఇప్పటికే రొమేనియాలోని ట్రాన్సిల్వేనియా ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, ఫ్రాన్స్‌లోని బియారిట్జ్‌లోని ఫిల్మ్ ఫెస్టివల్స్‌లోనూ గ్రాండ్ జ్యూరీ అవార్డులను కైవసం చేసుకుంది. ఇలా వరుసగా మూడు గ్రాండ్ జ్యూరీ అవార్డులు సాధించి హ్యాట్రిక్ సాధించింది. ఈ సందర్భంగా నిర్మాతలు రిచా చద్దా, ఫయాజ్ అలీ మాట్లాడుతూ 'ఇలా ఒక నెలలోనే ఈ సినిమాకు మూడు గ్రాండ్ జ్యూరీ పురస్కారాలు దక్కడంతో చాలా ఆనందంగా ఉంది. ఇది మా కష్టానికి దక్కిన గౌరవం. మా హృదయాలకు చేరువైన ఈ సినిమా.. ఇంతటి ఘనమైన ప్రదర్శన చేస్తుండడం జీవితాంతం మర్చిపోలేని విషయం. ఒక నిర్మాతగా మొదటి సినిమాకే ఇంత ఖ్యాతి రావడం మా అదృష్టం' అని చెప్పారు. కాగా, 16 ఏళ్ల అమ్మాయి జీవితంలో జరిగే సంఘటనల ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రంలో ప్రీతి పాణిగ్రహి ప్రధాన పాత్రలో నటించారు.



సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో షర్మిల

వైఎస్సార్ 75వ జయంతి వేడుకలకు రండి!

» సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టికి షర్మిల ఆహ్వానం

హైదరాబాద్, జూలై 2(ఆంధ్రజ్యోతి): ఈ నెల 8న జరిగే వైఎస్సార్ 75వ జయంతి వేడుకలకు తప్పని సరిగా రావాలని సీఎం రేవంత్ రెడ్డిని ఏపీసీసీ చీఫ్ షర్మిల ఆహ్వానించారు. మంగళవారం సీఎం నివాసానికి వెళ్లిన ఆమె.. ఈ మేరకు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. అలాగే ప్రజాభవన్‌కు వెళ్లి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కనూ ఆహ్వానించారు. వైఎస్సార్ 75వ జయంతి వేడుకలను విజయవాడలోని సీకే కన్వెన్షన్ సెంటర్లో ఘనంగా నిర్వహిస్తున్నామని, పార్టీలకు అతీతంగా అందరూ రావాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత సోనియాగాంధీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఇతర నేతలు, ప్రముఖులు హాజరై వైఎస్‌కు ఘనంగా నివాళులర్పించనున్నట్లు మంగళవారం ఓ ప్రకటనలో ఆమె వెల్లడించారు.

భద్రాద్రిలో బ్రేక్ దర్శనం ప్రారంభం

భద్రాచలం, జూలై 2: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో మంగళవారం బ్రేక్ దర్శనం ప్రారంభమైంది. ఉదయ 9 నుంచి 9.30 వరకు, రాత్రి 7 నుంచి 7.30 వరకు భక్తులకు విరామ దర్శన అవకాశం కల్పించినట్లు ఈవో ఎల్. రమాదేవి తెలిపారు. బ్రేక్ దర్శన టికెట్ల ధరను రూ. 200గా నిర్ణయించినట్లు చెప్పారు. తొలి టికెట్‌ను ఈవో రమాదేవి కొనుగోలు చేసి స్వామివారి దర్శించుకున్నారు. అలాగే దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, భక్తులు బ్రేక్ దర్శనం టికెట్ కొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ బ్రేక్ దర్శనాన్ని దేవస్థానంలో విశేష ఉత్సవాలు, కార్యక్రమాలు ఉన్న సమయంలో రద్దు చేసేందుకు లేదా వాయిదా వేసేందుకు అవకాశముందని ఈవో రమాదేవి తెలిపారు.

ఉద్యోగాల పేరుతో మోసం

రూ. లక్షల్లో నగదు వసూలు.. పోలీసుల అదుపులో నిందితుడు

సిద్దిపేట క్రైం, జూలై 2: ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ పలువురి వద్ద డబ్బులు వసూలు చేసి, అడిగితే చంపేస్తానని బెదిరిస్తున్న నిందితుడిని సిద్దిపేట పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం తిమ్మాపూర్‌కు చెందిన జోరవంతుల సత్యనారాయణ సిద్దిపేట సీతారాంనగర్‌లో ఓ కార్యాలయం ఏర్పాటు చేసుకుని, తెలంగాణ యాంటీ కరప్షన్ ఇంటలిజెన్స్ కమిటీ జనరల్ సెక్రటరీగా, సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సభ్యుడిగా, తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీగా పని చేస్తున్నానని... ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ ప్రచారం చేసుకున్నాడు. ఈ క్రమంలో సిద్దిపేటకు చెందిన అయిత వరప్రసాద్, అతని స్నేహితుడు బక్కోల అశోక్‌కు ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికాడు. ఒక్కొక్కరికీ రూ. 6 లక్షల వరకు ఖర్చవుతుందని చెప్పాడు. దీంతో వరప్రసాద్ రూ. 4,15,000, అశోక్ రూ. 1,50,000 ఇచ్చారు. ఈ క్రమంలో నిందితుడు కార్యాలయాన్ని మరో ప్రాంతానికి మార్చగా.. ఖర్చులు, కిరాయి అడ్వాన్స్ కావాలంటూ మరో రూ. 15,000 తీసుకున్నాడు. ఎంతకూ ఉద్యోగం ఇప్పించకపోవడంతో తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని అడగడంతో సత్యనారాయణ వారికి ఓ బ్యాంక్ చెక్ ఇచ్చాడు. కానీ అది బౌన్స్ అయింది. అనంతరం డబ్బుల కోసం అతడి వద్దకు వెళ్తే చంపేస్తానని బెదిరించాడని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

వీధి కుక్కల బెడదపై ఓ విధానం లేదా?:హైకోర్టు

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల దాడుల్లో చిన్నపిల్లలు చనిపోతున్న ఘటనలపై హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. వరుసగా ఇలాంటి సంఘటనలు జరుగుతున్నా పభుత్వానికి ఓ విధానం అంటూ లేకపోవడం ఏమిటని ప్రశ్నించింది. కేవలం పరిహారం చెల్లించి చేతులు దులుపుకుంటామంటే కుదరదని, ఇలాంటివి భవిష్యత్తులో చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవాలని నిర్దేశించింది. గతేడాది ఫిబ్రవరి 19న అంబర్‌పేట్‌లో నాలుగేళ్ల బాలుడు ప్రదీప్, తాజాగా జూన్ 28న పటాన్‌చెరులో బీహార్ వలసకూలీల కుటుంబానికి చెందిన ఆరేళ్ల బాలుడు విశాల్ కుక్కల దాడిలో చనిపోయిన ఘటనలపై వచ్చిన కథనాలను హైకోర్టు సుమోటోగా స్వీకరించింది. చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం ఈ పిటిషన్‌లపై మంగళవారం మరోసారి విచారణ చేపట్టింది. ఇదే అంశానికి సంబంధించి 'అనుపమ్ త్రిపాఠీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన సూచనలను ఎంతవరకు అమలు చేస్తున్నారో వివరించాలని రాష్ట్ర ప్రభుత్వం, జీహెచ్ఎంసీ, పోలీసుశాఖ, ఇతరులకు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణ ఈనెల 10కి వాయిదాపడింది.

నీట్ అక్రమాలను నిరసిస్తూ 4న విద్యాసంస్థల బంద్

» విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): నీట్ అక్రమాలకు నిరసనగా విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యచరణ సమితి ఈనెల 4న విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చింది. నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా విద్యార్థి, యువజన సంఘాలు ఆందోళన చేస్తున్నా, పార్లమెంటులో చర్చకు విపక్షాలు పట్టు పడుతున్నా ప్రధాని మోదీకి చీమ కుట్టినట్లుగా కూడా లేదని, అందుకే బంద్‌కు పిలుపునిస్తున్నట్లు సమితి ప్రకటించింది. ఈ మేరకు మంగళవారం టీజేఎస్ రాష్ట్ర కార్యాలయంలో విద్యార్థి, యువజన సంఘాల నేతలు మీడియాతో మాట్లాడారు. ఎన్ఎస్‌యూఐ(నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా) రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ.. పోటీ పరీక్షల నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీయే) విఫలమైందన్నారు. పదేళ్ల మోదీ పాలనలో 70 పరీక్ష పేపర్లు లీక్ అయ్యాయని, లీకేజీలు జరుగుతున్న రాష్ట్రాలన్నీ బీజేపీ పాలిత రాష్ట్రాలే కావడంతో మోదీ మౌనంగా ఉంటున్నారన్నారు. యువజన సమితి రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ సలీమ్ పాషా మాట్లాడుతూ.. నీట్ లీకేజీపై సీబీఐ దర్యాప్తు సరిగ్గా జరగడం లేదని, కాబట్టి సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. 4న తలపెట్టిన బంద్‌కు ప్రజల మద్దతు కోరారు. రాష్ట్రాలకే మెడికల్ ప్రవేశ పరీక్ష నిర్వహించుకునే అవకాశం ఇవ్వాలని విద్యార్థి జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు మాసంపల్లి అరుణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీవైఎల్, డీవైఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐవైఎఫ్ తదితర సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అడ్డగింత

» నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

భువనగిరి రూరల్, జూలై 2: భువనగిరిలో జడ్పీ సమావేశానికి హాజరైన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను బీజేపీ, బీజేవైఎం కార్యకర్తలు అడ్డుకునేందుకు చేసిన ప్రయత్నం ఉద్రిక్తతకు దారితీసింది. నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలని బీజేపీ, బీజేవైఎం కార్యకర్తలు భువనగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. అదే సమయంలో జడ్పీ కార్యాలయంలో సమావేశానికి హాజరవుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న రాకను గమనించిన బీజేపీ, బీజేవైఎం కార్యకర్తలు ఆయనను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో తీన్మార్ మల్లన్న, బీజేపీ కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. దీంతో పోలీసులు తీన్మార్ మల్లన్నను సమావేశ హాల్‌లోకి తీసుకువెళ్లారు. అయినప్పటికీ కార్యాలయ ప్రధాన గేటు వద్ద బీజేపీ, బీజేవైఎం కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తీన్మార్ మల్లన్న బయటకు రావాలని డిమాండ్ చేశారు. గేటును తోసుకుంటూ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు ఆందోళనకారులను చెదరగొట్టి అదుపులోకి తీసుకునేందుకు యత్నించారు. కొద్దిసేపటికి తీన్మార్ మల్లన్న బయటకు రావడంతో ఆయనకు వినతిపత్రం అందజేశారు.

బ్యారేజీలపై అబద్ధాలు

(మొదటిపేజీ తరువాయి)

సహకరించాలని సీఎం రేవంత్‌తోపాటు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించినా వారు తమ తీరు మార్చుకోలేదని తెలుస్తోంది. వాస్తవాలు కమిషన్‌కు చేరకుండా అడ్డుకోవడమే కాకుండా.. సాక్ష్యాలు అందించే విషయంలోనూ కలిసికట్టుగా ఒకే విషయం చెప్పాలని అధికారులు నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ప్రస్తుతం నీటిపారుదల శాఖలో కీలక బాధ్యతలు చూస్తున్న వారంతా గత ప్రభుత్వంలో చక్రం తిప్పినవారేనని, కమిషన్‌ను బురిడీ కొట్టించేలా అధికారులకు వారే సూచనలు ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి. వీరి సూచన మేరకే అధికారులు ఇంతకుముందు.. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌తోపాటు జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ నిపుణుల బృందం విచారణ సమయంలో కూడా కూడబలుక్కొని తప్పుడు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది.ఘోష్ కమిషన్ విచారణ ప్రారంభ మైన నాటి నుంచే కీలక అధికారులు ప్రణాళిక ప్రకారం వాస్తవాలను మరుగునపరిచే ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల పనుల్లో దాదాపు 150 మంది దాకా అధికారులు పాలుపంచుకోగా.. అందులో 33 మంది క్రియాశీలంగా వ్యవహరించినట్లు సమాచారం. బ్యారేజీల వైఫల్యానికి కారకులు వీరేనని, వాస్తవాలు వెలుగులోకి వస్తే తమ బండారం బయటపడుతుందనే వీరు కమిషన్ కళ్లకు గంతలు కట్టేందుకు ప్రయత్నిస్తున్నారని తెలుస్తోంది. అధికారులు కూడబలుక్కొని తమకు సమాచారం ఇవ్వకూడదని నిర్ణయించుకున్నట్లు గా జస్టిస్ ఘోష్ గతంలోనే గుర్తించి.. ఈ విషయమై ఉన్నతాధికారులను నిలదీసినట్లు సమాచారం. తమకు సమాచారం ఇవ్వరాదని వారు వాట్సాప్‌లో సమావేశాలు నిర్వహిస్తుంటే ఇక కమిషన్‌తో ఏం పని? అని ఆయన నిరసన వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ విషయం మంత్రి ఉత్తమ్ దృష్టికి వెళ్లడంతో ఆయన అధికారులను మందలించినట్లు సమాచారం. కమిషన్ ఛైర్మన్ హైదరాబాద్‌లో ఉన్న సమయంలో సమావేశాలు నిర్వహిస్తే ఊరుకునేది లేదని వార్నింగ్ ఇచ్చినట్లు తెలిసింది. అయితే శాఖను ప్రక్షాళన చేయకుండా, కీలక బాధ్యతల్లో ఉన్నవారిని తప్పించకుండా విచారణలో వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశాల్లేవని అధికారులు అంటున్నారు.

ప్రాజెక్టుల నిర్వహణకు నిధులేవి?

ఏటా రూ.600కోట్లపైనే అవసరం.. ఏడు నెలలుగా నిధుల మంజూరుకు బ్రేక్

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ కోసం కొన్నాళ్లుగా నిధులు విడుదల కావడం లేదు. గత డిసెంబరులోనే కొత్త ప్రభుత్వం ఏర్పడడం, ఆ తర్వాత వరుస ఎన్నికలు రావడంతో నిధుల మంజూరుకు బ్రేక్ పడింది. ఫలితంగా పలు ప్రాజెక్టుల పరిధిలో వానాకాలంలోగానే చేపట్టాల్సిన మరమ్మతులు సైతం నిలిచిపోయాయి. ప్రాజెక్టుల నిర్వహణకు సంబంధించిన నిధుల చెల్లింపులకు గ్రీన్‌చానల్ అమలు చేయాలని ప్రతిపాదనలు వచ్చినా.. గత ప్రభుత్వం అమలు చేయలేదు. ఫలితంగా గత డిసెంబరు నుంచి ఇప్పటి దాకా రూ.100కోట్ల మేర ఓ అండ్ ఎం పనులకు సంబంధించిన బిల్లులు ఆగిపోయాయి. ఏ శాఖకు లేని విధంగా నీటిపారుదల శాఖకు కార్యదర్శి, ప్రత్యేక కార్యదర్శులు ఉన్నా.. ఈ అంశంపై దృష్టి సారించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో 40 వరకు భారీ, మధ్యతరహా ప్రాజెక్టులు ఉండగా 42,000 కిలోమీటర్ల మేర ప్రధాన కాల్వలు, డిస్ట్రిబ్యూటరీ కాల్వలు ఉన్నాయి. ఇవీ కాక 900 కిలోమీటర్ల మేర పైప్ కెనాల్ వ్యవస్థ కూడా ఉంది. 138 పంప్‌హౌస్‌లు, 115దాకా సబ్‌స్టేషన్లు(నీటిపారుదలశాఖకు ప్రత్యేకంగా కట్టిన), 1.30లక్షల కెనాల్ నిర్మాణాలు(అక్విడెక్ట్‌లు, బ్రిడ్జిలు, సైఫన్లు) ఉన్నాయి. ప్రధాన డ్యామ్‌లు, రిజర్వాయర్ల పరిధిలోని గేట్లు, జనరేటర్లు, రోప్ వైర్లకు మరమ్మతులు, లీకేజీల నివారణ, కాలువల్లో కలుపు మొక్కల తొలగింపు, దెబ్బతిన్న కాలువల మరమ్మతులు, గేట్ల పెయింటింగ్, గ్రీజింగ్. ఇలాంటివన్నీ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్(ఓ అండ్ ఎం) కిందకే వస్తాయి. ఏటా వీటి నిర్వహణకు సుమారుగా రూ.600కోట్లు అవసరమవుతాయని అంచనాలున్నాయి. అయితే, గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంతోపాటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) తొలి త్రైమాసికంలోనూ ఓ అండ్‌ఎం కోసం నిధులు విడుదల చేయలేదు. దాదాపు రూ.100కోట్లకుపైగా బిల్లులు ఆగిపోవడంతో చిన్న కాంట్రాక్టర్లు విలవిల్లాడుతున్నారు.



ముఖం చాటేస్తోన్న పెద్ద కాంట్రాక్టర్లు

లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల వైఫల్యానికి ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్(ఓ అండ్ ఎం) లోపమే ప్రధాన కారణమని జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ తేల్చిన విషయం తెలిసిందే. నిర్వహణ పనుల ఖరీదు చిన్నదే అయినా... వాటిని విస్మరిస్తే కలిగే నష్టం వందల కోట్ల మేర ఉంటుందని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో అత్యంత కీలకమైన నాగార్జునసాగర్, శ్రీరామ్‌సాగర్, కడెం ప్రాజెక్టుల నిర్వహణ పనులకు టెండర్లు పిలిస్తే... బడా కాంట్రాక్టలెవరూ స్పందించలేదు. దీంతో చిన్న కాంట్రాక్టర్లతోనే పనులు చేయించాల్సిన పరిస్థితి నెలకొంది. గిట్టుబాటు కాకపోవడం, సకాలంలో చెల్లింపులు చేయకపోవడంతోనే పనులు చేసేందుకు పెద్ద కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని అధికారులు పేర్కొంటున్నారు.

అధికారాలున్నా నిధుల్లేవు

ప్రాజెక్టుల నిర్వహణ పనులను పెండింగ్‌లో పెట్టకూడదన్న ఉద్దేశంతోనే అధికారాలను వికేంద్రీకరిస్తూ నీటిపారుదల శాఖ గతంలోనే నిర్ణయం తీసుకుంది. ఇంజనీర్ ఇన్ చీఫ్(ఈఎన్‌సీ) స్థాయిలో రూ.కోటి, చీఫ్ ఇంజనీర్(సీఈ) రూ.50లక్షలు, సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్(ఎస్ఈ) రూ.25లక్షలు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ) రూ.5లక్షల మేర పనులకు అనుమతులు ఇచ్చే అధికారాన్ని కల్పించింది. నిర్వహణ పనుల కోసం ప్రత్యేకంగా విభాగాన్ని, ఒక ఈఎన్‌సీతో కూడిన టీమ్‌ను ఏర్పాటు చేసింది. యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టడానికి కొంత మేర నిధులను వీరి వద్ద అందుబాటులో ఉంచాలని నిర్ణయించింది. అయితే, ఇప్పుడు వీరి వద్ద ఒక్క పైసా కూడా లేదు. వీరి వద్ద నుంచి వచ్చిన బిల్లులు సైతం ఆగిపోవడం గమనార్హం. కొత్త ప్రభుత్వమైనా ఈ విధానాన్ని సంస్కరించి, ఓఅండ్‌ఎం బిల్లులను గ్రీన్‌చానల్‌లో పెట్టాలని పలువురు కోరుతున్నారు.

ఏడాదిన్నరలోగా సీతారామ ప్రాజెక్టు పూర్తి

» 2 లక్షల రైతు రుణమాఫీ చేసి తీరుతాం: పొంగులేటి

ఖమ్మం, జూలై 2 (ఆంధ్రజ్యోతి)/తిరుమలాయపాలెం/కూసుమంచి/డోర్నకల్: గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతూనే ఏడాదిన్నరలోగా సీతారామ ప్రాజెక్టు ఎత్తిపోతల పనులు పూర్తి చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పాలేరు లింక్ కెనాల్‌ను కూడా పూర్తిచేయించి గోదావరి జలాలతో పాలేరుకు అనుసంధానం చేస్తామన్నారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం, కూసుమంచి మండలాల్లో, మహబూబాద్ జిల్లా డోర్నకల్ మండలంలో జరుగుతున్న సీతారామ ప్రాజెక్టు కాలువ పనులను మంగళవారం మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు రాజీవ్‌సాగర్ పేరుతో 2లక్షల75 ఎకరాలకు ప్రాజెక్టు పనులు చేపడితే.. రాష్ట్ర విభజన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం సీతారామ పేరుతో రూ.18వేల కోట్లతో అంచనాలు వేసి రూ.8వేలు కోట్లు ఖర్చుపెట్టి ఒక్క ఎకరానికి కూడా నీరు ఇవ్వలేదన్నారు. ఆగస్టు 15నాటికి మొదటి లిఫ్టును ప్రారంభించి ఏన్కూరు లింక్ కెనాల్ ద్వారా లక్ష 52 వేల ఎకరాలకు సాగునీరందించే కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. రూ.2లక్షల రుణమాఫీ చేసి తీరుతామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

భద్రాచలంలో గ్రామ పంచాయతీలపై విలీనంపై సీఎం చొరవ తీసుకోవాలి: తుమ్మల

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఏపీలో విలీనమైన ఎటపాక, గుండాల, పురుషోత్తమపట్నం, కన్నాయిగూడెం, పిచుకలపాడు గ్రామ పంచాయతీలను భద్రాచలంలో కలిపేందుకు చొరవ తీసుకోవాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. మంగళవారం ఈ మేరకు లేఖ రాశారు. రాష్ట్ర విభజన సమయంలో ఏడు మండలాలు ఏపీలో విలీనమయ్యాయని గుర్తు చేశారు. భద్రాచలం పట్టణం మినహా మిగిలిన గ్రామాలను విలీనం చేశారని పేర్కొన్నారు. భద్రాచలం పట్టణ శివారు నుంచి ఏపీ కావటంతో డంపింగ్ యార్డుకు స్థలం లేదని తుమ్మల తెలిపారు. భద్రాచలం రామాలయ భూములు పురుషోత్తమపట్నంలో ఉండటంతో భూములపై ఆలయ అధికారుల పర్యవేక్షణకు పాలనాపరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. అందువల్ల ఆ ఐదింటిని భద్రాచలంలో కలపాలని తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

4 నుంచి గ్రూపు-4 దివ్యాంగ అభ్యర్థుల వైద్య ధ్రువపత్రాల పరిశీలన!

గ్రూపు-4 పోస్టులకు పోటీ పడుతున్న వికలాంగుల వైద్య పత్రాల పరిశీలన ప్రక్రియను 4వ తేదీ నుంచి 27 వరకు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. ఈ విషయాన్ని తెలంగాణ పబ్లిక్ సర్వీసు కమిషన్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూపు-4 పోస్టుల భర్తీలో భాగంగా ఇప్పటికే పరీక్ష ఫలితాలను వెల్లడించారు. అభ్యర్థులు ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను కూడా పూర్తి చేశారు. తాజాగా వికలాంగులైన అభ్యర్థులకు సంబంధించిన వైద్య ధ్రువపత్రాలను పరిశీలించాలని అధికారులు నిర్ణయించారు.



గవర్నర్‌తో స్పీకర్, ఛైర్మన్ భేటీ

హైదరాబాద్, జూలై 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గవర్నర్ రాధాకృష్ణన్‌ను శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ ప్రసాద్ కుమార్ మంగళవారం రాజ్‌భవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సన్మానించారు. గవర్నర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి కలిసిన మరుసటి రోజే శాసనమండలి ఛైర్మన్, శాసనసభ స్పీకర్ కలవడం చర్చనీయాంశమైంది. అయితే గవర్నర్ రాధాకృష్ణన్‌ను తాము మర్యాదపూర్వకంగానే కలిశామని శాసనసభ ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

ఈడీ విచారణకు హాజరైన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నేత, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) విచారణకు హాజరయ్యారు. అక్రమ మైనింగ్ కేసులో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిపై మనీలాండరింగ్ అభియోగాలు ఉన్నాయి. కేసు దర్యాప్తులో భాగంగా విచారణకు హాజరు కావాలని మహిపాల్ రెడ్డికి ఈడీ నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి మంగళవారం ఉదయం వెళ్లిన మహిపాల్ రెడ్డి ఈడీ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. మహిపాల్ రెడ్డిని విచారించిన అధికారులు ఆయన స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, ఆయన సోదరుడు మధుసూధన్ రెడ్డి కలిసి సంతోష్ శాండ్ అండ్ గ్రానైట్ సప్లయ్ అనే సంస్థ ద్వారా అక్రమ మైనింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకు సంబంధించి మహిపాల్ రెడ్డి, మధుసూధన్ రెడ్డి ఇళ్లు, కార్యాలయాలు సహా పది చోట్ల జూన్ 20న ఈడీ అధికారులు సోదాలు చేశారు. ఎమ్మెల్యే సోదరులు అక్రమ మైనింగ్‌తో రూ.300 కోట్లు కూడబెట్టారని, రాయల్టీ రూపంలో చెల్లించాల్సిన రూ. 39.08 కోట్లను ఎగవేశారని ఈడీ అధికారులు వెల్లడించిన సంగతి తెలిసిందే.


ఇటీవల కురుస్తున్న వర్షాలకు కూలిన ఓడేడు వంతెన 17-18 పిల్లర్ల మధ్యలో గర్డర్లు

మళ్లీ కూలిన ఓడేడు వంతెన గర్డర్లు

ముత్తారం, జూలై 2: పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఓడేడు, జయశంకర్ భూపలిపల్లి జిల్లా టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లి గ్రామాల మధ్యలో మానేరుపై నిర్మాణంలో ఉన్న వంతెన గర్డర్లు మంగళవారం రాత్రి కుప్పకూలాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు 17-18 పిల్లర్ల మధ్యలో ఉన్న రెండు గర్డర్లు ఒకవైపు వంగి నేలమట్టమయ్యాయి. గర్డర్లు కూలిన సమయంలో కింద ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ ఏడాది ఏప్రిల్ 22న రాత్రి ఇదే విధంగా 10-11 పిల్లర్ల మధ్యలో ఉన్న గర్డర్లు ఈదురుగాలులకు నేలమట్టమయ్యాయి. వంతెన లేకపోవడంతో రాకపోకల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డుపై వెళ్లేవారు గర్డర్లు కూలడంపై భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెన నిర్మాణాన్ని పటిష్ఠంగా, త్వరగా పూర్తిచేయాలని కోరుతున్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్ ఐదుగురు మావోయిస్టుల మృతి

మృతుల సంఖ్య పెరిగే అవకాశం

చర్ల, జూలై 2: దండకారణ్యంలో ఎన్‌కౌంటర్ల పరంపర కొనసాగుతూనే ఉంది. వరుస ఘటనల్లో భారీ సంఖ్యలో మావోయిస్టులు మరణిస్తున్నారు. తాజాగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లా అబూజ్‌మడ్ అడవుల్లో మంగళవారం ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎదురుకాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతిచెందారు. ఘటనా స్థలంలో మావోయిస్టులకు చెందిన తుపాకులు, మందుపాతరలు, ఇతర సామగ్రిని బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు బస్తర్ ఐజీ సుందర్ రాజన్ తెలిపారు. నారాయణపూర్ జిల్లా ఘమడి, కుడ్రేవాయి గ్రామాల పరిధిలో అబూజ్‌మడ్ అడవుల్లో మావోయిస్టుల సంచారం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దాంతో నారాయణపూర్, కొండెగావ్, కాంకేర్, దంతెవాడ జిల్లాలకు చెందిన డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, ఐటీబీపీ, బీఎస్ఎఫ్ బెటాలియన్ల నుంచి మొత్తం 1,400 మంది జవాన్లు సంయుక్త ఆపరేషన్ చేపట్టారు. నాలుగు జిల్లాల సరిహద్దుల నుంచి అబూజ్‌మడ్‌లోకి ప్రవేశించారు. ఈ క్రమంలో ఘమడి, కుడ్రేవాయి గ్రామాల మధ్య మావోయిస్టులు తారసపడడంతో ఇరు పక్షాల నడుమ కాల్పులు చోటుచేసుకున్నాయి. ఐదుగురు మావోయిస్టులు మృతిచెందారు. తప్పించుకున్న మావోయిస్టుల కోసం సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందని ఐజీ తెలిపారు. పోలీసులకు ఎలాంటి గాయాలు కాలేదన్నారు. కాగా, తప్పించుకున్న మావోయిస్టులు అడపాదడపా కాల్పులు జరుపుతున్నట్టు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతం గుట్టల్లో ఉండడంతో మృతదేహాల తరలింపు ఆలస్యమవుతున్నట్లు సమాచారం. ఈ ఏడాది జనవరి నుంచి బస్తర్ డివిజన్‌లోని 7 జిల్లాల్లో తుపాకుల మోత మోగుతోంది. వరుస ఘటనలతో బస్తర్.. వార్ జోన్‌గా మారింది. ఇప్పటి వరకు జరిగిన 9 ఎన్‌కౌంటర్లలో 136 మంది మావోయిస్టులు మృతిచెందారు. కాంకేర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 29 మంది మృతిచెందగా, అదే దేశ చరిత్రలో అతిపెద్ద ఎన్‌కౌంటర్‌గా నిలిచింది. బీజాపూర్, నారాయణపూర్, సుకుమా జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్లలో పదుల సంఖ్యలో మావోయిస్టులు మృతిచెందారు.

ఇద్దరు మావోయిస్టుల లొంగుబాటు

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ ఎదుట మంగళవారం ఇద్దరు మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో ఒకరు మహిళ, మరొకరు పురుషుడు ఉన్నారు. కుంట ఏరియా కమిటీలో గత 20 ఏళ్లుగా ఈ ఇద్దరు పనిచేశారని, వీరిపై 12కు పైగా కేసులు ఉన్నాయని ఎస్పీ తెలిపారు. వీరి ఒక్కొక్కరిపై రూ.5 లక్షల రివార్డు ఉంది. వీరికి ప్రభుత్వం నుంచి పునరావాసం కల్పిం చామని ఎస్పీ వివరించారు.

బీఆర్ఎస్‌కు మరో షాక్!

» మేడ్చల్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ మర్రి దీపిక కాంగ్రెస్‌లో చేరిక

మేడ్చల్ టౌన్, జూలై 2 : మేడ్చల్‌లో బీఆర్ఎస్ పార్టీకి మరోసారి గట్టి షాక్ తగిలింది. మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీమంత్రి మల్లారెడ్డికి సన్నిహితంగా ఉండే మేడ్చల్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ మర్రి దీపికనర్సింహారెడ్డి, ఆమె భర్త మర్రి నర్సింహారెడ్డి, పట్టణ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చెరువుకొమ్ము శేఖర్‌గౌడ్, కౌన్సిలర్లు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యురాలు గీత మధుకర్‌లతో కలిసి మంగళవారం మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు నక్క ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్లమెంట్ ఎన్నికల ముందు బీఆర్ఎస్‌కు చెందిన వైస్‌ఛైర్మన్‌తో సహా 13 మంది కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరిన విషయం విదితమే. తాజాగా మిగిలిన ఆరుగురు బీఆర్ఎస్ కౌన్సిలర్లలో ప్రస్తుతం ఛైర్‌పర్సన్‌తో సహా ముగ్గురు కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. ఛైర్‌పర్సన్‌ను వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన కొంతమంది కౌన్సిలర్లకు ఈ పరిణామం ఇబ్బందికరంగా మారింది. ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టడానికి గత కొద్ది రోజులుగా ప్రయత్నాలు చేస్తున్న కౌన్సిలర్లకు చెక్ పెట్టడానికే ఛైర్‌పర్సన్ దీపిక కాంగ్రెస్‌లో చేరినట్టు ప్రచారం జరుగుతోంది. ఛైర్‌పర్సన్ దీపికనర్సింహారెడ్డి భర్త మర్రి నర్సింహారెడ్డికి మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, నక్క ప్రభాకర్‌గౌడ్‌లతో ఉన్న పరిచయాలు పార్టీ మారేందుకు కలిసొచ్చాయి. మున్సిపాలిటీని అభివృద్ధి చేయాలన్న సంకల్పంతోనే పార్టీ మారామని ఛైర్‌పర్సన్ మర్రి దీపికనర్సింహారెడ్డి చెప్పారు.

చకచకా 'యాదాద్రి విద్యుత్కేంద్రం' పనులు

» ఓవైపు రాజకీయ రగడ.. మరోవైపు వేగంగా నిర్మాణం

» విద్యుదుత్పాదన దిశగా వైటీపీఎస్

» 4 నెలల్లో ప్రారంభోత్సవానికి అవకాశం

నల్లగొండ, జూలై 2 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద నిర్మిస్తున్న ఈ విద్యుత్కేంద్రంపై రాష్ట్రస్థాయిలో అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ దుమారం చెలరేగుతుండగా.. క్షేత్రస్థాయిలో నిర్మాణ పనులను మాత్రంగా చకచకా చేసేస్తున్నారు. 4 వేల మెగావాట్ల సామర్థ్యంతో నిర్మిస్తున్న ఈ ప్లాంటు పనులను బీహెచ్ఈఎల్ నిర్వహిస్తోంది. అక్టోబరు నెలాఖరుకు వాణిజ్య విద్యుదుత్పాదన చేపట్టాలని జెన్‌కో ఉన్నతాధికారులను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆదేశించడంతో పనులు వేగం పుంజుకున్నాయి. 800 మెగావాట్ల సామర్థ్యం గల రెండు యూనిట్లు దాదాపు విద్యుదుత్పాదనకు సిద్ధమవడంతో బాయిలర్ల లైటప్ ప్రక్రియ మే 15న విజయవంతంగా నిర్వహించారు. కీలకమైన బాయిలర్లు, చిమ్నీల నిర్మాణాలతో పాటు యాష్ పాండ్ పనులు నిర్దేశిత గడువులోగా పూర్తయ్యే అవకాశాలున్నాయి. మిగిలిన మూడు యూనిట్ల నిర్మాణాలు కూడా వేగంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే 70 శాతం మేర పనులు జరగ్గా.. వచ్చే మార్చి నెలాఖరుకు ముగుస్తాయని అంచనా వేస్తున్నారు. వీటితో పాటు యాష్ పాండ్ పనులు, వాటర్ సప్లయి, హైటెన్షన్ పవర్ సప్లయి టవర్ల నిర్మాణ పనులు వేగంగా సాగుతుండడంతో అక్టోబరు నెలాఖరుకు పూర్తవుతాయని జెన్‌కో ఎస్ఈ సమ్మయ్య వెల్లడించారు. ఈ ఏడాది చివరికల్లా పనులను పూర్తి చేయాలని జెన్‌కో అధికారులు కాంట్రాక్టర్లకు లక్ష్యం విధించడంతో ఆ మేరకు పనుల్లో వేగం కనిపిస్తోంది.


నల్లగొండ జిల్లా వీర్లపాలెం వద్ద నిర్మాణంలో ఉన్న యాదాద్రి థర్మల్ పవర్‌స్టేషన్

రైల్వేలైన్ నిర్మాణమే కీలకం

ఈ విద్యుత్కేంద్రానికి సమీపంలో బొగ్గు గనులు లేకపోవడంతో సింగరేణి, విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న బొగ్గును వినియోగించాలని నిర్ణయించారు. ఈ ప్లాంటుకు సగటున నెలకు 1 మిలియన్ యూనిట్ల బొగ్గు అవసరమవుతుంది. గనులు, పోర్టుల నుంచి బొగ్గును రైళ్ల ద్వారా తరలించాల్సి ఉంటుంది. ఈ ప్లాంటుకు సమీపంలో ఉన్న సికింద్రాబాద్-నడికుడి రైల్వేలైన్‌లోని విష్ణుపురం స్టేషన్ నుంచి ప్రత్యేకంగా తొమ్మిది కిలోమీటర్ల రైల్వేలైన్ నిర్మాణం చేపట్టారు. ఈ పనులు వేగంగానే కొనసాగుతున్నా పూర్తవడానికి కనీసం 4 నెలలు పడుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ లైన్ పూర్తయితే ఇటు సింగరేణి, అటు కృష్ణపట్నం పోర్టు నుంచి నేరుగా బొగ్గును సరఫరా చేస్తారు.

ఉద్యోగాల విషయంలో అస్పష్టత

విద్యుత్కేంద్రం ఏర్పాటులో భూములు, ఇళ్లు కోల్పోయిన వారికి ఇంటికో ఉద్యోగం లేదా అందుకు సమానమైన పరిహారమిస్తామని భూసేకరణ సమయంలో జెన్‌కో హామీ ఇచ్చింది. ఆ మేరకు జాబ్ కార్డులిస్తామని ప్రకటించింది. వీర్లపాలెం, కొత్తపల్లి, కపూర్‌తండా, మోదుగులకుంట తండాలకు చెందిన 524 మంది నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉంది. వీరందరికీ ప్లాంటు ప్రారంభమయ్యాక ఉద్యోగాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు జెన్‌కో అధికారులు పేర్కొంటుంటే, నిర్వాసితులు మాత్రం భూములు కోల్పోయిన 1560 కుటుంబాలకు చెందిన వారికి ఉద్యోగాలివ్వాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఉద్యోగాల సంఖ్యలో తేడాలపై జెన్‌కో, రెవెన్యూ అధికారులను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉద్యోగాలిస్తారని, విధివిధానాలు వస్తే తప్ప ఎందరికి ఉద్యోగాలు వస్తాయనే అంశంలో స్పష్టత ఇవ్వలేమని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే తమకు ఉద్యోగాలిచ్చే ప్రక్రియను కూడా చేపట్టాలని నిర్వాసితులు కోరుతున్నారు. భూపరిహారాల్లోనూ చాలా మందికి అన్యాయం జరిగిందని, వాటిని సరిచేయాలని కోరుతున్నారు.

అదానీ షేర్ల షార్ట్ సెల్లింగ్‌లో
కోటక్ మహీంద్రా బ్యాంక్ హస్తం

ఎఫ్‌పీఐ ద్వారా క్లయింట్ షార్ట్ పొజిషన్.. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ వెల్లడి

న్యూఢిల్లీ: అమెరికా షార్ట్ సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ మరో బాంబు పేల్చింది. ఈసారి ఏకంగా ఉదయ్ కోటక్ ప్రమోట్ చేసిన ప్రముఖ బ్యాంక్.. కోటక్ మహీంద్రా బ్యాంక్ పేరును రోడ్డు కీడ్చింది. అదానీ గ్రూప్ దందాపై తమ నివేదిక వివరాలను ముందే తెలుసుకున్న కింగ్‌డమ్ క్యాపిటల్ అనే తమ క్లయింట్.. అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏఈఎల్) కంపెనీ షేర్లలో షార్ట్ పొజిషన్ తీసుకుని రూ.183.24 కోట్ల (2.23 కోట్ల డాలర్లు) మేర లాభం పొందినట్టు తెలిపింది. కోటక్ మహీంద్రా బ్యాంక్ అనుబంధ సంస్థ.. కోటక్ మహీంద్రా ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ (కేఎంఐఎల్) విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్ట్‌మెంట్ (ఎఫ్‌పీఐ) విభాగమైన కే-ఇండియా ఆపర్చునిటీస్ ఫండ్ లిమిటెడ్ (కేఐఓఎఫ్ఎల్) ద్వారా కింగ్‌డమ్ క్యాపిటల్ ఈ షార్ట్ పొజిషన్ తీసుకున్నట్టు తెలిపింది.

అంతా అబద్ధం

కోటక్ మహీంద్రా బ్యాంక్ అనుబంధ సంస్థ కేఎంఐఎల్ ఈ ఆరోపణలను తోసిపుచ్చింది. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఎప్పుడూ తమ అనుబంధ సంస్థ కేఐఓఎఫ్ఎల్ క్లయింట్ కాదని తెలిపింది. తమ పెట్టుబడులన్నీ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ నిబంధనలకు అనుగుణంగానే ఉంటాయని స్పష్టం చేసింది. తమ క్లయింట్లు ఎవరూ ఇతరుల తరఫున పెట్టుబడులు పెట్టడాన్ని తాము అనుమతించమని స్పష్టం చేసింది. కేవైసీ ద్వారా పూర్తి వివరాలు తెలుసుకున్న తర్వాతే తాము ఏ సంస్థనైనా క్లయింట్‌గా చేర్చుకుంటామని తెలిపింది.

కోటక్ బ్యాంక్ షేరు డౌన్

ఈ వార్తలతో మంగళవారం కోటక్ మహీంద్రా బ్యాంక్ షేరు నష్టాలబాటపట్టింది. బీఎస్ఈలో ఈ షేరు 2.16 శాతం నష్టంతో రూ.1,769.60 వద్ద ముగిసింది. దీంతో బ్యాంక్ మార్కెట్ క్యాప్ రూ.7,777.33 కోట్లు తుడిచి పెట్టుకుపోయింది. ఇంట్రాడేలో కోటక్ బ్యాంక్ షేరు ఒక దశలో 3.98 శాతం నష్టంతో రూ.1,736.65 కనిష్ఠ స్థాయిని తాకింది.



హిండెన్‌బర్గ్‌కు సెబీ షోకాజ్ నోటీసులు

ఈ ఆరోపణల నేపథ్యంలో సెబీ.. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంస్థకు 46 పేజీల షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులపైనా హిండెన్‌బర్గ్ రీసెర్చ్ మండిపడింది. కనీసం కోటక్ మహీంద్రా పేరును కూడా ప్రస్తావించకుండా.. తమకు నోటీసులు జారీ చేయడం ఏమిటని ప్రశ్నించింది. ఉదయ్ కోటక్ ప్రముఖ వ్యక్తి కాబట్టే, సూచనప్రాయంగా కూడా సెబీ ఆయన పేరు ప్రస్తావించలేదని ఆరోపించింది. ఈ విషయంలోనూ సెబీ ప్రముఖ వ్యాపారవేత్తల కొమ్ముకాస్తోందని ఆరోపించింది. అదానీ గ్రూప్ షేర్ల దందాపైనా, తాము సమగ్ర వివరాలు ఇచ్చినా సెబీ తూతూమంత్రంగా దర్యాప్తు జరిపి అదానీ గ్రూప్‌ను ఒడ్డున పడేసిందని హిండెన్‌బర్గ్ ఆరోపించింది. దేశంలో శక్తివంతులైన వ్యక్తుల అవినీతి, మోసాలపై ఎవరూ నోరు మెదపకుండా భయపెట్టేలా సెబీ షోకాజ్ నోటీసు ఉందని దుయ్యబట్టింది.

ŠKODA | VOLKSWAGEN
ŠKODA AUTO Volkswagen India Private Limited

ఫోక్స్‌వ్యాగన్ ఇండియాలో వాటా విక్రయం!

కొనుగోలుకు మహీంద్రా ఆసక్తి

న్యూఢిల్లీ: ప్రపంచంలో అతిపెద్ద ఆటోమొబైల్ కంపెనీ ఫోక్స్‌వ్యాగన్ తన భారత వ్యాపార అనుబంధ విభాగమైన స్కోడా ఆటో ఫోక్స్‌వ్యాగన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ (ఎస్ఏవీడబ్ల్యూఐపీఎల్)లో వాటా విక్రయించే యోచనలో ఉన్నట్లు తెలిసింది. కాగా, ఈ కంపెనీలో వాటా కొనుగోలుకు దేశీయ వాహన సంస్థ మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) ఆసక్తిగా ఉన్నట్లు సమాచారం. "భారత మార్కెట్లో 20 ఏళ్లుగా కార్యకలాపాలు సాగిస్తున్నాం. ఇప్పటికీ మా వ్యాపారాన్ని గాడిన పెట్టలేకపోయాం. అందుకే, కొత్త వ్యూహాన్ని ఎంచుకోవాలనుకుంటున్నాం. సరైన స్థానిక భాగస్వామి లభిస్తే, వారి ద్వారా నేర్చుకోవడంతో పాటు ఒకరి ద్వారా మరొకరం లబ్ధి పొందే అవకాశం ఉంటుంద"ని స్కోడా ఆటో గ్లోబల్ సీఈఓ క్లాస్ జెల్మెర్ అన్నారు. ఫోక్స్‌వ్యాగన్ భారత కార్యకలాపాలను ప్రస్తుతం ఈయనే పర్యవేక్షిస్తున్నారు. ఫోక్స్‌వ్యాగన్ గ్రూప్ భారత మార్కెట్లో వ్యాపార విస్తరణ కోసం ఇప్పటివరకు 200 కోట్ల డాలర్ల మేర పెట్టుబడులు పెట్టడంతో పాటు పలు మోడళ్లను విడుదల చేసింది. అయినప్పటికీ, ఇక్కడి మార్కెట్లో కంపెనీ విజయం సాధించలేకపోయింది. ప్రస్తుతం ఈ గ్రూప్ భారత్‌లో ఫోక్స్‌వ్యాగన్, స్కోడా బ్రాండ్ కార్లను విక్రయిస్తోంది. ఇతర బ్రాండ్లతో పోలిస్తే తన కార్ల ధర అధికం కావడంతో ఈ కంపెనీ సగటు భారత కస్టమర్‌కు చేరువ కాలేకపోయింది.

విద్యార్థుల కోసం ఐసీఐసీఐ సఫీరో ఫారెక్స్ కార్డ్



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగంలోని ఐసీఐసీఐ బ్యాంక్.. విదేశాల్లో ఉన్నత విద్యకు వెళ్తున్న విద్యార్థుల కోసం సఫీరో ప్రీపెయిడ్ ఫారెక్స్ కార్డ్‌ను ప్రత్యేకంగా విడుదల చేసింది. వీసా నిర్వహణలోని ఈ కార్డు విద్యార్థుల విద్యా సంబంధిత లావాదేవీలు నిర్వహించేందుకు ఇది సహాయకారిగా ఉంటుంది. అడ్మిషన్ ఫీజు, కోర్సు సంబంధిత ఫీజులు; ప్రయాణం, ఆహారం, నిత్యావసరాలు సహా రోజువారీ ఖర్చులను విద్యార్థులు ఈ కార్డు ద్వారా చెల్లించవచ్చు. ఎలాంటి క్రాస్ కరెన్సీ మార్క్ అప్ చార్జీలు లేకుండా 15 కరెన్సీల్లో లావాదేవీలు నిర్వహించుకునే వెసులుబాటు ఈ కార్డు ద్వారా లభిస్తుంది.

మాస్‌చిప్‌తో సీ-డాక్ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): పూర్తి దేశీయ పరిజ్ఞానంతో పనిచేసే హై పెర్‌ఫార్మెన్స్ కంప్యూటర్ల అభివృద్ధికి సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ కంప్యూటింగ్ (సీ-డాక్) సిద్ధమైంది. ఈ కంప్యూటర్లకు అవసరమైన ఏయూఎం ఆధారిత ప్రాసెసర్ల డిజైన్, డెవలప్‌మెంట్ కోసం హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే మాస్‌చిప్ టెక్నాలజీస్, జపాన్ కేంద్రంగా పనిచేసే సోఫియోనెక్స్ ఇంక్ అనే కంపెనీతో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. తైవాన్ సెమీకండక్టర్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ లిమిటెడ్ (టీఎస్ఎంసీ) తయారు చేసే 5ఎంఎం చిప్ టెక్నాలజీ ఆధారంగా ఈ ప్రాసెసర్లను అభివృద్ధి చేస్తారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,380 ▲	66,350 ▲	95,500 ▲
ముంబై	71,692 ▼	65,670 ▼	88,015 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



3వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	540
వరంగల్	527	గోదావరి	535
చిత్తూరు	573	విశాఖపట్నం	550

డజను గుడ్లు రూ. 72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	107	విజయవాడ	118
వరంగల్	107	గుంటూరు	118
కరీంనగర్	107	ఒంగోలు	118
మహబూబ్‌నగర్	107	చిత్తూరు	120
కర్నూలు	107	నెల్లూరు	120
విశాఖపట్నం	119	అనంతపురం	118
గోదావరి	118		

ఈ ఏడాది 4,000 కొలువులు

హెక్సావేర్

న్యూఢిల్లీ: ముంబై కేంద్రంగా ఉన్న ఐటీ కంపెనీ హెక్సావేర్ నియామకాల బాట పట్టింది. దేశ, విదేశాల్లోని తమ కేంద్రాల్లో పని చేసేందుకు ఈ సంవత్సరం కొత్తగా 6,000 నుంచి 8,000 మందిని నియమించుకోనుంది. ఇందులో 4,000 మందిని దేశంలోని వివిధ కేంద్రాల్లో పని చేసేందుకు నియమిస్తామని కంపెనీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (గ్లోబల్ హెడ్ టాలెంట్ సప్లయ్ చైన్) రాజేశ్ బాలసుబ్రమణియన్ తెలిపారు. హెక్సావేర్.. హైదరాబాద్, నోయిడా, కోయంబత్తూర్, డెహ్రాడూన్, బెంగళూరుతో పాటు అమెరికా, కెనడా, యూకే, మెక్సికో, పోలాండ్‌లోనూ ఐటీ కేంద్రాలను నిర్వహిస్తోంది. ప్రస్తుతం ఈ కేంద్రాల్లో 30,000 మంది పని చేస్తున్నారు.

20-21 తేదీల్లో అమెజాన్ ప్రైమ్ డే సేల్స్

న్యూఢిల్లీ: ఈ నెల 20-21 తేదీల్లో ప్రైమ్ డే సేల్‌ను నిర్వహించనున్నట్లు అమెజాన్ ఇండియా ప్రకటించింది. ఈ సందర్భంగా అమెజాన్ ప్రైమ్ సభ్యులకు అన్ని వస్తువులపై ప్రత్యేక డిస్కౌంట్‌లు, ఆఫర్లు ఉంటాయని తెలిపింది. ప్రైమ్ ఖాతాదారులు 450 బ్రాండ్స్‌కు చెందిన వేలాది వస్తువులను ప్రత్యేక ఆఫర్లు, డిస్కౌంట్లలో కొనుగోలు చేయవచ్చు. ఈ వస్తువులు అదే రోజు లేదా మరుసటి రోజు ప్రైమ్ సభ్యులకు డెలివరీ చేస్తారు. కాగా దేశవ్యాప్తంగా ఉన్న వినియోగదారులకు కూడా అదే రోజు లేదా మరుసటి రోజున డెలివరీ చేయాలని చూస్తున్నట్లు తెలిపింది.

ఫినోమ్ చేతికి టైడీ

వచ్చే ఏడాది కాలంలో 1,000 నియామకాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హ్యూమన్ రీసోర్సెస్ (హెచ్ఆర్) టెక్నాలజీ సంస్థ ఫినోమ్.. మానవ వనరుల విభాగంలోని స్టార్టప్ టైడీని కొనుగోలు చేసింది. అయితే డీల్ విలువను మాత్రం కంపెనీ వెల్లడించలేదు. ఈ రెండు సంస్థలు అమెరికా కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్నాయి. కాగా ఫినోమ్.. అమెరికాతో పాటు హైదరాబాద్, విశాఖపట్నంలో కార్యాలయాలను నిర్వహిస్తుండగా టైడీ బెంగళూరు కేంద్రంగా సెంటర్‌ను నిర్వహిస్తోంది. ఈ కొనుగోలుతో హెచ్ఆర్ కార్యకలాపాలను మరింత సులభతరం చేయటంతో పాటు నైపుణ్యం కలిగిన ఉద్యోగులను ఎంపిక చేసుకునేందుకు అవసరమైన టెక్నాలజీలను అందించే వీలు కలుగుతుందని ఫినోమ్ సీఈఓ మహి బైరెడ్డి తెలిపారు. ప్రస్తుతం కంపెనీ ఉద్యోగుల సంఖ్య 1,600గా ఉందని, ఒక్క హైదరాబాద్ సెంటర్‌లోనే 900 ఉద్యోగులు పనిచేస్తుండగా విశాఖలో 150 వరకు ఉద్యోగులు ఉన్నారని ఫినోమ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శివానంద్ ఆకెళ్ల తెలిపారు. కాగా వచ్చే ఏడాది కాలంలో కొత్తగా మరో 1,000 మందిని నియమించుకోవాలని చూస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం కంపెనీకి 700కు పైగా క్లయింట్లు ఉన్నారని తెలిపారు.

సరికొత్త గరిష్ఠాల నుంచి స్వల్ప నష్టాల్లోకి..

సెన్సెక్స్ 35 పాయింట్లు డౌన్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం ఆరంభ ట్రేడింగ్‌లో సరికొత్త జీవితకాల గరిష్ఠాలను తాకినప్పటికీ.. చివరికి స్వల్ప నష్టాలతో సరిపెట్టుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల మిశ్రమ సంకేతాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు గరిష్ఠాల వద్ద లాభాల స్వీకరణకు పాల్పడటం ఇందుకు కారణమైంది. సెన్సెక్స్ ట్రేడింగ్ ఆరంభంలోనే 379.68 పాయింట్ల లాభంతో 79,855.87 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. కానీ, ఆరంభ లాభాలను ఎక్కువ సేపు నిలబెట్టుకోలేకపోయింది. రోజంతా లాభనష్టాల మధ్య తీవ్ర ఊగిసలాటలకు లోనైన సూచీ చివరికి 34.74 పాయింట్ల నష్టంతో 79,441.45 వద్ద ముగిసింది. ఆరంభంలో 94.4 పాయింట్లు ఎగబాకి 24,236.35 వద్ద సరికొత్త జీవితకాల గరిష్ఠాన్ని నమోదు చేసిన నిఫ్టీ.. చివరికి 18.10 పాయింట్ల నష్టంతో 24,123.85 వద్ద స్థిరపడింది.

బ్రోకింగ్ షేర్లు ఢమాల్

స్టాక్ బ్రోకింగ్ సేవలందించే కంపెనీల షేర్లన్నీ భారీగా పతనమయ్యాయి. ఏంజిల్ వన్ షేరు 8.72 శాతం క్షీణించగా.. జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ 6.83 శాతం, మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ 4.19 శాతం, ఎస్ఎంసీ గ్లోబల్ సెక్యూరిటీస్ 2.81 శాతం, దౌలత్ ఆల్గోటెక్ 2.28 శాతం నష్టపోయాయి. స్టాక్ ఎక్స్ఛేంజీలు, స్టాక్ బ్రోకింగ్ కంపెనీలతో పాటు మిగతా మార్కెట్ మౌలిక సదుపాయాల సంస్థలు ఇకపై తమ సభ్యుల నుంచి ట్రేడింగ్ వాల్యూమ్ లేదా కార్యకలాపాల ఆధారంగా భిన్న చార్జీలకు బదులు ఏకరీతి, సమాన రుసుమును వసూలు చేయాలని సెబీ ఆదేశించడం ఇందుకు కారణమైంది. దాంతో మార్కెట్లో బ్రోకింగ్ డిస్కౌంట్లకు తెరపడినట్లైంది.

ఆఫీసర్స్ చాయిస్ షేరు తొలిరోజు 13% అప్

ఆఫీసర్ చాయిస్ విస్కీ బ్రాండ్ తయారీ సంస్థ అలైడ్ బ్లెండర్స్ తన షేర్లను మంగళవారం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.281తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు 13.20 శాతం ప్రీమియంతో రూ.318.10 వద్ద లిస్టయింది. ఒకదశలో 15.44 శాతం వరకు పెరిగినప్పటికీ, చివరికి 13.11 శాతం లాభంతో రూ.317.85 వద్ద ముగిసింది. గతవారంలో ముగిసిన ఐపీఓకు 23.49 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది.

డివైన్ పవర్ 284 శాతం ప్రీమియంతో లిస్టింగ్

ఇన్సులేటెడ్ వైర్లు, స్ట్రిప్స్ తయారీదారు డివైన్ పవర్ ఎనర్జీ లిస్టింగ్‌కు అపూర్వ స్పందన లభించింది. కంపెనీ తన షేర్లను ఎన్ఎస్ఈ ఎమర్జ్ ప్లాట్‌ఫామ్‌లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.40తో పోలిస్తే, కంపెనీ షేరు 287.50 శాతం ప్రీమియంతో రూ.155 వద్ద లిస్టయింది. తొలి రోజు ట్రేడింగ్ నిలిచే సరికి, 284 శాతం లాభంతో రూ.150 వద్ద ముగిసింది.

స్పోర్ట్స్

జింబాబ్వే టూర్‌కు జితేష్, సుదర్శన్, హర్షిత్

తొలి రెండు టీ20లకు దూబే, జైస్వాల్, శాంసన్ దూరం

న్యూఢిల్లీ: జింబాబ్వే టూర్‌కు ఎంపిక చేసిన భారత జట్టులో మరో మూడు మార్పులు చోటు చేసుకొన్నాయి. ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా జరిగే తొలి రెండు మ్యాచ్‌లకు ఇదివరకే జట్టుకు ఎంపికైనా సంజూ శాంసన్, శివమ్ దూబే, యశస్వి జైస్వాల్ స్థానంలో సాయి సుదర్శన్, జితేష్ శర్మ, హర్షిత్ రాణాలను ఎంపిక చేశారు. టీ20 వరల్డ్‌కప్ విన్నింగ్ జట్టులో శాంసన్, దూబే, జైస్వాల్ సభ్యులు. వీరు నేరుగా జింబాబ్వే వెళ్లి జట్టుతో కలవాల్సి ఉన్నా.. బార్బడోస్‌లో హరికేన్ కారణంగా అక్కడే ఉండిపోయారు. దీంతో మిగతా ఆటగాళ్లతో కలసి ఈ ముగ్గురు కూడా ప్రత్యేక విమానంలో బుధవారం భారత్ రానున్నారు. ఆ తర్వాత విశ్వ విజేతలను ప్రధాని నరేంద్ర మోదీ సత్కరించే కార్యక్రమంలో ఈ ముగ్గురు కూడా పాల్గొంటారు. ఆ తర్వాతే వీరు జింబాబ్వే సిరీస్ కోసం హరారే వెళతారు. ఈ నేపథ్యంలో వీరి స్థానంలో తొలి రెండు మ్యాచ్‌లకు సుదర్శన్, జితేష్, హర్షిత్‌లను ఎంపిక చేశారు. ఇక.. రింకూ, ఖలీల్ అహ్మద్ కూడా టీమిండియాతోనే ఉన్నా.. వారి స్థానాలను మాత్రం భర్తీ చేయలేదు. కాగా, ఈనెల 6 నుంచి జరిగే సిరీస్ కోసం భారత యువ జట్టు మంగళవారం జింబాబ్వే బయల్దేరింది. ఇక, జింబాబ్వే సిరీస్‌కు జట్టు కెప్టెన్‌గా ఎంపికైన శుభ్‌మన్ గిల్ అమెరికాలో జట్టుతో కలువనున్నాడు.

గైక్వాడ్‌ను ఆదుకోండి!

బీసీసీఐకి పాటిల్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ: టీ20 వరల్డ్‌కప్ నెగ్గిన భారత జట్టుకు రూ.125 కోట్ల నజరానాను బీసీసీఐ ప్రకటించడంపై మాజీ ఆటగాడు సందీప్ పాటిల్ హర్షం వ్యక్తం చేశాడు. అదే సమయంలో టీమిండియా మాజీ కోచ్ అన్షుమన్ గైక్వాడ్ చికిత్సకు సాయం చేయాల్సిందిగా పాటిల్ కోరాడు. ఏడాది కాలంగా గైక్వాడ్ బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడని తెలిపాడు. లండన్‌లో చికిత్స చేయించుకొంటున్న గైక్వాడ్ నిధులలేమితో ఇబ్బందులుపడుతున్నాడనీ, అతడిని బీసీసీఐ ఆదుకోవాల్సిన అవసరం ఉందని అన్నాడు. భారత్ తరఫున 40 టెస్టులు, 15 వన్డేలు ఆడిన 71 ఏళ్ల గైక్వాడ్.. సచిన్ కెప్టెన్సీ సమయంలో జట్టు కోచ్‌గానూ పనిచేశాడు.



వెంకన్న సేవలో స్మృతీ మంధాన

తిరుమల (ఆంధ్రజ్యోతి): భారత మహిళల క్రికెట్ జట్టు వైస్ కెప్టెన్ స్మృతీ మంధాన మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. కుటుంబసమేతంగా వచ్చిన ఆమె స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసింది.

రోహిత్ ఫోన్ చేసుండకపోతే..



బ్రిడ్జ్‌టౌన్ (బార్బడోస్): గతేడాది రోహిత్ శర్మ తనకు ఫోన్ చేసుండకపోతే, ఇవాళ ఈ చరిత్రాత్మక విజయంలో తాను భాగస్వామిని అయ్యేవాడిని కాదని రాహుల్ ద్రవిడ్ అన్నాడు. 'నిరుడు నవంబరులో జట్టు వన్డే వరల్డ్‌కప్ ఓడడంతో చీఫ్ కోచ్‌గా తప్పుకోవాలని అనుకున్నా. కానీ, రోహిత్ నాకు ఫోన్ చేసి.. టీ20 ప్రపంచకప్ వరకైనా కొనసాగాలని కోరాడు. అయితే, మొదట కొంత తటపటాయించినా, రోహిత్ చెప్పిన మాటలకు కొనసాగేందుకు ఒప్పుకున్నా. ఆరోజు ఆ ఫోన్ రాకుంటే గనక ఈరోజు ఇంతటి అపురూపమైన క్షణాలు నాకు దక్కుండేవి కావు. అందుకే, రోహిత్‌కు ధన్యవాదాలు చెబుతున్నా' అని ద్రవిడ్ చెప్పిన వీడియోను బీసీసీఐ పోస్ట్ చేసింది.

అందుకే మట్టి తిన్నా..: రోహిత్

టీ20 వరల్డ్‌కప్ ఫైనల్ గెలిచిన తర్వాత పిచ్‌పై ఉన్న మట్టిని తినడంపై రోహిత్ మాట్లాడుతూ.. 'ఆ పిచ్ (బార్బడోస్)పై వరల్డ్‌కప్ ట్రోఫీ సాధించాం. జీవితాంతం ప్రత్యేకంగా గుర్తుండిపోయే ఆ పిచ్‌ను నాలో భాగం చేసుకోవాలనుకున్నా. అందుకే ఆ మట్టిని నోట్లో వేసుకున్నా' అని చెప్పాడు.

టీఓఏలో ఎన్నికల రగడ



గందరగోళంగా ఎన్నికల షెడ్యూల్ ప్రకటన

- కొన్ని క్రీడా సంఘాల ఓట్లు తొలగింపు
- హైకోర్టుకు అసోసియేషన్ ప్రతినిధులు
- అధ్యక్ష రేసులో జితేందర్ రెడ్డి, మహేష్ గౌడ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): రాష్ట్రంలో క్రీడారంగం అభివృద్ధిలో పెద్దన్న పాత్ర పోషించాల్సిన తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ (టీఓఏ).. ఆ బాధ్యతను పక్కకి పెట్టి వర్గ పోరుతో వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. గత పదేళ్లలో టీఓఏ ప్రభుత్వంతో చర్చలు జరిపి క్రీడా సంఘాలకు రావాల్సిన గ్రాంట్ల విడుదలలో కానీ, ప్రతిభావంతులైన క్రీడాకారులకు సర్కార్ నుంచి ప్రోత్సాహకాలు ఇప్పించడంలో పూర్తిగా విఫలమైంది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్జ్) నుంచి టీఓఏకు, రాష్ట్రంలో పలు క్రీడా సంఘాలకు గుర్తింపు లేని కారణంగా స్పోర్ట్స్ కోటా కింద విద్యా ప్రవేశాల్లో క్రీడాకారులకు దక్కాల్సిన సీట్లు కూడా లభించక గత పదేళ్లలో వేల మంది క్రీడాకారులు నష్టపోయారు. ఇలా ఏ విధంగానూ క్రీడాకారులకు ఊతమివ్వలేకపోతున్న టీఓఏ.. ముఠా రాజకీయాల వివాదాలతో, భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) నుంచి వచ్చే నిధులను స్వాహా చేయడంలో మాత్రం ముందుంటున్నదన్న విమర్శలను మూటగట్టుకుంటోంది. తాజాగా టీఓఏ బ్యాంకు ఖాతాలోని సుమారు రూ.8 లక్షలు వ్యక్తిగత అకౌంట్లలోకి తరలించడంపైన, సంఘం నిధులను దుర్వినియోగం చేసినట్టు కేసులు కూడా నమోదయ్యాయి. జాతీయ స్పోర్ట్స్ కోడ్‌ను రాష్ట్రంలో 2020 నుంచి అమలు చేస్తున్నా దానిని టీఓఏ పట్టించుకోకుండా ఇష్టానుసారం వ్యవహరిస్తోందని పలువురు క్రీడాకారులు ఆరోపిస్తున్నారు. అస్మదీయుల దగ్గరకు వచ్చేసరికి నిబంధనలన్నీ గాలికి వదిలేసి, తమను ప్రశ్నించేవారిపై మాత్రం సవాలక్ష రూల్స్ పెట్టి ప్రస్తుత టీఓఏ పెద్దలు వేధిస్తున్నారని ఇటీవల ఐదు క్రీడా సంఘాలు హైకోర్టును ఆశ్రయించాయి.

నిస్తేజంగా ఒలింపిక్ సంఘం

ఈ ఫిబ్రవరిలో టీఓఏ ప్రస్తుత కార్యవర్గం పదవీ కాలం ముగిసింది. 2020లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రోద్బలంతో అధ్యక్షుడిగా నెగ్గిన ప్రభుత్వ ఐటీశాఖ కార్యదర్శి జయేష్ రంజన్ కనీసం బాధ్యతలు కూడా తీసుకోకుండానే నాలుగేళ్ల కాలయాపన చేయడంతో, తాత్కాలిక అధ్యక్షుడిగా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాలచారిని పెట్టి బండి నెట్టుకొచ్చారు. టీఓఏను పదవుల కోసమే వాడుకుంటున్నారు తప్ప, క్రీడా రంగం మేలు కోసం పని చేసే వ్యవస్థగా నడిపించడంలో ప్రస్తుత కార్యవర్గం పూర్తిగా విఫలమైందన్న విమర్శలు చెలరేగుతున్నాయి. 70 ఏళ్లు నిండిన వారు, వరుసగా రెండు పర్యాయాలు కార్యవర్గ సభ్యులుగా పని చేసిన వారు పోటీ చేయకూడదనే స్పోర్ట్స్ కోడ్ నిబంధన లున్నా.. వాటిని భేఖాతరు చేస్తూ ఇష్టానుసారం టీఓఏను నడిపిస్తున్నారు.

ఎన్నికల నిర్వహణపై వివాదం..

ప్రస్తుత కార్యవర్గ పదవి కాలం ముగియడంతో ఈ ఏడాది మే 19న ఎన్నికల నోటిఫికేషన్‌ను గందరగోళంగా విడుదల చేసి, జూన్ 9వ తేదీన ఎలక్షన్ నిర్వహించాలని కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్ ప్రయత్నించారన్న ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో తమకు వ్యతిరేకంగా ఉన్న పదికి పైగా క్రీడా సంఘాల ఓట్లను తొలగించారని సమాచారం. మరికొన్ని క్రీడా సంఘాల ప్రతినిధులపై ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హత వేటు వేశారట. దీంతో వివాదం ముదిరి హైకోర్టుకు చేరింది. న్యాయస్థానం ఎన్నికల ప్రక్రియను నిలుపదల చేస్తూ స్టే ఇచ్చింది. అయితే, నోటిఫికేషన్ ఇచ్చాక జగదీశ్వర్ యాదవ్ వర్గం.. అధ్యక్ష పదవికి మాజీ ఎంపీ జితేందర్ రెడ్డితో నామినేషన్ వేయించింది. కాగా, జితేందర్ రెడ్డికి 70 ఏళ్లు నిండడంతో స్పోర్ట్స్ కోడ్‌కు విరుద్ధంగా ఆయనను ఎలా పోటీకి అనుమతిస్తారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మరోవైపు స్క్వాష్ సంఘం నుంచి టీఓఏ అధ్యక్ష బరిలోకి దిగుదామనుకున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ గౌడ్‌పై ప్రత్యర్థి వర్గం నామినేషన్ వేయనీయకుండా అనర్హత వేటు వేసింది. దీంతో టీఓఏలో వర్గ పోరు తారస్థాయికి చేరుకుంది. క్రీడా మంత్రిత్వ శాఖను సాక్షాత్తూ సీఎం రేవంత్ రెడ్డి పర్యవేక్షిస్తుండడంతో రాష్ట్రంలో క్రీడారంగం అభివృద్ధి పథంలో నడిపించేందుకు టీఓఏను గాడిన పెట్టాలని పలు క్రీడా సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

పారిస్ ఒలింపిక్స్‌కు జ్యోతి!



న్యూఢిల్లీ: తెలుగు అథ్లెట్ జ్యోతి ఎర్రాజీ పారిస్ ఒలింపిక్స్‌కు ఎంపికవడం ఖాయమైనట్లే. ప్రపంచ అథ్లెటిక్స్ సమాఖ్య మంగళవారం ప్రకటించిన వరల్డ్ ర్యాంకింగ్స్ కటాఫ్ ప్రకారం 100 మీటర్ల హర్డిల్స్‌లో జ్యోతి, షాట్‌పుట్‌లో అభా ఖతువా భారత్ నుంచి విశ్వక్రీడలకు అర్హత సాధించిన అథ్లెట్ల జాబితాలో నిలిచారు. పారిస్‌లో మొత్తం 40 మంది అథ్లెట్లు పోటీపడే తన ఈవెంట్‌లో జ్యోతికి ర్యాంకింగ్స్ కటాఫ్‌లో 34వ స్థానం దక్కింది. పారిస్ క్రీడలకు ఎంపికైన అథ్లెట్ల తుది జాబితాను ఈనెల 7న అధికారికంగా ప్రకటిస్తారు. ఇదే జరిగితే, ఒలింపిక్స్‌లో 100 మీటర్ల హర్డిల్స్‌లో పోటీపడనున్న భారత అథ్లెట్‌గా జ్యోతి రికార్డుకెక్కనుంది.

వింబుల్డన్ చాంపియన్ అవుట్



- వొంద్రుసోవాకు జెస్సికా షాక్
- రుబ్లెవ్ ఇంటిబాట
- జొకోవిచ్, స్వియటెక్, రిబకినా శుభారంభం

లండన్: గ్రాస్‌కోర్టు గ్రాండ్‌స్లామ్ వింబుల్డన్‌లో ఆరంభంలోనే సంచలనం నమోదైంది. మహిళల డిఫెండింగ్ చాంపియన్ మార్కెటా వొంద్రుసోవా తొలిరౌండ్లోనే వెనుదిరిగింది. స్పెయిన్‌కు చెందిన 21 ఏళ్ల జెస్సికా బొజాస్ మనెరో 6-4, 6-2తో 6వ సీడ్ వొంద్రుసోవా (చెక్ రిపబ్లిక్)కు షాకిచ్చి సంచలనం సృష్టించింది. 2019 ఫ్రెంచ్ ఓపెన్ రన్నరప్, టోక్యో ఒలింపిక్స్ రజత పతక విజేత వొంద్రుసోవా.. గంటా ఏడు నిమిషాల పాటు సాగిన ఏకపక్ష పోరులో యువ కెరటం జెస్సికా ధాటికి ఏ దశలోనూ పోటీ ఇవ్వలేక వరుససెట్లలో ఓటమిపాలైంది. గతేడాది అన్‌సీడెడ్ హోదాలో ఇక్కడ విజేతగా నిలిచి చరిత్ర సృష్టించిన 25 ఏళ్ల వొంద్రుసోవా.. ఈ పరాజయంతో చెత్త రికార్డును మూటగట్టుకుంది. ఓపెన్ ఎరాలో స్టెఫీగ్రాఫ్ (1994లో) తర్వాత ఆల్ ఇంగ్లండ్ క్లబ్‌లో తొలిరౌండ్లోనే ఓడిన డిఫెండింగ్ చాంప్‌గా వొంద్రుసోవా నిలిచింది. ఇక, కెరీర్‌లో మూడోసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో తలపడుతున్న83వ ర్యాంకర్ జెస్సికాకు టాప్-10 క్రీడాకారిణిపై గెలవడం ఇదే తొలిసారి. మిగతా స్టార్ క్రీడాకారిణుల్లో టాప్‌సీడ్ స్వియటెక్ 6-3, 6-4తో కెనిన్‌పై, 2వ సీడ్ కొకొ గాఫ్ 6-1, 6-2తో కరోలిన్‌పై, 4వ సీడ్ రిబకినా 6-3, 6-1తో ఎలెనా గాబ్రియెల్ రూస్‌పై, 5వ సీడ్ జెస్సికా పెగులా 6-2, 6-0తో అష్లిన్ క్రూగర్‌పై గెలిచి రెండోరౌండ్‌కు దూసుకెళ్లారు.

జొకోవిచ్ అలవోకగా: ఏడుసార్లు చాంపియన్ జొకోవిచ్ వింబుల్డన్‌ను గ్రాండ్‌గా శుభారంభం చేయగా.. 6వ సీడ్ ఆండ్రీ రుబ్లెవ్ ఆదిలోనే ఇంటిబాట పట్టాడు. 25వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ వేటలోనున్న 2వ సీడ్ జొకోవిచ్ 6-1, 6-2, 6-2తో క్వాలిఫయర్ విట్ కోప్రివాను అలవోకగా ఓడించాడు. ఇక, తొలిసారి గ్రాండ్‌స్లామ్ మ్యాచ్ ఆడుతున్న ఫ్రాన్సిస్కో కొమెసన (అర్జెంటీనా) 6-4, 5-7, 6-2, 7-6(5)తో రష్యాకు చెందిన 6వ సీడ్ ఆండ్రీ రుబ్లెవ్‌కు ఝలకిచ్చి రెండోరౌండ్‌లో అడుగుపెట్టాడు. 4వ సీడ్ జ్వెరెవ్, 9వ సీడ్ మినార్, 11వ సీడ్ సిట్సిపాస్ రెండోరౌండ్ చేరారు. కాగా, భారత ఆటగాడు సుమిత్ నగాల్ తొలిరౌండ్లోనే అవుటయ్యాడు.

భళా.. కోస్టా

'యూరో' క్వార్టర్స్‌కు పోర్చుగల్
షూటౌట్‌లో స్లోవేనియాపై గెలుపు



ఫ్రాంక్‌ఫర్ట్ (జర్మనీ): గోల్ కీపర్ డీగో కోస్టా అద్భుత ప్రదర్శనతో పోర్చుగల్ యూరో ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ క్వార్టర్స్‌కు చేరుకొంది. సోమవారం రాత్రి జరిగిన రౌండ్-16 పోరులో పోర్చుగల్ 0-0 (3-0)తో స్లొవేనియాపై షూటౌట్‌లో గెలిచింది. నిర్ణీత, అదనపు సమయంలో ఇరు జట్లూ గోల్ చేయలేకపోవడంతో.. ఫలితం షూటౌట్‌కు దారి తీసింది. ఇందులో పోర్చుగల్ తొలి మూడు కిక్‌లను గోల్స్‌గా మలచగా.. స్లొవేనియా ప్లేయర్లు కొట్టిన మూడు కిక్‌లను కీపర్ కోస్టా అద్భుతంగా అడ్డుకొన్నాడు. తమకంటే బలహీనమైన స్లొవేకియాపై పోర్చుగల్ ఒక్క గోల్ కూడా చేయక పోవడం తీవ్ర విమర్శలకు దారితీసింది. స్టార్ ప్లేయర్ రొనాల్డో ఏకంగా స్పాట్ కిక్‌ను మిస్ చేశాడు. ఈ నేపథ్యంలో అతడు ఫ్యాన్స్‌ను క్షమించాలని వేడుకున్నాడు. ఇక, మ్యాచ్ ముగిసిన తర్వాత ఇదే తన ఆఖరి యూరో కప్ అని రొనాల్డో ప్రకటించాడు. మరో మ్యాచ్‌లో నెదర్లాండ్స్ 3-0తో రొమేనియాను చిత్తుచేసి క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకెళ్లింది.



ఖజానాకు ఆదాయమెలా?

» నేడు కీలక శాఖల ఉన్నతాధికారులతో సీఎం భేటీ

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదాయాన్ని ఆర్జించడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి బుధవారం కీలక శాఖల ఉన్నతాధికారులతో సమావేశం కానున్నారు. ప్రభుత్వానికి ఆదాయాన్ని అందించే ఎక్సైజ్, రిజిస్ట్రేషన్, వాణిజ్య పన్నులు, రవాణా, రెవెన్యూ శాఖలతోపాటు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శులు, ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఈ సమావేశం జరగనుంది. ఆదాయ వనరులు పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలను సూచించాలని ఇప్పటికే సీఎంవో నుంచి కీలక శాఖలకు ఆదేశాలు వెళ్లాయి. దీంతో వివిధ శాఖలు ఆదాయ మార్గాలను సూచించనున్నాయి. రైతుబంధు, రుణమాఫీ పథకాలకు అవసరమైన నిధుల సేకరణపైనా ఈ సమావేశంలో చర్చించనున్నారు.

అధిష్ఠానం నుంచి రాని పిలుపు!

» పీసీసీ చీఫ్, మంత్రివర్గ విస్తరణపై సస్పెన్స్ వీడేనా..!?

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ కొత్త చీఫ్ నియామకం, మంత్రివర్గ విస్తరణపై చర్చించేందుకు ఢిల్లీకి రావాలంటూ మంగళవారం పొద్దు పోయేంత వరకూ సీఎం రేవంత్‌రెడ్డికి అధిష్ఠానం నుంచి పిలుపు రాలేదు. ఆయన బుధవారం యథాప్రకారంగా సమీక్ష సమావేశాలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో టీపీసీసీకి నూతన చీఫ్ నియామకం, మంత్రివర్గ విస్తరణలపై కొనసాగుతున్న సస్పెన్స్.. ఇప్పట్లో వీడుతుందా.. ఆషాఢం రాకముందే కొత్త మంత్రులు కొలువుదీరుతారా? అన్నది ఆసక్తికరంగా మారింది. వాస్తవానికి టీపీసీసీ చీఫ్ నియామకం, మంత్రివర్గ విస్తరణపై తుది నిర్ణయం తీసుకునేందుకు మంగళ, లేదా బుధవారాల్లో ఢిల్లీకి రావాలంటూ సీఎం రేవంత్ రెడ్డికి అధిష్ఠానం నుంచి పిలుపు రావచ్చునన్న సమాచారం ఉంది. అయితే మంగళవారం రాత్రి వరకూ పిలుపు రాలేదు. దీంతో టీపీసీసీ చీఫ్, మంత్రివర్గ విస్తరణలపై తుది నిర్ణయం తీసుకునేందుకు బుధవార ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, అగ్రనేత రాహుల్‌గాంధీతో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి ఉత్తమ్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీల భేటీ జరుగుతుందా.. లేదా? అన్నదానిపై స్పష్టత లేదు. అయితే బుధవారం రాత్రి, లేదా గురువారం ఈ సమావేశం జరిగేందుకూ ఆస్కారం ఉందని, నిర్ణయం జరిగిన మరుసటి రోజే కొత్త మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమమూ ఉంటుందని పార్టీ ముఖ్యనేతలు తెలిపారు. సామాజిక సమకూర్పులో టీపీసీసీ చీఫ్ నియామ కానికీ, మంత్రివర్గ విస్తరణ ఒకదానికి ఒకటి ముడిపడి ఉన్నందున.. ఈ సమావేశం తర్వాతనే స్పష్టత వస్తుందని పార్టీ వర్గాల సమాచారం.

ఈ నెల మూడో వారంలో బడ్జెట్ సమావేశాలు?

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల మూడో వారంలో రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు ప్రారంభం అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నెల 22న కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో రాష్ట్రంలో బడ్జెట్ సమావేశాలు 23న ప్రారంభమయ్యే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాల సమాచారం. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి వచ్చే నిధుల అంచనాల ఆధారంగా రాష్ట్ర బడ్జెట్‌ను రూపొందించుకునేందుకు వీలుగా ఈ నెల 3వ వారంలో బడ్జెట్ సమావేశాలను ప్రారంభించుకునే ఆలోచన ప్రభుత్వం చేస్తోంది. 23న సమావేశాలు ప్రారంభమైనా.. కేంద్రం నుంచి వచ్చే నిధుల అంచనాల ఆధారంగా రాష్ట్ర బడ్జెట్‌ను తీర్చిదిద్దేందుకు మరో వారం రోజులు పడుతుందని, ఆ వారం పాటు బిల్లులు, ఇతర అంశాలపైన సభ నడుస్తుందని ప్రభుత్వ పెద్దల సమాచారం.

ఏపీ ఆధీనంలోని ఆర్ అండ్ బీ ఆస్తుల స్వాధీనానికి కసరత్తు: మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధీనంలో ఉన్న హైదరాబాద్‌లోని ఆర్ అండ్ బీ ఆస్తులను స్వాధీనం చేసుకుంటామని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఇరు రాష్ట్రాల సీఎంలు రేవంత్ రెడ్డి, చంద్రబాబు జూలై 6న సమావేశం కానున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆర్ అండ్ బీ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్‌లో ఏపీ ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఆర్ అండ్ బీ ఆస్తుల స్వాధీనంపై చర్చించారు. లేక్ వ్యూ అతిథి గృహం, మినిస్టర్స్ క్వార్టర్స్ ఆదర్శనగర్, బషీర్ బాగ్, కుందన్‌బాగ్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న ఎమ్మెల్యేల నివాస సముదాయాలు, గ్రీన్‌ల్యాండ్స్, మంజీర అతిథి గృహాలు, ఇతర ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు అవసరమైన సమాచారం, ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

ఆమెను తొలగించకుంటే వైద్యసేవలు బంద్!

» తక్షణమే విధుల నుంచి తప్పించండి

» లేకుంటే నిరవధిక సమ్మెకు దిగుతాం

» డెంటల్ కాలేజీ ప్రిన్సిపాల్‌పై డీఎంఈకి ఫిర్యాదు

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ప్రభుత్వ దంత కళాశాల ప్రిన్సిపాల్‌ను తక్షణమే విధుల నుంచి తొలగించాలని ఆ కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వెంటనే ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణను తొలగించకుంటే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం డీఎంఈ డాక్టర్ వాణిని కలిసి సమ్మెకు సంబంధించిన నోటీసులు అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ.. ఆస్పత్రులకు వచ్చే రోగులు, విద్యార్థులు, అధ్యాపకులను అకారణంగా వేధిస్తోందని డీఎంఈకు ఫిర్యాదు చేశారు. రోగులకు, స్టాఫ్‌కు ఉపయోగపడే లిఫ్ట్‌ను కూడా నిలిపివేయించారని ఆరోపించారు. ఆమె మానసిక స్థితి సరిగా లేదన్నారు. పరిపాలనా విధుల నిర్వహణలో ఆమె వైఫల్యం చెందారని, గతంలో విజయవాడ డెంటల్ కాలేజీలో పనిచేసినప్పుడు ఇదే తరహాలో ప్రవర్తిస్తే.. ఆమెను బోధనేతర విభాగాలకు పంపారని గుర్తు చేశారు. అఖరికి పరీక్షలకు హాజరయ్యే విషయంలోనూ చివరి సంవత్సరం విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారని వాపోయారు. 50 ఏళ్ల పైబడిన అటెండర్స్‌ను కారణం లేకుండా ఆమె తొలగించడంతో వారంతా లేబర్ కోర్టుకు వెళ్లిన విషయాన్ని డీఎంఈ దృష్టికి తీసుకువచ్చారు. డీఎంఈను కలసిన వారిలో మెడికల్ జేఏసీ ఛైర్మన్ బొంగు రమేశ్, డాక్టర్ రంగా, డెంటల్ కాలేజీ సీనియర్ అధ్యాపకులు చందులాల్ తదితరులున్నారు.

సమాచారం ఇవ్వండి.. క్యాష్ తీసుకెళ్లండి

» డ్రగ్స్‌పై సమాచారం ఇచ్చిన వారికి పోలీసు నజరానా

» 87126 71111 నంబర్‌కు ఫోన్ లేదా మెసేజ్ చేయాలని పిలుపు

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపే అంశంలో ప్రజలను భాగస్వాములను చేయాలని పోలీసు శాఖ నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా గంజాయి, డ్రగ్స్‌పై తమకు సమాచారం ఇచ్చిన వారికి నగదు బహుమతులు ఇస్తామని తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో(టీజీన్యాబ్) డైరెక్టర్ సందీప్ శాండిల్య చెప్పారు. 100 కిలోల కంటే ఎక్కువ గంజాయి నిల్వ, సరఫరాకు సంబంధించి సమాచారం ఇచ్చిన వారికి రూ.2లక్షలు రివార్డుగా ఇస్తామని తెలిపారు. పోలీసులకు సమాచారం ఇచ్చిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. ప్రజలు 87126 71111 నెంబరుకు ఫోన్ లేదా మెసేజ్ రూపంలో గంజాయి, డ్రగ్స్‌పై సమాచారం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కాగా, ఈ ఏడాది తొలి 5నెలల్లో టీజీన్యాబ్ అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా 788కేసులు నమోదు చేశారు. ఆయా కేసుల్లో 1580 మంది నిందితులను అరెస్టు చేశారు. నిందితుల నుంచి 74.73 కోట్లు విలువైన గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు.

'రైతుభరోసా' ఉపసంఘం చైర్మన్‌గా భట్టి

(మొదటిపేజీ తరువాయి)

వ్యవహరించే ఈ కమిటీ.. రైతుభరోసా పథకం మార్గదర్శకాలపై అధ్యయనం చేస్తుంది. ఈ కమిటీకి రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్ రావు కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. అసెంబ్లీ సమావేశాల్లోనూ రైతుభరోసాపై చర్చించాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ఈనెల 15 నాటికి నివేదిక ఇవ్వాలని సబ్‌కమిటీకి క్యాబినెట్ భేటీలోనే సూచించారు. రాళ్లు, రప్పలు, కొండలు, గుట్టలు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, రహదారులు, సాగుకు యోగ్యంలేని భూములకు రైతుభరోసా ఇవ్వకూడదని ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం పీఏసీఎస్‌ల్లో భేటీలు నిర్వహించి రైతుల అభిప్రాయాలను సేకరిస్తున్నారు. ఈ క్రమంలో రైతుసంఘాల నేతలు, ఇతరవర్గాల అభిప్రాయాలు తీసుకొని మార్గదర్శకాలు రూపొందించే బాధ్యతలు ఉపసంఘానికి అప్పగించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ బోర్డులు

» విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు

» క్వాడ్ జెన్ కంపెనీ ప్రతినిధులతో సీఎం చర్చ

» పెట్టుబడులు పెట్టాలని నోకియా కంపెనీకి ఆహ్వానం

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యను కార్పొరేట్ స్థాయిలో బలోపేతం చేయాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. క్వాడ్ జెన్ కంపెనీతో కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ బోర్డులు(ఇంటెరాక్టివ్ వైట్ బోర్డులు) ఏర్పాటు చేయనున్నామని, విద్యార్థులకు రూ. 20 వేలలోపు విలువగల ల్యాప్‌టాప్‌లు ఉచితంగా అందించనున్నామని సీఎం తెలిపారు. క్వాడ్ జెన్ కంపెనీ ప్రతినిధులతో సీఎం మంగళవారం సచివాలయంలో సమావేశమయ్యారు. పథకం అమలుపై చర్చించారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు సామాజిక బాధ్యతలో భాగంగా కంపెనీలు ముందుకు రావాలని కోరారు. అలాగే మరో సమావేశంలో నోకియా కంపెనీ ప్రతినిధులతో సీఎం సమావేశం అయ్యారు. పారిశ్రామికాభివృద్ధిలో ముందంజలో ఉన్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని ముఖ్యమంత్రి నోకియా ప్రతినిధులను కోరారు. నోకియా గ్లోబల్ హెడ్ మార్టిన్ నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధుల బృందం మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కలిశారు. ఈ సందర్భంగా పెట్టుబడులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సీఎం వివరించారు. ఈ భేటీలో నోకియా గ్లోబల్ బిజినెస్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ వెంకట్ ఎస్. నారాయణయ్య, సేల్స్ గ్లోబల్ హెడ్ మయాంక్ భాటియా, ఎంటర్‌ప్రైజ్ సొల్యూషన్స్ ఇండియా సేల్స్ మేనేజర్ రాకేశ్, క్వాడ్జెన్ చైర్మన్ సీఎస్ రావు, యూఎస్ఎం చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ పద్మజ, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.



నోకియా గ్లోబల్ హెడ్ మార్టిన్‌తో సీఎం రేవంత్

డ్రగ్స్, సైబర్ నేరాల నియంత్రణలో

సినీ నటులకూ బాధ్యత

తారాగణంతో అవగాహన వీడియోలు ప్రదర్శించాలి

» అలా చేస్తేనే సినిమా టికెట్ ధరల పెంపునకు అనుమతి

» అతిపెద్ద సమస్యలు సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలే: సీఎం రేవంత్

» 'డ్రగ్స్' నష్టాలపై చిరంజీవి వీడియా భేష్ అంటూ అభినందనలు





హైదరాబాద్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సైబర్ సెక్యూరిటీ బ్యూరో కొత్త వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): "డ్రగ్స్, సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కల్పించే బాధ్యత సినీ పరిశ్రమపైనా ఉంది. థియేటర్లలో సినిమా ప్రదర్శనకు ముందు.. సైబర్ నేరాలు, డ్రగ్స్ దుష్పలితాలపై అవగాహన కల్పించే విధంగా తారాగణంతో ఒకటిన్నర లేదా రెండు నిమిషాల నిడివితో రూపొందించిన వీడియోలనూ ప్రదర్శించాలి. ఉచితంగా ఈ వీడియోలను ప్రదర్శిస్తేనే సినిమా టికెట్ ధరల పెంపునకు, షూటింగులకు అనుమతులు ఇస్తాం" అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోకు 14 కార్లు, 54 ద్విచక్ర వాహనాలు, తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో(టీజీ న్యాబ్)కు 27 కార్లు, 59 ద్విచక్ర వాహనాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. డీజీపీ రవి గుప్తా, ఇంటెలిజెన్స్ చీఫ్ శివధర్‌రెడ్డి, టీజీ న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. సినిమా అనేది వందల కోట్ల రూపాయల పెట్టుబడితో చేసే వ్యాపారమని, వారి వ్యాపారాన్ని తాము కాదనమని, అదంతా ప్రజల నుంచి వచ్చేదనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. ప్రస్తుతం సమాజాన్ని పట్టి పీడిస్తున్న అతి పెద్ద సమస్యలు సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలేనని అన్నారు. ఒకప్పుడు హత్య, అత్యాచారాలు పెద్ద నేరాలుగా ఉండేవని, హత్యతో ఒకరే చనిపోతారని, కానీ డ్రగ్స్ ప్రభావంతో ఒక తరం పనికిరాకుండాపోతుందని పేర్కొన్నారు. డ్రగ్స్‌తో కలిగే నష్టాలపై ఇటీవల ప్రముఖ నటుడు చిరంజీవి ఓ వీడియో తీసి పంపారని, ఆయనను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు సీఎం తెలిపారు. చిరంజీవిని ఇతర నటులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. డ్రగ్స్, సైబర్ నేరాలపై టీవీలు, పత్రికల్లోనూ అప్పుడప్పుడు ఉచితంగా ప్రకటనలు వేయాలని కోరారు. గత ప్రభుత్వ పదేళ్ల నిర్లక్ష్యంతో గంజాయి వినియోగం గల్లీగల్లీలో పెరిగిపోయిందని ఆరోపించారు. కళాశాలలతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ గంజాయి అమ్మకాలు సాగుతుండటం ఆందోళనకర విషయమన్నారు. ఉన్నత వర్గాల వారే కాకుండా మధ్యతరగతి, పేద వర్గాలకు చెందిన వారు సైతం గంజాయికి బానిసలు అవుతున్నారని, ఇటీవల హత్యలు, చిన్న పిల్లలపై దాడులకు కారణమైన వారిని పరిశీలిస్తే వారిలో అత్యధికులు గంజాయికి బానిసలైనవారిననే తేలిందని చెప్పారు. ఆధునిక కాలంలో అందివచ్చిన సాంకేతికతను, నైపుణ్యాలను నేరగాళ్లు వినియోగించుకుంటున్నారని, వారిని ఎదుర్కోవాలంటే అంతకుమించిన నైపుణ్యాలు, సాంకేతికతను పోలీసులు అందిపుచ్చుకోవాలని సూచించారు.

సమర్థంగా పనిచేస్తే పదోన్నతులు

గతంలో ఉగ్రవాదం, తీవ్రవాదంపై పోరాటం చేసిన పోలీసు సిబ్బందికి పదోన్నతులు ఇచ్చేవారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రస్తుతం సైబర్ నేరాలు, డ్రగ్స్ సరఫరాను అరికట్టడంలో సమర్థంగా పనిచేసే పోలీసు సిబ్బందికి పదోన్నతులు ఇచ్చే బాధ్యత తమ ప్రభుత్వం తీసుకుంటుందని చెప్పారు. సైబర్ నేరగాళ్లను పట్టుకున్న వారికి, సైబర్ నేరాలు జరగకుండా అడ్డుకున్న వారికి, డ్రగ్స్ సరఫరా చేసే వారిని పట్టుకునే సిబ్బందికి పదోన్నతులు కల్పించే విధివిధానాలు తయారు చేయాలని డీజీపీ రవిగుప్తాను ఆదేశించారు. ఇందుకోసం శాసనసభలో చర్చించి అవసరమైన చట్టం చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

రాజకీయ నిఘా కంటే..

నేరాల నియంత్రణకే ప్రాధాన్యమివ్వాలి

» నేతలకు అవసరానికి మించిన భద్రత వద్దు

» సైనిక్ స్కూల్ తరహాలో ప్రత్యేక స్కూల్: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రాజకీయ వ్యవస్థపై నిఘా తగ్గించి నేరాల నియంత్రణపై నిఘా పెంచాలని పోలీసు అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. ప్రజలు ఎన్నుకుంటేనే తాము ప్రజాప్రతినిధులుగా వచ్చామని, తమకు మితిమీరిన భద్రత అవసరం లేదని, ఎవరికి ఎంత అవసరమో అంతే భద్రత కల్పించాలన్నారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్ల పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఇన్‌స్పెక్టర్.. ఆపైస్థాయి అధికారులతో బంజారాహిల్స్‌లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం మంగళవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ సరిహద్దుల్లో సైన్యం మాదిరిగా రాష్ట్రంలోకి డ్రగ్స్ రాకుండా పోలీసు పహారా ఉండాలన్నారు. పోరాటాలతో ఏర్పడ్డ తెలంగాణలో పదేళ్లలో ఆశించిన ఫలితాలు రాకపోవడంతో గంజాయి వంటి మాదకద్రవ్యాలకు బానిసలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సైనిక్ స్కూళ్ల తరహాలో రాష్ట్రంలో పోలీసుల పిల్లల కోసం ప్రత్యేక స్కూల్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. తానూ పోలీసు కుటుంబం నుంచే వచ్చానని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. తన అన్న భూపాల్ రెడ్డి వనపర్తిలో కానిస్టేబుల్‌గా పనిచేసి తనను చదివించారని, తన అన్న పెంపకంతోనే తాను ఈ రోజు ముఖ్యమంత్రి స్థాయికి వచ్చానని చెప్పారు. తెలంగాణ పోలీసులకు జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు ఉందని పేర్కొన్నారు.

పైసలతో పోస్టింగ్‌లు తెచ్చుకోవద్దు

పైసలు ఖర్చు చేసి పోస్టింగ్‌లోకి వస్తే.. వారిపై ఏసీబీ నిఘా పెడుతుందని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. సామర్థ్యం, పనితీరుతోనే పోలీసు సిబ్బంది బదిలీలు కోరుకోవాలన్నారు. సామర్థ్యం ఉన్నవారిని తమ ప్రభుత్వం గుర్తిస్తుందని చెప్పారు. అందుకు సందీప్ శాండిల్య ఉదాహరణ అని పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ అక్రమాలకు చెల్లు

» ఇక నుంచి దరఖాస్తుల స్వీకరణ ఆన్‌లైన్‌లోనే

» వెబ్‌సైట్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జూలై 2(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి(సీఎంఆర్ఎఫ్)లో అక్రమాలకు అవకాశం లేకుండా ప్రభుత్వం కొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఇక నుంచి ఈ పథకం కోసం వచ్చే దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారానే స్వీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించి సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ రూపొందించిన ప్రత్యేక వెబ్‌సైట్ cmrf.telangana.gov.in ను సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం సచివాలయంలో ప్రారంభించారు. సీఎంఆర్ఎఫ్ నిధులు పక్కదారి పట్టకుండా పారదర్శకంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ వెబ్‌సైట్‌ను రూపొందించారు. గత ప్రభుత్వ హయాంలో సీఎంఆర్ఎఫ్ నిధులు పక్కదారి పెట్టిన నేపథ్యంలో ఈ విధానాన్ని తీసుకొచ్చారు. సీఎంఆర్ఎఫ్ కోసం తమ వద్దకు వచ్చే వారి వివరాలు తీసుకుని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు తమ సిఫారసు లేఖను జతచేసి కొత్తగా రూపొందించిన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అప్లికేషన్‌లో దరఖాస్తుదారుల బ్యాంక్ అకౌంట్ నంబర్ తప్పనిసరిగా ఇవ్వాలి. అప్‌లోడ్ చేసిన తర్వాత ఒక కోడ్ ఇస్తారు. దాని ఆధారంగా ఒరిజినల్ మెడికల్ బిల్లులను సచివాలయంలో అందజేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ ద్వారా అప్లికేషన్‌ను సంబంధిత ఆస్పత్రులకు పంపించి నిర్ధారించుకుంటారు. అన్ని వివరాలు సరిగ్గా ఉంటే సీఎంఆర్ఎఫ్ అప్లికేషన్‌ను ఆమోదించి చెక్ సిద్ధం చేస్తారు. చెక్‌పై తప్పనిసరిగా దరఖాస్తుదారుడి అకౌంట్ నంబర్‌ను ముద్రిస్తారు. ఆ తర్వాత ప్రజాప్రతినిధులు చెక్‌ను స్వయంగా దరఖాస్తుదారులకు అందజేస్తారు. ఈ నెల 15 తర్వాత సీఎంఆర్ఎఫ్ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా మాత్రమే స్వీకరిస్తారు. కాగా, సీఎంఆర్ఎఫ్‌లో అక్రమాలను అరికట్టడానికి సర్కారు కసరత్తు మొదలుపెట్టిందని 'ఆంధ్రజ్యోతి' ముందే చెప్పింది. సీఎంఆర్ఎఫ్ వ్యవస్థలో పారదర్శకత, మెరుగైన సేవల కోసం ప్రత్యేక వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని జూన్ 8న 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో కథనం ప్రచురితమైంది.

ఎన్టీఆర్ మార్గ్‌లో పనులు కాంట్రాక్టర్ల కోసమా?

» ఎప్పుడూ ఏదో ఒకటి చేస్తుంటారెందుకు?

» అధికారులను ప్రశ్నించిన సీఎం రేవంత్

హైదరాబాద్ సిటీ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): 'ఎన్టీఆర్ మార్గ్‌లో ఎప్పుడూ పనులు చేస్తారెందుకు? రోడ్లు, ఫుట్‌పాత్‌ల నిర్మాణమో, మరమ్మతో, ఏదో ఒకటి జరుగుతూనే ఉంటుంది. ఎందుకలా? నిజంగా ఆ స్థాయిలో పనులు చేయాల్సిన అవసరముందా? కాంట్రాక్టర్ల కోసం చేస్తారా?' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సచివాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో అధికారులను అడిగినట్లు తెలిసింది. సచివాలయానికి వచ్చే క్రమంలో తాను పరిశీలిస్తూ ఉంటానని, ఏదో ఒక పని జరుగుతూనే ఉంటుందని ఆయన వారితో అన్నట్లు సమాచారం. హెచ్ఎండీఏ పరిధిలో ఆ రహదారి ఉండడం సంబంధిత అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఓ పోలీస్ అధికారి స్పందించినట్టు తెలిసింది. వినాయక నిమజ్జనం ఇతరత్రా అవసరాల కోసం ఫుట్‌పాత్‌ల తొలగింపు, రహదారి మరమ్మతు వంటి పనులు చేస్తుంటారని ఆయన చెప్పినట్టు సమాచారం.

కలెక్టర్లు కదలాలి!

(మొదటిపేజీ తరువాయి)

అందించాలన్నారు. దేశంలోనే అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండేలా తెలంగాణను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఐఏఎస్‌లపైనే ఉందన్నారు. తమ శాఖల పని తీరును మెరుగుపరుచుకునేందుకు అవసరమైతే అధికారులు, సిబ్బందిని ప్రక్షాళన చేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రజలకు ఉపయోగపడే కొత్త కార్యక్రమాలు, వినూత్న ఆలోచనలతో ముందుకు సాగాలని, వాటిని ఎప్పటికప్పుడు నేరుగా సీఎంవోతో పంచుకోవాలన్నారు. ఒక్కో అధికారి ఒక్కో ఫ్లాగ్‌షిప్ ఐడియాను రెండు వారాల్లో ప్రభుత్వానికి తెలియజేయాలని ఆదేశించారు.

అనుభవాన్ని చాటుకోండి..

ఉమ్మడి రాష్ట్రం నుంచి పలువురు ముఖ్యమంత్రులతో పనిచేసిన అనుభవశీలురైన అధికారులు ఇప్పటికీ కీలక విభాగాల్లో ఉన్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వారు ఎప్పటికప్పుడు ప్రభుత్వ ప్రాథమ్యాలను గుర్తించి, తమ పనితీరును చాటుకోవాలన్నారు. ప్రజలకు మేలు జరిగే పనులు చేయాలనే సంకల్పంతో విధులు నిర్వహించాలని, ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి లక్ష్యంగా పని చేయాలని సూచించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి వంద రోజుల్లోనే.. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీల్లో ఐదింటిని అమలు చేసిందని చెప్పారు. తర్వాత వంద రోజుల పాటు ఎన్నికల కోడ్ కారణంగా ప్రభుత్వ కార్యక్రమాలు, పనులు నిలిచిపోయాయని, ఇకపై అధికారులు విధిగా పరిపాలనపైనే దృష్టి సారించాలని ఆదేశించారు. ఐఏఎస్‌లు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, ప్రతి రోజూ నిర్దేశిత సమయంలోగా సచివాలయంలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. తమ విభాగం పనితీరును పర్యవేక్షించేందుకు వారానికి ఒకరోజు విధిగా జిల్లాలకు క్షేత్ర పర్యటనకు వెళ్లాలని, నెలకోసారి అన్ని జిల్లాల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించాలని ఆదేశించారు. సంబంధిత విభా గం చేపట్టిన కార్యక్రమాలు, జరుగుతున్న పనుల పురోగతిని తెలుసుకోవాలని సూచించారు. తమ ప్రభుత్వానికి వ్యక్తిగతంగా అధికారులపై రాగద్వేషాలేమీ లేవని, పని తీరు ఆధారంగానే ఉన్నత అవకాశాలుంటాయని చెప్పారు. బాగా పని చేసేవారికి ప్రోత్సాహకాలుంటాయని ప్రకటించారు. లేనిపోని సొంత నిర్ణయాలతో ప్రభుత్వానికి చెడ్డపేరు తేవద్దని, ముఖ్యమంత్రి కార్యాలయం ఇచ్చే సలహాలు, సూచనలు పాటించాలన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్

వారానికో జిల్లాలో పర్యటిస్తా: సీఎం రేవంత్

త్వరలోనే వారానికో జిల్లాలో పర్యటిస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులతోపాటు క్షేత్ర స్థాయిలో వివిధ కార్యక్రమాల అమలు తీరును స్వయంగా పరిశీలిస్తానన్నారు. అక్కడి ప్రజలను కలుసుకునేలా తన పర్యటన ఉంటుందని తెలిపారు. త్వరలోనే జిల్లా పర్యటనల షెడ్యూలును విడుదల చేస్తామన్నారు. మొత్తం 29 విభాగాలకు చెందిన ఐఏఎస్ అధికారులు హాజరైన ఈ సమావేశంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సీఎంవో ముఖ్యకార్యదర్శి శేషాద్రి పాల్గొన్నారు.

213 మంది ఖైదీలకు క్షమాభిక్ష

షరతులతో ప్రసాదించిన రాష్ట్ర ప్రభుత్వం.. 50 వేల పూచీకత్తు సమర్పించాల్సిందే

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జైళ్ల నుంచి క్షమాభిక్ష పొందిన ఖైదీలు చర్లపల్లి జైలుకు తరలింపు

నేడు కౌన్సెలింగ్, జాబ్ మేళా.. ఆపై విడుదల

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా జైళ్లల్లో మగ్గిపోతున్న 213 మంది ఖైదీలకు రాష్ట్ర ప్రభుత్వం క్షమాభిక్ష ప్రసాదించింది. బుధవారం ఆ ఖైదీలందరూ స్వేచ్ఛావాయువులు పీల్చుకోనున్నారు. చాన్నాళ్లుగా కారాగారంలో ఉన్న వారి విడుదల కోసం వారి కుటుంబ సభ్యులు సీఎం రేవంత్ రెడ్డికి 'ప్రజాపాలన' కార్యక్రమంలో దరఖాస్తులు అందజేశారు. ఈ అంశంపై స్పందించిన ముఖ్యమంత్రి.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాల ఆధారంగా ఖైదీల ముందస్తు విడుదలకు గల అవకాశాలను పరిశీలించాలని అధికారుల్ని ఆదేశించారు. ఆ దరఖాస్తులను పరిశీలించిన సీనియర్ అధికారులు.. అర్హులైనవారి వివరాలను ఉన్నతస్థాయి కమిటీ ముందుంచారు. కమిటీ ఆ వివరాలను పరిశీలించి.. విడుదలకు అర్హులైన ఖైదీల జాబితాను క్యాబినెట్ ముందుంచింది. సీఎం రేవంత్ నేతృత్వంలోని క్యాబినెట్ వారి విడుదలకు పచ్చజెండా ఊపింది. అనంతరం ఆ జాబితాకు గవర్నర్ ఆమోద ముద్ర వేయడంతో.. ఖైదీల ముందస్తు విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జైళ్ల నుంచి.. క్షమాభిక్షకు ఎంపికైన ఖైదీల్ని చర్లపల్లి కేంద్ర కారాగారానికి చేర్చారు. బుధవారం కౌన్సెలింగ్, జాబ్ మేళా అనంతరం వారిని విడుదల చేస్తారు. కాగా.. విడుదలవుతున్నవారిలో 205 మంది యావజ్జీవ ఖైదీలు ఉండగా.. తక్కువ కాలం శిక్ష పడ్డవారు 8 మంది. వీరందరికి ఇప్పటికే జైళ్లల్లో వివిధ వృత్తులకు సంబంధించిన నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చారు. మెరుగైన ప్రవర్తన ద్వారా సమాజంలో తిరిగి కలిసిపోవడానికి వారందరికీ కౌన్సెలింగ్ ఇప్పించారు.

ఇవీ షరతులు..

క్షమాభిక్షపై విడుదలయ్యే ఖైదీలు రూ.50 వేల వ్యక్తిగత పూచీకత్తు ఇవ్వాల్సి ఉంటుంది. ఆయా కేసుల్లో గతంలో న్యాయస్థానం వారికి విధించిన శిక్షా కాలం పూర్తయ్యే వరకూ వారి గ్రామ పరిధిలోని పోలీస్ స్టేషన్‌లో 3 నెలలకొకసారి హాజరు కావాల్సి ఉంటుంది. క్షమాభిక్షపై విడుదలయ్యే ఖైదీలు తిరిగి ఏదైనా నేరానికి పాల్పడితే వారికి రద్దు చేసిన శిక్షా కాలాన్ని తిరిగి అమలు చేస్తామని ప్రభుత్వం తన మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది.

విద్యుత్ కమిషన్ గడువు

నెల రోజులు పెంపు

» జూలై 31లోగా నివేదిక ఇవ్వండి: ఇంధన శాఖ

» కేసీఆర్ వైఖరిపై వేచిచూసే ధోరణి

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ రంగంలో గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై విచారణకు ఏర్పాటు చేసిన జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి కమిషన్ గడువును ఈనెల 31వ తేదీ దాకా పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అప్పటిలోగా నివేదిక ఇవ్వాలని కోరింది. బీఆర్ఎస్ సర్కారు కుదుర్చుకున్న ఛత్తీస్‌గఢ్ విద్యుత్ ఒప్పందం, యాదాద్రి, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లను నామినేషన్ ప్రాతిపదికన అప్పగించడంపై విచారణకు.. ప్రస్తుత సర్కారు మార్చి 14న ఈ కమిషన్‌ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. నివేదిక ఇవ్వడానికి జూన్ 30ని గడువుగా నిర్ణయించింది. అయితే.. జస్టిస్ నర్సింహారెడ్డి ఏప్రిల్ 7న ప్రారంభించిన విచారణ ఇంకా పూర్తి కాలేదు. ప్రస్తుతం అది కీలకదశకు చేరుకుంది. ఈ నేపథ్యంలో.. గడువును మరో నెలరోజులపాటు పెంచుతున్నట్లు ఇంధనశాఖ విద్యుత్ కమిషన్‌కు సమాచారం ఇచ్చింది. కాగా.. కేసీఆర్ నిర్ణయాల వల్లే విద్యుత్ రంగానికి నష్టం జరిగిందని కమిషన్‌కు పలువురు నివేదించారు. ఈ నేపథ్యంలో.. జూన్ 19న వారిని క్రాస్ ఎగ్జామిన్ చేయడానికి కేసీఆర్‌కు కమిషన్ లేఖ రాసింది. ఆయన అందుకు ముందుకు రాకపోవడంతో.. జూన్ 29తో ఆ గడువు ముగిసినట్లు కమిషన్ భావించింది. కేసీఆర్ విషయంలో మరికొద్దిరోజులపాటు వేచిచూసే ధోరణి అవలంబించాలని నిర్ణయించింది.

బొగ్గు గనుల ప్రాంతాల్లోని యూపీఎస్సీ మెయిన్స్ అభ్యర్థులకు రూ.1 లక్ష ప్రోత్సాహకం

- 'నిర్మాణ్' పోర్టల్ ఆవిష్కరణలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి
- ఉగ్రవాద సంస్థలతో రాహుల్ దోస్తీ అని విమర్శ



న్యూఢిల్లీ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణత సాధించిన బొగ్గు గనుల ప్రాంతాలకు చెందిన అభ్యర్థులకు మెయిన్స్‌కు సన్నమయ్యేందుకు రూ.1 లక్ష ప్రోత్సాహకం అందిస్తామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ప్రకటించారు. మంగళవారం ఢిల్లీలోని తన కార్యాలయంలో నిర్మాణ్ (నోబుల్ ఇనిషియేటివ్ ఫర్ రివార్డింగ్ మెయిన్స్ ఆస్పిరెంట్స్ ఆఫ్ నేషనల్ సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్) పోర్టల్‌ను ఆయన ప్రారంభించారు. దీని ద్వారా దేశంలో బొగ్గు గనులున్న 39 జిల్లాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి ఈ ప్రోత్సాహకం అందిస్తామని కిషన్‌రెడ్డి తెలిపారు. ఎస్సీ, ఎస్టీలతోపాటు యువతులు, థర్డ్ జెండర్ వర్గాలకు అధిక ప్రాధాన్యమిస్తామని ఆయన పేర్కొన్నారు. వార్షిక ఆదాయం రూ.8 లక్షలకు మించని వారే ఈ ప్రోత్సాహకానికి అర్హులని చెప్పారు. మరోవైపు.. ఉగ్రవాద సంస్థలు, సన్నిహితులతో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దోస్తీ చేస్తున్నారని కిషన్ రెడ్డి ఆరోపించారు. హిందువులను కించపరిచేలా ఆయన మాట్లాడడం దురదృష్టకరమని అన్నారు. మంగళవారం ఢిల్లీలో కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డీఎంఎఫ్(డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్) స్టాల్‌ను కిషన్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. రాహుల్ గాంధీ మిడి మిడి జ్ఞానంతో హిందువులపై విద్వేషపూరితంగా మాట్లాడారని మండిపడ్డారు. దేశ ప్రజలకు ఆయన బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర గనుల శాఖ ఆధ్వర్యంలో 23 రాష్ట్రాల్లోని 645 జిల్లాల్లో డీఎంఎఫ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు విస్తృతంగా జరుగుతున్నా యని తెలిపారు.

ఖర్గేతో మహేష్‌కుమార్ భేటీ

న్యూఢిల్లీ, జూలై 2(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ మంగళవారం భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో ఆరు గ్యారెంటీల అమలుపై ఖర్గే ఆరా తీశారు. పథకాలను ప్రభుత్వం అమలు చేస్తున్న విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. తనకు తెలిసిన నిజామాబాద్‌కు చెందిన వ్యక్తుల ఆరోగ్యం గురించి కూడా ఖర్గే ఆరా తీసినట్లు సమాచారం. టీపీసీసీ అధ్యక్షుడిగా కొత్తవారిని నియమిస్తారని ప్రచారం జరుగుతున్న క్రమంలో మహేష్‌కుమార్ ఖర్గేను కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ప్రజాభవన్‌లో అన్నపూర్ణ రూ.5 భోజన స్టాల్

బేగంపేట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహిస్తున్న 'ప్రజావాణి'లో తమ సమస్యలను చెప్పుకునేందుకు వస్తున్న ప్రజలకు మధ్యాహ్న భోజనానికి ఇబ్బంది అవుతోంది. మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజావాణి జరుగుతుండడంతో ఈ సమస్య తలెత్తుతోంది. ఈ ఇబ్బందులను గుర్తించిన జీహెచ్ఎంసీ అధికారులు ప్రజాభవన్ ప్రాంగణంలో మంగళవారం అన్నపూర్ణ రూ.5 భోజన స్టాల్‌ను ఏర్పాటు చేశారు. దాంతో 2వ తేదీన ప్రజావాణికి వచ్చిన ప్రజలు ఇక్కడే భోజనం చేశారు. రాష్ట్ర నలుమూలాల నుంచి వచ్చే పేదల కోసం ఈ స్టాల్‌ను ఏర్పాటు చేసినట్లు ఖైరతాబాద్ సర్కిల్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంత్ తెలిపారు. రానున్న రోజుల్లో స్టాల్‌కు శాశ్వత షెడ్డు ఏర్పాటు చేయడంతో పాటు వృద్ధులు, దివ్యాంగులకు ప్రాధాన్యం కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కాగా, మంగళవారం ప్రజావాణి కార్యక్రమంలో 601 దరఖాస్తులు వచ్చాయి.

పాలమూరు- రంగారెడ్డికి జాతీయ హోదా ఇవ్వాలి

- రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

న్యూఢిల్లీ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని రాజ్యసభలో బీఆర్ఎస్ పార్టీ ఉప నాయకుడు వద్దిరాజు రవిచంద్ర డిమాండ్ చేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంలో భాగంగా మంగళవారం రాజ్యసభలో ప్రసంగించిన ఆయన... ఖాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీని, బయ్యారంలో ఉక్కు కర్మాగారాన్ని నిర్మించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ఛత్తీస్‌గఢ్‌లోని బైలడిల్లా గనుల నుంచి ఇనుప ఖనిజాన్ని రాష్ట్రానికి కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

బీఆర్ఎస్‌లోకి వేరే పార్టీలవారిని ఆహ్వానించలేదా?

- కేటీఆర్ విమర్శ ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నా:ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల టౌన్, జూలై 2 : టీడీపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి గెలిచిన వారిని గతంలో బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించలేదా... వారికి మంత్రి పదవులు ఇవ్వలేదా...? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో హుందాతనంతో రాజకీయం చేయాలన్నారు. రాజకీయ వేదికలపై ఇష్టం వచ్చినట్లు విమర్శించిన ప్రతి ఒక్కరూ ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. జగిత్యాలలో ఎమ్మెల్యే మాట్లాడారు. సేవాభావంతో రాజకీయాల్లోకి వచ్చిన తనను కేటీఆర్ విమర్శించడంపై ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు. కవిత ప్రోత్సాహంతోనే రాజకీయాల్లోకి వచ్చినా జగిత్యాల ప్రాంత అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్‌లో చేరానని, సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి పని చేస్తానన్నారు.

ఆర్ఎంపీ,పీఎంపీలకు శిక్షణ పత్రాలు ఇవ్వండి

- మంత్రి రాజనర్సింహకు ఆయా సంఘాల విజ్ఞప్తి

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలందిస్తోన్న ఆర్ఎంపీ, పీఎంపీలకు ఇచ్చిన శిక్షణకు సంబంధించి ధ్రువపత్రాలు ఇవ్వాలని తెలంగాణ ఆర్ఎంపీ, పీఎంపీ సంఘాలు ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం ప్రొఫెసర్ కోదండరామ్ అధ్యక్షతన వారు వైద్యారోగ్య మంత్రి దామోదర రాజనర్సింహను కలిశారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 1273 జీవోనిచ్చి, దాని ద్వారా రూ.4.32 కోట్ల నిధులతో 12,900 మంది ఆర్ఎంపీ, పీఎంపీలు శిక్ష పూర్తి చేశారని, అయితే వారికి ఇంకా అందుకు సంబంధించి పత్రాలు ఇవ్వలేదని మంత్రికి తెలిపారు. వారికి వెంటనే పరీక్షలు నిర్వహించి, పత్రాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆర్ఎంపీ, పీఎంపీ డాక్టర్ల సమస్యల గురించి సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని వారికి మంత్రి హామీనిచ్చారు.

నేడు, రేపు తేలికపాటి వర్షాలు

బుధ, గురువారాల్లో తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మరో వైపు 5 వరకు వర్షాలకు సంబంధించి ఎటువంటి హెచ్చరిక లేదని, తేలికపాటి వర్షాలే తప్ప భారీ వర్షాలకు ఆస్కారం లేదని వెల్లడించింది.

హైకోర్టులో నలుగురు అదనపు పీపీల నియామకం

రాష్ట్రప్రభుత్వం, పోలీసుల తరఫున క్రిమినల్ కేసుల్లో హైకోర్టు ఎదుట వాదనలు వినిపించేందుకు నలుగురు అదనపు పీపీలను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం జీవో జారీచేసింది. ఎం రామచంద్రారెడ్డి, వీ జితేందర్ రావు, డీ అరుణ్‌కుమార్, సయ్యద్ యాసర్ మమూన్‌లను నియమిస్తూ న్యాయశాఖ కార్యదర్శి ఆర్ తిరుపతి ఉత్తర్వులు జారీచేశారు. వీరు మూడేళ్ల పాటు ఈ పదవుల్లో కొనసాగనున్నారు.

చిక్కుముళ్లు వీడే దిశగా..!

(మొదటిపేజీ తరువాయి)

లేఖ పట్ల రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. చంద్రబాబు చేసిన ప్రతిపాదనకు అంగీకరిస్తూ బేగంపేటలోని మహాత్మ జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో సమావేశమవుదామంటూ సమాచారమిచ్చారు. సమావేశానికి రావాల్సిందిగా చంద్రబాబును ఆహ్వానించారు. ఈ భేటీలో చర్చించాల్సిన ఎజెండా, విధివిధానాల ఖరారుపై సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క మంగళవారం సచివాలయంలో సమావేశమయ్యారు. విభజన సమస్యలు, ఇతర అంశాలపై చర్చించారు. మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా ఇందులో పాల్గొన్నారు. కాగా, ఇరువురు సీఎంల సమావేశానికి ఏర్పాట్లు చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లతోపాటు భేటీకి అవసరమైన ఎజెండానూ రూపొందిస్తున్నారు. ఈ నెల 6న మధ్యాహ్నం తర్వాత సమావేశం ప్రారంభం కానుంది.

పదేళ్లు గడిచినా అపరిష్కృతంగానే..

ఉమ్మడి రాష్ట్రం రెండు రాష్ట్రాలుగా విడిపోయి జూన్ 2తో పదేళ్లు గడిచినా.. ప్రధాన సమస్యలు అపరిష్కృతంగానే ఉండిపోయాయి. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లోని సంస్థలు, వాటి ఆస్తులు, అప్పులు, నిధుల పంపిణీ ఎటూ తేలలేదు. కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో ఇరు రాష్ట్రాల అధికారులతో పలుమార్లు సమావేశాలు జరిగినా, రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య చర్చలు జరిగినా... పరిష్కారానికి నోచుకోలేదు. కొన్ని సంస్థలకు సంబంధించి పరస్పర అంగీకారం కుదిరినా.. విభజన కాగితాలపై రెండు రాష్ట్రాలు సంతకాలు చేయలేదు. కొన్ని కీలక సమస్యలు అపెక్స్ కౌన్సిల్ ద్వారానే పరిష్కారమవుతాయని తెలిసినా.. అందులో సభ్యులైన ఇరు రాష్ట్రాల సీఎంలు మాత్రం చొరవ చూపలేకపోయారు. అప్పట్లో సీఎంలు కేసీఆర్, జగన్ 'హాయ్ బాయ్' సమావేశాలు నిర్వహించారే తప్ప.. ఒక్క సమస్యను కూడా నిగ్గు తేల్చలేకపోయారన్న విమర్శలున్నాయి. ప్రస్తుతం ఇరు రాష్ట్రాల మధ్య స్నేహపూర్వక వాతావరణం నెలకొన్నందున కొన్ని సమస్యలైనా పరిష్కారమవుతాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పలు సంస్థలపై తెగని పేచీ..

సీఐడీ హెడ్ క్వార్టర్స్, లేక్‌వ్యూ అతిథి గృహం, హెర్మిటేజ్ కార్యాలయ భవనం మినహా మిగిలిన



అన్ని భవనాలను తెలంగాణకు అప్పగించడానికి సిద్ధంగా ఉన్నట్లు ఏపీ లేఖ రాసింది. దీనిపై తెలంగాణ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. పాత సెక్రటేరియట్‌లో ఉన్న భవనాలు, స్థలాన్ని, అసెంబ్లీ ప్రాంగణంలోని శాసనసభ, శాసనమండలి భవనాలను 2019లోనే తెలంగాణకు ఏపీ అప్పగించింది. సీఐడీ హెడ్ క్వార్టర్స్, లేక్‌వ్యూ అతిథి గృహం వంటి వాటిని జనాభా దామాషా ప్రకారం 58.32, 41.68 పద్ధతిన పంచాలని ఏపీ కోరుతోంది. కాగా, 9వ షెడ్యూలులో కేంద్రం చేర్చిన మొత్తం 91 సంస్థలకు చెందిన ఆస్తులు, అప్పులు, నగదు నిల్వలు, ఉద్యోగులను రెండు తెలుగు రాష్ట్రాల మధ్య పంపిణీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం షీలా భిడే కమిటీని వేసింది. ఇందులో 68 సంస్థలపై తమకు ఎలాంటి అభ్యంతరాలు లేవని తెలంగాణ తెలిపింది. మిగతా 23 సంస్థలకు సంబంధించి ఇరు రాష్ట్రాల మధ్య పేచీ నెలకొంది. ఇందులో ప్రధానంగా ఏపీఎస్ఆర్టీసీ, ఏపీ స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్, ఏపీజెన్‌కో, ఏపీట్రాన్స్‌కో వంటి సంస్థల ఆస్తులపై ఏకాభిప్రాయం కుదరడం లేదు. ఈ అంశం ఇరువురు సీఎంల సమావేశంలో చర్చకు వస్తుందని సమాచారం. ఇక 10వ షెడ్యూలులో విద్య, శిక్షణ, మానవవనరుల అభివృద్ధి సంస్థలు, వర్సిటీలు వంటి మొత్తం 142 సంస్థలున్నాయి. వీటి ఆస్తుల విలువ రూ.38 వేల కోట్లుగా అంచనా వేశారు. ఈ షెడ్యూలులో మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ, ఏఎంఆర్‌ఏపీ అకాడమీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్, ఏపీ ఫారెస్ట్ అకాడమీ, పోలీస్ అకాడమీ, ఏపీ ఎక్సైజ్ అకాడమీ, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్, ఇంటర్మీడియట్ బోర్డు, స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెయినింగ్, ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వంటి సంస్థలున్నాయి. వ్యవసాయ విశ్వవిద్యాలయం, పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వంటివి పదో షెడ్యూలు కిందనే ఉన్నాయి. వీటిలో తెలుగు అకాడమీ, అంబేద్కర్ యూనివర్సిటీ, తెలుగు యూనివర్సిటీ వంటి 30 సంస్థలపై వివాదాలున్నాయి. కాగా, ఉన్నత విద్యామండలి ఆస్తుల విలువ తేలడం లేదు. దీనికి సంబంధించిన రూ.800 కోట్ల బ్యాంకు డిపాజిట్లు ఉన్నాయి.

చంద్రబాబుకు రేవంత్ ఆహ్వానం ఇదీ..

విభజన సమస్యల పరిష్కారం కోసం భేటీ అవుదామంటూ ఏపీ సీఎం చంద్రబాబు రాసిన లేఖపై సానుకూలంగా స్పందిస్తూ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి తిరిగి లేఖ రాశారు. ఈ నెల 6న సమావేశానికి రావాలని చంద్రబాబును ఆహ్వానించారు. "విభజన సమస్యలను కలిసి పరిష్కరించుకుందాం. తెలుగు రాష్ట్రాల పరస్పర సహకారానికి ముఖాముఖి చర్చలు అవసరం. మీ అభిప్రాయంతో పూర్తిగా ఏకీభవిస్తున్నా. మా రాష్ట్ర ప్రభుత్వం, ప్రజల తరఫున చంద్రబాబును ఆహ్వానిస్తున్నాం" అని లేఖలో రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో విజయం సాధించిన తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్వాతంత్ర్యానంతరం నాలుగోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టిన నేతల్లో మీరూ ఒకరంటూ చంద్రబాబును కొనియాడారు.

తెగని విద్యుత్తు బాకీల పోరు..

తెలుగు రాష్ట్రాల మధ్య విద్యుత్తు బకాయిల వివాదం పదేళ్లుగా పరిష్కారానికి నోచుకోవడం లేదు. రాష్ట్ర అవతరణ అనంతరం 2014 జూన్ 2 నుంచి 2017 జూన్ 10వ తేదీ దాకా ఏపీ జెన్‌కో నుంచి తెలంగాణ తీసుకున్న విద్యుత్తుకుగాను రూ.3441.78 కోట్లను, వీటిని సకాలంలో చెల్లించనందుకు ఆలస్య రుసుము సర్‌చార్జి(లేట్ పేమెంట్ సర్‌చార్జి) కింద రూ.3315.14 కోట్లు కలిపి రూ.6756 కోట్లు కట్టాలని ఏపీ అడుగుతోంది. అయితే ఏపీ నుంచే తమకు రూ.17,828 కోట్లు రావాల్సి ఉందని తెలంగాణ చెబుతోంది. ఏపీకి కట్టాల్సిన కరెంట్ బిల్లులు, ఆలస్య రుసుము సర్‌చార్జి మొత్తం రూ.4887కోట్లు పోను ఇంకా తమకు రూ.12940 కోట్లు రావాల్సి ఉందని అంటోంది. ఈ వివాదాన్ని తేల్చడానికి చాలా ప్రక్రియలు జరిగినా ఏపీ కార్యరూపం దాల్చలేదు.

గవర్నర్ ముఖ్య కార్యదర్శిగా రామకృష్ణారావు?

లేదంటే బెన్‌హర్ మహేశ్‌దత్‌కు అవకాశం

- త్వరలో రాష్ట్రంలో మరోసారి ఐఏఎస్ బదిలీలు!
- భట్టి విక్రమార్క పేషీలో నలుగురు ఐఏఎస్‌లు
- అధికారుల కొరతతో మిగతా శాఖలపై ప్రభావం

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరోసారి ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగే అవకాశముంది. ముఖ్యంగా సీనియర్ అధికారులను బదిలీ చేయవచ్చని తెలిసింది. ఇటీవలే ప్రభుత్వం రెండు దఫాలుగా ఐఏఎస్‌లను బదిలీ చేసింది. తొలుత 20 జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించిన ప్రభుత్వం... వారం రోజుల వ్యవధిలోనే మరో 40 మంది ఐఏఎస్‌లు, ఇద్దరు ఐపీఎస్‌లు, ఒక ఐఎఫ్ఎస్ అధికారి, మరో నాన్-కేడర్ అధికారిని బదిలీ చేసింది. తాజాగా, పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా మరికొంత మంది ఐఏఎస్‌లను బదిలీ చేసే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం గవర్నర్‌కు ముఖ్యకార్యదర్శి పోస్టు ఖాళీగా ఉంది. ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న రామకృష్ణారావును బదిలీ చేసి ఈ పదవిలో నియమిస్తారని, లేదా 1995 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి బెన్‌హర్ మహేశ్‌దత్ ఎక్కాకు అవకాశమిస్తారని చర్చ జరుగుతోంది. విద్యా శాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం గవర్నర్ ఇన్‌చార్జి ముఖ్యకార్యదర్శిగా కొనసాగుతున్నారు. కాగా, ఇటీవల చేపట్టిన 40 మంది ఐఏఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాను ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శిగా నియమించిన సంగతి తెలిసిందే. దీంతో ప్రస్తుతం ఆర్థిక శాఖలో ఒక ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఒక ముఖ్య కార్యదర్శితో పాటు 2014 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ కె.హరిత సంయుక్త కార్యదర్శిగా ఉన్నారు. వీరు కాకుండా... డిప్యూటీ సీఎం, ఆర్థిక, విద్యుత్తు శాఖల మంత్రి మల్లు భట్టి విక్రమార్క వద్ద 2012 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ కృష్ణ భాస్కర్ ప్రత్యేక కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ఇలా ఒక్క ఆర్థిక శాఖలోని సచివాలయ బ్రాంచిలోనే నలుగురు ఐఏఎస్‌లు ఉండడంతో ఇతర శాఖలకు అధికారులు లేకపోవడం ప్రతికూల ప్రభావం చూపుతోంది.



చంద్రబాబు శక్తిమంతుడు

- ఆయనపైనే కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఆధారపడి ఉంది
- 7 మండలాలు, సీలేరు ప్రాజెక్టు రాష్ట్రానికి దక్కేలా బాబుపై ఒత్తిడి తేవాలి
- ఇరు రాష్ట్రాల సీఎంల భేటీ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డికి హరీశ్ సూచన

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం చంద్రబాబుతో జరిగే సమావేశంలో.. గతంలో ఆ రాష్ట్రంలో కలిపిన తెలంగాణకు చెందిన ఏడు మండలాలను తిరిగి రాబట్టే అంశంపై పట్టుబట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. 'ప్రస్తుతం చంద్రబాబుపైనే కేంద్రంలోని బీజేపీ, ఎన్డీఏ ప్రభుత్వం ఆధారపడి ఉంది. ఇవాళ ఆయన శక్తిమంతుడు. కాబట్టి ఆయనపై ఒత్తిడి తెచ్చి ఏడు మండలాలు, లోయర్ సీలేరు పవర్ ప్రాజెక్టు తెలంగాణకు కేంద్రం ఇచ్చేలా కృషి చేయాలి' అని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పోలవరం కట్టుకుంటే తమకు అభ్యంతరం లేదన్నారు.

కాంగ్రెస్ పాలనతో అస్తవ్యస్తం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనతో అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయని, గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్యం పడకేసినా పట్టించుకోకుండా ప్రభుత్వం మొద్దునిద్ర పోతోందని హరీశ్ ఆరోపించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ చేపట్టాల్సింది పోయి.. రోజువారీ చర్యలపైనా దృష్టి పెట్టడం లేదన్నారు. 9 ఏళ్ల తమ ప్రభుత్వ హయాంలో పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాల అమలుకు గ్రామపంచాయతీలకు 3,300 కోట్లు, మునిసిపాలిటీలకు రూ.1700 కోట్లు నిధులిచ్చామని. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన ఈ ఏడు నెలల్లో గ్రామ పంచాయతీలకు ఒక్క పైసా కూడా ఇవ్వలేదని చెప్పారు. వృద్ధులకు ప్రతినెలా రూ.4వేల పింఛన్ ఇస్తానన్న రేవంత్‌రెడ్డి ఆ హామీ నెరవేర్చకపోగా, అంతకుముందు ఇచ్చే రూ.2వేలు కూడా 2 నెలల నుంచి ఇవ్వడం లేదన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు మాత్రం అధికారంలోకి రాగానే ఆ రాష్ట్రంలోని వృద్ధులకు పాతబకాయిలు కలిపి రూ.7వేలు ఇచ్చారని హరీశ్ పేర్కొన్నారు. కాంగ్రెస్‌కు ఓటేసిన పాపానికి ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ ప్రభాకర్ అనే రైతు వీడియో విడుదల చేసి మరీ ఆత్మహత్య చేసుకున్నారని, ఆ వీడియోనే.. మరణ వాంగ్మూలంగా స్వీకరించి పోలీసులు కేసు నమోదు చేయాలన్నారు. ప్రభాకర్ కుటుంబానికి 25లక్షలు పరిహారం, వారింట్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వాన్ని హరీశ్ డిమాండ్ చేశారు.

వచ్చే ఎన్నికల్లో గెలుపు మనదే!

15 ఏళ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉంటుంది.. ఈసారి ఎవరికి బీ ఫామ్ దక్కితే వారిదే విజయం

- పార్టీ మారిన వారిని ప్రజలు అసహ్యించుకుంటున్నారు
- జెడ్పీచైర్‌పర్సన్లతో కేసీఆర్



సమావేశంలో మాట్లాడుతున్న కేసీఆర్

హైదరాబాద్/మర్కుక్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని మాజీ సీఎం కేసీఆర్ చెప్పారు. 15 ఏళ్లపాటు అధికారంలో ఉంటామని ధీమా వ్యక్తం చేశారు. గతంలో ఎన్టీఆర్ విషయంలో జరిగిందే.. తమకూ జరుగుతుందన్నారు. ఒకసారి అధికారంలోకి వస్తే.. పిచ్చి పనులు చేసి ప్రజలచేత ఛీ కొట్టించుకోవడం కాంగ్రెస్ పార్టీ లక్షణమని చెప్పారు. ఈ కారణంగానే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు మళ్లీ బీఆర్ఎస్‌నే గెలిపిస్తారని కేసీఆర్ పేర్కొన్నారు. మంగళవారం ఎర్రవెల్లిలోని తన వ్యవసాయక్షేత్రంలో జెడ్పీచైర్‌పర్సన్లు, వారి కుటుంబసభ్యులతో కేసీఆర్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఇందులో మాజీ మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. తమ పార్టీ ఈసారి 15 ఏళ్లు అధికారంలో ఉంటుందన్నారు. మరో రెండేళ్లలో నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణ జరిగే అవకాశం ఉందని, రాష్ట్రంలో నియోజకవర్గాల సంఖ్య 160 వరకు పెరగొచ్చని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మహిళలకు ఎక్కువ అవకాశాలు వస్తాయని, ఈసారి బీఆర్ఎస్ తరఫున ఎవరికి బీఫామ్ దక్కితే వాళ్లదే విజయమని చెప్పారు. అంత వరకు పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కొంచెం కష్టపడితే మంచి ఫలితాలు వస్తాయని, ఆలోగా పార్టీకి సంబంధించి అన్ని స్థాయిల్లో కమిటీల ఏర్పాటు ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. అత్యున్నత పదవులు అనుభవించి పార్టీని వీడుతున్న వారిని ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. వ్యవసాయ స్థిరీకరణ కోసం తమ ప్రభుత్వం రైతుబంధు పథకం ద్వారా అన్నదాతలను ఆదుకుంటే.. కాంగ్రెస్ సర్కారు వివిధ కారణాలు చూపుతూ ఎగనామం పెట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారం చేపట్టాక విద్యుత్తు, తాగునీటి ఇబ్బందులే గాక మతకల్లోలాలు కూడా చెలరేగడం బాధ కలిగిస్తోందని చెప్పారు. అప్పుడున్న అధికారులే ఇప్పుడూ ఉన్నప్పటికీ ఈ సమస్య ఎందుకు వస్తుందో ఆలోచించాలన్నారు. ఒకసారి ప్రజా జీవితంలోకి వచ్చాక, అధికారం ఉన్నా లేకపోయినా ప్రజల కోసం పనిచేసే వాళ్లే నిజమైన రాజకీయ నాయకులని కేసీఆర్ పేర్కొన్నారు.

రాష్ట్రంలో డిజిటల్ విధ్వంసం

సీఎస్ చర్యలు తీసుకోవాలని కోరిన మాజీ మంత్రి కేటీఆర్

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో జరుగుతున్న డిజిటల్ విధ్వంసంపై దృష్టి సారించాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి కేటీఆర్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్)ని కోరారు ఈ మేరకు మంగళవారం ఆయన ఎక్స్(ట్విటర్)లో ఓ పోస్టు చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారం చేపట్టిన తర్వాత ప్రభుత్వ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా హ్యాండిల్స్‌లోని ముఖ్యమైన సమాచారాన్ని కనిపించకుండా చేశారని, కొన్ని వెబ్‌సైట్లను పూర్తిగా తొలగించారని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితి చూస్తే డిజిటల్ విధ్వంసం జరుగుతుందనే భావన కలుగుతోందని ఆరోపించారు. ముఖ్యమైన సమాచారాన్ని ఆర్కైవ్స్‌లో భద్రపరచాలని, ఇలా తొలగించడం సరికాదని అభిప్రాయపడ్డారు. ఈ డిజిటల్ విధ్వంసంపై సమగ్ర వివరాలను పంపిస్తానని, సమాచార భద్రతకు సీఎస్ తగు చర్యలు తీసుకోవాలని కేటీఆర్ కోరారు.

టీజీఎస్ ఆర్టీసీలో 3,035 కొలువులు

వివిధ విభాగాల్లో ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వ ఆమోదం

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): టీజీఎస్ ఆర్టీసీలో ఉద్యోగాల భర్తీకి అడుగు పడింది. వివిధ విభాగాల్లో మొత్తం 3,035 పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి అనుమతినిచ్చింది. ఈ పోస్టుల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్ త్వరలోనే వెలువడనుంది. సుమారు పదేళ్లుగా ఆర్టీసీలో ఉద్యోగ నియామకాలు జరగడం లేదు. దీంతో వివిధ విభాగాల్లో వేలాది మంది ఉద్యోగులు పదవీ విరమణ చేసినా ఆ ఖాళీలు భర్తీ కాలేదు. దీంతో పెద్ద సంఖ్యలో ఖాళీలు ఉన్నాయి. ఉద్యోగాల భర్తీకి ఆర్టీసీ ఉన్నతాధికారులు ప్రభుత్వాన్ని ఎన్నిసార్లు కోరినా ఫలితం లేకపోయింది. గత ప్రభుత్వం హయాంలో సంస్థ మనుగడే ప్రశ్నార్థకం అయింది. ఆర్టీసీని ప్రైవేటుపరం చేస్తారనే చర్చ కూడా జరిగింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత తీసుకొచ్చిన మహాలక్ష్మీ పథకంతో ఆర్టీసీ ఆక్యుపెన్సీ రేటు అమాంతం పెరిగింది. సంస్థ ఆదాయం కూడా వృద్ధి చెందింది. రూ.13కోట్ల నుంచి రూ.14 కోట్ల వరకు ఉండే రోజువారీ ఆదాయం రూ.20 కోట్ల నుంచి రూ.22 కోట్లకు చేరింది. ఫలితంగా ఆర్టీసీ ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కిందని భావిస్తున్నారు. అయితే, ఆర్టీసీలోని వివిధ విభాగాల్లో సుమారు పది వేలకు పైగా పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ అత్యవసంగా 3,035 ఖాళీలను భర్తీ చేయనున్నారు. డ్రైవర్లు-2,000, శ్రామిక్-743, డిప్యూటీ సూపరింటెండెంట్(మెకానిక్)- 114, డిప్యూటీ సూపరింటెండెంట్(ట్రాఫిక్)- 84, డిపో మేనేజర్/అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్- 25, అసిస్టెంట్ ఇంజనీర్(సివిల్)- 23, అసిస్టెంట్ మెకానికల్ ఇంజినీర్-15, సెక్షన్ ఆఫీసర్(సివిల్)-11, మెడికల్ ఆఫీసర్(జనరల్)- 07, అకౌంట్స్ ఆఫీసర్ 06, మెడికల్ ఆఫీసర్-7, మెడికల్ ఆఫీసర్ (స్పెషలిస్ట్)-7 పోస్టుల భర్తీకి ప్రభుత్వం నుంచి అనుమతి లభించిందని ఆర్టీసీ అధికారులు ప్రకటించారు. కాగా, ఆర్టీసీలో కొత్త రక్తం నింపేందుకే ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ చేపట్టాలని నిర్ణయించిందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆయా ఉద్యోగాల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్ త్వరలోనే వెలువడుతుందని పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం అమలుతో పెరిగిన రద్దీకి అనుగుణంగా ప్రభుత్వ సహకారంతో ఆర్టీసీ కొత్త బస్సులను కొనుగోలు చేస్తోందని తెలిపారు. ఆ బస్సులకు అనుగుణంగా నియామకాలు చేపడుతున్నట్లు వివరించారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● బుధవారం 3 జూలై 2024

నయా రాయ్‌పూర్ ఐఐఐటీలో ఎంటెక్



నయా రాయ్‌పూర్‌లోని డా.శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ)- ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. ఎంపికైన అభ్యర్థులకు ఏఐసీటీఈ నిబంధనల ప్రకారం నెలకు రూ.12,400/-ల స్కాలర్‌షిప్ ఇస్తారు. జాతీయ, అంతర్జాతీయ సమావేశాల్లో అభ్యర్థులు తమ రిసెర్చ్ వర్క్ ప్రజంటేషన్‌కు అవకాశం కల్పిస్తారు. ఇందుకు ఫైనాన్షియల్ అసిస్టెన్స్ అందిస్తారు. నాన్ గేట్ అభ్యర్థులు యూనివర్సిటీ ఎగ్జామ్ రాయాల్సి ఉంటుంది.

ప్రోగ్రామ్ వివరాలు: ఇది రెండేళ్ల వ్యవధి గల ఫుల్ టైం ప్రోగ్రామ్. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగాల్లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. సీఎస్ఈ విభాగంలో డేటా సైన్స్ అండ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ; ఈసీఈ విభాగంలో కమ్యూనికేషన్ అండ్ సిగ్నల్ ప్రాసెసింగ్, వీఎల్ఎస్ఐ అండ్ ఎంబెడెడ్ సిస్టమ్స్ స్పెషలైజేషన్‌లు ఎంచుకోవచ్చు. ఆలిండియా కోటా కింద 16 సీట్లు ఉన్నాయి. ఒక్కో విభాగానికి 8 సీట్లు కేటాయించారు. ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు విభాగానికి ఒక సీటు చొప్పున రెండు సీట్లు ప్రత్యేకించారు. వీటిని సీసీఎంటీ 2024 నిబంధనల ప్రకారం భర్తీ చేస్తారు. ఎన్‌టీపీసీ కోటా కింద విభాగానికి మూడు చొప్పున 6 సీట్లు ఉన్నాయి. వీటిని ఎన్‌టీపీసీ ఉద్యోగులకు వారి పిల్లలకు ప్రత్యేకించారు.

అర్హత వివరాలు: సీఎస్ఈ విభాగానికి బీఈ/బీటెక్(కంప్యూటర్ సైన్స్) ఉత్తీర్ణులై ఉండాలి. ఎమ్మెస్సీ(కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/మేథమెటిక్స్/మేథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్/ స్టాటిస్టిక్స్), ఏఎంఐఈ టీఈ(కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్), ఎంసీఏ అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. సీఎస్/ఎంఏ/ఎస్‌టీ కోడ్ పేపర్‌లో గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. ఈసీఈ విభాగానికి బీఈ/బీటెక్/ఏఎంఐఈటీఈ(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్) పూర్తిచేసి ఉండాలి. ఎమ్మెస్సీ(ఎలక్ట్రానిక్స్/ ఫిజిక్స్) అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈసీ/ ఈఈ/ ఐఎన్/ బీఎం/ ఎక్స్‌ఈ/ పీహెచ్ కోడ్ పేపర్‌లో గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

ముఖ్య సమాచారం


- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.500/-; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.300/-
- **దరఖాస్తు దాఖలుకు చివరి తేదీ:** జూలై 14
- **గేట్ అర్హతతో ఎంపికైన అభ్యర్థుల మొదటి జాబితా విడుదల:** జూలై 16
- **నాన్ గేట్ అభ్యర్థులకు ఎగ్జామ్:** జూలై 17
- **ఎగ్జామ్ ద్వారా ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** జూలై 19
- **ఎంపికైన గేట్/నాన్ గేట్ అభ్యర్థుల రెండో జాబితా విడుదల:** జూలై 22
- **ఎంపికైన గేట్/నాన్ గేట్ అభ్యర్థుల మూడో జాబితా విడుదల:** జూలై 31
- **వెబ్‌సైట్:** www.iiitnr.ac.in

ఏపీ కాలేజీల్లో జనరల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లు

గుంటూరులోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్(ఏపీఎస్‌సీహెచ్ఈ)- జనరల్ యూజీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి ఉద్దేశించిన ఆన్‌లైన్ అడ్మిషన్స్ మాడ్యూల్ ఫర్ డిగ్రీ కాలేజెస్(ఓఏఎండీసీ) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రభుత్వ/ప్రైవేట్ అటానమస్, ప్రైవేట్ ఎయిడెడ్/అన్‌ఎయిడెడ్ కళాశాలల్లో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. ఆర్ట్స్, సైన్స్, సోషల్ సైన్సెస్, కామర్స్, మేనేజ్‌మెంట్, కంప్యూటర్ అప్లికేషన్స్, సోషల్ వర్క్ తదితర విభాగాల్లో బీఏ, బీఎస్సీ, బీకాం, బీబీఏ, బీ ఒకేషనల్, బీఎఫ్ఏ, అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ పీజీ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఇంటర్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. అకడమిక్ మెరిట్, సర్టిఫికెట్స్ వెరిఫికేషన్, కౌన్సెలింగ్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **రిజిస్ట్రేషన్ ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.400; బీసీ అభ్యర్థులకు రూ.300; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.200
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** జూలై 10
- **స్పెషల్ కేటగిరీ వెరిఫికేషన్:** జూలై 4 నుంచి 6 వరకు
- **హెచ్ఎల్‌సీ వెరిఫికేషన్:** జూలై 5
- **వెబ్ ఆప్షన్స్:** జూలై 11 నుంచి 15 వరకు
- **సీట్ల అలాట్‌మెంట్:** జూలై 19
- **విద్యార్థుల రిపోర్టింగ్:** జూలై 20
- **తరగతులు ప్రారంభం:** జూలై 22 నుంచి
- **వెబ్‌సైట్:** apsche.ap.gov



లిటిల్స్

గుర్రం- గాడిద


ఒక ఊరిలో వ్యాపారి దగ్గర ఒక గుర్రం, ఒక గాడిద ఉండేవి. అతను ఒకరోజు అంగడికి వెళ్లి చాలా సరుకులు కొనుగోలు చేసి, ఆ మూటలన్నిటినీ గాడిద మీద వేసి తాను గుర్రం మీద కూర్చుని తిరుగు ప్రయాణం అయ్యాడు. మధ్యలో గుర్రం గాడిదను చూసి ఏమిటో నీ చాకిరీ బతుకు అంటూ హేళనగా నవ్వింది., దానికి గాడిద నామీద ఉన్న బరువులో కొంత నువ్వుతీసుకుని నాకు సాయం చేయవచ్చు కదా అని అడిగింది. గుర్రం మరలా నవ్వి నాది బండ చాకిరీ చేసి, బరువులు మోసే పని కాదు అన్నది. మరి కొంచెం సేపటి తర్వాత గాడిద ఆ బరువులు మోయలేక మొత్తానికే కూలబడిపోయింది, అపుడు వ్యాపారి గాడిద మీది మొత్తం బరువులను గుర్రం మీదికి మార్చి తాను కూడా గుర్రం మీదనే కూర్చున్నాడు. అందుకే ' ఎవరినైనా వారు ఇబ్బంది పడుతూ ఉంటే హేళన చేయకూడదు' అన్నది గాడిద.



దారి కనుక్కోండి



12 తేడాలు గుర్తించండి!



రంగులు వెయ్యి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 348

		5					9	
1			7			2		3
	3			2		8		
8					2	9		
		7	5		6	1		
		2	9					4
		3		7			6	
6		1			8			2
	2					3		

సుడోకు - 347 సమాధానం

8	9	5	1	6	4	2	7	3
3	4	2	7	8	9	6	1	5
1	7	6	2	5	3	4	9	8
5	6	3	4	9	7	1	8	2
9	8	4	5	2	1	7	3	6
7	2	1	6	3	8	9	5	4
2	1	8	9	4	5	3	6	7
4	3	7	8	1	6	5	2	9
6	5	9	3	7	2	8	4	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

SCHOLARSHIP ALERT

Kotak Junior Scholarship

Description: Under the CSR initiative on Education & Livelihood by the Kotak Mahindra Group Companies, Kotak Education Foundation invites applications for Kotak Junior Scholarship 2024-25 from Class 10 passed students within the Mumbai Metropolitan Region.

Eligibility: Applicants must have obtained over 85% marks in their Class 10 board examination (SSC/CBSE/ICSE) in 2024.

- They must have secured admission in Class 11 at junior colleges/schools for Arts, Commerce or Science streams in the Mumbai Metropolitan Region (MMR) for the academic year 2024-25.
- The annual family income of applicants must be INR 3,20,000 or below.
- Students must reside within the Mumbai Metropolitan Region (MMR).

Prizes & Rewards: Scholarship of INR 3,500 per month along with mentorship support, academic assistance, career guidance, and exposure visits.

Last Date to Apply: 15-07-2024 ***Application mode:*** Online only

Short Url: www.b4s.in/aj/KJSP2

Swami Vivekanand Scholarship for Academic Excellence Scheme 2024

Description: Swami Vivekanand Scholarship for Academic Excellence Scheme 2024 (formerly Rajiv Gandhi Scholarship) is an initiative of the Government of Rajasthan, for students planning to pursue undergraduate, postgraduate, Ph.D., and post-doctoral research programs abroad.

Eligibility: Applicants must be Indian citizens residing in Rajasthan, pursuing a UG, PG, Ph.D. or postdoctoral program, and be under 35 years old on July 1st of the financial year. Applicants must meet the specified income criteria to be eligible for the scholarship.

Prizes & Rewards: A monthly living expenses of up to 1,00,000 and other benefits

Last Date to Apply: 15-01-2025

Application mode: Online Applications

Short Url: www.b4s.in/ aj/RGAE1



TOEFL India Championship

Description: An initiative of ETS India Private Limited to help undergraduate students and working professionals pursue their dream of studying abroad.

Eligibility: Participants must currently be enrolled in the 3rd or 4th year of undergraduate studies at an accredited Indian higher education institution (college or university). Additionally, applicants who have completed their undergraduate or graduate studies in India and are seeking higher education abroad, or those with up to two years of verifiable professional work experience, are also eligible to apply.

Prizes & Rewards: Total prize money of 15 lacs

Last Date to Apply: 31-07-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/TOIC1

buddy4study.com

ప్రభుత్వ బ్యాంకుల్లో ఉద్యోగాలు

ఖాళీలు 6128

దేశవ్యాప్తంగా పదకొండు ప్రభుత్వరంగ బ్యాంకుల్లో 6,128 క్లర్క్ ఉద్యోగాల భర్తీకి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్(ఐబీపీఎస్) నోటిఫికేషన్ విడుదల చేసింది. 2025-26 సంవత్సరానికి సంబంధించి కామన్ రిక్రూట్‌మెంట్ ప్రాసెస్(సీఆర్‌పీ)-14 నిర్వహించనుంది. ఆంధ్రప్రదేశ్‌లో 105, తెలంగాణలో 104 ఖాళీలున్నాయి. తగిన విద్యార్హతలు, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ ఉద్యోగాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

అర్హత: డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి

వయసు: 20-28 సంవత్సరాల మధ్య ఉండాలి.

ఎంపిక: ప్రిలిమినరీ, మెయిన్స్ రాతపరీక్షల ఆధారంగా.

దరఖాస్తు ఫీజు: ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ ఎక్స్ సర్వీస్‌మన్ అభ్యర్థులకు రూ.175, ఇతరులకు రూ.850

ఉద్యోగాలు కల్పిస్తున్న బ్యాంకులు: బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరాబ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, యూకో బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, పంజాబ్ అండ్ సిండికేట్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, ఇండియన్ బ్యాంక్.

దరఖాస్తు స్వీకరణ: జూలై 21 వరకు

ప్రీ-ఎగ్జామ్ ట్రైనింగ్ నిర్వహణ తేదీలు: ఆగస్టు 12 నుంచి 17 వరకు.

ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష తేదీలు: ఆగస్టు 24, 25, 31

ప్రిలిమినరీ పరీక్ష ఫలితాల విడుదల: సెప్టెంబరులో

మెయిన్ పరీక్ష: అక్టోబరు 13

తెలుగు రాష్ట్రాల పరీక్ష కేంద్రాలు:

తెలంగాణ: హైదరాబాద్, సికింద్రాబాద్, కరీంనగర్.

ఆంధ్రప్రదేశ్: గుంటూరు, విజయవాడ, కర్నూలు, విశాఖపట్నం.

వెబ్‌సైట్: https://www.ibps.in/



Institute of Banking Personnel Selection

జాబ్ కార్నర్

ఐడీబీఐలో స్పెషలిస్ట్ క్యాడర్ ఆఫీసర్లు

ఖాళీలు 31

ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఐడీబీఐ)... కింద పేర్కొన్న స్పెషలిస్ట్ క్యాడర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. డిప్యూటీ జనరల్ మేనేజర్ గ్రేడ్-డి: **3**
2. అసిస్టెంట్ జనరల్ మేనేజర్ గ్రేడ్-సి: **15**
3. మేనేజర్ గ్రేడ్-బి: **13**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ, సీఏ, ఎంబీఏ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

విభాగాలు: ఫైనాన్స్ అండ్ అకౌంట్స్, ఆడిట్- ఇన్ఫర్మేషన్ సిస్టమ్, డిజిటల్ బ్యాంకింగ్ అండ్ ఎమర్జింగ్ పేమెంట్స్, రిస్క్ మేనేజ్‌మెంట్- ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ గ్రూప్, సెక్యూరిటీ, ఫ్రాడ్ రిస్క్ మేనేజ్‌మెంట్ గ్రూప్.

గరిష్ఠ వయోపరిమితి: 2024 జూన్ 1 నాటికి జనరల్ డిప్యూటీ మేనేజర్ పోస్టుకు 45 ఏళ్లు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పోస్టుకు 40 ఏళ్లు, మేనేజర్ పోస్టుకు 35 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: పోస్టును అనుసరించి దరఖాస్తుల ప్రిలిమినరీ స్ర్కీనింగ్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1000. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.200.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 15

వెబ్‌సైట్: www.idbi bank.in/

IDBI BANK

ఐహెచ్‌ఎంసీఎల్‌లో ఇంజనీర్లు

గుజరాత్ ద్వారకలోని ఇండియన్ హైవేస్ మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్(ఐహెచ్‌ఎంసీఎల్) రెగ్యులర్ ప్రాతిపదికన వివిధ ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

ఖాళీలు

1. ఇంజనీర్(ఐటీఎస్): **30 పోస్టులు**
2. ఆఫీసర్(ఫైనాన్స్): **1 పోస్టు**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్, సీఏ, సీఎంఏ ఉత్తీర్ణతతోపాటు 2022, 2023, 2024 గేట్ స్కోరు తప్పనిసరిగా ఉండాలి.

విభాగాలు: ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఎలక్ట్రికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్, డేటా సైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్.

వయసు: ఇంజనీర్ పోస్టుకు 21-30 ఏళ్లు, ఆఫీసర్ పోస్టుకు 30 ఏళ్లు మించకూడదు.

జీతం: నెలకు రూ.40,000 - రూ.1,40,000

ఎంపిక: ఇంజనీర్(ఐటీఎస్) పోస్టుకు గేట్ స్కోరు, ఇంటర్వ్యూ, ఆఫీసర్(ఫైనాన్స్ పోస్టుకు సీఏ మార్కులు, ఇంటర్వ్యూ ఆధారంగా.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

దరఖాస్తుకు చివరితేదీ: జూలై 16

వెబ్‌సైట్: https://ihmcl.co.in/

IHMCL

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో అప్రెంటిస్‌లు

మహారాష్ట్ర, భండారాలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ భండారా గ్రాడ్యుయేట్స్/ టెక్నీషియన్స్ అప్రెంటిస్‌షిప్ శిక్షణలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

1. గ్రాడ్యుయేట్ అప్రెంటిస్
2. టెక్నీషియన్ అప్రెంటిస్
3. జనరల్ స్ట్రీమ్ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్

మొత్తం ఖాళీలు: **49**

విభాగాలు: కెమికల్, మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ, బీహెచ్‌ఎం.

అర్హతలు: సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

శిక్షణ వ్యవధి: ఒక సంవత్సరం

స్టయిఫండ్: నెలకు గ్రాడ్యుయేట్/ జనరల్ స్ట్రీమ్ గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లకు రూ.9,000, టెక్నీషియన్ అప్రెంటిస్‌కు రూ.8,000

వయసు: 14-18 సంవత్సరాల మధ్య ఉండాలి.

ఎంపిక: విద్యార్హతలతో సాధించిన మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక జరుగుతుంది.

దరఖాస్తు: ఆఫ్‌లైన్ దరఖాస్తులను చీఫ్ జనరల్ మేనేజర్, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ భండారా, భండారా, మహారాష్ట్ర చిరునామాకు పంపాలి.

దరఖాస్తులకు చివరి తేదీ: జూలై 13

వెబ్‌సైట్: munitionsindia.in/